
# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, అక్టోబరు, 2016 ₹ 30

ISSN 2454–4329




దండి యాత్ర

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
**- *Dammapada***


**సంపుటి 27 అక్టోబరు సంచిక 10**

ప్రధాన సంపాదకుడు
*చెన్నూరు ఆంజనేయ రెడ్డి*

సంపాదకుడు
*వల్లభనేని అశ్వినీకుమార్*

సహాయ సంపాదకుడు
*కాండ్రేగుల నాగేశ్వరరావు*

సహకార సంపాదకులు
*డా. వోలేటి పార్వతీశం*
*కరుటూరి విజయ్*

సాంకేతిక సహాయకులు
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రముద్దీన్ జీ షాన్,
వేముల రాణి

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*
**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in,
misimi90monthly@gmail.com
www.misimimonthly.com
**e-magazine : www.kinige.com/misimi**
**facebook.com/misimimaasapathrika**
**https://twitter.com/MISIMIMONTHLY**

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-
విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

LIBRARY OF CONGRESS
LCCN
91-903060

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329


**YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 5
తేజోమయ ప్రాణ రేఖ ........ 7
*- డా. ఆవంత్స సోమసుందర్*
వజ్రాయుధ పాణి ........ 12
*- డా. దామెర వేంకట సూర్యారావు*
పరిశోధకులకు కరపత్రం ........ 14
*- గొల్లపూడి మారుతీరావు*
తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాణ విశేషాలు-3 ........ 19
*- డా. ఈమని శివనాగి రెడ్డి*
వాంఛేశ్వర కవి - సామాజిక వాంఛ...... ........ 23
*- డా. జి. వెంకటేశ్వరరావు*
తూర్పు, లేములవాడ, ముదిగొండ చాళుక్యులు ........ 27
*- రావి భారతీదేవి*
'కొవ్వలి' నవలల్లోని వస్తువైవిధ్యం ........ 36
*- లింగాల రామతీర్థ*
తెలుగు నాటకంలో రచయిత్రుల పాత్ర ........ 40
*- ఎన్. తారక రామారావు*
అధ్యక్షోపన్యాసం (ఏడవ దశకం నాటకం) ........ 43
*- కూర్మా వేణుగోపాలస్వామి*
గురజాడ అప్పారావు గారి ఉత్తరం ........ 47
వేల్చేరుతో మధురవాణి ........ 49
క్రోమోసోమ్ కథనమ్ - మృత్యువు ........ 52
*- ముక్తవరం పార్థసారథి*
మృత్యువొడిలో ........ 57
*- కె. శ్రీనివాసులు*
కరవది శాసనము - ఒక పరిశోధన ........ 64
*- ప్రొ. ముదిగొండ శివప్రసాద్*
తెలుగులో తొలి పద్య నిఘంటువులు ........ 66
*- మన్నూరు శివప్రవీణ్*
కొంపెల్ల జనార్దనరావు ఉదయిని ........ 71
*- చెరుకువాడ వెంకట్రామయ్య*
దెయ్యాల రాత్రి ........ 73
*- కాండ్రేగుల నాగేశ్వరరావు*
డాక్టర్ శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డి ........ 75
*- నటరాజ రామకృష్ణ*
కళేవరం కైఫియత్ ........ 78
*- కడియాల వెంకటేశ్వరరావు*
హోరు ........ 84
అతడొక త్రివర్ణమాల ........ 86
*- డా. వోలేటి పార్వతీశం*
గూడు వదిలిన పక్షి ........ 90
ఏయెన్నార్ ఏమన్నారు? ........ 91


| | | **చిత్రకారులు :** |
|---|---|---|
| *ముఖచిత్రం* | *: కంటిదీపం* | *హల్దంకర్* |
| *రెండవ అట్ట* | *: దండియాత్ర* | *కేశవ్* |
| *మూడవ అట్ట* | *: మరణశాస్త్రం (Thanatology)* | *ఎనిక్ సైమన్ (Enrique Simonet)* |
| *నాల్గవ అట్ట* | *: కరదీపం* | |


*వివరాలు : 50 వ పుటలో..*


అట్టతో కలిపి 100 పుటలు


**తె**లుగులో ఎందరో లబ్ధప్రతిష్ఠులైన రచయితలు ఉన్నారు. రచయితలంటే యూనిసెక్స్‌కిందే తీసుకోవాలి. ఔత్సాహికులైన ప్రతిభావంతులూ ఉన్నారు. వారి రచనలను ఎంతో ప్రేమగా **మిసిమి**కి పంపుతుంటారు.

ఇంకా ప్రత్యేకంగా, సంపాదకులు కొందర్ని ఫలానా ప్రక్రియపైగానీ, విషయంపైగానీ వ్రాయండి అని అడగటం కూడా కద్దు.

గతంలో రెండు దశాబ్దాల కవిత్వ సమీక్షను వేగుంట మోహన్ ప్రసాద్ గారు మా అభ్యర్థన మేరకు ఎంతో లోతుగా చేశారు. ఆ తర్వాత కథాసాహిత్యం మీద ఎందరినో అడిగాం. ఇదిగో అదిగో అని దాటవేశారు. చివరికి నవలా సాహిత్యంపై నవీన్ గారు **మిసిమి** కోసం వ్రాసిన అధ్యయనం ప్రచురించాం.

ఇతర భాషారచనలు పరిచయం చేయడానికి ఎంతో శ్రమ చేయించి, ముక్తవరం పార్థసారథి గారితో వ్రాయిస్తున్నాం. అన్నిటికంటే ముఖ్యం – 'పురస్కార సాహిత్యం' శీర్షికన రావినూతల వారు అమూల్యమైన వ్యాసాలు అందించారు. ఇవి పుస్తకరూపంలోనూ అందుబాటులోకి వచ్చాయి.

గొల్లపూడి మారుతీరావుగారు వ్రాసినవి ఎన్నో మా అభ్యర్థన మేరకే అయినా కొన్ని వదలివేయవలసి వచ్చింది కూడా.



మిసిమి తో ముఖ్యమంత్రి

ప్రస్తుతం బి.వి. రామిరెడ్డి **మిసిమి**కి గత ఇరవైఏళ్ళుగా రాస్తున్న వ్యాసాలు, అందులో ప్రముఖంగా నోబెల్ ప్రసంగాలు పుస్తక రూపంగా త్వరలో వస్తుంది.

ఇదంతా ఎందుకు? **మిసిమి**లో ప్రచురించేవి ఎన్నో వడపోతల తరువాతనేనని, ఎంతో చర్చ జరిగిన తరువాతనేనని రచయితలు తెలుసుకోవాలి.

మేము అడగటంలో మా అవసరం ఉన్నా మీరు వ్రాసినదంతా ప్రచురించాలనే ఆశించటంలో తప్పు లేకపోయినా, ఒకవేళ ప్రచురించలేకపోతే తప్పుపట్టకూడదని చెప్పటానికే.

మేము కొన్ని పరిమితులు, పరిమాణాలకు లోబడి లేదా నియమించుకుని **మిసిమి**ని నిర్విఘ్నంగా, ప్రకటనలతో పని లేకుండా ప్రచురిస్తున్నాం.

ఈ యజ్ఞంలో మాకు కళాజ్యోతి వారి స్థిరమైన అండదండలు మాత్రమే కాదు, సంపాదకులకు అవసరమైన వనరుల తోడ్పాటుతోపాటు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ఎంతో విలువ ఇస్తుంటారు.

తమ రచనలను ప్రచురించకపోవటంలో సంపాదకులకు ఎటువంటి రాగద్వేషాలు ఉండవని విజ్ఞులయిన రచయితలు గ్రహించగలరని ఆశిస్తాం.

– సంపాదకులు

# కమ్మతెమ్మెరలు

✧ "... చాలాకాలం నుండి **మిసిమి** చదివేవాళ్ళల్లో నేనొకణ్ణి, వైవిధ్య రచనాశోభితమైన పత్రిక, ఎంతో సంతృప్తిని కలిగిస్తున్నది. ఈ 2016 ఆగస్టు పత్రిక 1వ తేదీన చేరగానే చదవటం ఆరంభించినాను. *చివరకు మిగిలిన సగం* అనే పేరు చాలా బాగున్నది. మిత్రులు పార్వతీశం గారికి అలవడిన, ఆకాశవాణి, దూరదర్శన్‌ల కార్యక్రమ నిర్వహణల అనుభవం – ఈ ఇంటర్వ్యూలో చాలావరకు ప్రతిఫలించింది.... ప్రఖ్యాత పరిశోధకులు డా. నాగిరెడ్డిగారి బృహదీశ్వరాలయ వ్యాసం ఎంతో గొప్పగా ఉన్నది. కొన్నాళ్ళ క్రితం నేను చూచిన దేవాలయానికిగల బృహద్విశేషాలు ఇన్నాళ్ళకు తెలిసి సంతోషించినాను. నటరాజ రామకృష్ణగారి *ఆంధ్రులు – నాట్యకళ* వ్యాసం నిత్యనూతనం. కర్ణాటక దివ్యప్రదేశాల గూర్చిన భాగవతుల హేమలతగారి వ్యాసం ఆశ్చర్యం కలిగించింది. మా కుటుంబమంతా వారు పేర్కొన్న చాలా స్థలాలను సందర్శించినా ఇన్ని వివరాలు – ఇంత సమాచారాన్ని సేకరించలేకపోయినాం. యధార్థ విషయాలను సహజ కవన పద్ధతి వర్ణనల్లో తెలపటం ఆకర్షణీయంగా ఉంది. చెన్నకేశవ అంటే వీరి సమన్వయం వింత అనిపించింది (32 పు.). కేశవ లక్షణాలను ఛన్నంగా (వ్యత్యస్తంగా) ఉంచుకున్నందున (ఛన్న) చెన్నకేశవుడైనాడని నేను విన్నాను. ఈ స్వామికి అందువల్లనే శంఖచక్రాలు వ్యత్యస్తంగా ఉంటాయి. 'బోనాల పండుగ' గూర్చి మీ పత్రికలో ఇదే మొదటి రచన అనుకుంటాను. *హంసలదీవి శతకం*, పల్నాడు, పాత విషయాలైనా పునశ్చరణగా నూతనత్వాన్ని నింపుకున్నాయి. *వడ్లు–రెడ్లు* రవీంద్రనాథ్ గారి రచన బాగున్నది. చాలాకాలంనాడు తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన *చాటుపద్య రత్నావళి*లో బహువ్రీహి (అనేకమైన వడ్లు) సీసమాలిక ఎన్నో నూతనమైన వరి ధాన్యాల పేర్లు తెలుపుతున్నది. ఇట్లా మీరు (ప్రచురిస్తున్న) ప్రచురించిన పత్రికలోని ప్రతీ రచన అమూల్యమనటంలో సందేహం లేదు......"

**– డా. శ్రీరంగాచార్య,** *హైదరాబాద్*

✧ "... ఆగస్టు 2016 **మిసిమి** సంచిక వేదికలో నా లఘువ్యాసానికి స్థానం కల్పించినందులకు హార్దిక ధన్యవాదాలు. శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి గారితో వోలేటి పార్వతీశంగారి ఇంటర్వ్యూ సంచికకే హైలైట్. పత్రిక అట్టలు రెండింటిమీదా, లోపలి చిత్రాలు ఎంత అందంగా ఉన్నాయో! వర్ణనాతీతం! పత్రికాధిపతుల 'అభిరుచికి' అద్దంపడుతున్నాయి. హైదరాబాదీ సంగీత దర్శకుడు 'శంకర్ జైకిషన్' జంటలో ప్రథముని గురించిన విశేషాలు ఎన్నిమార్లయినా చదువగలిగేలా ఆసక్తికరంగా ఉన్నాయి. 'శైలేంద్ర' హార్బర్‌లో సరకులు ఓడకెత్తేవేళ 'లెక్కలు వ్రాసే కూలీ'గా ఉంటూ, విరామ సమయాల్లో కవితలు వ్రాసే వాడని, అది గమనించిన 'శంకర్' అతన్ని పృథ్వీరాజ్‌కపూర్‌కు పరిచయం చేశాడనీ, ఒకచోట చదివాను. శంకర్ సహాయ హృదయమిది! మొత్తంపై ప్రతి సంచికా అబ్బురపరచే రచనల సంపుటే! వృద్ధిరస్తూ...!..."

**– జి. సుబ్రహ్మణ్య శాస్త్రి,** *నంద్యాల*

✧ "... **మిసిమి** ఆగస్టు పత్రికలో ప్రచురించిన రెండు వ్యాసాలు ఎక్కువగా ఆలోచింపచేసినవి. 1. ఎ.బి. సాయిప్రసాద్ పందిరి మల్లికార్జునరావుగారిపై వ్యాసం. 2. కె. వెంకటేశ్వర్లుగారు *కృష్ణా ధాన్యాగారం ప్రకాశం బారేజి* అనే వ్యాసం. పందిరి మల్లికార్జునరావుగారితో నాకు గల పరిచయం నేను 1950–52 సంవత్సరాల మధ్య మౌంట్‌రోడ్‌లోని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీలో బి.ఎ. చదువుతూ ఉండేవాడిని. నాతోపాటు మల్లికార్జునరావుగారి కుమారులైన ఆనందమోహన్, కృష్ణమోహన్‌గార్లు నా సహోద్యోగులుగా ఉండేవారు. మద్రాస్‌లో వారి ఇంటివద్ద జరిగే సాహిత్య కార్యక్రమాలకు కొంతమంది తెలుగు విద్యార్థులకు కూడా ఆహ్వానం పంపేవారు. అనేకమంది ప్రసిద్ధులైన పత్రికా ప్రచురణకర్తలతోపాటు మల్లికార్జునరావు గారు కూడా చరిత్ర సృష్టించారు. ఇటీవల గుంటూరులో వారి సంస్మరణ సభ జరిగింది. ఆ సందర్భంగా వారి జీవిత చరిత్రను పునఃముద్రించారు. వారి కుమారులైన కృష్ణమోహన్‌గారు అమెరికా వెళ్ళి ఉన్నత విద్యను అభ్యసించటంతోపాటు అచట అనేక ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించారు. గాంధీ గారి అహింసామార్గంపై ఒక గ్రంథమును ఇంగ్లీషులో ప్రచురించి విడుదల చేశారు. ప్రస్తుతం కృష్ణమోహన్‌గారు హైదరాబాద్‌లోనే నివసించుచున్నారు.
*కృష్ణా ధాన్యాగారం ప్రకాశం బ్యారేజి.* కృష్ణా గోదావరి నదులపై నిర్మించిన ఆనకట్టలు, కాటన్ మహాశయుని గురించి

పదేపదే స్మరణకు తెచ్చుకోవటం ఎంతైనా అవసరం. కావేరీ నదిపై కట్టిన ఆనకట్టల సాంకేతిక పరిజ్ఞానమే గోదావరీ కృష్ణా నదులపై కట్టడాలకు కూడా ఉపయోగించారు. ఆ సందర్భంలో సిమెంటుగాని ఉక్కుగాని వినియోగించబడలేదు. 1850లో నిర్మించిన గోదావరి ఆనకట్టకు కోటిన్నర రూపాయలు మాత్రమే వినియోగించబడినది. పదిలక్షల ఎకరాలకు సాగునీరు అందించడం – బ్రిటీష్ వారికి ఆనకట్టల నిర్మాణంపై వ్యతిరేకత ఉన్నప్పటికీ ప్రభుత్వం వారికి కలిగే లాభాలను గురించి నచ్చచెప్పి నిర్మాణం చేయించారు. కాటన్ మహాశయుడు చేసిన ముఖ్యమైన సూచన ఇప్పటికీ అమలు జరుగలేదు. యాభైకోట్లతో భారత దేశంలోని నదులు అనుసంధానం చేసినట్లుయితే, ఉత్తరాదిలో కలిగే అతివృష్టికి దక్షిణాదిలో ఉండే అనావృష్టికి పరిష్కారమార్గంగా సూచించారు. అనుసంధానమైన కాలువల ద్వారా భూములకు నీటి సరఫరాయే కాక సరుకు రవాణా కూడా సూచించారు. కాలువల ద్వారా సరుకు రవాణా అతి చౌకగా జరుగునని వ్యక్తీకరించారు. అనుసంధాన ప్రణాళిక అమలు జరిగితే మరొక ముఖ్యవిషయం కూడా జరుగునని ఘంటాపథంగా చెప్పారు. ప్రపంచంలోని సమస్త జనులకు ఆహారము అందించగలదని చెప్పారు. ఇప్పటికైనా నదుల అనుసంధానం జరిగితే బహుళ ప్రయోజనములు సమకూరగలవు. ఉత్తరోత్తర చిన్నచిన్న రాష్ట్రములుగా విడగొట్టవలసిన అవసరం కలిగితే ఈ ప్రాంతమును కాటన్ రాష్ట్రంగా వ్యవహరించుట సముచితముగా ఉండును....”

**– గోగినేని నాగేశ్వరరావు,** *గుంటూరు*

✧ “2016 సంచికలో తెన్నేటి హేమలత, హలధరనాగ్, ఆచార్య కొలకలూరి ఇనాక్‌ల పరిచయాలు; జహాంహదీద్ వాస్తు నిర్మాణ శైలిలో సాధించిన విప్లవాత్మక విజయాలు, చాలా బాగున్నాయి. డా. ఎమ్.వి. భారతలక్ష్మి గారి రాణీ చిన్నమాంబ వైదుష్యాన్ని, సాహిత్య, సంగీత, నాట్య రంగాల్లో నాటి మేటి మహిళామణులను ఆదరించి, ప్రోత్సహించిన తీరును, సంఘసంస్కరణ, అనాధ ఆశ్రమాల నిర్వహణా సామర్థ్యాన్ని సమర్థవంతంగా చిత్రించారు. చిన్న నాటిక ద్వారా వారి సమగ్ర వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించిన భారతలక్ష్మి గారికి అభినందనలు. 1932లో జన్మించిన హేమలతగారు 65 సంవత్సరాల ప్రాయంలో కన్నుమూశారు అన్నారు. వారు మరణించింది 1997లో. గానసరస్వతి, బాలసరస్వతి గారి పరిచయ వ్యాసంలో పాడిన రెండు పాటల సాహిత్యాన్ని, రచయితల సంగీత కర్తల వివరాలను ఇవ్వటం ముదావహం...”

**– టి.వి. ప్రసాద్,** *నల్లగొండ*

✧ “...హృదయం ద్రవించే కథ – మన వివాహ వ్యవస్థలోని పరస్పరానురాగాలు కాలంతోనే పరిపక్వమవుతాయి. చాలా బాగుంది – ‘ఎవరు ముందు...’...” **– ప్రసాదరావు,** *మరువాడ (ఫేస్‌బుక్)*

✧ “.....జులై ***మిసిమి*** సంచికలో ‘వేదం వేంకటరాయ రచనలు – సామాజిక చరిత్ర’ రచన చదివాను. రచయిత ఉటంకించినట్లు ‘ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు’ డా. నేలటూరి వేంకటరమణరావుగారు కాదు. ‘హిస్టరీ కాంగ్రెస్’ వ్యవస్థాపకులు డా. మల్లిరెడ్డి పట్టాభిరామిరెడ్డిగారు. వీరు కావలి జవహర్ భారతి ప్రిన్సిపాల్. మే 1976లో జవహర్ భారతి కావలి ఆవరణలో జరిగింది. నేను వారితో కలిసి పనిచేశాను. A.P.H.C. వ్యవహారాలు అప్పుడు నేను ఉపాధ్యాయుని హోదాలో పర్యవేక్షించాను.....” **– డా. దేవిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి,** *తిరుపతి*

✧ “...ఈ నెల (ఆగస్టు) సంచికలో ‘ఎవరు ముందు’ చదువుతుంటే ఎంతో గొప్ప ప్రేమానుబంధం ఉంటేకానీ అలాంటి ఆలోచన రాదు. అలాంటి అనుబంధం లభించిన జీవితం ఎంత గొప్పది... ఎంత ధన్యమైనది... అలాగే ‘ఆనందం ఎండమావా’ అన్న సిద్ధయ్య నాయుడు గారి వ్యాసం ప్రతీ మనిషి చదవవలసినది. బజారు చీకటిలో రూపాయిబిళ్ళ పారవేసుకొని ఇంటి ముందు దీపం వెలుగులో వెతుక్కునే ప్రయత్నం చేసిన ముసలమ్మలాంటి అజ్ఞాన ప్రపంచం అర్థంకావడానికి సిద్ధయ్య నాయుడు గారి వ్యాసం చదివి తీరాలి. ఇది ఎంతో చింతనాత్మకం....”

**– బి.వి. రామిరెడ్డి,** *రుద్రవరం*

✧ “....వి. ప్రమోద్‌కుమార్‌గారు వ్రాసిన తెన్నేటి హేమలత, అందులో కన్నడి అంటే ఏమిటి? కన్నీటి సిరాతో రక్తాక్షరాలను లిఖించారు... కన్నీరు సిరా రక్తంగా ఉంటుందా? కన్నీటి సిరాతో రక్తాక్షరాలు వివరించగలరు. తెలుగులో మహిళలు అలవాటుపడిన మధ్యతరగతి వనితకు ‘మద్యం’ అనగానేమి తెలుపగలరు....” **– కొండా శివారెడ్డి,** *కరీంనగర్*



అవంత్స సోమసుందర్

# తేజోమయ ప్రాణ రేఖ

*- అవంత్స సోమసుందర్*

అలనాటి మహాకవి నన్నయార్యుడుగానీ ఆ తరువాతి మహాకవులు తిక్కనాదులుకుగానీ దక్కని భాగ్యం నాకు దక్కినందుకు గర్విస్తున్నాను. ఆ గర్వం సాహిత్యోత్సవానికీ, ఆనందానికీ సంకేతాలేగానీ వెర్రిమొర్రి గర్వాలకు కాదు. ఇంతకీ ఏమిటాగర్వం? ఆ మహాకవులు ఎవరూ కూడా తమ పుత్రులు కవులై ప్రకాశించే సందర్భం ఉంటే అది తెలుపుకుని సంతోషించలేదు. మొత్తం సాహిత్య చరిత్రలో సమీపస్థమైన అంశాలున్నాయి. కానీ, వాటిని స్థాపించుకోవలసిన అవసరం ఉండదు. అలాంటి అదృష్టం నాకు లభించింది. నా తృతీయ కుమారుడు చి॥ శశికాంత్ శాతకర్ణి తన మూడవ కవితా సంపుటిని ప్రచురించి, నాకు ఆనందాన్నీ ఆత్మస్థైర్యాన్నీ, సంతృప్తినీ కలిగించాడు. ఈ అవకాశం నాకు లభించడం నా పుత్రుడు నాకిచ్చిన ఆనందంగా భావిస్తాను. ఇలాంటి అదృష్టం చరిత్ర తవ్వగా, తవ్వగా ఒక్క ధూర్జటి మహాకవికి లభించదంటారు కొందరు. ఆయన కొడుకో? మనవడో కుమార ధూర్జటి శ్రీకృష్ణదేవరాయలు విజయ పరంపరపై కావ్యం రాశాడంటారు. ఆ పుస్తకం నాకు లభించలేదు. ఆ ప్రయత్నాన్ని జారవిడుచుకున్నాను.

నా మిత్రుడు కె. శివారెడ్డి పీఠిక రాస్తూ - హృదయపూర్వకంగా తాను నా ఆనందాన్ని పంచుకున్నాడు. మా ఇరువుని ఆనందాలూ ఒకే స్థాయిలోనివి. కాలానికీ, పురుషుడికీ ఉన్న సంబంధం అనివార్యమైనదీ, ఆనందకరమైనదీను. పురుషుని కృత్యమూ, చర్యా సమాజానికి ఒక ముందు అడుగుగా రూపొందితే ఆ ఆనందాన్ని సమాజం యావత్తూ అనుభవిస్తుంది. ఆ సమాజానికి సజీవ ప్రాతినిథ్యం వహించే కవి మిత్రుడు కె. శివారెడ్డి సమగ్ర ఆలోచనతో, సహృదయతతో ఈ గ్రంథానికి పీఠిక రాశాడు. ఇందలి కవితలు సహృదయులను ఎలా స్పందింప చేయగలవో తెలిపాడు. శశికాంత్ జనకునిగా ఈ ఆనందం కూడా నాదే. ఏదో ఒక బిందువువద్ద శతాంశంగానయినా జన జీవితంతో సంబంధం పెట్టుకోని కవిత వ్రాయటం నిరర్థకమని నేను భావిస్తాను. ఏ బిందువు వద్ద నుంచి అయినా 'కవి గమనం ఎప్పుడూ వ్యష్టి నుంచి సమిష్టిలోకే కావాలి' అని స్పష్టంగా చెప్పాడు శివారెడ్డి. ఆధునిక సమాజం వ్యష్టి నుంచి సమష్టికి పెరిగి స్థిరపడింది. పాత సమాజం వ్యష్టిగా తన చిన్న గూట్లో తనే బతికింది. ఆధునిక సమాజానికి లోచనాలు విశేషమైనవి. బాహువులు దీర్ఘమైనవి. ఈ అంశాన్నే శివారెడ్డి పట్టుకుని మరింత స్పష్టం చేశాడు. ఒక సమగ్ర కవి నిండు హృదయంతో అవగాహన చేసుకుని, శశికాంత్ కవిత్వం గురించి చక్కని మాటలు చెప్పడాన్ని ఉల్లేఖించకుండా ముందుకు సాగడం సాధ్యం కావడంలేదు.

ఆచార్య చందుసుబ్బారావు శశికాంత్ కవిత్వాన్ని సమాలోచిస్తూ ఇలా అంటాడు - "దేవుడు పక్షులను ప్రేమించాడు. వాటికోసం పంజరాలను రూపొందించాడు. వాటి పాటల్లో రాగాలే కాని, స్వరాలుండవు..., ఆమె మనస్సు ఆమ్లపాతం, సుందర భవిష్యత్తులోనికి సుమవారధి" వంటి ప్రయోగాలు అపూర్వ ఓజస్సుందరాలు. విశాఖలో శ్రీశ్రీ షష్టిపూర్తి మహోత్సవం అపూర్వంగా జరిగింది. ఆనాటి కల్లోలంగానీ, వినోదాభాస కానీ మరెన్నడూ కనపడలేదు. ఆ సందర్భంలో జరిగిన కవి సమ్మేళనంలో "Dear Daddy" అంటూ శ్రీశ్రీ ని సంబోధిస్తూ శశికాంత్ ఒక కవిత చదివాడు. అది శ్రీశ్రీతో సహా అందరినీ అలరించింది. శ్రీశ్రీ ని ఆప్యాయంగా డాడీ అని సంబోధిస్తాడు. శశి! ఆ కవిత సభలో యావత్తునూ రంజింపచేసింది. కాలం జ్ఞాపకాలను చెరిపెయ్యకుండా ఉంటే కొన్ని పాదాలైనా ఇక్కడ ఉల్లేఖించి ఉండేవాడిని. అయితే శశికాంత్ గ్రంథానికీ, గ్రంథానికీ నడుమ పదేళ్ళ వ్యవధి చూపించాడు. అయినా కవిత్వంలో తనదైన వ్యక్తిత్వాన్నీ తనదైన అపూర్వ శక్తినీ మర్చిపోలేదు. అదే మిత్రులు శివారెడ్డిని, ఆచార్య చందుసుబ్బారావునీ ఆనందింపచేసింది. ఈ సంపుటిలో మాతృవియోగ దుఃఖం

ఎంత బాధాకరమైనదో, శశికాంత్ ఎంతో వేదనామయంగా వర్ణించాడు. ఆ వస్తువే ఇందులో ప్రధాన అంశం. ఇతఃపూర్వం కవితలకు అలాంటి ఇతివృత్తం లభించదు. (దాన్ని) తన మనస్సును క్రుంగదీసిన దుఃఖాన్ని కవిగా, కళాకారుడుగా అక్షరబద్ధం చేసుకున్నాడేగాని, బావురుమంటూ బహిరంగపరచలేదు. ఈ సంపుటిలో ప్రధాన కవితావస్తువు అదే అని చెప్పడంగానీ, అది తప్ప వేరే ఏదీ లేదనిగాని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు.

ఈ కావ్యానికి మూడో ముందు మాటగా శశికాంత్ కవిత్వ చింతనా ఫలితార్థాలను వివేచించాడు. కవిత్వం గురించి ఆలోచనలు ప్రతి కవికీ తప్పనిసరిగా ఉంటాయి. కవిత్వం జీవితంలో ఒక భాగం. జీవితంలోంచే ఉద్భూతమవుతుంది. కానీ జీవితమే కవిత్వం కాదు. కవిత్వం ప్రతినిత్యం మనిషి హృదయంతోనే జీవిస్తుంది. కానీ అంటీముట్టనట్టు నిరంతరం అతని చుట్టూ పరిభ్రమిస్తుంది. ఈ విషయాలన్నీ శశికాంత్ స్వీయానుభవ జన్యాలుగా వివరించాడు. కనుకనే ఇరువురు వేత్తల పీఠికల తర్వాత కవి పీఠిక సైతం అత్యవసరమైనదే అనిపిస్తుంది. స్వీయ హృదయావిష్కరణ చేసుకోగల కవులెంతమంది ఉన్నారు? భావ కవిత్వ యుగంలో ఎంత ఉదారంగా లెక్కపెట్టినా, చిరస్మరణీయమైన కవిత్వం రాసినవారు 10 మందికన్నా ఎక్కువ లేరు. ఐదుగురుకన్నా ఎక్కువ లేరు అనేవాళ్ళూ ఉన్నారు. కానీ, అభ్యుదయ కవితాయుగంలో (1943-2010) వరకు చిరస్మరణీయ కవులు పదిహేను; ఇరవైమంది కవులు తామర తంపరగా కవితాసంపుటులు వెలువరించారు. అనివార్య ఆకర్షణవల్ల మన కవులు సినిమా రంగానికి కైంకర్యమైనా, లోటు లేనంత పుష్టి అభ్యుదయ కవితారంగం సాధించింది. ఆరు పేజీల మూడవ ఉపోద్ఘాతంగా, ఈ గ్రంథానికి సమకూర్చిన ఫ్రీవెర్స్ కవిత్వం గురించిన పరాత్మక చింతనగా సాగింది. ఈ రచనల్లో ఎక్కడా స్వాత్మకత స్పర్శించకపోవడం విశిష్టంగా ఉంది. బ్రతుకుతున్న మానవుల రక్తపు కణాలలో తల్లిదండ్రులు, వారి చరిత్రలూ, నిరంతరాయంగా బ్రతుకుతుంటాయి. ఈ యధార్థాన్ని కవితామయంగా చెబుతున్నాడు శశికాంత్. మానవులకు మాట వచ్చిన తరువాతనే మానవుడు సంపూర్ణ శక్తివంతుడయ్యాడు. విశిష్టుడయ్యాడు. సకల జీవజాలంలోనూ అతని మాటే ప్రత్యేక అధికారాన్ని సాధించింది. ఈ మాట గురించి ఎంతో ప్రత్యయంతో ఎంతో వివేచనతో ఈ కవిత రచించాడు శశికాంత్ ''మాటలు అంతస్తత్వాన్ని కూడా జారవిడుచుకుని విలోమత్వాన్ని సంధిస్తాయి'' అనడం ఆలోచనా పరిపక్వతకు నిదర్శనం. ''రామాయణ మహాకావ్యంలో తన పాత్ర తాను నిర్వహించిన ఉడతవంటి అల్ప జీవులు కూడా అవిస్మరణీయాలే.'' అవి శశి మీద కూడా తారట్లాడి అదృష్టవశాత్తూ ఈ కవితలో ప్రవేశించాయి. సంగీతం దివ్యానుభవాన్ని కలిగించిన సమయాలు శశికాంత్‌కు నిరంతర స్మృతి.

తడి కాంతి అనే కవితలో రాత్రి నుంచి పగటికి సాగించే కాలయాత్రను సుందరానుభవంగా చిత్రించాడు. ఇది అనుభూతి పరమయిన కవిత. నిరంతర అనుభూతిగా మనిషికి వేకువ చీకటులు, క్రమక్రమంగా వెలుతురు వేషాలు మారుతూ తదేక ధ్యానంతో పరిశీలిస్తే దివ్యానుభవాన్ని అందిస్తాయి. కవి దృష్టి ఈ సూక్ష్మాంశాన్ని పట్టుకోవడం విశిష్టత సాధించినట్టు. ఆకాశమంత సంగీత దివ్యానుభవాన్ని కోకిల నిట్టూర్పువంటి హ్రస్వ గీతంలో ఆవిష్కరించడం, శశికాంత్ ప్రదర్శించిన ప్రజ్ఞ. ఇలాంటి ప్రజ్ఞలే మనిషిని కవిగా మారుస్తాయి. తన బాల్యం – గడిచిన కులస్వాముల మండువా ఇల్లు ఒక పరిమితానుభవమే కానీ మధురస్మృతిగా భాసిస్తుంది. అదే ఇంటిలో నేను పుట్టి, పెరిగి చదువుకుని పెద్దవాడిని అయినవాడిని. శశికాంత్‌కు అతని అన్నతమ్ములకు తండ్రినై, కవినై బ్రతుకుతున్న నాకు ఈ గీతం ఒక అనంతమైన విషాద వాహిని, పోయిన వేటినీ తిరిగి తేలేం. అలాగే సంతృప్తి ఒక్కటే విషాదాన్ని బంధించి కవాటంలో ఉంచుతుంది. జీవితం నిరంతర పరిణామ శీలి, యాత్రాశీలీను. కనుకనే గతంకంటే మనకు వర్తమానం అందిస్తున్న నూత్న వరాలే ముఖ్యం.

బస్సు డ్రైవర్‌దో, ట్రాఫిక్ కంట్రోల్‌వాడిదో తప్పెరిదైతేనే పూలమొగ్గల్లా తయారై స్కూలుకు పోతున్న బాలురు ఆకస్మిక మృత్యువాతకు గురవడం యావదాంధ్రనూ తీరని దుఃఖంతో వెక్కివెక్కి ఏడ్చేలా చేసిందా దృశ్యం. ఈ సంఘటన మన రాష్ట్రంలోని కవులందరినీ చకితుల్ని చేసింది. శశికాంత్ కూడా మంచి కవిత రాయడం హర్షణీయం. నిశ్శబ్ద భాషకు భాష్యం అనే కవితలో నిశ్శబ్దం వేరు, మౌనం వేరు. మౌనానికి సంకల్పశక్తి ఉంటుంది. నిశ్శబ్దానికి ఏదో భయంకర ఆజ్ఞవంటిది ఉంటుంది. ఈ రెండూ ఒకటి కాదు. నిశ్శబ్దం ఉండవచ్చు ఉండకపోవచ్చు. కానీ, అడవి, తోటా, పిల్లలూ, పెద్దలూ అన్ని స్థాయిల జీవులకూ మౌనం తెలుసు. ''సుదూర తీరాల నుంచి ఆయన గొంతు వెతుక్కుంటూ వచ్చిన రాగాలు ఆయన స్వరపేటిక ద్వారానికి నవనవోన్మేష తోరణాలు. అత్యంత

సులభ మార్గం ఆయన పాట ఆలకించడమే. పాట వెనుక భావాన్ని పరిగెత్తించే శక్తి ఆయనొక్కడిదే" అంటూ ఒక మహా గాయకుణ్ణి గురించిన వాస్తవిక చిత్రణ ఇస్తాడు కవి.

ఈ గీతం ఆద్యంతం చదివాక ఎవరీ మహా గాయకుడు అనే ప్రశ్న ప్రతివాడి హృదయాన్నీ శోధిస్తుంది. "మహాగురువులు పారుపల్లి ఆయన గొంతులో శాశ్వతంగా ఒదిగిపోయారు'' అనడం ద్వారా ఆ గాయకుడు బాలమురళీకృష్ణ అనీ, ఆ మహోన్నత వ్యక్తి శిష్యునిపట్ల ఎంతో అభిమానంతో ఆయన గొంతులో ఇమిడిపోయారనీ అర్థమవుతోంది. ఒకనాడు తలవని తలంపుగా దివ్యానుభవాన్నీ కలిగించాలన్న ఉద్దేశ్యంతో కాబోలు. ఎక్కడిదో ఒక శీతాకోక చిలుక వచ్చి వాలుతుంది. దానితో కవి ఆపాద మస్తకం చలించిపోతాడు. ఆ అనుభవం కవితగా మారి మనకు ప్రత్యక్షమవుతుంది. తర్వాత కవితే జ్వాలాపాతం. జలపాతం అనే మాట అందరికీ పరిచయమే జ్వాలాపాతం అనేది కవికి కలిగిన తీవ్రానుభూతిని ప్రత్యక్షం చేయడానికి ఇతడే ప్రయోగించిన కొత్త సృష్టి.

భానూదయానికి ఆయత్తమవుతున్న సుందర సమయంలో ఒక తోటను చూడాలి. ఆ తోట విరజిమ్ముతున్న ఒక చల్లని గాలి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. చీకటుల పాశాలను దులిపేసుకుంటున్న ఒకానొక నూత్న యౌవనం తోట ధరిస్తున్నట్టు మనకు దిగంతాలవరకూ ఆనవాళ్ళు దొరుకుతాయి. నూత్న తేజస్సుకు ఆవిష్కరణ జరుగుతున్నట్టు మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఈ పరిణామాన్నే స్పష్టంగా వర్ణిస్తూ శశికాంత్ చెలరేగుతున్న తోట అనే కవితలో వర్ణించాడు. 16వ కవిత కువకువలే వేకువ రెక్కలు – నవోషస్సునందుకుంటున్న తోటలో నవ జీవన కంఠస్వరాలు ప్రాదుర్భవిస్తూ పుడమికి నవ జీవనమందిస్తున్నాయి. కువ కువల వేకువ ఒక సుందర అభివ్యక్తి. అదే జగతికి ప్రభాతగీతం అంటాడు కవి. ఎన్నాళ్ళనుంచో ఒక ఏకాంతం మరిగి – సుందర స్వప్నంగా బయటపడుతుంది. దానికి శబ్దమే కాదు. రాగమూ ఉంటుంది. కానీ ఆ రాగానికి స్వరాలందించేవాళ్ళు లేరు. ఆ పనిచేయడానికే కవులు తమ సుందర స్వప్నాలను కరిగిస్తారు అంటారు కవి. దైన్యం ఆవహించిన బాధితుల ముఖవర్చస్సు అదృశ్యమై విషాదమేదో, వికృతరూపంలో బయటపడుతున్నట్టు ఉంటుంది. కలలు, కారుచీకటిలో మునుముందుకు నడిపే దివిటీలు కలలు, బ్రతుకు ప్రమిదలో ఆశను పోసి జీవకాంతిని కాపాడే అదృశ్య హస్తాలు! కలలే మనిషిని భవిష్యత్తులోనికి కొనిపోయే దివ్యాశ్వ రథాలు. ''కలలకు రెక్కలుంటాయి. అవి మనసును ఎగరేసుకుపోతాయి". అలాంటి స్వప్నాల కోసం సహృదయులు నిరంతరం అన్వేషిస్తూనే ఉంటారు.

"పగుళ్ళలోంచి నీటిని ఆత్రంగా తాగుతోంది భూమి అకస్మాత్తుగా ప్రారంభమైన వాన ఆకాశానికీ భూమికీ తాళ్ళు పేనినట్లు నల్లగా ప్రత్యక్షం చేశాడు కవి. ఆశల విపత్తులనే కవితలో మాతృభూమి రక్షణకై ప్రాణాలొడ్డి అమరత్వం సాధించే వీరజవాన్లు పయనించే బాటలకు నేను వినమ్రంగా గౌరవ వందనం చేస్తానంటాడు కవి. లోకాన్ని కాపాడేందుకు ప్రాణాలనూ, సౌఖ్యాలనూ తలపోయక త్యాగమయంగా నడచి వెళ్ళే బాటలు అందరికీ నమస్కారయోగ్యమైనవే. ఆ వీరసైనికులే దేశాన్ని కాపాడతారు. జీవన గీతాన్ని పాడతారు. అట్టివారికి భావుక పుష్పాంజలి అందిస్తాడు కవి.

తెలంగాణా దుఃఖార్తికి అనునయ గీతంగా అందించిన కాకతీయ శిథిలాలలో... అనే కవిత హృదయాన్ని జివ్వున లాగుతుంది. కాకతీయుల మహత్తర పరిపాలనా సౌభాగ్యం కన్నులకు కడుతుంది. శాలివాహన శకం తర్వాత ప్రజలలో మమేకమై వారి శ్రేయోభిలాషులై బ్రతికినవారు కాకతీయులే. రుద్రమదేవి వరకూ ఈ సౌభాగ్యం వర్ధిల్లింది. తర్వాత వారి తాబేదారులు స్వార్థముష్కరులు పరిపాలించి ప్రజలను దోపిడీ చేశారు. కష్టజీవులను బానిసలుగా చేశారు. "నీ బాంచన్ దొరా, కాల్మొక్తా దొరా" అనే మాట నిరంతర ఉచ్ఛ్వాసమైంది. అలాంటి నైజాం శని విరగడవుతూ ఎవ్వరికీ కనిపించని చీకటిలో సపరివారంగా పారిపోయిన తర్వాత కూడా ఇడుమలే అనుభవించడం తెలంగాణాకి తప్పలేదు. అలాంటి చరిత్రను సమాప్తి చేస్తూ తెలంగాణాకు సంపూర్ణ స్వేచ్ఛ లభించడం సుఖోచ్ఛ్వాసంగా తనరారింది. కాని, దుర్మార్గులైన నేటి పాలకులు కొందరు ఇంకా ఆ పాదుషాల కాలానికి కాల్మొక్కుతూనే ఉన్నారు. అలాంటి దుష్ట రాజకీయ పాలకుల గురించి ఈ కవి ఇలా అంటున్నాడు : "నిరాశతో ఎంతోమంది విద్యార్థులు బలవన్మరణం పొందితేనేం, చిత్తశుద్ధి లేని బలహీన నాయకులు పదాడంబరాల జోల పాటలో నిష్పూచీగా నిద్రపో ఓ తెలంగాణమా!" వ్యంగ్య గర్భితమైన ఈ ఓదార్పు ఎంతటి నిట్టూర్పు కలిగిస్తుందో అందరికీ తెలిసిందే. ఈ గీతం దుఃఖార్తులైన తెలంగాణా సోదరుల బాధలను అనునయింప చేయడానికే కవి వ్యంగ్యాన్ని ఉపయోగించాడు. ఇకనైనా

సంపూర్ణ స్వేచ్ఛాయుత స్వాతంత్ర్యాన్ని అనుభవించాలని ఈ కవి కోరుతున్నాడు. ఈ కవి పెద్దన్న పట్టభద్రుడై కూడా ఐచ్ఛికంగా వ్యవసాయానికి పూనుకుని, దానికి సంబంధించి, నానా బాధలూ పడుతూ షుగరు వ్యాధితో జీవితాన్ని ముగించడం, యావత్ కుటుంబానికీ దుఃఖ కారకమే. అతని స్మృతులతో ఈ కవిత బరువుగా సాగుతుంది. ధనరాశులతో ధగధగలాడే తేజస్సు ఒకవైపు, తిండిలేక మలమల మాడుతూ కనిపించిన ప్రతి చెత్తా నోట్లో కుక్కుకుంటూ నీలిగే నిర్భాగ్యులు ఒక ప్రక్కనా కనిపించే మహానగరం బొంబాయి గురించి, ఇక ఈ కవికి గల అనుభవ పరంపర ఒక కవిత పలికించింది. ఇది చదువుతోంటే, దీనంగా ఒక అనుభవం మన గుండెల్లో మూలుగుతూంటుంది..

"ఆమ్లపాతం" అనే మాట కొత్తగా వినిపిస్తుంది. మాధుర్యంకాక, అభివ్యక్తిలో ఆమ్లం దర్శనమివ్వడం విడ్డూరమైన సంగతి. మానవ జాతిలో ఇలా విడ్డూరమైన అభివ్యక్తులున్నవాళ్ళు ఎందరో ఉన్నారు. ప్రధానంగా చింత ఆ మనుషుల ఆకారాలను అరుచిగా మారుస్తుంది. వర్తమానం విషాద అనుభవాలతో నిండి కాలు తీసివేసే సుస్థిర స్థలం కనిపించక మనసు విషాదంతో బరువెక్కుతోంది. ఎన్నో విషాద స్మృతులు చిందరవందరగా హృదయంలో పోగులు పడి ఉన్నాయి. వాటిని ఎత్తి పారబోసే స్థితిలో లేము. కానీ, విషాదాలు తొలగిపోవాలని, సుఖపరంపరలు మేలుకోవాలని, మనసు కోరుతోంది. శోకస్మృతుల గత కాలం నుంచి ఆనంద సుందర భవిష్యత్తులోకి... పరిస్థితులన్నీ మార్పు పొందాలని మనసు ఆర్జిస్తోంది. సృజనోత్సవం, జీవనోత్సవం అనేది అద్భుత పర్యాయపదాలు అన్నాడు కవి. అయితే సృజనోత్సవం లేని జీవితం జడమయమైపోతుంది. జీవనోత్సవం లేని సృజనోత్సవం నిర్జీవమైపోతుంది. ఈ రెండూ జాగ్రత్తగా విలీనం చేసుకోవాలి. అప్పుడే జీవితం జీవనీయమౌతుంది. కీర్తనీయమవుతుంది. దాన్నే కవి ధ్వనిపూర్వకంగా వినిపిస్తాడు. నవ్వుల జంత్ర సంగీతం అనే కవిత పారస్పర్యం నుంచి ఉద్భవించిన దివ్యానుభవాన్ని స్మృతిగా వెలిగిస్తుంది. కవి హృదయం ఒక దివ్యానుభవానికి గురయినపుడు ఏవో స్మృతులో, పునఃసృజనలో సజీవంగా మేల్కొంటాయి. అవి ఇదమిత్థంగా చెప్పుకోలేనివి. అలాంటి దివ్యానుభవాలు ఈ కవికి మనసు నిండా పోగుపడడం, కవిగా పునర్జన్మించా" అనే ఈ కవితకు మూలాధారాలు... దాదాపు అందరు యువకులూ ఒకరికొకరు ప్రతిరూపంగా కనిపిస్తారు. చేష్టలూ – మాటలూ ప్రతిబింబాల్లా భాసిస్తుంటాయి. కానీ కొందరు సమగ్ర విశిష్ట మూర్తులుగా మనకి ఆశ్చర్యం కలిగిస్తుంటారు. కారణాలు చెప్పలేం. వెతకలేం. ఎలా పరిణామాలు చెందుతారో చెప్పలేం. కానీ భిన్నత్వం మాత్రం యథార్థమే అంటూ కొన్ని ప్రకృతులను వర్ణిస్తాడు. సింగమనేని నారాయణగారు కీర్తించవలసిన మనిషే. ఎంతో స్పష్టతతో పరిశీలించి ఆయన సోమసుందర్ పురస్కారం అందుకుని, చక్కని ఉపన్యాసం ఇచ్చారు. ఆ ఉపన్యాసం ఆబాలగోపాలాన్నీ తన్మయమొనర్చింది. ఈ ఉపన్యాసం విని అంతర్ముఖుడైన శశికాంత్ శాతకర్ణి చక్కని కవిత రచించాడు. ఇది స్వరూపానికి చిన్నదే కానీ, ప్రతి పదమూ ఆలోచనా స్ఫోరకంగా ఎన్నో సత్యాలు తవ్విపోస్తుంది. ఆ నాటి ప్రేక్షకులు ఎందరో ఇంకా వినాలనిపించింది అంటూ కితాబులు ఇచ్చారు. నారాయణ ఉపన్యాసంలో ఆ మూర్తిమంతనం కనిపిస్తుంది.

ప్రతి మనిషికీ ఒక బాల్యం ఉంటుంది. ఆ బాల్యం నిండా ఎన్నో అనుభూతులూ, జ్ఞాపకాలూ ఉంటాయి. బ్రతుకు పొడుగునా జ్ఞాపకాలను బరువుగా, తడిగా దుఃఖమయంగా ఆనందహేలగా మార్చేవి జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాలే లేకపోతే బ్రతుకు దుంగని ఈడుస్తున్నట్టు కఠోరంగా ఉంటుంది. ప్రతివాడి బాల్యం జ్ఞాపకంలో బంగరు మలామా చేసుకునే కనిపిస్తుంది. బాల్యానికి అటూ ఇటూ జ్ఞాపకాలు. ఈ జ్ఞాపకాలే లేని మానవ జీవితం ఎంత దుఃఖమయంగా ఉంటుందో. "చెల్లీ నీ వీణానిక్వాణం ఇక్కడి ప్రతి అణువూ నినదిస్తోంది" అంటాడు, విగత హృదయ శకలతమైపోవడమూ కనిపిస్తుంది. బాల్య జ్ఞాపకాలను పంచుకునే చెల్లో, అక్కో, అన్నో తలపించేసరికి మనసు జివ్వుమని లాగుతుంది. వెళ్ళిపోయిన పరిమళం తిరిగి వచ్చినట్టుంటుంది. ఆ అనుభవాన్నే శశికాంత్ కవితలో వర్ణించాడు. జీవితంలో కొన్ని సంఘటనలు, కొన్ని సన్నివేశాలు నిర్నిరోధకంగా జరుగుతూంటాయి. కొన్ని కుటుంబాలలో ఉదయం లేస్తూనే కలహప్రియుల కంఠాలు మ్రోగుతుంటాయి. గతంలో మధురక్షణాలన్నీ మాయమైనట్లు ఈసడింపులు, ఛీత్కారాలు, తూష్ణీభావాలూ చెలరేగుతూ స్త్రీ, పురుష స్వభావాలను వ్యక్తం చేస్తుంటాయి. కొన్ని ఇళ్ళలో పగలు జగడమూ రాత్రి ఏకత్వమూ స్పష్టమవుతుంటాయి. అలాంటి కుటుంబాల దృశ్యాలు కవి మనసును కలతపరచి జ్ఞాపకాలు తోడుతాయి. "సురభిళ సుమలతలు హొయలుపోయే నవ జవ్వనులు పరిమళ పుష్పతతికి హృదయంలో చిగురించే రాగాలు..." "ఇంటి చుట్టూగల

పచ్చని చెట్లు సచ్చిదానందునిలా సతతం స్వాగత గీతాలు పలుకుతాయి" అంటూ తన బాల్య జీవితపు జ్ఞాపకాలను మరోసారి తవ్వుకుంటాడు.

మానవుడు మేలుకీళ్ళ కలయిక. అహంకారమూ, స్వార్థమూ మనిషిని మానవత్వానికి దూరం చేస్తాయి. తన మనసును ఒక్కసారి సమీక్షించుకుని కవి అంతర్దృష్టితో ఈ కవిత రచించాడు. "కవిత్వమంటే మనసు కొలనులో రేపిన ప్రభావతరంగం కవిత్వం అంటే ఆనందం అవధుల్ని మాటలతో కొలవడం అంటూ అనేక సత్సందర్భాలను పేర్కొన్నాడు కవి. అగాథ బాధల మెట్లు ఎక్కి నవ చంద్రోదయాన్ని గాఢాలింగనం చేసుకోవడమే కవిత్వం" అంటూ అనుభవాల పరాకాష్టలనూ కవిత్వ సృజనోత్సవాన్ని వర్ణించాడు కవి. ఎదురయ్యే మధురానుభవాలు ఆనందమయ క్షణాలు, ఆహ్లాదకర సంగీతాలను కవిత్వ జననం ఎలా తోడ్కొని రాగలదో ఈ కవి భిన్న భిన్న స్వరాలతో ఆయత్తపరిచాడు ఈ కవితలో. పాబ్లోనెరుడా కవితాహృదయం ప్రజా జీవన సహచర్యంతో ఎలా సాగుతుందో, ఈ కవి ప్రదర్శించిన గీతంలో దర్శనమిచ్చింది. "ప్రజల కడగండ్లే నా చిరునామా" అనగల మహనీయుడు పాబ్లోనెరుడా. భిన్నభిన్న అనుభవాలతో కవిత్వానికి గ్రహణం పట్టించేవాణ్ణి నిలదీసి ప్రశ్నిస్తాడు. వీడు కవేనా? అని. ఆ అనుభవమే ఈ అథఃపతనం అనే కవితలో వర్ణిస్తాడు. సత్పురుషుడి ముఖంలా ఆకాశంమీద ఆహ్లాదం పరుచుకుంది అనడం వినూత్న అభివ్యక్తీకరణం. ఈ కవితలో అనేక కవితామయ వాక్యాలు హృద్యమయిన వర్ణనలూ ఉన్నాయి. శబ్దం నుంచి నిశ్శబ్దంలోకి జారిపోయే రాత్రిలో నక్షత్రాల నిశ్శబ్ద సంభాషణలు వినిపిస్తాయి అనడం మనోజ్ఞంగా ఉంది. రాత్రింబవళ్ళకు ప్రతి కవీ సహ యాత్రికుడు. అతని హృదయంలో కవితా విర్భూతికి సమయాసమయాలుండవు. అతని హృదయం ఏ సమయంలో కవితలు ప్రసవిస్తుందో ఎవరూ చెప్పలేరు. శశికాంత్ కవితా హృదయం కవిత కోసం నిరీక్షిస్తూ కవిత స్ఫురించగానే కలంలో దాచుకున్న వైఖరి మనకు కనిపిస్తుంది. కలమూ, కలలూ ఈ కవికి రాత్రింబవళ్ళవంటివి. మానవుని సంకల్పంతో నిమిత్తంలోని ప్రాకృతిక ధర్మాలు నిర్నిరోధకంగా సాగుతూనే ఉంటాయి. అలా సాగకపోతేనో? అనే ప్రశ్నకు తావే లేదు. ప్రకృతి ధర్మాలను అనుసరించి, సకల చరాచర ప్రాణజాలమూ తమ నడతలు మార్చుకుంటూ, ఉనికిపట్లు మార్చుకుంటూ జీవితాన్ని సుఖమయం చేసుకుందుకే ప్రయత్నిస్తాయి.

"నీ హస్తాక్షరాలు" అనే కవిత మిత్రులు గురుపాదులు డా॥ మిరియాల రామకృష్ణగారి ఆకస్మిక మృతికి స్మృతిచిహ్నంగా రచించబడిన చివరి కవిత. ఆయన అక్షరాలు ఆణిముత్యాల్లా ఉండేవి. బ్రతికినన్నాళ్ళు సాహిత్యాన్వేషణతోనే బ్రతికారు. ఆంధ్రాయూనివర్శిటీలో ప్రప్రథమంగా, శ్రీశ్రీ పై పరిశోధన చేశారు. పరిశోధనా పత్రాలు వ్యావహారిక బాషలోనే రాయాలి అనే నిర్ణయంతో వెలువడ్డ ప్రథమ గ్రంథమిది. ఆయన శశికాంత్ శాతకర్ణికి గురుపాదులు. రామకృష్ణగారి రచనల గురించీ అక్షరాల గురించీ ఒక సత్యం వివరిస్తాడు. ఇలా నందనవనంలో ఆనంద నర్తనం చేసే గోపికలు – నిద్రలో సైతం మనసును మెత్తగా తాకే స్వప్న శారికలు". ఆయన మనసులాగే ఆయన అక్షరాలు కూడా మనోజ్ఞంగానూ, నిర్మలంగానూ కనిపించాయి. హృదయరోగం ఆయన్ని మింగేసింది. మరింత ఆయుష్మంతుడైతే మరెన్నో రచనలు రచించేవారు. ఆయన శ్రీమతి బిడ్డలూ క్షేమంగా పెరగడమే మనకు లభించిన అదృష్టం. శ్రీశ్రీ బండ బూతులు తిట్టిన దుర్మార్గులు ఈ లోకంలో ఎన్ని రూపాలతో ఉన్నారో....

చి॥ శశికాంత్ 3వ కవితాసంపుటిలో భిన్నభిన్న అభిరుచులనూ, భిన్న కవితావస్తువులనూ స్వీకరించి, కవితలు రాశాడు. ఆంధ్రాయూనివర్శిటీలో తత్త్వశాస్త్రంలో ఎమ్.ఎ. పట్టభద్రుడైన ఈ కవి వర్తమానంలో ఎవరి ప్రభావానికీ ఏ రచనాశక్తుల ప్రభావానికీ లోనుకాకుండా స్వతంత్రంగా ఆలోచిస్తాడు. ఎమ్.ఎ. లో సర్వేపల్లి రాధాకృష్ణగారి పేరున, గోపాలకృష్ణగారి పేరునా ఇవ్వబడుతున్న స్వర్ణపతకాలను సంపాదించాడు. ఆనాటి తత్త్వశాఖ ఆచార్యులు పిహెచ్.డి. చేయమనీ, భవిష్యత్తు విషయంలో భయపడవద్దనీ, మేమున్నామనీ చెప్పారు. కానీ ఈ చిరంజీవికి జర్నలిజం మీదా సాహిత్య రచన మీదా అభిరుచివల్ల దీనిని తిరస్కరించాడు. ఆంధ్రజ్యోతివారు బాలజ్యోతి అనే పిల్లల పత్రిక నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో పరీక్షలు పెట్టగా అందులో ఉత్తీర్ణుడై ఎడిటర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఎక్కువగా చదువుతూ తక్కువగా రాసే కవులలో శశికాంత్ ఒకరు. ఈ సందర్భంలో మొదటి రెండు కవితా సంపుటాలను ఈషన్మాత్ర పరిచయం చేయవలసి ఉంది. కానీ, ఆ గ్రంథాలు నా వద్ద లేక ఆ పని చేయలేకపోయాను. మరిన్ని కవితా సంపుటులు ప్రచురించి కీర్తి సంపాదించాలని ఆశిస్తున్నాను.

(మిసిమికి పంపిన చివరి రచన) మి

# వజ్రాయుధ పాణి

– దామెర వేంకట సూర్యారావు

మనఃకార్మిక శాలలో ఉత్పన్నమయ్యే అక్షరబద్ధ కళాస్వరూపం సాహిత్యం. వ్యక్తి ప్రతిభాజన్యమైన ఈ కళకు నవ్యత ప్రధాన జీవలక్షణం. కవిత్వంలో నవత్వం ఉండాలనే ఆశయంతో కాలానికి కంఠ ధ్వనిగా కవిత్వం వెలువరించిన అభ్యుదయ కవి అవంత్స సోమసుందర్. "ప్రతి కవీ తను జీవించే కాలానికి మాత్రమే ప్రత్యక్ష సాక్షి. ద్రష్టగా తన కాలానికి ప్రతినిధిగా నిలిస్తే చాలు అతని కవితకు, సార్వజనీనత, సార్వకాలికతలు సిద్ధిస్తాయి. అతడు గతానికి వారసుడు అగామికి రసభూమికలందించే సేతువు'' అంటారు సోమసుందర్.

అవంత్స సోమసుందర్ 1924 నవంబర్ 18న తూర్పుగోదావరి జిల్లా శంఖవరంలో జన్మించారు. స్వస్థలం పిఠాపురం. అభ్యుదయ కవిగా ప్రసిద్ధుడైన సోమసుందర్ మంచి విమర్శకులు కూడా. వామపక్ష ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. క్విట్ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్నారు. సత్యాగ్రహ ఉద్యమాలు ముగిసి స్వాతంత్ర్యం రాకపోగా, జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు తెలుగు కవుల్లో గొప్ప చైతన్యాన్ని కలిగించాయి. బ్రిటిష్ పాలకుల ఖజానాకు అంటకట్టబడిన భారత ఆర్థికస్థితి సంక్షోభంలో పడింది. ఆర్థికమాంద్యం ఏర్పడింది ప్రపంచ పరిస్థితులు విషమించాయి. జర్మనీలో హిట్లర్ నాజీ ప్రభుత్వం ఏర్పడింది. ప్రపంచ సంస్కృతి పరిరక్షణ వివిధ దేశాల మేధావుల కర్తవ్యమైంది. అప్పటికింకా వర్గచైతన్యం సాహిత్యంలో ప్రస్ఫుటంగా లేదు. సోషలిస్టు పార్టీ ప్రత్యక్షంగానూ కమ్యూనిస్టు పార్టీ ప్రచ్ఛన్నంగానూ పనిచేయడం ప్రారంభించిన రోజుల్లోనే 'ఎగరాలి ఎగరాలి మన ఎఱ్ఱజెండా' అనే పాట 'ఆకలి మంటచే మలమలలాడే అనాథలందరు లేవండోయ్' అనే అంతర్జాతీయ గీతానువాదం, 'అన్నా కూలీ లేకముకావలెర' అనే కార్మిక ఐక్యతా ప్రబోధ గేయం, విశ్వ సాహిత్యం నుండి గోర్కీ 'అమ్మ' మొదలైన రచనలు అభ్యుదయ రచనోద్యమానికీ తెనుగునాట అంకురార్పణ చేశాయి. ఫాసిజం నుండి సంస్కృతీ పరిరక్షణకై ప్రపంచ రచయితల సంఘమొకటి 1935లో ఏర్పడింది. ఆ తరువాత 1943లో తెనాలిలో తెలుగునాట అభ్యుదయ రచయితల సంఘం స్థాపితమైంది. తాపీ ధర్మారావు అధ్యక్షత వహించారు. శ్రీశ్రీ, శిష్ట్లా ఉమామహేశ్వరరావు, శ్రీరంగం నారాయణబాబు, సామినేని ముద్దుకృష్ణ, పురిపండా మొదలయినవారు తొలి తరం అభ్యుదయ కవులు కాగా శ్రీశ్రీ చాలామంది అనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు. తెన్నేటి సూరి, అనిసెట్టి సుబ్బారావు, రెంటాల గోపాలకృష్ణ, బెల్లంకొండ రామదాసు, అరుద్ర, గంగినేని వెంకటేశ్వరరావులతోపాటు సోమసుందర్ అభ్యుదయ కవుల్లో మలితరానికి చెందినవాడు. సోమసుందర్ వజ్రాయుధం, అనల కిరీటం, బానిసల దేశం, మందీ మనిషి, కాహళి, అంగారతల్పం, గోదావరి జలప్రళయం, రక్తాక్షి, మిణుగురులు, కాలం జాడలు, వెన్నెలలో కోనసీమ, శ్రీరామరక్ష మేఘరంజని, సోమరసం – సుందరకాండ, కవిత్వం కాలాతీత కాంతిరేఖ, నారాయణ చక్రం, కృష్ణశాస్త్రి కవితాత్మ మొదలయిన రచనలు చేశారు.

**వజ్రాయుధం :** 1949లో సోమసుందర్ రచించిన ఈ అభ్యుదయ గేయ సంపుటి అభ్యుదయ కవిత్వోద్యమానికి స్ఫూర్తినిచ్చిన రచన. వర్గ సంఘర్షణను చిత్రించడం, పెట్టుబడిదారీ సమాజాన్ని నిరసించడం విప్లవాన్ని ప్రబోధించడం లక్ష్యంగా సమధర్మం, ధృవతార, ఫాక్టరీవంటి శీర్షికలతో గేయాలున్నాయి. బానిసల దండయాత్రలో తెలంగాణలో నైజాం నిరంకుశ చర్యలు, వాటిని ఎదుర్కొన్న విప్లవ వీరుల పోరాటం ఇతివృత్తం. జనగామలో జమ్మిచెట్టు కొమ్మపై ఎక్కి గెరిల్లా పోరాటం సాగించిన వీరుల సాహసాన్ని హృదయానికి హత్తుకొనేటట్టుగా వర్ణించారు.

*'ఖబడ్దార్ ఖబడ్దార్ నైజాం పాదుషాహీ / బానిసత్వ విముక్తికై హిందూ ముస్లిం పీడిత – శ్రమ జీవులు ఏకమైరి"* అంటూ నిజాంను హెచ్చరించిన సోమసుందర్ కవితా ప్రతిభకు ఈ పంక్తులు నిదర్శనాలు.

*"ఒక వీరుడు మరణిస్తే / వేలకొలది ప్రభవింతురు*
*ఒక నెత్తుటి బొట్టులోనె / ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు"*

అభ్యుదయ సాహిత్య చరిత్రలో వజ్రాయుధం మరో ఉదయబింబం. ఇందులో కవి ఆదర్శమైన సామ్యవాదం వాస్తవ చిత్రణ ఆవిష్కృతమయ్యాయి. సంవిధానంలో ఉద్రేకాన్ని నిలుపుతూ వేగాన్ని సాధించే శిల్పం రచనకు ఔజ్వల్యాన్ని కలిగిస్తుంది, అని మాదిరాజు రంగారావు ప్రశంసించారు.

*'నిరవధికం, నిరంకుశం / సహింపనీ, భరింపనీ / ధీరప్రజాకోటికొరకు /త్రవ్వించే గోరీల్లో/నీ అమానుషత్వాన్నే / నీ నిరంకుశత్వాన్నే / పాతేస్తాం పాతేస్తాం..'* అంటాడు.

తెలంగాణ వీరుల పట్ల సానుభూతి చూపిస్తూ తుపాకులూ, ఫిరంగులు, విషవాయువులు ప్రజాశక్తిని ఆపలేమంటాడు. 'వృద్ధ జగతి సమాధిపై సమధర్మం ప్రభవింప'జేసే ఆశారూపానికి క్రియాశక్తిగా విప్లవం రూపొందించాలని ఆశించాడు సోమసుందర్. చరిత్ర గతిలో వచ్చిన పరివర్తన వేగంలో సంఘర్షణ పర్యవసానంగా నిమ్నోన్నతాలు నశించి పరాధీనత్వం, పురాలోకం, కృతకృత్యం స్థానంలో స్వాధీనత్వం, నవలోకం, సహజత్వం బుజుగత అవతరించి క్రమంగా అవనిపై

*"నిన్న నేదుల కృషియే రేపై జనిస్తుంది / సమధర్మం ప్రభవిస్తుందన్న"* అశాకేతనాన్ని ఆవిష్కరించాడు అవంత్స. ఆలోచన రూపంలో కనిపించని అభ్యుదయ భావన స్ఫుటంగా ప్రతీకమయ్యే లయాత్మక పదవిన్యాసంతో చీకటి నుండి ఉదయమై భవిష్యత్తు వెలుగుతూ రూపొందిన క్రాంతి చిత్రం 'సమధర్మం'. పాపపు లోకమే నిండుకుండ. రేపో ఎల్లుండో బద్దలవకమానదని, పొగరుమోతు లోకం కూలిపోక తప్పదని భావిస్తాడు 'బాడుగ చేగోడీలు'లో.

*'కాని రేపటి సూర్యుడు పదమూడోవాడు / చీకట్లను పరపర కోసుకుంటూ ఉదయిస్తాడు/ అప్పుడిక తప్పదు, మారిపోతుంది లోకం / రేపటి మానవుణ్ణి అసహాయశూరుణ్ణి / ఆహ్వానిస్తోంది కాలం చకోరాక్షి'* అంటారు 'అగామి సూర్యోదయం'లో.

**కాల్పనికత :** సోమసుందర్ కవిత్వంపై భావకవిత్వం ప్రభావం చాలాచోట్ల గోచరిస్తుంది. 'నీ హృదయం నెత్తురు గెడ్డయ్యి తుఫానులో రాలిన జీర్ణపత్రమై' 'ఆ తారను పీకనులిమి చంపిందేదో చీకటి' 'పాపం లోకం విసరిన శాపం' మొదలైనవాటిల్లో అలంకారాలపైనా ఉక్తి వైచిత్రి పైన సోమసుందర్ ఆసక్తి అర్థమవుంది. 'తల్లీ! ఏడవకమ్మా! మళ్ళీ జన్మన్నది మాకుంటే చల్లని నీ కడుపున జన్మిస్తాం అన్నప్పుడు రాయప్రోలు "పోరండి బ్రతుకుకై పోరండి పుడమికై పోరండి స్వేచ్ఛకై" అన్నపుడు బసవరాజు అప్పారావు కనిపిస్తున్నారంటారు కురుగంటి సీతారామయ్య 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' గ్రంథంలో.

వజ్రాయుధం తర్వాత సోమసుందర్ రాసిన మిణుగురులు, సోమరసం – సుందరకాండ, మేఘరంజని వంటి రచనలు కొంత భిన్నమైనవి. వాటిలోని ప్రకృతి వర్ణనలు, సోమసుందర్ తాత్విక చింతన విలక్షణమైనవి. వచన కవితలో చక్కని సూక్తులు పొదగడం సోమసుందర్ ప్రత్యేకత. 'ఫ్యాక్టరీ కూలీ ఎముకలను సున్నంగా విరగగొట్టి రక్తంలో రంగరించి ధనస్వామి పాదాలకు పారాణిపూస్తున్నది' వంటి భావ చిత్రాలతోపాటు 'దరహాస చంద్రికల'వంటి పదప్రయోగాలు కూడా చేశారు. తన స్వంత ఊరు పిఠాపురం ప్రకృతి సౌందర్యాన్ని 'ఊరు మారింది'లో వర్ణించాడు. 'వెన్నెలలో కోనసీమ' శీర్షికకు తగినట్లే అక్కడి సౌందర్యాన్ని కమనీయంగా చిత్రించారు. 'కాహళి' ఆంధ్రోద్యమానికి సంబంధించిన గేయ రచన. వాడుక భాషలో సంస్కృత సమాసాలను భావకవులుపయోగించే పడికట్టు పదాలు ఉపయోగించి సోమసుందర్ చాలా సందర్భాలలో శైలిని జటిలం చేశారు.

**విమర్శకుడు :** సోమసుందర్‌ను అభ్యుదయ కవిగా గుర్తించిన సాహితీ లోకం ఆయనను విమర్శకుడుగా పెద్దగా పట్టించుకోలేదు. ఆయన సహృదయ విమర్శకుడు. 'కవిత్వం కాలాతీత కాంతిరేఖ' కవిత్వ తత్వాన్ని, కవిత్వ ప్రయోజనాన్ని దర్శింపజేసే విలక్షణమైన వ్యాస సంపుటి కవిత్వం సామాజికుల హృదయాలనుకాలం కలుపుతుందని, కదుపుతుందని, ఉత్తమ కవిత్వం కాలుష్యాలను తొలగిస్తుందని భావించిన ఆవంత్స కవిత్వానికి ప్రజా ఉద్యమాలతోను, ఉద్యమాలకు కవిత్వంతోనూ పరస్పర భావానుబంధం ఏర్పడుతుందని, కవితా వికాసం బాసటగా నిలవనిదే ఆధునిక జీవనం పరిపుష్టం కాదని వ్యక్తం చేశారు.

'చలిమేర పొలిమేర ఆమని పొడిచె...... అంటూ తెలుగు కవితానందనంలో కృష్ణశాస్త్రి ప్రవేశాన్ని అభివర్ణిస్తూ, కవిగా, వ్యక్తిగా కృష్ణశాస్త్రి కొత్త నాగరికతకు ప్రేరకుడని ఆయన పలుకు కొత్త, ఊహ కొత్త, ఇతివృత్తం కొత్త, కవితా శిల్పం కొత్త అంటారు. కృష్ణశాస్త్రి కవితాత్మను అతి రమణీయంగా ఆవిష్కరించారు సోమసుందర్. "నారాయణ చక్రం" పేరులో డా. సి. నారాయణరెడ్డి కవిత్వ సమాలోచన చేశారు. మానవత్వం కోసం ఉద్యమించే కలంగా సినారెను అభివర్ణించారు. చైతన్యం యుగధర్మమని భావించిన సోమసుందర్ 'కుబేర లోకం సమాధిపై కుచేల లోకం నిర్మించాలని కాంక్షించిన ప్రగతి శీల సమతావాది.'

డా. దామెర వేంకట సూర్యారావు
విశాఖపట్నం. ఫోన్ : 988 518 8431.

# పరిశోధకులకు కరపత్రం

- గొల్లపూడి మారుతీరావు

కర్ణాటక సంగీతానికి తెలుగు కృతుల మూలాలు ఇప్పటి తమిళనాడులోనే ఉన్నాయి. అప్పటి కర్ణాటక సంగీత ప్రపంచంలో త్రిమూర్తులయిన వాగ్గేయకారులు - త్యాగరాజస్వామి, శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ అవిభక్త మద్రాసు రాష్ట్రంలో - తిరువారూర్‌లో జన్మించారు. వారి ప్రభావమూ, స్ఫూర్తీ ఇప్పటికీ తమిళనాడు చుట్టుపక్కలే పరుచుకుంది. తమిళనాడులో ఏ టెలిఫోన్ డైరక్టరీ తెలిచినా 'త్యాగరాజు' పేరు కొన్ని వేలసార్లు కనిపిస్తుంది. త్యాగరాజు కారణంగానే ఇప్పటికీ ప్రతీ తమిళుడూ ఏ కాస్తో తెలుగును అర్థంచేసుకుంటాడు. స్థూలంగా ఒక కళ సమాజానికి చేయగల ఉపకారమిది. అలాగే ఆ రోజుల్లో తెలుగు కీర్తన వ్రాయని సంగీతకారుడు దాదాపు లేరని చెప్పవచ్చు. తెలుగుకాక మరొక భాష - కీర్తన సంప్రదాయానికి ఒదుగుతుంది - అన్న ఆలోచనే లేని రోజులవి. ప్రముఖ సంగీత విద్వాంసులు టి.ఆర్.ఎస్. సుబ్రహ్మణ్యంగారు ఒక సభలో చెప్పారు : "ఎందుకయ్యా మీరు తెలుగులో రాశారు?" అంటే "ఏమో తెలియదు. మా గురువులు పెట్టిన ఒరవడి అది" అన్నారట వారు. కాగా, కీర్తనకి, భావ ప్రకటనకి - అపూర్వమైన రుచిని 'తెలుగు' భాష ఇవ్వడం వారు మరిగారు.



హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్

"కలిగియుంటే కదా కలుగును?" అన్న త్యాగయ్య సాహిత్యంగాని ''ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు?" అన్న అన్నమయ్య రచనలో అర్థగాంభీర్యాన్ని మించి ఎవరైనా చెప్పగలరా? అని తెలుగువాడిగా గర్వపడాలనిపిస్తుంది. ప్రత్యేకమైన నా అదృష్టం - 20 సంవత్సరాలు ఆలిండియా రేడియోలో పనిచేయడం. శెమ్మంగుడి, అరియక్కుడి, ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి, ఎమ్.డి. రామనాథన్, ఎస్. బాలచందర్, నామగిరిపేట్టై కృష్ణన్, రవిశంకర్, బడే గులాం ఆలీఖాన్, అల్లా రఖా, బిస్మిల్లా ఖాన్ వంటి నిన్నటి తరం దిగ్గజాలను వినే అదృష్టం కలసివచ్చింది. అంతేకాదు. శ్రీరంగం గోపాలరత్నం, మంచాల జగన్నాథరావు, వింజమూరి వరదరాజ అయ్యంగార్, దండమూడి రామమోహనరావు, అన్నవరపు రామస్వామి, దత్తాడ పాండురంగరాజు, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, ఎస్. రాజం వంటి వారితో కలిసి పనిచేసే అవకాశం కలిగింది. అయితే సంగీతం రుచి బాగా వంటబట్టని రోజులవి. మద్రాసులో ఉన్న కారణంగా, నా ఉద్యోగ, సినీ జీవితం నుంచి కాస్త విశ్రాంతి దొరికినప్పుడు - నేనూ, మా ఆవిడా (డాక్టర్ పద్మభూషణ్ పినాకపాణి అన్నగారి అమ్మాయి) దాదాపు ప్రతిరోజూ కచ్చేరీలో గడిపాం. క్రమంగా సంగీతం వైభవం వంటబట్టింది. కాగా ఈ తరం మహానుభావులు - పినాకపాణి, నేదునూరి కృష్ణమూర్తి, నూకల చినసత్యనారాయణ, లాల్‌గుడి జయరామన్, టి. రమణి, ఎమ్మెస్ గోపాలకృష్ణన్, పరూర్ అనంతరామయ్య, ఆర్.కె. శ్రీకంఠన్, డి.కె. పట్టమ్మాళ్, టి.ఎన్. కృష్ణన్, టి.ఎన్. శేషగోపాలన్, టి.వి. శంకరనారాయణ్, ఎ. కన్యాకుమారి, నిత్యశ్రీ మహాదేవన్, సంజయ్ సుబ్రహ్మణ్యం, ఉన్నికృష్ణన్,



మైసూర్ వాసుదేవాచార్



ధర్మపురి సుబ్బారాయర్

సుధారఘునాథన్ – ఇలా ఎందరి కచ్చేరీలకో హాజరు కాగలిగాం. ఈ సందర్భాలలో ఒక విషయం కొట్టవచ్చినట్టు క్రమంగా స్ఫురణకు వచ్చింది. త్యాగరాజు స్వామి, శ్యామాశాస్త్రి, దీక్షితార్‌వంటివారి తెలుగు కీర్తనలేకాక – అపూర్వమైనవి, అనూహ్యమైన మాధుర్యంగలవీ ఎన్నో తెలుగు కీర్తనలు వినడం జరుగుతూ వచ్చింది. వీరంతా ఎవరు? పేర్లు విన్నప్పుడు ఇంకా ఆశ్చర్యం తోసుకువచ్చింది. వీణ కుప్పయ్యర్, పూచ్చి శ్రీనివాస అయ్యంగార్, అన్నయ్య పిళ్లె, హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్, మైసూర్ వాసుదేవాచార్ – వీరంతా తెలుగులు కారు. కాని తెలుగువారు కూడా పట్టుకోలేనంత గొప్ప పలుకుబడిని, శబ్దసౌందర్యాన్ని, గానమాధుర్యాన్ని పుణికిపుచ్చుకుని అద్భుతంగా రచనలు చేశారు. ముగ్ధుడనై విన్నాను. ఎందరో తెలుగు గాయకులనడిగాను. వీరి గురించి తెలుసా? అని. కొన్ని పాపులర్ కీర్తనలు – వీరి గురువులు చెప్పినవి మాత్రమే తెలుసు అన్నారు వారు.

తెలుగులో అపూర్వమైన కృతులు చేసిన ఈ ఆంధ్రేతరులు ఎవరు? కేవలం కొందరి సమాచారం. త్యాగరాజుకి ప్రత్యక్ష శిష్యులు – వాలాజాపేట వేంకట రమణ భాగవతార్ (1781–1874). ఈయన త్యాగయ్య శిష్యుడే కాదు. ఆయన కృతులను, సమాచారాన్ని ప్రోదు చేస్తూనే, ఆయన్ని ఆరాధించిన భక్తుడు. శ్రీగురు మంగళాష్టకం, ఆదిగురు అష్టోత్తర పంచాంగం వ్రాసినవాడు. ఆయన కీర్తనలు – గురుచరణం భజరే – శంకరాభరణం, నీవు నను బ్రోవవలెనమ్మా – దర్బారు, వినరాదా – సెంజురటి, గురువరు మహిమల ఏమని భువిలో – ఆనందభైరవి, ఆనందమయమనవే – జ్యోతిస్వరూపిణి – నేను విన్న కీర్తనలు.

ఆకుమడుగుల మానంబుచావిడి వెంకట సుబ్బయ్యర్ మరొక త్యాగరాజు ప్రత్యక్ష శిష్యుడు. హంసధ్వనిలో 'జలజాక్ష' వర్ణం చాలామంది గాయకులకు తెలిసే ఉంటుంది. ఈయన శిష్యుడు పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్. తెలుగులోనే కీర్తనలు చేశారు. ఆయన శిష్యుడు పూచి శ్రీనివాస అయ్యంగార్ –



అరియకుడి రామానుజ అయ్యంగార్

రామనాథపురం స్వస్థలం. ఈయన చేసిన తెలుగు కీర్తనలు అపూర్వం. నిన్ను కోరి – మోహన (ఇళయరాజా సినీమాకు చక్కని పాటను చేశారు), సద్గురు సామికి – రీతిగౌళ, సామజవరద – శుద్ధసావేరి నేను విన్న కీర్తనలు. ఈ కాలం సంగీతజ్ఞుడు పచ్చిమిరియం ఆది అప్పయ్య. ఈయన 'విరిబోణి' వర్ణం గాయకులకు కొంగుబంగారం. విశ్వనాథవారు తమ గురువుల గురించి గర్వంగా చెప్పిన మాటలు ఈయనకి వర్తిస్తాయి. కర్ణాటక ప్రపంచంలో త్రిమూర్తులలో ఒకరయిన శ్యామాశాస్త్రి వీరి శిష్యులు.

వీరిలో కొందరు పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్‌లాగ జీవితమంతా తెలుగులోనే కృతులు చేశారు. ధర్మపురి సుబ్బరాయర్‌ని ఎవరు మరచిపోగలరు? వారి జావళీలు ఇప్పటికీ తెలుగు సాహిత్యంలో మణిపూసలు. ఎప్పుడు తలచుకున్నా పులకింపజేసే రెండు జావళీలు నాకు గుర్తుకొస్తున్నాయి. పరులన్న మాట నమ్మవద్దు – కాపీ, కొమ్మరో వానికెంత బిగువే – ఖమాచ్. ఇంత గొప్ప భావ ప్రకటన, తెలుగుతనం, బాణీలో బిగింపు, ఆరోగ్యకరమైన సరసత, శృంగారం – చాలా అరుదుగా కనిపిస్తాయి. కొన్ని తరాలు తెలుగుదేశం నడిబొడ్డులో ఉంటేకాని వ్రాయలేని సరసత, అర్థగాంభీర్యం వీరి జావళీలది.

తంజావూరు క్వార్టెట్‌గా పేరుగాంచిన నలుగురు గాయకులు – చిన్నయ్య పిళ్లె, పొన్నయ్య పిళ్లె, శివానందం పిళ్లె, వడివేలు పిళ్లె అపూర్వమైన కీర్తనలు చేశారు. ముఖ్యంగా పొన్నయ్య పిళ్లె 'అంబ నీలాంబరి' ఇప్పటికీ వింటే జోకొట్టి నిద్రపుచ్చుతుంది. ఏమి కీర్తన! వీరు 19వ శతాబ్దివారు. మరిచిపోవద్దు. వీరు ఆంధ్రేతరులు. వీరి కృషి – తెలుగు భాషకు పట్టాభిషేకం. నేను విన్న మరికొన్ని కీర్తనలు 'సాటిలేని' పూర్వీ కళ్యాణి. సౌరాష్ట్రలో 'రంగనాథుడే' అద్భుతమైన కీర్తన. మరొకటి – ఆహిరిలో 'దీన రక్షక నిను.'

పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ శిష్యుడు టైగర్ వరదాచారి.



ఎమ్.డి. రామనాథన్

ఆయన శిష్యుడు జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం. ఇంగ్లీషులో బి.ఏ. ఆనర్స్ చదివిన ఈ గాయకుడు అద్భుతమైన తెలుగు కీర్తనలు చేశారు. నిజానికి సంస్కృతం, తమిళం, తెలుగులో 250 కృతులు చేశారు. భారమా బాలుని – హంసనాదం, గతి వేరెవరమ్మా – భైరవి, నిజముగ రామ నీ పాదముల – కీరవాణి, మరువను నే నిన్ను – ఆరభి, తామసమిక తాళను – తాపత్రయ శమని – ఇలా ఎన్నయినా చెప్పగలను. గర్భపురి వాసర్ – బ్రోవ సమయమిదే – గౌరీ మనోహరి, నా మనవిని వినవయ్యా – చక్రవాకం; తంజావూర్ త్యాగయ్యర్ (52 కృతులు) నెనరు మీరగను – చక్రవాకం, పలుమారు నిన్ను వాచస్పతి, పలుకవదేల – బాలహంస హరికేశనల్లూర్ ముత్తయ్య భాగవతార్ (1877–1945) గురువు పదినైందు మండప శ్రీనివాస అయ్యర్ (తిరువారూర్), ఆయన శిష్యుడు రామనాథపురం శంకర శివం – ఆయన శిష్యుడు టి.ఎన్. శేషగోపాలన్. ఈ తరం పద్మభూషణ్. తన గురువుగారి గురువుగారి కీర్తనలు అద్భుతంగా గానం చేస్తారు. శ్రీ రాజమాతంగి – శుద్ధధన్యాసి, అంబవాణి నన్ను – కీరవాణి – ఇలా ఆయన కీర్తనలు తలుచుకుంటేనే ఒళ్ళు పులకరిస్తుంది. నిన్న మొన్నటి తరం గాయకురాలు అంబుజం కృష్ణ. 1951 ఆగస్టులో త్యాగరాజ సమాధి దగ్గర ప్రభావితురాలై తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, సంస్కృతం భాషలలో కృతులు చేశారు. ముసిరి సుబ్రహ్మన్య అయ్యర్ వంటి దిగ్గజాలు ఆమె రచనలను ప్రశంసించేవారు. శెమ్మంగిడి, మధురై కృష్ణన్ వంటివారు ఆ కృతులకు రాగబద్ధం చేశారు. మైసూర్ వాసుదేవాచార్ (1865–1961)ని ఈ తరం తెలుగువారు మరిచిపోలేరు. లేదా సులువుగా గుర్తుపడతారు. కారణం – 'శంకరాభరణం' సినిమాలో "బ్రోచేవారెవరురా" కీర్తన. వారి దేవాదిదేవ – సునాద వినోదిని, భజన సేయరాదా? – ధర్మావతి చిరస్మరణీయాలు. వాసుదేవాచార్ అంటారు : "తొలినే చేసిన పూజా ఫలమో, నా పూర్వజుల పుణ్యఫలమో!" అని. మరోతరం తరువాత – విదేశాలలో మాయమయే మన తర్వాత తరంవారికి ఈ మాటలు అర్థంకావు – వారికి పూర్వజులు, వారి పుణ్యంలాంటి మాటలకు అర్థాలు తెలియవు కనుక, వారు ఏం నష్టపోయారో తెలుసుకోడానికయినా ఈ కీర్తనలు మిగలాలి. సింహేంద్ర మధ్యంలో వారి 'నిన్నే నమ్మితినయ్య' వింటే నేను కరిగి నీరయిపోతాను. ఆయన వర్ణములు, తిల్లాన, జావళి, శ్లోకాలు చేశారు. రుక్మిణీ దేవి అరండేల్ వారిని కళాక్షేత్రకు ఆహ్వానించి ఉద్యోగం ఇచ్చారు (వారు 96 సంవత్సరాలు జీవించారు). వారి మనుమలు ఎస్. కృష్ణమూర్తి (ఏఐఆర్) నేను చెన్నై రేడియోలో పనిచేశాము. ఇక నిన్న మొన్నటి లాల్‌గుడి జయరామన్ (1930–2013) చలము సేయనేల – వలజి, నీవే గతియని – నళినకాంతి, ఎంతో ప్రేమతో – బహుదారి ఎవరు మరిచిపోగలరు. వారి వయొలిన్ కచ్చేరీకి తన్మయులై 1965లో ఎడింబరో ఫెస్టివల్‌లో యహూదీ మెనూహిన్ ఆయనకు ఇటాలియన్ వయొలిన్‌ని బహూకరించారు. ఈయన త్యాగరాజు శిష్య పరంపరలో అయిదో తరం. వీరి తండ్రి శుద్ధ తరంగిణి, వేలావళి, గాంధర్వ మనోహరి, భువనమోహిని, సింధుక్రియ, మేఘరంజనివంటి అరుదైన రాగాలలో కృతులు చేశారు.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రం. అయితే వీరికి స్ఫూర్తి ఏమిటి? ఎన్ని కీర్తనలు చేశారు? వారి రచనల వివరాలున్న పుస్తకాలున్నాయా? లేవు. లేవు. లేవు. ఎవరికీ సమగ్రంగా తెలియదు. మద్రాసు పుస్తకాల షాపుల్లో వాకబు చేశాను. అలాంటి పుస్తకాలు లేవు. అంతెందుకు? పాపనాశన్ శివన్ ఎన్నో అద్భుతమైన కీర్తనలు తమిళంలో చేశారు. మనవాళ్ళు పాడుతారు. కాని తెలుగులో ఆయన కీర్తనల పుస్తకం లేదు. మరి త్యాగరాజు, శ్యామాశాస్త్రి మీద తమిళంలో కొన్ని డజన్ల డాక్టరేట్లు ఉన్నాయి. మనవాళ్ళు తెలుసుకుని పాడే కీర్తనల బాణీలను, కృతులను మన భాషలోకి ఎందుకు తెచ్చుకోలేదు? సమాధానం లేదు.

అప్పటినుంచీ కాగితం, పెన్నూ పుచ్చుకుని కచ్చేరీలలో కూర్చోవడం ప్రారంభించాను. తెలుగు కీర్తన ఎప్పుడు వినిపించినా – కొత్త రచయిత పేరు వింటే వ్రాసుకోవడం ప్రారంభించాను. నన్ను నిర్ఘాంతపరిచే, అపూర్వమయిన కృషి – తెలుగేతర ప్రాంతాలలో, ముఖ్యంగా దక్షిణాదిన జరిగిందని అర్థమయింది. గత రెండున్నర శతాబ్దాలుగా ఎందరో మహానుభావులు – తెలుగులో భక్తితో, సామర్థ్యంతో, ఒక ఉపాసనలాగ కీర్తనలు చేశారు. ఈ కీర్తనల పాఠాలు ఇప్పుడు

కేవలం కొందరు నిన్నటితరం గాయకుల నోళ్ళలోనే ఉన్నాయి. కొందరు శలవు తీసుకుంటున్నారు. ఇప్పటి తరం గాయకులకు పాఠం మీద దృష్టి లేదు. పైగా ప్రాంతీయ తత్వం, తెలుగు మీద విముఖత క్రమంగా ఏర్పడుతోంది. ఒక ఉపాసనలాగ కాక తమిళంలో పాడి ఇప్పటి ప్రేక్షకులని అలరించే ధ్యాస క్రమంగా యువ గాయకులలో నిలదొక్కుకుంటోంది. ఒకప్పటి సందర్భం గుర్తుకు వస్తోంది. ఆ రోజుల్లో అరియక్కుడికి ముత్తయ్య భాగవతార్ కీర్తనలు ఇచ్చి సభలో ఒకటి రెండు పాడమని భాగవతార్ అభిమానులు అడిగారట. ఆయన త్యాగరాజు, దీక్షితార్ వంటి వారి కీర్తనలు పాడి కచ్చేరీని ముగించారు. తర్వాత ఈ పాటలు ఇచ్చినాయన – అడిగారట. అరియక్కుడి సమాధానం : "ఆ త్రిమూర్తుల పాటలు కీర్తనం. ఈ పాటలు పోకిరీతనం" – ఇది విన్న కథ. ఆ తరానికి సంప్రదాయంపట్ల గల భక్తిని సూచించడానికి మాత్రమే ఉదహరించాను. నేటి తరానికి ఆ భక్తి సన్నగిల్లుతోంది. ఇటీవలే రమోన్ మెగ్సేసే అవార్డు పుచ్చుకున్న ప్రముఖ గాయకుడు టి.ఎన్. కృష్ణ ఖమాచ్‌లో పాడిన 'సీతాపతే' కీర్తన విన్నాను. చరణంలో సాహిత్యం మీద బొత్తిగా ఆయనకి దృష్టిలేదు. ఆశ్చర్యంలేదు. ఈ తరానికి తెలుగుమీద చిన్న చూపు కూడా తెలుస్తోంది. త్యాగరాజ, శ్యామాశాస్త్రి వదులుకోలేని, దూరంగా ఉంచలేని కారణంగానే వారింకా మిగిలి ఉన్నారు. వారు తరచూ వినిపిస్తారు. మిగతా రచనలు – కేవలం ఆయా కీర్తనల సాంద్రత కారణంగానే అంతంతమాత్రంగా వారి గొంతుల్లో మిగిలి ఉన్నాయి. ఇది చాలా నయం. మనవారికి – కనీసం చాలామందికి అవి కూడా తెలియవు కదా?

ఈ వ్యాసాన్ని ఒళ్ళు దగ్గర పెట్టుకుని, సంగీతం పట్ల కేవలం భక్తితో మాత్రమే వ్రాస్తున్నాను. నిజానికి ఈ వ్యాసం వ్రాయడానికి కారకులు మిత్రులు **మిసిమి** సంపాదకులు, అశ్వినికుమార్ లోగడ స్థాలీపులాక న్యాయంగా ఈ వివరాలను ఉటంకిస్తూ రాసిన వ్యాసం చదివారు. తదాదిగా ఆ విషయం మీద ఒక సమగ్రమైన వ్యాసం రావాలనీ, తద్వారా సంగీత ప్రపంచానికి ఉపకారం జరుగుతుందనీ పట్టుబడ్డారు. అంతటితో ఆగలేదు. పెన్ను మూత తెరిచి నా చేతిలో పెట్టి కూర్చున్నారు. వరసగా ఫోన్లు. ఫలితం ఈ వ్యాసం. ఈ తరం దాటితే ఇక ఈ సంపద మిగలదు. వాటిని నేర్చుకున్న తరం వెళ్ళిపోతుంది కనుక. చెప్పగలిగే పెద్దలు, ఆ శ్రద్ధ ఉన్న గాయకులు – ఇంకా కొందరున్నారు. ఇదివరకటికంటే ఇప్పటి సౌలభ్యం – చేతిలో టేప్‌రికార్డరు. ఆయా గాయకుల్ని కలిసి వారిచేత పాడించుకుని, పాఠాంతరాలను పట్టుకుని సవరించుకోవాలి. బాణీలను



జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం

స్వరపరచుకోవాలి. విశ్వవిద్యాలయాలు ఈ 'పరిశోధన'కు పూనుకోవాలి. ఈ గాయకులు ఎవరు? ఆనాటి సంగీత ప్రపంచం తెలుగులో కీర్తనలు చేయడానికి ఏ విధంగా వీరిని ప్రోత్సహించింది, ఇంకా ఏమైనా కీర్తనలు చేశారా? ఈ సమాచారమంతా పుస్తకరూపంలో రావాలి. ఇది ఈ భాష సంపద. కొన్ని శతాబ్దాల తర్వాత అన్నమయ్య పదకవితల సంపద తెలుగువారి జీవనాన్ని ప్రభావితం చేసింది. ఇదీ అంత గొప్ప సంపద. సందేహం లేదు. ఆంధ్రేతరులు ఇచ్చిపోయిన సంపద. అవసరమైతే ఏదో విశ్వవిద్యాలయం – ఈ పనికి ఒక పీఠాన్ని ప్రారంభించినా తప్పులేదు. పూనుకున్నవారికి నేను రాసుకున్న వివరాలను అందించగలను.

ఇంకా ఈ వివరాలను ఎంతో కొంత చెప్పగల పెద్దలు తమిళ సంగీత ప్రపంచంలో ఇప్పటికీ ఉన్నారు. నాకు గుర్తుకొచ్చే పేర్లు – ఆర్. వేదవల్లి, పి.ఎస్. నారాయణస్వామి, పరూర్ అనంతరామయ్య, ఆర్.కె. శ్రీకంఠన్, సుగుణా వరదాచారి, సుగుణా పురుషోత్తం, టి.ఎన్. శేషగోపాలన్, టి.వి. శంకరనారాయణ్ మొదలయినవారు. ఈ విషయం ప్రముఖ విద్వాంసులు టి.ఆర్.ఎస్.తో ఒకసారి అన్నాను. ఆయన విజయవాడలో పదేళ్ళు ఉద్యోగం చేశారు. నేను చెప్పిన విషయం విని "మంచి ఆలోచన. మావాళ్ళచేత ఒక ఎమ్.ఫిల్. వ్యాసం చేయిస్తాను" అన్నారు. వారికి ఈ విషయం ఒక ఎమ్.ఫిల్. పాటిది. మనకి నాలుగైదు డాక్టరేట్ల విస్తృతి కలది. ఇప్పటికే చెంగల్పట్టు రంగనాథన్, టి.ఆర్.ఎస్., కల్పగం స్వామినాథన్ (వీణ), తంజావూరు శంకరయ్యర్, లాల్‌గుడి జయరామన్, నాదోపాసన శ్రీనివాసన్ వంటి సీనియర్లు వెళ్ళిపోయారు. ఇది ఆలస్యం చేయవలసినది, అశ్రద్ధ చేయవలసిన పనికాదు. ఆంధ్రేతరులు మన భాషనీ, మన



పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్

సంప్రదాయాన్నీ ప్రేమించి, ఆరాధించి, ఉపాసించి మనకిచ్చిపోయిన రెండున్నర శతాబ్దాల సంపద.


మన దేశంలో ఇప్పుడిప్పుడు సంగీతం పట్ల ఎంతో కొంత మక్కువ ఏర్పడుతోంది. ఇవాళ్టికీ – తెలుగులో కీర్తనలు వ్రాస్తున్న తమిళులు ఉన్నారు. జి.ఎస్. మణి, టి.ఆర్. సుబ్రహ్మణ్యం, తంజావూర్ శంకరయ్యర్, స్పెన్సర్ వేణుగోపాల్ మొదలైనవారు. మరొక్కసారి – కేవలం సంగీతం పట్ల, తెలుగు భాష పట్ల అభిమానం పెట్టుబడిగా మాత్రమే ఈ వ్యాసాన్ని – రాస్తున్నాను. తెలిసి కాదు – తెలుసుకుని. వ్యాసాన్ని ముగించేముందు – నేను విన్న మరికొన్ని ఆణిముత్యాలు.

*వలచి వచ్చి – వర్ణం – కొట్టువాసల్ వెంకట రామయ్యర్*

*పార్థసారథిని – యదుకుల కాంభోజి – సుబ్బరాయ దీక్షితార్*

*రఘునాథ నన్ను – శూరరంజని – రామనాథపురం శ్రీనివాస అయ్యంగార్ / ఎంతని విన్నవింతురా – ఊర్మిక – నీకరపట్టి పల్లవి శేషయ్యర్*

ఎవరీ మహానుభావులు? ఏమిటి వీరికి స్ఫూర్తి? ఇంకా ఏయే వైభవాలను వీరు ఆవిష్కరించారు? ఇదొక పెద్ద పీఠం కాగలిగిన కృషి. ఈ కీర్తనలు గ్రంథస్తం అవుతూనే పాడగలిగినవారి నుంచి రికార్డు చేసి పొందుపరచుకోవలసిన మన సంపద.




గొల్లపూడి మారుతీరావు

email : gmrsivani@gmail.com


## కమాల్ సాహెబ్

స్త్రీ పాత్ర నిర్వహణలో దిట్ట. ఈయన 1915, ఫిబ్రవరి 12న కడపజిల్లా కొండపేటలో పుట్టాడు. తండ్రి పేరు హుసేన్‌సాహెబ్. నిరుపేద కుటుంబంలో పుట్టిన కమాల్ సాహెబ్ అయిదవ తరగతి చదువుతోనే విద్యాభ్యాసం ముగిసింది. పదకొండవ సంవత్సరంలోనే కమ్మగా పాడే కమాల్ సాహెబ్‌ను, గాజుల లక్ష్మయ్య చేరదీశాడు. *లవకుశ* నాటకంలో నటింపజేశాడు. నాటి ప్రదర్శనలో కమాల్ సాహెబ్ నటన, శ్రావ్యమైన గాత్రం నటుడిగా ముందుగా వెళ్ళడానికి తోడ్పడింది. ఈయన డి.వి. నరసింహారావు దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న తరువాత *రామదాసు, కృష్ణలీల, తులాభారంలో* నటించాడు.


తురిమెళ్ళవారి మాధవ విలాస నాటక సమాజం నలభైమంది నటులతో రాయలసీమ ప్రాంతంలో నాటకాలు ప్రదర్శిస్తుండేది. కమల్ సాహెబ్ ఆ సమాజంలో చేరి *రంగూన్ రౌడి, చింతామణి, హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం* మొదలైన నాటకాలలో నటించి మంచి నటుడుగా పేరుతెచ్చుకున్నాడు. 1935లో రామవిలాస సభ తరఫున కడపలో ప్రదర్శించిన *రామదాసు, చండిక, పాదుక* మొదలైన నాటకాలలో బళ్ళారి రాఘవ, దొడ్డన గౌడ, పద్మావతి దేవి బృందంతో కలిసి నటించాడు. స్త్రీ పాత్ర నిర్వహణలో సహజత్వాన్ని కనబరచిన కమాల్ సాహెబ్ తరువాత నాటకాలలో సత్యభామ, సక్కుబాయి, చింతామణి, కైక, ముర, చంద్రమతి, సావిత్రి, తార, యశోద, పద్మావతి పాత్రలలో నటించి స్థానం నరసింహారావు, బళ్ళారి రాఘవ, సుప్రసిద్ధ కవి జాషువా మెప్పును పొందాడు. కమాల్ సాహెబ్ మహమ్మదీయుడైనప్పటికీ నటనలో కులమతాలు లేవని, హిందూ మతానికి సంబంధించిన ఆధ్యాత్మిక, పౌరాణిక పాత్రలలో నటించి నటనా రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు.



కమాల్ సాహెబ్

1962 వరకు సురభి సమాజం ప్రదర్శించిన నాటకాలలో నటించాడు. ప్రదర్శనాపరంగా లభించిన సొమ్మును అనాథ పిల్లలకోసం, నిరుపేదల కోసం, స్కూళ్ళ నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చాడు. ఈయన నటించిన నాటకాలు మన రాష్ట్రంలోనే కాదు బెంగుళూరు, మైసూరు, మదరాసులలోనూ మెప్పును పొందాయి. నాటక రంగం కోసం పనిచేసిన కమాల్ సాహెబ్‌ను అనేక పరిషత్తులు అభినందించాయి. సువర్ణ పతకాలతో సత్కరించాయి. 1971లో ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘానికి అనుబంధంగా ఉన్న రాయలసీమ ప్రాంతీయ సంఘం 'నాటక కళాధురీణ' బిరుదునిచ్చి గౌరవించింది.

దాసరి ఎన్.



# తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాణ విశేషాలు - 3

– ఈమని శివనాగి రెడ్డి

**ప్రధాన శిల్పి : రాజరాజ పెరుంతచ్చున్**

రాజరాజేశ్వరమని పిలుబడిన తంజావూరులో బృహదీశ్వరాలయ గోడలపైన చాలా శాసనాలున్నాయి. దేవాలయ భూములు, ఆస్తులు, నగలు, పంచలోహ విగ్రహాలు, ఆలయ అర్చనా విధానం, ఉత్సవాలు, జాతర్లు, ఆలయ సేవకుల గురించిన వివరాలెన్నో ఈ శాసనాల్లో ఉన్నాయి. శాసనాల్లో పేర్కొనబడిన 750 మంది వ్యక్తుల పేర్లలో నాట్యగత్తెలు, వాద్యకారులు, ఛేరీవాదకులు, ఆలయాల్లో ఊడ్చి, శుభ్రపరచేవాళ్ళు, దర్జీలు, మంగళ్ళు, కాగడాలు పట్టేవాళ్ళు – ఇంకా ఎంతోమంది సేవకులున్నారు. శాసనాల్లో ఇంతమంది పేర్లున్నా, రాజరాజ పెరుంతచ్చున్, నిత్త వినోద పెరుంతచ్చున్‌ల పేర్లు మాత్రం ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. వీరిద్దరూ ఆలయాన్ని నిర్మించిన ప్రధాన శిల్పి, ఆయన అనుచరులు. వీరికి ఆలయ మర్యాదల ప్రకారం రావలసిన ప్రసాదాలు, ఆదాయ వివరాలు కూడా ఈ శాసనాల్లో ఉన్నాయి. వీరికి చెల్లించే జీతభత్యాలను 'తచ్చార్యమ్' అని పేర్కొనబడింది.

మచ్చుకు ఒక ఉదాహరణ :

'ఒక ప్రధాన కొయ్య శిల్పి తచ్చాచార్యునికి ఒకటిన్నరవంతులు, మరో ఇద్దరికి ఒకటిన్నర వంతులు, వీరచోళ కుంజర మల్లిన్ అనే బిరుదుగల ప్రధాన శిల్పి అయిన రాజరాజ పెరుంతచ్చున్‌కు మూడొంతులు ఇవ్వబడినది' అని దక్షిణ భారత శాసన సంపుటి : వాల్యూం – 2, శాసన సంఖ్య 66, లైన్లు 503–505లో పేర్కొనబడింది. అదే శాసనంలో, గుణవన్ మధురాంతకన్ అనే బిరుదుగల ప్రధాన కొయ్య శిల్పి నిత్త వినోద పెరుంతచ్చున్‌కు ఒక వంతులో ముప్పావు భాగాన్నీ, ఇలాత్తిచ్చడైయన్ అనే బిరుదుగల గండరాడిత్త పెరుంతచ్చున్‌కు ఒక వంతులో ముప్పావు భాగాన్నీ హక్కుగా ఇచ్చినట్లు చెప్పబడింది. ఇక్కడ తచ్చున్ అన్న పదం రాతి శిల్పిని సూచించగా తచ్చాచార్య అన్న పదం ప్రధాన వడ్రంగి (కొయ్య శిల్పి)ని సూచిస్తుంది. ప్రధాన శిల్పిని కూడా తచ్చాచార్య అనే పిలవటం తమిళనాట ఇప్పటికీ ఉంది. ఆలయ శాసనాలలో శిల్పులతోపాటు మణికారులు, స్వర్ణకారులు, దర్జీలు, రాగి, వెండి, ఒగారు పాత్రలను తయారుచేసేవారు, కుమ్మర్లు, జ్యోతిష్యుల పేర్లు కూడా ఉన్నాయి. ఆలయ నిర్మాణ ప్రారంభం నుంచి మహాకుంభాభిషేకం దాకా పనిచేసిన అనేకమందికి రాజరాజు, తన పేరును జోడించిన బిరుదునిచ్చి సత్కరించాడు. వివిధ కళాకారులకు రాజరాజు ఇచ్చిన బిరుదులు ఇలా ఉన్నాయి :

1. చిన్న ఢమరుకాన్ని మోగించే సహస్ర బాహుకు – రాజరాజ సహస్రబాహు.

2. వీణా వాద్యకారుడు శ్రీ హస్తన్‌కు – రాజరాజ శ్రీహస్తన్.

3. వైద్యుడు కూడా అయిన మంగళి నావిసన్‌కు – రాజరాజ పెరునావిసన్.

4. కాగడాపట్టే కావిటికి – రాజరాజ పెరుంకావిటి.

5. జోతిష్యుడైన గణితాధి రాజన్‌కు – రాజరాజ గణితాధి రాజన్.

6. శస్త్రచికిత్సలు చేసే వైద్యుడైన ప్రయోగత్ తరైయన్‌కు – రాజరాజ ప్రయోగత్తరైయన్.

వారికున్న ప్రతిభను గుర్తించి, తగిన విధంగా, తనతో సమానంగా బిరుదులనిచ్చి సత్కరించాడు. మరికొంతమందికి రాజరాజకున్న 'ముమ్మిడిచోళ, నిత్తవినోద' బిరుదుల్ని ఇచ్చి గౌరవించాడు. ఆలయ నిర్మాణ ప్రారంభం నుంచి పనిచేసి, మధ్యలో చనిపోయినవారికి, వారందించిన సేవల్ని కొనియాడి వారి వారసులకు ఆదాయ వనరుల్ని అందించినట్లు రాజరాజు

వారసుల పేర్లను శాసనాల్లో పేర్కొని వారి రుణం తీర్చుకొన్నాడు. ప్రధాన శిల్పి రాజరాజ పెరుంతచ్చన్‌కు మూడు భాగాలు, అతని ఇద్దరు సహాయకులకు ఒక్కొక్కరికి ముప్పావువంతు చొప్పున ఇచ్చాడు. రాజరాజు, తన పేర నిర్మించిన రాజరాజేశ్వరాలయ నిర్మాణ పర్యవేక్షకునిగా పెరుంతచ్చున్‌ను ఎంపిక చేసుకొన్నాడు. అతని గుణగణాల్ని, శిల్పి కళానైపుణ్యానికి అచ్చెరువొంది, ప్రధాన శిల్పిని, రాజరాజ గురువుతో సమానంగా చూచుకొనేవాడు. మయమతంలాంటి శిల్పశాస్త్రాల్లో చెప్పిన ప్రధాన శిల్పి (స్థపతి) లక్షణాలన్నీ పెరుంతచ్చున్‌లో ఉండటాన ఆయన్ను రాజ శిల్పిగా నియమించాడు. ప్రధానశిల్పి, ఉత్తమ గుణాలున్న శీలవంతుడు, వాస్తుశాస్త్ర విదుడు, అన్ని రకాల కట్టడాలను నిర్మించటంలో నిపుణుడు, అన్ని శాస్త్రాలు తెలిసినవాడు, అన్ని అంగాలు సరిగా ఉన్నవాడు, ధార్మికుడు, దయాపరుడు, ఏ రకమైన దురలవాట్లు లేనివాడు, గణితజ్ఞుడు, చిత్రజ్ఞుడు, పురాణజ్ఞుడు అయి ఉండాలి. వీరికి సహకరించేవారిని సూత్రధారులంటారు. వీరు కూడా వాస్తు శిల్ప శాస్త్రం తెలిసి, స్థపతి సూచనలమేరకు కట్టడాలను పర్యవేక్షించేవారు.



నందీశ్వరుని ధ్యానం

అన్నిరకాల కొలతలు తెలిసినవారై ఉండాలని చెప్పబడింది. తరువాత శ్రేణి శిల్పులను వర్ధకులంటారు. నిర్మాణానికి అవసరమైన కట్టడ భాగాలను చెక్కడం, ఒక్కొక్క వరుసను పొందించటంలాంటి వ్యక్తులను దగ్గరుండి, స్థపతి సూత్రగావి సూచనలమేరకు నిర్వహిస్తుంటారు. ప్రధాన శిల్పిని స్థపతి, విశ్వకర్మ అని పిలుస్తారు. స్థపతి నిర్మాణ స్థలంలో ప్రధానాధికారి. స్వతంత్ర నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ కలిగినవాడు. అందుకనే, తనకు నచ్చిన ఇద్దరు శిల్పులను తనకు సహాయకులు ఉండటానికి, వారికి సరిపడినంత జీతాలనివ్వటానికి రాజరాజు ప్రధాన శిల్పి రాజరాజ పెరుంతచ్చన్‌కు స్వేచ్ఛనిచ్చాడు. రాజరాజ పెరుంతచ్చన్ నియమించుకొన్న ఆ ఇద్దరు సహాయకుల్లో ఒకరు సూత్రగాహి మరొకరు వర్ధకి. ఆలయ ప్లాను గీచేటప్పుడు, నిర్మాణం చేసేటప్పుడు, రాజగురువైన ఈశాన శివగురుని సలహాలను తీసుకొనేవాడు.

ఈ సందర్భంగా క్రీ.శ. 8వ శతాబ్దినాటి ఉత్తర మేరూరులోని సుందరవరుడప్పెరుమాళ్ దేవాలయ శాసనాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ఆ శాసనంలో, కాంచీపురం శివారులోని పాటక గ్రామానికి చెందిన పరమేశ్వరన్ అనే స్థపతి ఈ ఆలయాన్ని నిర్మించాడనీ, మూడు అంతస్తులుగల ఈ ఆలయం, అష్టాంగ విమానమని పేర్కొనబడింది. అద్భుతమైన ఈ ఆలయ స్థపతిని వాస్తువిదాంవరః అని కొనియాడబడింది. అతన్ని ఒక తచ్చన్‌గానీ, క్రితధి – సదావాగ్మి, జ్ఞానవంతుడు, సత్యవంతుడు అయిన స్థపతిగా కీర్తించింది. ఉత్తర మేరు చతుర్వేది మంగళం అన్న ఉత్తర మేరూరును ఒక పెద్ద వైష్ణవ గ్రామంగా నిర్మించాడు రెండో పల్లవ నందివర్మ (క్రీ.శ. 850). రెండో నందివర్మ విడుదల చేసిన క్రీ.శ. 855 నాటి కసక్కూడి రాగిరేకు శాసనంలో, ఆ శాసనాన్ని రాసింది పరమేశ్వర పెరుంతచ్చన్ అని తిమళంలోనూ, పరమేశ్వర మహాకాష్టకారి (గొప్ప కొయ్య శిల్పి) అని సంస్కృతంలోనూ పేర్కొనబడింది. ప్రధానశిల్పిని 'పెరుంతచ్చన్'తోపాటు 'మహాకాష్టకారి' అని కూడా పిలిచేవారని ఈ శాసనంవల్ల తెలుస్తుంది. అంతేకాదు, ఉత్తర మేరూరులోని సుందరవరద పెరుమాల్ దేవాలయాన్ని నిర్మించిన పరమేశ్వర పెరుంతచ్చన్ నందివర్మ శాసన లేఖకుడుగా విధులు నిర్వర్తించాడని కూడా చెప్పొచ్చు. రాజు శాసన లేఖకులు, స్థపతులుగా వ్యవహరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అనివారితాచారి అనే హిదామి చాళుక్య రెండో విక్రమాదిత్యుని రాజ లేఖకుడు, రాజు కంచిపై దాడిచేసినప్పుడు, అతనితోపాటు కాంచీపురం వెళ్ళి, పల్లవులు అపురూపంగా నిర్మించిన కైలాసనాథ దేవాలయాన్ని చూచి, అచ్చెరువొంది, దాదాపు అలాగే చాళుక్య రాజాధని అయిన

పట్టడకల్‌లో విరూపాక్ష దేవాలయాన్ని నిర్మించాడు. ప్రధాన శిల్పుల్ని 'తచ్చన్' అని పిలవటంతోపాటు, రాజుల పేర్లతో పిలిచిన ఆధారాలు కేవలం బృహదీశ్వరాలయం తంజావూరులోనేకాక, రాజరాజ చోళుని కుమారుడైన రాజేంద్ర చోళుని కాలంలో కూడా కొనసాగింది. రాజేంద్రచోళుని ఆజ్ఞలను తిరువొత్తియుంది శాసనాలుగా చెక్కిన రవి అనే శాసనలేఖకుని, అక్కడి దేవాలయాన్ని నిర్మించాడనీ, ప్రతిభావంతుడైన రవిని 'తచ్చన్'తోపాటు, రాజేంద్రచోళుడు, తనకున్న 'వీరచోళ' అన్న బిరుదును ఇచ్చి 'వీరచోళ తచ్చన్' అని సత్కరించినట్లు ఆ శాసనంలో చెప్పబడింది. ఈ విషయం, స్థానిక ఆదిపురీశ్వర దేవాలయాల్లో మూడంతస్తుల విమానంతో, గజపృష్టాకారంలో రవి నిర్మించాడనీ, అదే ఆలయ దక్షిణ అధిష్టానంపై చెక్కిన శాసనంలో ఉంది. ఇంకా ఆ శాసనంలో *"తక్షణైతీత్ శ్రీవిమానం బహువిధ చరణైః తోరణైఃకూటకోష్టైః । నీడైః దభ్రైః అదభ్రైః / మృగపతివదనైః నాసికాద్యైః విచిత్రమ్ దేవస్య అధిపుర్యాం అతిబహుళతీర్థైః అస్మిభిః కృష్ణవీర్త్రాః రాజేంద్రస్య ప్రసాదాత్ కృతం ఇహ రవిణా రాజరాజస్య సూణోః చతురాననచోదితేనతేన త్రితల నిర్గతద్భూషణం విమానమ్ రవింణా అధిపురీశస్య శంభోః కృతం పతీత్ వరవీరచోళతక్షణాం".* 'రాజరాజు కుమారుడైన రాజేంద్రచోళుని దయవల్ల అనేక రకాలైన అధిష్ఠానాలు, తోరణాలు, మండపాలు, కోష్టాలు, వ్యాఖ్యాలు, గోమూఖలతో, అదిపురీశ్వరునికి తక్షకుడైన రవి నిర్మించాడు. రాజేంద్ర చోళుని ఆజ్ఞతపైన, చతురానన పండితుని సలహామేరకు, వీరచోళ తచ్చన్ అని పిలువబడిన రవి అనే శిల్పి మూడంతస్తులున్న ఈ ఆలయాన్ని నిర్మించాడ'ని ఈ శాసనంలో చెప్పబడింది. 'తక్ష' అనే పదం ఋగ్వేదం కాలంనాటికే రథాలు, ఇతర యానాలను తయారుచేసేవారిని సూచించింది. త్వష్ట అనే బ్రహ్మ, దేవతల శిల్పి అనీ, అతన్నే వాస్తోష్పతి (వాస్తు పురుషుని)తో గుర్తించింది. యజుర్వేదం కూడా తక్షున్ని రథకారునిగా (తక్షాభ్యోరథకారేభ్యశ్చ) పేర్కొంది. శివుడు ప్రధాన తక్షకుడనీ, అతని పరశు, వులి అని కూడా చెప్పబడింది. మయమతం రాసేనాటికి క్రీ.శ. 8వ శతాబ్ది విశ్వకర్మ కొడుకు స్థపతి, మయుని కొడుకు సూత్రగ్రాహి, త్వష్టు కొడుకు వర్ధకి, మనువు కొడుకు తక్షకుడని, శిల్పులు నాలుగు తరగతులని విభజింపబడి, అలాగే పిలువబడినారు.



మహా లింగార్చన, అభిషేకం

చారిత్రక తొలికాలం (క్రీ.పూ. 2-1 శతాబ్దాలు) నాటి బ్రహ్మశాసనాల్లో, శిల్పుల్ని లిపికారులనీ, వర్ణకులనీ, దంతకార శిల్పులనీ, శిలాకమ్మాంతికులనీ పిలిచారు. అశోకుని శాసనాల్లో చెక్కిన శిల్పులను 'తక్షాపిత' అని పేర్కొన్నారు. బార్హుత్‌లోని బౌద్ధ స్థూపం వద్ద శిల్పులను శిలాకర్ములని, సాంచీ తోరణ ద్వారులను చెక్కిన శిల్పులు విదిశకు చెందిన దంతకారులనీ, నాగార్జునకొండ శిల్పులనీ వధకి (వర్ధకి) అనీ అక్కడి శాసనాలు పేర్కొంటున్నాయి. పశ్చిమ భారతదేశంలోని కార్లే బౌద్ధ గుహలో 'వెజయంతితో సెఠిన భూతపాలేన శిలాగ్రహం పరినితాపితం జపూదిపంహి ఉతమా' అన్న క్రీ.పూ. 1వ శతాబ్దినాటి బ్రాహ్మీ శాసనంలో కర్ణాటకలోని వైజయంతికి చెందిన భూతపాలుడనే శెట్టి జంబూద్వీప (అప్పటి భారతదేశం)లోనే ఉత్తమమైన శిలాఘరాన్ని (శిలాగ్రహాన్ని) నిర్మించాడని చెప్పబడింది. కుడలోని మరో బ్రాహ్మీశాసనంలో *'సహభయాయ విజయాయ పియతనయేనచ సులస దతస శివపాలితస శివదీతస చ శిలారూప కమ్మమ్'* ఈ శిల్పికర్మను, తన భార్య విజయ, కొడుకులు సులసదత్తుడు, శివపాలితుడు, శివదత్తుడు కలిసి ఆ శిల్పి (అతని పేరు లేదు) చెక్కాడని ఉంది. ఇందులో శిల్పం చెక్కటాన్ని శిలారూపకమ్మ అన్న పదంతో సూచించటం గమనించాల్సిన విషయం. ఇదిలా ఉంటే అద్భుత కట్టడంగా గుర్తింపు పొందిన రాష్ట్రకూట కృత్తుడు నిర్మించిన ఎల్లోరాలోని కైలాస నాథాలయ శాసనంలో శిల్పిని కేవలం శిల్పిగానే ప్రస్తావించబడింది. క్రీ.శ. 1002వ సంవత్సరంలో చాందెల రాజు ధంగుడు, ఖజురహోలో నిర్మించిన విశ్వనాథాలయాన్ని (మరకటేశ్వరాలయాన్ని) నిర్మించిన ప్రధాన శిల్పిని విజ్ఞాన విశ్వకర్మా, సూత్రధార అని అక్కడి శాసనంలో చెప్పబడింది.

తమిళనాడులోని పుదుక్కోటి జిల్లా నర్తమలైలోని క్రీ.శ. 7వ శతాబ్దినాటి శాసనంలో 'ఇదు చైత తచ్చన్ సొన్నరైయనుక్కు కొడుత్త కుమిళ తుడవల్' అని ఒక రాతి తూమును తయారు చేసిన సొన్న అరయన్ అనే శిల్పి (తచ్చన్)కు కొంత భూమిని దానం చేసినట్లుగా ఉంది. కర్ణాటకలోని పట్టడకల్ మంగళం నందివర్మ పల్లవి మల్ల 61 వ పాలనా సంవత్సరపు రాగిరేకు శాసనాలను కచ్చిపేడులోని ఐంపనచ్చేరికి చెందిన విడెవిడుగు పల్లవ పెరుంతచ్చన్ మటుకు శ్రీ దంతి చెక్కాడని చెప్పబడింది. తమిళనాడులోని ఉత్తర ఆర్కోటు జిల్లా, అరక్కోణం తాలూకా, కీల్పునామ్‌లోని వైరమేఘవర్మ రెండో పాలనా సంవత్సరంలో వేసిన శాసనాన్ని కర్లి పెరుంతచ్చన్ కొడుకు ఇలంగాదన్ చెక్కాడని చెప్పబడింది. బమ్మసారి శిల్పుల్ని, శాసన లేఖతులను ఆచారి అని కూడా పేర్కొన్నారు. తూర్పు చాళుక్య వీరచోళుని శాసనాన్ని చెక్కిని శిల్పిని పెన్నాచారి అనీ, నరేంద్ర మృగరాజు రాగిరేకు శాసనాన్ని చెక్కిన విజయవాడకు చెందిన శిల్పి పేరు అక్షర లలితాచారి అని పేర్కొన్నట్లు గమనించాల్సిన విషయం.

విజయకంపవర్మ 19వ పాలనా సంవత్సరంలో వేయించిన తిరువొర్రియూర్ శాసనాన్ని చాముండా చార్యుని కొడుకైన తిరువొర్రియూర్ ఆచార్య చెక్కినట్లుగా చెప్పబడింది.





పెనోరమా



ఆ శాసనంలో 'ఈ రాగిరేకు శాసనాన్ని శిల్పుల్లో ఉత్తముడైన, చాముండాచార్యుని కొడుకు పరమేశ్వరుడు చెక్కాడని ఉంది. ఒక్కోసారి, ఆలయాన్ని నిర్మంచడానికి వినియోగించిన కొలబద్దను గురించి కూడా శాసనాలు పేర్కొంటున్నాయి. కంచిలోని వరదరాజ స్వామి మండప అధిష్టానంపైన ఒక కొలబద్ద బొమ్మ, దానికింద 'తచ్చుకోల్' అని, స్థపతి వాడిన బద్ద గురించిన చిన్న శాసనముంది. కన్యాకుమారి దగ్గరున్న తిరుప్పతూర్‌లోని ఒక శాసనంలో కల్‌తచ్చన్ (రాతిని చెక్కిన శిల్పి)ని గురించి ఉంది. ఇలా, శాసన లేఖకుడు, దేవాలయ శిల్పులను తచ్చన్ (తక్షక) అనీ, పెరుంతచ్చన్ (శిల్పులలో ముఖ్యుడు) అని పేర్కొనటం తమిళనాట కొత్తేమీ కాదు.

మహాబలిపురంలోని దగ్గరున్న పుంజేరిలోని గల నుండి వీరప్పన్ కుదిరైతొట్టి అనే రాతిగుండుపైన క్రీ.శ. 7వ శతాబ్దికి చెందిన తమిళ గ్రంథ లిపిలో కెవాడ పెరుంతచ్చన్, గుణమల్లన్, పయ్యం ఇపిష్టాన్, సాత్తముఖ్యనో, కళ్యాణి, నమఃతిరువొర్రియార్ ఆభాజన్, కొల్లన్ సెమిన్‌లు శిల్పులేనని గుర్తించారు. వీరిలో కెవాడ పెరుంతచ్చన్ ఒక ప్రముఖ స్థపతి అనీ, గుణమల్లన్, పల్లరాజువైశ్యా 'శతృమల్ల' బిరుదాంకితుడైన, మహేంద్రవర్మకు, మంమల్ల బిరుదాంకితులైన మొదట నరసింహవర్మ, 'ఏకమల్ల' బిరుదాంకితుడైన మొదట పరమేశ్వరుడు, 'అమిత్రమల్ల', 'అప్రతిమల్ల' బిరుదాంకితుడైన రాజసింహలలో ఏదో ఒక రాజు, ఆ శిల్పికి గుణమల్ల అనే బిరుదునిచ్చి ఉండవచ్చు.






డా. ఈమని శివనాగి రెడ్డి - స్థపతి
ది కల్చరల్ సెంటర్, విజయవాడ.
ఫోన్ : 984 859 8446.

# వాంఛేశ్వర కవి - సామాజిక వాంఛ

- జి. వెంకటేశ్వరరావు

దక్షిణ భారతదేశంలో మదురను రాజధానిగా చేసుకొని పరిపాలించిన నాయక రాజులు సాహితీ పోషకులుగా నిలిచిపోయారు. సాహిత్య పరిశీలన ద్వారా ఆనాటి సాంఘిక సామాజిక పరిస్థితులను తెలిసికొనే అవకాశం ఉంది. కవులు రాజులను పొగడటం, రాజులు కవులను గౌరవించడం జరుగుచుండేది. ఇది పరస్పర ప్రశంస అని తేలికగా తీసుకొనరాదు. పాలకులు ఆగ్రహానుగ్రహ సమర్థులు. కావున కవులు తమ కవితల ద్వారా ప్రభువుల మనసులను తెలిసికొని సమాజ హితం కోరి, కథాపాత్రలు, వర్ణనలు, సన్నివేశాల ద్వారా తాము కాంక్షించిన హితవును ప్రియమైన రీతిలో తెలియచెప్పేవారని అనడం నిస్సందేహం. అటువంటి ప్రయత్నమే కుట్టి కవి (వాంఛేశ్వరుడు) 'మహిష శతకం'లో చేశాడు.

'మహిష శతకం' సంస్కృతంలో వ్రాసి మదుర నాయక రాజునకు విన్నవించిన తీరు ప్రశంసనీయమైనది. సమకాలీన దక్షిణ భారతదేశంలో అధికభాగం మదుర నాయక రాజుల ఏలుబడిలో ఉండేది. ద్రవిడ భాషలు విస్తరించిన ఈ ప్రాంతంలో తెలుగు, తమిళ, కన్నడ, మళయాళాలు ప్రసిద్ధంగా వాడుక భాషలుగా ఉన్నను, సాంస్కృతిక భాషగా యావత్ భారత ప్రఖ్యాతిగన్న సంస్కృత భాష కూడ ఆదరణీయ స్థానంలో ఉండేది. పాలకులు ఏ భాషవారైనా, ఏ జాతి మతాల వారైనా అన్ని భాషలను వినియోగపరచుకొనేవారు. ప్రాంతీయ భాషలకు తోడుగా సంస్కృతం కూడా ప్రధాన వినిమయ భాష కావడంచేత లాక్షణిక గ్రంథాలతోబాటు సాహితీపరమైన కావ్యనాటకాలు సంస్కృతంలో రచించి ప్రచారం చేసినట్లు తెలియుచున్నది. ఆంధ్రభాషకు నిలయమైన తెలుగునాట కూడ సంస్కృత ప్రాచుర్యం ఉన్న కారణంగా *మహిషశతకం* దక్షిణ భారతదేశ స్థితిగతుల పరిశీలనకు తోడ్పడగలదు. గోదావరి నది నుంచి దక్షిణతీరం వరకు విస్తరించిన భూభాగంలోని ప్రజలు సామాజిక జీవన పరిస్థితులలో సామ్యం ఉండటం చేతనూ, అధిక జనాభా జలధారల నేర్పరచుకొని సేద్యమో, పశుపోషణమో, జీవనాధారంగా తీసుకోవడంచేత, పన్నులు వసూలు చేసే ప్రభువులకు, వాటిని చెల్లించే ప్రభువులకు, వాటిని చెల్లించే ప్రజలకు ఒకేవిధమైన ఈతి బాధలు ఉన్న తీరు గమనించతగినది. ప్రజల ఇక్కట్లను గమనించి ప్రభువులు దయచిత్తంతో అనుగ్రహించేవారు. ప్రభువులను అనుసరించిన ప్రజలకు సుఖశాంతులు లభించేవి. కవులు తమ అనుభూతులను అనుసరించి, తమ సుఖదుఃఖానుభూతులకు తగిన పాత్రలను, వ్యక్తులను ఎంచుకొని, స్తుతి లేదా నిందాత్మకంగా మనోగతాన్ని వెల్లడించేవారు. దానికి తగినట్లుగా కుట్టికవి రైతులకు సహకారియైన మహిషాన్ని తీసుకొని ఈ శతక రచన చేశాడు. ఇది ఉచితంగాను, సాహితీరంగాన నిలిచింది.

మహిష శతక రచయిత వాంఛేశ్వర కవి. నివాసం కుంభకోణానికి సమీపంలో కావేరీ తీరంలోని తిరువిశనల్లూరు. ఈ గ్రామాన్ని శహజీరాజపురాగ్రహం అని కూడా పిలుస్తారు. వాంఛేశ్వరకవి ద్రావిడ బ్రాహ్మణుడు. ధాటాశతకం, ఆశీర్వాదశతకం అను రెండు శతకాలను రచించాడు. ఇతని వంశస్థులు రాజుల వద్ద వంశపారంపర్యంగా మంత్రులుగాను, ఆస్థాన విద్వాంసులుగాను ఉండినారు. వాంఛేశ్వరుడు తంజావూరు పాలకుడు, మహారాష్ట్రుడు అయిన ఏకోజీ మహారాజువద్ద 18 వ శతాబ్దంలో మంత్రిగాను, ఆస్థాన విద్వాంసుడుగాను ఉండినాడు. మైసూర్‌లో అప్పుడు టిప్పుసుల్తాను రాజ్యమంతరించి, కృష్ణ ఒడయార్ ప్రభువు రాజ్యమునకు వచ్చారు. ఆయన కుట్టిసూరిని అనేక విధముల సన్మానించి తన ఆస్థానంలో ధర్మకారిగా ఉండమని కోరినాడు. ఏకోజీ మహారాజు నిర్యాణం తర్వాత అతని కుమారుడైన ప్రతాపసింహుడు రాజ్యానికి వచ్చాడు. బాలుడైన ఈ రాజు

దుష్టుల బోధనలవల్ల విద్వాంసులను, అధికారులను తొలగించి నిరంకుశంగా వ్యవహరించి, ప్రజల కష్టసుఖములను గమనించకుండా బలవంతంగా పన్నులు వసూలు చేయడం ప్రారంభించినాడు. రాజు పెట్టే బాధలకు తట్టుకోలేని కొందరు మాట్లాడకుండా ఉండిపోగా మరికొందరు రాజ్యాన్ని వదిలిపెట్టి వెళ్ళినారు. మంత్రిగా ఉండిన వాంఛేశ్వర కవి రాజును చూచుటకుగాని, హితోపదేశం చేయడానికిగాని అవకాశం లేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

వాంఛేశ్వర కవి ప్రజల బాధలను చూడలేక రాజును తిరిగి సన్మార్గంలోకి తీసుకొని రావడం కోసం మహిష శతకాన్ని రచించాడు. ఈ శతకాన్ని వ్రాయవలసిన అవసరాన్ని గురించి శతక పూర్వ భాగంలో కవి వివరించాడు. దీనిలో రాజులను, రాజ్యాధికారులను, ధనగర్వితులను వ్యంగ్యంగా నిందించాడు. ఈ శతకంలో వర్ణించిన వర్ణనలనుబట్టి ఈ కవి మనస్సు ఎంతగా గాయపడిందో స్పష్టమగుచున్నది. ఈ గ్రంథము పేరుకు శతకముగా కనిపించినా, భాషాప్రపంచంలో దీనికి గొప్ప స్థానం ఉంది. గ్రామాలలోని జంతువులలో దున్నపోతుకి గల స్థానం అందరికీ తెలిసిన విషయమే. అటువంటి దున్నపోతు ఈ కవి యొక్క వాక్ప్రవాహం వలన ప్రశంసింపతగినదిగాయున్నది. దున్నపోతును స్తుతించే నెపంతో రాజులనందరిని నిందించినందువలన వారికి కోపం రావచ్చును. అందువలన ఈ శతక రచన రాజులకు బుద్ధి రావడానికి మాత్రమే వ్రాయబడినది. వారికి కోపాన్ని తెప్పించడానికి ఎంతమాత్రం కాదు. రాజులు ఈ శతకాన్ని చదివి, తమకున్న దుర్గుణాలను తెలిసికొని, మనస్సు మార్చుకొని ప్రజలను కన్న బిడ్డలవలె ధర్మబద్ధంగా పరిపాలిస్తారనీ కవి ఉద్దేశ్యపడి శతక రచన చేశాడు.

కవి ఎంత ప్రయత్నించినను రాజు యొక్క ఆశ్రయం లభించలేదు. ఈ విధంగా ఎంతకాలం కనిపెట్టికొని ఉండాలి? దుర్మార్గుడైన ఈ రాజును ఆశ్రయించడంకంటే సంతోషంగా సేద్యం చేసుకొని బ్రతుకవచ్చును. కృషి చేసినందువల్ల కరవు కాటకాలు ఉండవు. రాజులు ధనమదాంధులై ప్రవర్తించుచుండగా, రాజ్యంలో దుర్భిక్షమైన పరిస్థితులు కొనసాగుచున్నాయి. రాజు యొక్క సన్నిధిలో విద్యకు గౌరవం తగ్గిపోయింది. ఎక్కడైనా చదువు చెప్పుకుందామంటే, అది సాధ్యంకాక పండిత ప్రకాండులు ఎంతమందో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. అందువల్ల వ్యవసాయం చేసి జీవించడమే మేలనిపిస్తున్నది. కొందరు పండితులు వరి అన్నానికి కూడా నోచుకోలేదు. రాజుయొక్క ఆశ్రయం దొరకనందువల్ల గదా ఈ పండితులు ఇన్ని బాధలు పడుతున్నారు. స్వదేశంలో విద్య, గౌరవ జీవనం లేనపుడు పండితుడున్నాడు. కాని రాజును వదిలిపెట్టి శ్రీరంగపట్నం వెళ్ళినట్లయితే, అచట ధనాన్ని సంపాదించవచ్చు. కాని అచట వ్యాధిగ్రస్తులై త్వరగా మరణిస్తారు. నా గొప్పతనాన్ని గుర్తించని అజ్ఞానుడైన ప్రభువును నేను కసితీరా దూషిస్తాను. సౌజన్యంగల రాజులు నా దూషణలను విని సంతోషిస్తారు. అంటే, ఈ శతకం దుర్మార్గులను సన్మార్గులుగ చేయడానికి వ్రాయబడినది. మూర్ఖులకు జ్ఞానోపదేశం చేయడంకంటే ప్రత్యక్షంగా హితోపదేశం చేయడం మంచిదికదా! అని కవి ప్రశ్నిస్తున్నాడు. కవి తన శతకంలో ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు : "ఓ దున్నపోతా! నేను చాలా మహిమగలదానివని గర్వపడుచున్నావు. నాపట్ల ద్రోహం చేయదలచిన ఒక తుచ్ఛమైన అధికారిని ఛీకొట్టాలనే ఉద్దేశ్యంతో ఈ శతకాన్ని వ్రాస్తున్నానే తప్ప రాజు యొక్క గొప్పతనాన్ని వర్ణించడం కోసం కాదు" అని వివరించాడు. ఇచట కవి రాజును మహిషంతో (దున్నపోతుతో) పోల్చినాడు.

"రాజు బుద్ధిమంతుడు. అతని మంత్రులు అతనికంటే బుద్ధిమంతులు. అయితే కొందరు దుర్మార్గులు వారిద్దరినీ మోసం చేసి ప్రజల సర్వస్వాన్నీ దోచుకుంటున్నారు. మహిషరాజా! అందువల్ల నువ్వు చోళరాజ్యంలో వ్యవసాయాన్ని చేయడానికి పూనుకోవద్దు. ఎందువల్లనంటే దేశద్రోహులైన అధికారులు పదవులు పొందిన తర్వాత నా సర్వస్వాన్ని దోచుకున్నారు. నాకు చివరకు మిగిలింది గోచిపాత మాత్రమే. కాని ఓ దున్నపోతా! నీకు ఇదికూడా లేదు. రాజు యొక్క ఆశ్రయాన్ని సంపాదించాలనే ఉద్దేశ్యంతో కొందరు దుర్మార్గులు రాజుకు తాము ఎక్కువ ధాన్యాన్ని ఇస్తామని పోటీలుపడి రాజు కొలువులో ఉన్నవారికి లంచాలను కూడా ఇచ్చి వారిని వశపరచుకొని, ప్రజల సర్వస్వాన్ని దోచుకుంటున్నా'రని కవి శతకంలో తన బాధ్యతను వ్యక్తం చేశాడు.

బ్రాహ్మణులు వ్యవసాయం చేయడంవల్ల దొంగలైనారని కొందరు దూషించుచున్నారు. అయితే దొంగతనం అనేది కృషీవలుని సహజ ధర్మం. కృషీవలుడు భూమి నుంచి ధాన్యము, గడ్డి మొదలగువాటిని ఇంటికి తీసుకొని వెళ్తాడు. అందువల్ల అసలు వ్యవసాయాన్నే దొంగ వృత్తి అని అనవలసి

ఉంటుంది. ఈ వృత్తిని బ్రాహ్మణులు చేపట్టవలసినది కాదు. కాని చోళదేశంలో బ్రాహ్మణులు మరోవిధంగా బ్రతికే పద్ధతి లేదుకదా! అందువల్ల వారు తప్పనిసరి పరిస్థితులలో వ్యవసాయం చేయవలసి వస్తున్నది. బ్రాహ్మణులు కష్టపడి వ్యవసాయం చేసి పంటను పండించే సమయానికి మారీచ, సుబాహులు లాంటి అధికారులు ఏమాత్రం కనికరం చూపకుండా పండిన పొలాన్ని చుట్టుముట్టి దోచుకొనిపోతున్నారు. ధనవంతులు ధనం ఉండికూడా మూడులై ప్రవర్తిస్తున్నారు. అందువల్ల ప్రపంచమంతటిలో దున్నపోతు ఒక్కటే ధన్యజీవి అని చెప్పక తప్పదు. అది కష్టపడి పంటను పండిస్తుంది. జనులను రక్షిస్తుంది. రాజులు పేరుకు మాత్రమే పెద్దలు. వారు ఒక్క సహాయాన్నయినా చేస్తారా? అందువల్లే ఈ మహిషము (దున్నపోతు) సర్వోపకారమైన జంతువు, దుర్మార్గుల ముఖాల్ని చూడటంకంటే దున్నపోతు ముఖాన్ని చూడటమే మేలు. దున్నపోతును నమ్ముకుంటే ఇంత మృష్టాన్నమైనా దక్కుతుంది. దున్నపోతు కష్టపడి పంటను పండిస్తుంది. సుబేదారులు పన్ను పేరుతో పండిన ధాన్యాన్ని బలవంతంగా దోచుకొనిపోతున్నారని కవి మహిష శతకంలో తాను అనుభవించిన కష్టాలను వర్ణిస్తున్నాడు.

పండిన ధాన్యాన్ని బలవంతంగా తీసుకొనిపోవడానికి వచ్చిన అధికారులు దున్నపోతుకంటే హీనమైనవారని మహిష శతకంలో వర్ణించాడు. 'ఓ దున్నపోతా!' నేను నిన్ను పోషిస్తున్నాను. అందుకు నా చిన్న కోర్కెను తీర్చమని కోరుచున్నాను. పన్నులను బలవంతంగా వసూలు చేసే అధికారులను నీపై ఎక్కి తిరుగుతున్న యమధర్మరాజు వద్దకు తీసుకొని వెళ్ళు. నువ్వు గడ్డినే కదా తినేది? నిరపరాధమైన గడ్డిని తినడానికంటే బలవంతంగా పన్నులు వసూలు చేసేవారిని తినినట్లయితే నీ ఆకలి తీరుతుంది. భూభారం తగ్గుతుంది. నీకు కీర్తి దక్కుతుంది. నువ్వు ఇంత శ్రమపడేదానికంటే హాయిగా రాజసభలో కూర్చొనవచ్చును. నీకంత జ్ఞానం ఎక్కడిదని సంకోచించవద్దు. రాజసభలో ఉండేవారంతా నీకంటే మూఢులు. నువ్వు అచటకు వెళ్ళినట్లయితే బృహస్పతిలాగా మంచి పేరు తెచ్చుకుంటావు. నేను నిన్ను ధనం ఇచ్చి కొన్నాను. కాని నువ్వు నాకు ఎప్పుడో ఋణపడినదాని మాదిరిగా శ్రమపడి ధాన్యాన్ని పండించి, నాకు సుఖాన్ని ఇస్తున్నావు. నువ్వు చేస్తున్న ఈ మహోపకారానికి నేను నీకు పూర్తిగా వశమౌతున్నాను అని కవి దున్నపోతుమీద తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేశాడు. నేను మహరాజుల మంచిచెడ్డలను తెలిసికొనకుండా స్తుతించి, కల్మషమైనాను. ఆ కలుషితమైన నోటితో నిన్ను స్తుతించవలసి వచ్చినందుకు క్షమాపణ వేడుకొంటున్నానని కవి దున్నపోతుతో విన్నవించుకొన్నాడు.

"ఓ దున్నపోతా! శంబాలు, కారులు, పిషాణాలు, శిత్తులు, ఆయుధాలు, మంజాళులు, శంబాలికలు, సూచీలు మొదలైన ద్రావిడ దేశ ప్రసిద్ధమైన 'వడ్లు' మొదలగు ధాన్యములను, కొఱ్ఱలు, నువ్వులు, చామలు, గోధుమలు, తెల్ల ఆవాలు, ఉలవలు, పెసలు, కందులు, అనుములు, మినుములు మొదలైనవాటిని ఆయాకాలములందు పండించి, మమ్మల్ని రక్షిస్తున్నావు. ఇన్ని సద్గుణాలు కలిగిన నిన్ను వదలిపెట్టి రాజులను ఆశ్రయించి చెడిపోయినాను. నా పరిస్థితిని చూచినట్లయితే సిద్ధాన్నమును వదలుకొని, భిక్షాటనకు పోయినట్లుగా ఉంది. నువ్వు సర్వకాల సర్వావస్థల యందు ఒకేవిధంగా ఉంటావు. కాని రాజులకు నిలకడలేదు. వారికి మానమర్యాదలు లేవు. నువ్వు దీనులపాలిట ఆప్తబంధువుగా కనిపిస్తున్నావు. నువ్వు నాకు దొరికినందుకు నేను అదృష్ట జాతకం గలవాడినని సంతోషపడుతున్నాను అని కవి దున్నపోతును ప్రశంసించాడు. రాజులు దుష్పరిపాలకులైనారు. వారు మాట్లాడిన మాటలు విని నా చెవులు చిల్లులు పడిపోయినాయి. కాని నువ్వు చేసే పనులు నాకు ఆనందాన్ని కలిగించాయి. దురదృష్టం ఏమిటంటే దుష్టులు సుఖపడుతున్నారు. మంచివారు దుఃఖపడుతున్నారు. ఇది చాలా విచిత్రమైన పరిస్థితి అని కవి తన బాధను వ్యక్తం చేస్తున్నాడు.

నేను ధనమందాధులైన రాజుల ఇంటి వాకిటలో వారు ఏమైనా ఇస్తారని కాలయాపన చేశాను. ఓ దున్నపోతా! నువ్వు మమ్మల్ని అన్ని విధాలా రక్షిస్తున్నావు. నిన్ను ఆశ్రయించినట్లయితే, ధనధాన్యాలు సమకూరుతాయి. అంతేకాని దుష్టులైన రాజులను ఆశ్రయించినందువల్ల ఏమీ ప్రయోజనం లేదు. మహారాజులకు రాజభవనాలు ఉంటాయి. కాని నీకు కొట్టమే రాజభవనం. రాజులు కస్తూరిని పూసుకుంటారు. కాని నీకు పేడయే కస్తూరి. రాజులు దుస్తులకు సుగంధాన్ని వాడతారు. కాని క్రింద ఉండే దుమ్మే నీకు సుగంధం. ఇతరులకు సహాయం చేయాలనే మనస్తత్వం గల నువ్వు రాజుకంటే గొప్పదానివి. అందువల్ల నిన్ను

ఆశ్రయిస్తేనే మంచిది అని కవి దున్నపోతును ప్రశంసించాడు.

నువ్వు కష్టపడి దుక్కిని దున్నుతావు. బరువులు మోస్తావు. ఎంతో శ్రమపడి నువ్వు మానవులను పోషిస్తున్నావు. అందువల్ల ధనమదాంధులైన వారిని ఆశ్రయించడం తెలివితక్కువతనం. నిన్ను ఆశ్రయిస్తే అన్నం దక్కుతుంది అని కవి దున్నపోతును ప్రశంసించాడు. ప్రజలు యజ్ఞయాగాలను చేయవచ్చును. అనేక తపస్సులను చేయువచ్చును. తీర్థయాత్రలకు వెళ్ళవచ్చును. కాని నిన్ను చూడకుండా శుభాన్ని పొందలేరు. నువ్వు పంటను పండించి, లోకానికి కావలసిన తిండిని సమకూర్చుచున్నావు. యజ్ఞయాగాలకు కావలసిన సామగ్రిని సమకూర్చుచున్నావు. నువ్వు జాతిపరంగా అథమజాతికి చెందినదానివైనా, నీ గుణగణములు లోకోత్తరమైనవి. కాబట్టి, జాతి ఏదైనా కావచ్చును. కాని గుణమే ప్రధానం అని కవి దున్నపోతు యొక్క గునగణములను ప్రశంసించాడు.

రాజభటులు ఆయుధాలను ధరించి రాజద్వారాలలో నిలబడి తమకు ఆ పదవి లభించినందుకు గర్వపడి రాజాస్థానానికి వచ్చేవారిపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుంటారు. నేను రాజదర్శనం కోసం ఎంత శ్రమపడవలసి వచ్చేది? ఓ దున్నపోతా! నీ దర్శనం కోసం ఇంత శ్రమపడనవసరంలేదు! అని కవి రాజభటులు స్థానబలిమిచేత మానమర్యాదలను కోల్పోయిన తీరును ఇచట వర్ణించాడు.

క్షత్రియ కులంలో పుట్టినంతమాత్రాన రాజు కావాలనే నియమం లేదు. ఎవరైతే ప్రజాసంరక్షకుడో అతడే రాజు. ప్రజాపరిపాలనవే రాజుయొుక్క విధి. అందువల్ల ప్రజాసంరక్షణ చేయడంలో ఎట్టి ఆపేక్షణ లేదు. ఇప్పటి రాజులు కిరాతకులవలె ప్రజాపీడన చేస్తున్నారు. దుర్మార్గంగా పరిపాలన చేస్తున్నారు. అందరికీ ఉపకారం చేస్తూ, అన్ని లక్షణములున్న నిన్ను రాజుని చేయడంలో ఎలాంటి ఇబ్బంది రాదు.

కవి ఆ తర్వాత 'మహిష శతకం'లో దున్నపోతును పసిపాపతోను, వేదము చదువుకున్న అవధానులతోను, పరబ్రహ్మస్వరూపునిగాను, దేవేంద్రుని, సాలగ్రామంలాగాను, గంభీరమైన సముద్రంగాను, అంజనాదేవి పుత్రుడైన ఆంజనేయస్వామిగాను, కార్త్యవీర్యార్జునునిగాను, భరతాచార్యునిగాను, మత్స్యావతారమెత్తిన శ్రీమన్నారాయణ మూర్తిగాను, కార్తవీర్యార్జునుని వధించిన పరశు రామావతారంగాను, శివధనుస్సును విరిచి సీతను చేపట్టిన దశరథరాముని గాను, సాక్షాత్తు శ్రీకృష్ణునిగాను, బుద్ధావతారంగాను, రామాయణ కావ్యంతోను పోల్చి వర్ణించాడు.

గ్రంథకర్త వాంఛేశ్వరకవి తన ప్రభువు దుస్సాంగత్యం వలన, తన మాట వినకుండా దుష్టప్రవర్తునుడైనందువల్ల మహిష శతకాన్ని రచించి తన ప్రభువుకు సత్ప్రవర్తన కలిగించాలని ప్రయత్నించాడు. అందువల్ల దున్నపోతును సర్వదేవతా స్వరూపమని, సర్వోత్కృష్టమని, రాజుకంటే గొప్పదని వర్ణించుచు మహిష శతకాన్ని ముగించాడు. అంతవరకు తనను పోషించిన రాజుకు తన శుభాకాంక్షలను తెలిపి ఆశీర్వదించాడు.

వాంఛేశ్వర కవి మహిష శతకాన్ని వ్రాసి తన రాజుకు బుద్ధి వచ్చేట్లు చేశాడు. తాను చేసిన తప్పిదాలను తెలుసుకొన్న రాజు పరివర్తన చెంది కవి పాదాలకు మ్రొక్కి క్షమాపణ వేడుకొన్నాడు. తిరిగి రాజ్యాన్ని సుభిక్షంగా పాలించాడు. ఒక కవి ఇటు రాజ్యక్షేమం కోసం, అటు ప్రజాసంక్షేమం కోసం ఇంత శ్రమపడినాడంటే ఇది నిజంగా ప్రశంసించతగిన విషయం. అష్టకష్టాలతో తాను జీవించినా, రాజ్యాన్ని మాత్రం వదలిపెట్టలేదు. అప్పట్లో శ్రీరంగపట్నం వెళ్ళివుంటే (ఆనాడు శ్రీరంగ పట్టణాన్ని మహమ్మదీయ రాజులు పరిపాలిస్తుండేవారు) తన పాండిత్యం ద్వారా ధనాన్ని సంపాదించి ఉండవచ్చు. కాని ఆ విధంగా చేయలేదు.

దీనివల్ల కవికున్న దేశభక్తి, రాజభక్తి ముఖ్యంగా ప్రజాసంక్షేమ దృష్టి ఎంత గొప్పదో తెలియుచున్నది. మహిష శతకంలో కవి ఆనాటి వ్యవసాయ పరిస్థితులు, ఆనాడు పండించే రకరకాల ధాన్యాలను గురించి, ఆనాటి పన్నులు వసూలు చేసే అధికారుల దుర్మార్గాలను గురించి ప్రస్తావించినాడు. రాజుకంటే దున్నపోతే మేలని చెప్పడం, దున్నపోతును పురాణ పురుషునితోను, రామాయణంతోను పోల్చడం, అతని శ్లేష కవిత్వ ప్రతిభకు గుర్తుగా నిలిచిపోతుంది. ఆనాటి సాహిత్యంలో మహిష శతకానికి ప్రముఖమైన స్థానం ఉండినది.

డా. జి. వెంకటేశ్వరరావు
UGC EMIRITUS ప్రొఫెసర్
నెల్లూరు.

## తూర్పు, లేములవాడ, ముదిగొండ

# చాళుక్యులు

- రావి భారతీదేవి

**తూర్పుచాళుక్యులు** : దక్షిణ హిందూదేశ చరిత్రయందు మహత్తరమైన పాత్ర నిర్వహించిన రాజవంశములలో తూర్పు చాళుక్యులొకరు. వీరు బాదామి పశ్చిమ చాళుక్య వంశం నుండి చీలిన యొక శాఖకు చెందినవారు. బాదామి చాళుక్యుల తరువాత ప్రశంసనీయమైన చరిత్ర కలవారు ఆంధ్రదేశంను నాలుగున్నర శతాబ్దుల కాలం పరిపాలన చేసిన తూర్పు చాళుక్యులు ఆంధ్ర చాళుక్యులనియు, వేంగీ చాళుక్యులనియు వ్యవహరించుచున్నారు. వీరుకాక ఆంధ్రదేశంలో వేములవాడ చాళుక్యులు, ముదిగొండ చాళుక్యులు అను చిన్న కుటుంబంగలవారు గలరు.

చాళుక్యుల జన్మాదిన కథనమంతయు పుక్కిటి పురాణంలతోడను, కల్పిత గాథలతోడను నిండి చరిత్రకారునకంత విశ్వసనీయంగాకయున్నది. ఈ కల్పిత గాథలే కడపటి చాళుక్య రాజుల కాలంనాటి శాసనంలోనికి కూడ నెగ్రాకి యుండెను. ఇట్టి గాథ యొకదానిని బిల్హణ కవి తన విక్రమాంకదేవ చరిత్రంనందు మనోహరంగా జొప్పించియున్నాడు. "ఒకప్పుడు బ్రహ్మదేవుడు ప్రాతఃకాల కృత్యములు నిర్వర్తించుచుండ, నచ్చటికి నింద్రుడు చనుదెంచి ప్రపంచమున నే మనుష్యుడును యజ్ఞయాగాది క్రతువుల నాచరించి దేవతలకు హవిర్భాగముల నొసంగకుండుటఁజేసి పాపం వర్థిల్లుచున్నదని మొరవెట్టుకొనియెనట. అంతట బ్రహ్మదేవుడర్ఘ్యనిమిత్తమై యుదకముపట్టియుండిన తన చుళుకమువైపు చూచెనట. అంతటా చుళుకము నుండి మహా యోధుడొకడు జనించి చాళుక్య వంశమునకు కర్తయయ్యెనట. అతని వంశమునందు కొంత కాలమునకు హారీతుడు, మానవ్యుడు అను నిరువురు మహాయోధులు జన్మించి జగద్విఖ్యాతిగాంచిరి. వీరి మొదటి రాజధాని అయోధ్యా నగరముగానుండెనట. పిమ్మట నీ వంశములో నొక శాఖవారు దక్షిణా పథమునకు వచ్చియుండిరట. ఈ విక్రమాంకదేవ చరిత్రము కళ్యాణపురాధీశ్వరుడగు ఆరవ విక్రమాదిత్యుని చరిత్రము తెలుపునట్టిదియైయున్నది. అయోధ్యా నగరమునుండి వచ్చిన విజయాదిత్యుడను చాళుక్యాన్వయుడు దక్షిణాపథమునందలి త్రిలోచన పల్లవునితోఁ బోరుచు రణరంగమున నిహతుడయ్యెను. పతి వెంట వచ్చిన యాతని పట్టమహిషి యా సమయమున గర్భవతియై యుండుటవలన శత్రువుల వాత బడకుండ పురోహితుడను విష్ణుభట్ట సోమయాజియను నాతని యింట దాగియుండి కొంతకాలమునకు మగ శిశువు నొకనిని గనెను. ఆ బాలుడు యుక్తవయస్సు వచ్చిన తరువాత తన తల్లి వలన సమస్త వృత్తాంతముఁ దెలిసికొని శత్రుగతమైన పైత్రుక రాజ్యమును మరల సంపాదింపదలచి చళుక్య పర్వతమునకుఁ బోయి ఘోర తపము గావించి, పరమేశ్వరునిచే వరము బడసి, తన జనకుని శత్రువులయిన కదంబులను, గాంగులను జయించి రాజ్యమును మరల స్వాధీనము చేసికొనెను. ఈతడు విష్ణుభట్ట సోమయాజిచేఁ బెంపబడిన వాడగుటచే విష్ణువర్ధనుడను నామము ధరించి పరిపాలించియుండెను. నాట నుండి విష్ణువర్ధ నామము చాళుక్యులకు వంశ పరంపరగా వచ్చుచుండెను. చాళుక్యుల తామ్రశాసనములందుగూడ వీరు హారీత పుత్రులనియు మానవ్యస గోత్రులనియుఁ దెలుపబడియుండెను. వీరలు సప్తమాతృ రక్షణముగలగి కార్తికే యానుగ్రహమున నభ్యుదయముగాంచిరి. మరియు నారాయణానుగ్రహమున వరాహధ్వజమునుబడసి, యనేక రాష్ట్రములను గెలిచి విశాల సామ్రాజ్యమును స్థాపించగలిగిరని కలదు. పురాణ ప్రశస్తి కలిగిన యా గాథ యంతయు చాళుక్యాన్వయమునకు గౌరవము నొడగూర్పదలచిన తరువాత

కాలపు వారిచే గల్పింపబడినదని యూహింపవచ్చును. శాసనములలోని గాథనంతయు మొదట కల్పించినవాడు విమలాదిత్యుని శాసనము లిఖించిన భీమన భట్టారకుడు. గాథయందలి సత్యాసత్యములెట్టి వయినను చాళుక్యులు తాము మానవ్యస గోత్రులమనియు, హారీత పుత్రులమనియు జెప్పుకొని యుండుటచేత కొంతవరకు చరిత్రకారుని అపూర్వపుటూహలకుఁ దావొసంగుచున్నది. కడపటి యాంధ్ర చక్రవర్తుల కాలమున మన చాళుక్యులు ఆంధ్ర పల్లవ సంయోగమువలన జనించిన సంకీర్ణజాతివలె ఆంధ్ర, శక సంయోగమున జనించి అభివృద్ధిగాంచిన యొక సంకీర్ణ జాతి యని ఇట్టి సంకీర్ణత్వమే యదార్థమయినచో తమ వంశమునకు కళంకము బాపుకొనుటకై చాళుక్యులు బ్రాహ్మన మతావలంబకులై తమ వంశమునకు శ్రేష్ఠత్వమును గౌరవమును సంపాదించుటకై పౌరాణిక క్షత్రియ వంశములతో తమ వంశ కర్తలకు సంబంధము కల్పించి ఆర్యక్షత్రియులమనియు, చంద్రవంశజులమనియు చెప్పుకొనుచుండిరి. ఏది ఎట్లయినను చాళుక్యులు తొలుత విజాతీయులై సంకీర్ణత్వమునుబొంది తుదకు బ్రాహ్మణ క్షత్రియ కుటుంబములుగానేర్పడి యుండిరని మాత్రము విశ్వసింపవచ్చునని భావరాజువారి యభిప్రాయము.

శాతవాహనుల యాంధ్ర మహాసామ్రాజ్యము క్రీ.శ. 3వ శతాబ్దముతో నంతమొందెను. పిమ్మట పూర్వాంధ్ర దేశమును పల్లవులను నొక తెగవా రాక్రమించుకొని పాలించిరి. పశ్చిమాంధ్ర కర్ణాట మహారాష్ట్ర దేశములను నాకాలమున పాలించిన రాజుల చరిత్ర మేమియు చరిత్రకారునికి గోచరమగుట లేదు. కాని ఆ కాలమున కర్ణాట దేశము కదంబులకును, గాంగులకును మహారాష్ట్రదేశము రాష్ట్రకూటులకును లోబడియుండినట్లు గానవచ్చుచున్నది. ఆ కాలముననే సామంత నాయకత్వము కలిగి యుండిన చాళుక్యులు స్వరాజ్యేచ్ఛకలిగి రాష్ట్రకూటులతోడను, గాంగుల తోడను, కదంబులతోడను పోరాడుచు, స్వతంత్ర రాజ్య నిర్మాణ యత్నము సాగించిరి. క్రీ.శ. 6వ శతాబ్దము వీరు అభ్యుదయముగాంచెను. జయసింహుడు, రణరాగుడు, మొదటి పులకేశి వల్లభుడు కీర్తివర్మ మంగశేశులు యీ క్రమమున బాదామి చాళుక్య రాజులు పశ్చిమ సామ్రాజ్యమునకు పునాదులువైచిరి. రెండవ పులకేశి ఈ పునాదులపై సువిశాల సామ్రాజ్య భవనమును నిర్మించెను. సత్యాశ్రయ పృథ్వీవల్లభ బిరుదాంకితుడైన ఈ మహారాజు క్రీ.శ. 609 లేక 610లో సింహాసనమధిష్ఠించెను. వేంగీ రాజ్యమును జయించిన సందర్భమున తనకు ఖడ్గసహాయుడైన తోడ్పడిన తమ్ముని కుబ్జవిష్ణువర్ధనుని క్రీ.శ. 624లో పాలకునిగ నియమించెను.

రాజకీయముగ తూర్పు చాళుక్య యుగమును మూడు ప్రధాన ఘట్టములుగ విభజింపవచ్చును. మొదటి ఘట్టము క్రీ.శ. 625–753 వరకు, రెండవ దశ క్రీ.శ. 753–973 వరకు, మూడవ మజిలీ క్రీ.శ. 973–1075 వరకు.

**కుబ్జవిష్ణువర్ధనుడు** : క్రీ.శ. 624–631 కుబ్జవిష్ణువర్ధనుడు వేంగి దేశమును పదునెనిమిదేండ్ల కాలము పాలించినట్లు తూర్పు చాళుక్య శాసనములు ఏక కంఠముగ పలుకుచున్నవి. ఈ పదునెనిమిదేండ్ల కాలమును రెండు ఘట్టములుగ విభజింపవచ్చును. క్రీ.శ. 624 మొదలు 631 వరకుగల యేడేండ్లను ప్రథమ ఘట్టమని చెప్పవచ్చును. ఈ కాలమున అతడు తన యన్నయగు పులకేశి వల్లభునికి ప్రతినిధియై రాష్ట్రపాలనము చేసెను. పూర్వ చాళుక్య శాసనములో పేర్కొనబడియున్న దద్దరాది శత్రువులను అతడప్పుడే జయించినట్లు తోచుచున్నది. క్రీ.శ. 631లో అతని రాజ్యకాలమునందు ద్వితీయ ఘట్టము ప్రారంభమాయెను. ఈ కాలముననే పల్లవ రాజ్యము జయించుటయందు పులకేశి వల్లభునకు సహాయమొనర్చి ప్రతిఫలముగా వేంగి రాజ్యాధిపత్యమునుబడసెను. అది మొదలు క్రీ.శ. 641 వరకును నూతన రాజ్యమును నిష్కంటకముగ పాలించి కాలగతి చెందెను.

ఇతని శాసనములు చీపురుపల్లి, తిమ్మాపురము మొదలగుచోటులందు దొరికినవి. వీనినిబట్టి ఈతని రాజ్యము ఉత్తరమున విశాఖపట్టణ మండలము నుండి దక్షిణమున కమ్మనాటి వరుగల తీరదేశముపై వ్యాపించియుండెనని చెప్పవచ్చును. ఈతడు నేర్పరియైన దళనాయకుడు. అసమాన పరాక్రమశాలి ధైర్యశౌర్యములకు ఆటపట్టు. విషమ సిద్ధియనియు, మకరధ్వజుడనియు ఇతనికి బిరుదులు. కుబ్జవిష్ణువర్ధనునకు కార్యఖడ్గములందు తోడ్పడిన ప్రముఖులు కొందఱు శాసనములలో పేర్కొనబడినారు. వీరిలో మత్స్యవంశజుడైన అటవీదుర్జయుడొక్కడు. కొండ పడమటి వంశమునకు జెందిన బుద్ధవర్మ మరియొకడు. ఇతడు బహుపరాక్రమశాలియై తన ప్రభువుయొక్క ఆజ్ఞననుసరించి

దుర్ధర బల సంపన్నుడైన దద్దరుడనువానిని జయించి అతని బిరుదావళిని గొనెనట. కుబ్జవిష్ణువు పట్టమహిషి అయ్యన మహాదేవియని తెలియుచున్నది. ఇతనికి జయసింహ వల్లభుడు, ఇంద్రభట్టారకుడు అను పుత్రులిర్వురు గలిగిరి. ఈతడు విష్ణుభక్తుడు, పరమ భాగవతుడని ఇతని తిమ్మాపుర తామ్రశాసనము తెలుపుచున్నది. కుబ్జవిష్ణువనగా వామనుడు. విష్ణుభక్తుడయినను, కార్తికేయాది కులదేవతతల నాతడు త్యజింపలేదు. ఈతని కాలమున యునాన్‌చ్వాంగ్ అను చీనా యాత్రికుడు ఆంధ్రదేశమును పర్యటించి ఇచ్చటి స్థితిగతులను తన యాత్రాచరిత్రయందు వివరించియున్నాడు. పులకేశి వల్లభుడును, అతని యనుజుడైన కుబ్జ విష్ణువర్ధనుడును ఏకవర్షమున మృతిజెందిరని తెలియుచున్నది. నరసింహవర్మ పల్లవుడు క్రీ.శ. 641లో బాదామిని ముట్టడించినపుడు కుబ్జవిష్ణువర్ధనుడు తన యన్నకు సహాయుడై చని, యా ముట్టడియందే తన యన్నతోబాటు వీరస్వర్గమలంకరించెను.

**మొదటి జయసింహ వల్లభుడు (క్రీ.శ. 641–673)** : కుబ్జవిష్ణువర్ధనుని మరణానంతరము అతని జ్యేష్ఠపుత్రుడైన జయసింహవల్లభుడు రాజ్యాధిపత్యమును వహించెను. ఈతడు పరమభాగవతుడు. బ్రాహ్మణ మతావలంబకుడు. అనేక శాస్త్రార్థతత్త్వజ్ఞుడు. సర్వసిద్ధి నామధారుడు. మఱియు నా పేరట యలమంచి తాలూకాలో సర్వసిద్ధి యను నగరమును నిర్మించెను. ఈతడు తన రాజధానిని పిష్ఠపురమునుండి వేంగీ నగరమునకు మార్చుకొనిన తరువాత కళింగ దేశమును పరిపాలించు ప్రతినిధులకీ సర్వసిద్ధి రాజధానిగ నుండెను. ఈతడు ముప్పదిమూడేండ్ల కాలము రాజ్యము నేలినను ఈతని రాజ్యములోని విశేషాంశములు తెలియవచ్చుటలేదు. జయసింహ వల్లభుని దాన శాసనములందు పేర్కొనబడిన దానోద్దిష్ట స్థలములనుబట్టి చూడగా అతని పాలన క్రింద రాష్ట్రము విశాఖపట్టణ ప్రాంతము నుండి గుంటూరు మండలములోని ఒంగోలు పరిసరములవరకు వ్యాపించి యుండెనని తోచుచున్నది. ఒకానొక శాసనమునీతడు ఉదయపురి నుండి ఇచ్చినట్లు తోచుచున్నది. ఈతని విప్పఱ్ల గ్రామశాసనము తెనుగు భాషా చరిత్రకు ముఖ్యమైనది. ఇంతవరకు లభించిన వానిలో సాగరసీమ యందిదియే తెలుగు భాషలో వ్రాయబడిన మొట్టమొదటి శాసనము. ఈ రాజన్యుడు పండిత విద్యాప్రియుడై యుండెను. ఈతనికి సంతానము కలుగనందున తమ్ముడైన ఇంద్రభట్టారకుని అతని సంతతి వారిని చేరదీసి రాజ్యపాలనమున భాగస్వాములను గావించుకొనెను. వీరి సహాయముతో మహావైభవముగా రాజ్యపాలనము గావించి 673 ప్రాంతమున దేహము చాలించెను.

**జయసింహ వల్లభుని తరువాతి రాజులు (క్రీ.శ. 673–753)** : జయసింహ వల్లభుని మరణానంతరం ఇంద్రభట్టారకుడు ఏడు దినములును, తరువాత నాతని తనయుడగు రెండవ విష్ణువర్ధనుడు తొమ్మిది వర్షముల కాలము పాలించిరి. ఈ రెండవ విష్ణువర్ధనుని తరువాత ఇతని కొడుకైన మంగి యువరాజు సింహాసనాసీనుడైన క్రీ.శ. 705 వరకు 25 సంవత్సరములు పాలించెను. ఈతడు విజయసిద్ధి బిరుదమును దాల్చినవాడు. చెందలూరు గ్రామమును కర్మరాష్ట్ర నివాసులగు ఆరుగురు బ్రాహ్మణులకు దానమొసంగెను. మంగి యువరాజునకు జయసింహుడు, కొక్కిలి విక్రమాదిత్యుడు, విష్ణువర్ధనుడను ముువ్వరు పుత్రులలో జయసింహుడు 705 మొదలు 717 వరకు పాలించెను. ఈతనికే ఇమ్మడి జయసింహుడని పేరు. ఇతనికి సకల లోకాశ్రయుడు, సర్వసిద్ధి బిరుదములేగాక 'నిరవద్యుడు' మున్నగు బిరుదములు కూడ గలవు. ఈతని యనంతరము కొక్కిలి రాజ్యాభిషిక్తుడయ్యెను కాని సింహాసనము నెక్కిన ఆరు మాసములకే తమ్ముడైన ముమ్మడి విష్ణువర్ధనునిచే పదచ్యుతుడై మధ్యకళింగమునకు పారిపోయి అచట పాదుకొనెను. కొక్కిలిని తరుమగొట్టిన విష్ణువర్ధనుడు క్రీ.శ. 718 మొదలు 752 వరకు పాలించెను. ఇతని కాలమునాటి చారిత్రకాంశములు ఇతర సాధనముల వలన నేమియు తెలియకపోయినను సమకాలిక పల్లవ రాజుల శాసనముల వలన కొన్ని తెలియుచున్నవి. ఈ శాసనముల వలన ముమ్మడి విష్ణువర్ధనునకును పల్లవుల పక్షమువాడగు ఉదయ చంద్రునకు పోరు సంభవించుటయు, తత్ఫలితముగ విష్ణువర్ధనుడు తన రాజ్యములోని దక్షిణ సీమలో గోల్పోవుటయు దెలియుచున్నది. మొత్తముమీద జయసింహుని యనంతరము రాజ్యపాలన చేసినవారి నామములుతప్ప విశేషాంశములేవియు గోచరింపవు. నాటినుండియు తొమ్మిదవ శతాబ్దమువరకు దేశమునందు శాంతిభద్రతలు లేకుండఁబోయెను. రాష్ట్రకూటులును, చాళుక్యులును సహజ శత్రువులు. ఆ కారణమున రాష్ట్రకూటులు తమ శక్తివంచన లేక పూర్వ చాళుక్య వంశమును కబళింప ప్రయత్నించిరి. వీరెంత ప్రయత్నము గావించినను బహుసమర్థులును,

అప్రమత్తులునగు నాంధ్ర చాళుక్యులకడ వారి యాటలు సాగిరాకుండెను.

**ప్రథమ విజయాదిత్యుడు క్రీ.శ. 753–770** : ఈ మొదటి విజయాత్యుని రాజ్యకాలమునుండి తూర్పు చాళుక్యాన్వయము రెండవ దశయందడుగు పెట్టినది. విష్ణువర్ధనుని మరణానంతరము అతని పట్టమహిషి విజయమహాదేవియందు జన్మించిన యీ విజయాదిత్యుడు పట్టాభిషిక్తుడయ్యెను. ఇతనికి సమస్త భువనాశ్రయ త్రిభువనాంకుశయను చాళుక్య సామాన్య బిరుదములేగాక అధిరాజపదవీసూచకములయిన మహారాజాధి రాజ, పరమేశ్వర, భట్టారకాదిబిరుద విశేషములుండినట్లు అతని శాసనములవలన తెలియవచ్చుచున్నది. ఈతని రాజ్యారంభ దశయందు బాదామి చాళుక్య రాజ్యముత్పన్నమైపోవుట వలన రాష్ట్రకూట దంతిదుర్గుడు సామ్రాజ్య పదవి నాక్రమించుకొన ప్రయత్నించెను. కాని విజయాదిత్యుడు వారసత్వపు హక్కువలన తనకు సంక్రమింపవలయునని ప్రకటించుటకొర్కై పై బిరుదములను వహించియుండును; ఇట్లు ప్రకటించుకొనినను దంతిదుర్గ డీతనిపై దండెత్తుకుండుటవలన రాజ్యము చాలకాలము శాంతముగ సాగెను. కాని దంతిదుర్గుని యనంతరము అతని పినతండ్రి యగు అకాలవర్ష కృష్ణుని కాలమున రాహప్పయను చాళుక్య వీరుడు చాళుక్య సామ్రాజ్యమును పునరుద్ధరించుటకు కంకణము కట్టుకొని పెద్దయల్లరిని రెచ్చగొట్టెను. విజయాదిత్యుడు రాహప్పకు సహాయుడై రాష్ట్రకూటుల యధికారమును కూలద్రోయుటకు ప్రయత్నించుటవలన అకాల వర్ష కృష్ణభూపతి యువరాజగు గోవిందరాజును గొప్ప సైన్యముతో వేంగీదేశముపై దండయాత్రకు పంపెను. వీరినెదుర్కొన విజయాదిత్యుడెట్టి ప్రయత్నమొనర్చెనో గాని రాష్ట్ర కూట శాసన సాక్ష్యమునుబట్టి చూడగా ఆతడు యుద్ధమునందోడి తన సర్వస్వమును శత్రువులకు సమర్పించినట్లు తెలియవచ్చుచున్నది. పరాజయమునకు పిమ్మట నీతడు చాలకాలము రాజ్యము చేయక క్రీ.శ. 770లో దేహమును చాలించెను.

**నాల్గవ విష్ణువర్ధనుడు (క్రీ.శ. 771–806)** : విజయాదిత్యుని మరణానంతరము నాల్గవ విష్ణువర్ధనుడు రాజై ముప్పదియైదేండ్లు రాజ్యపాలన మొనర్చెను. ఈతని కాలమున రాష్ట్రకూటులలో గృహకలహములు సంభవింపగా విష్ణువర్ధనుడు ఇమ్మడి గోవిందరాజునకు సహాయమొనర్చెను. కాని గోవిందరాజు పరాజయమును పొందెను. ధృవుడు క్రీ.శ. 780 ప్రాంతమున సింహాసనమధిష్ఠించి వేంగీరాజును శిక్షింపనెంచెను. కాని విష్ణువర్ధనుడు తన కుమార్తెయగు శీలమహాదేవిని ధృవునకిచ్చి వివాహమొనర్చి సంధి కావించుకొనెను. ఈ వివాహమువలన పూర్వ చాళుక్యులకును, రాష్ట్రకూటులకును సంబంధ బాంధవ్యము లేర్పడినవి.

**రెండవ నరేంద్ర మృగరాజ విజయాదిత్యుడు (క్రీ.శ. 806–846)** : నాల్గవ విష్ణువర్ధనుని మరణానంతరము ఆతని కుమారులు విజయాదిత్యుడును. భీమసలికీయు వేంగీరాజ్యమునకై కలహించిరి. పెద్దవాడైన విజయాదిత్యుడు రాజ్యాధికారము వహించెను. తమ్ముడు భీమసలికి స్వయముగ అన్నను తొలగద్రోసి రాజ్యమునాక్రమింపలేక రాష్ట్రకూట చక్రవర్తియగు ముమ్మడి గోవిందరాజు నాశ్రయించెను. అతడు భీమసలికికి గొప్ప సైన్యమును తోడిచ్చి పంపెనుగాని ధీరోత్తముడైన విజయాదిత్యుడు పరాజయమునంగీకరింపక పండ్రెండేడ్ల కాలము తమ్మునితో బోరాడి జయమునుగొనెను. ఈ సమయమున ముమ్మడి గోవిందరాజు స్వర్గస్థుడగుట వలన రాష్ట్రకూట రాజ్యమున అరాజకము ప్రబలెను. అంతట విజయాదిత్యుడు భీమసలికి నుచ్చాటనము చేయుటకది మంచి సమయమని గ్రహించి యుద్ధమొనర్చి హైహయ వంశజుడైన నృపరుద్రుడీ యుద్ధమునందు ఖడ్గసహాయుడై నిలువ జయమునుగొనెను. రాష్ట్రకూట రాజైన సువర్ణవర్షుడు విజయాదిత్యునితో సంధిగావించుకొని తోబుట్టువైన శీలమహాదేవిని అతని కుమారుడైన కలివిష్ణువర్ధనునకిచ్చి వివాహము చేసెను. అది మొదలు విజయాదిత్యుడు నిరాటంకముగ వేంగిని పాలించి క్రీ.శ. 848లో దేహమును చాలించెను.

నరేంద్రమృగ విజయాదిత్యుడు అద్వితీయ పరాక్రమశాలి. శత్రుజన భయంకరుడు. శత్రువుల ననేకుల భజించుటవలన నరేంద్ర మృగరాజను బిరుదుఁగలిగెను. ఈతని పరాక్రమమునకు మెచ్చి లోకమాతనికి చాళుక్యార్జునుడను బిరుదునిచ్చెను.

**కలివిష్ణు వర్ధనుడు (క్రీ.శ. 846–848)** : ఈతడు తన తండ్రి యనంతరము రాజ్యధిపతియై పదునెనిమిది మాసములు పరిపాలించెను. ఈతనికే అయిదవ విష్ణువర్ధనుడని పేరు. 'కలి'యనుటవలన నీతడు గొప్ప యుద్ధవీరుడని తెలియుచున్నది. ఈతని రాజ్యకాలము

శాంతముగానున్నట్లు తెలియుచున్నది. ఈతనికి విజయాదిత్యుడు, విక్రమాదిత్యుడు, నృపకాముడు, యుద్ధమల్లుడను నలుగురు కుమారులు జన్మించిరి. గుణగవిజయాదిత్యుని శాసనమువలన నృపకామునిపేర తెలియవచ్చుచున్నది.

**గుణగ విజయాదిత్యుడు (క్రీ.శ. 848-892)** : ఈతడు మూడవ విజయాదిత్యుడనియు, అనేక సద్గుణాలంకృతుడగుటచే గుణాంక, గుణగ విజయాదిత్యుడనియు వ్యవహరింపబడెను. ఈతడు కలివిష్ణువర్ధనుని జ్యేష్ఠకుమారుడు. వేంగిని పాలించిన వారిలో కడు గొప్పవాడు. అద్వితీయ పరాక్రమశాలి! రణప్రియుడు శౌర్య ధైర్య సాహసాది గుణములచేతనీతడు సమకాలిక రాజన్యుల నదఃకరించెను. ఈతని కాలమునాటి విషయములు అతనియొక్కయు, అతని సంతతి వారియొక్కయు శాసనములందు అభివర్ణింపబడియున్నవి. సమకాలిక రాష్ట్రకూట శాసనములవల్ల కూడ కొన్ని విషయములు తెలియుచున్నవి. గుణగుడు సింహాసనము నధిష్ఠించినపుడు వేంగిరాజ్యము దక్షిణపు పొలిమేర గుండ్లకమ్మను దాటి యుండలేదు. గుండ్లకమ్మకు దక్షిణమునగల తీరాంధ్రమును బోయలేలుచుండిరి. పూర్వము మూడవ విష్ణువర్ధనుని కాలమున ఈ బోయరాష్ట్రమంతయు పూర్వ చాళుక్యులకు లోబడియుండెను. ఆ రాజ్యమును మరల స్వాధీనపరచుకొనుటకు గుణగ విజయాదిత్యుడు తన సేనాపతియైన పండరంగని దండయాత్రకు పంపెను. పండరంగడు బోయదొరలను నిర్జించి, కట్టెంపు దుర్గమును స్వాధీనపరచుకొని, నెల్లూరును తగులబెట్టి పులికాటు పర్యంతముగల రాజ్యమును స్వాధీనపరచుకొనెను. తత్ఫలితముగ రాజ్యము దక్షిణమున తొండమండలపు సరిహద్దు వరకు వ్యాపించెను.

తరువాత విజయాదిత్యుడు రాహుడనువానితో యుద్ధము చేసినట్లు శాసనములు చెప్పుచున్నవి. ఈ కాలమున తిరిగి రాష్ట్రకూటులకు చాళుక్యులకును ఘర్షణ ప్రారంభమైనది. ఈ ఘర్షణ యే కారణముచేత జరిగినదో చెప్పుట కష్టముగాని ఉభయ సైన్యములకు యుద్ధము పొసగి, గుణగుని సైన్యము విజృంభించి 'స్తంభమును' నిర్మూలించెను. ఈ స్తంభము కంబముగాని, కంబము మెట్టుగాని కావచ్చును. కంబము నిర్మూలమయినదని తెలియగానే అమోఘవర్షుడు వేంగి మీదకు దండు పంపెను. వింగవల్లియను గ్రామముచెంత ఉభయ పక్షములకు భీకర యుద్ధము నడచెను. పూర్వ చాళుక్యులకు పరాజయము సంభవించుటయు, తత్ఫలితముగ గుణగుడు స్వాతంత్ర్యమును కోల్పోయి రాష్ట్రకూటులకు లొంగవలసి వచ్చెను. తరువాత గుణగ విజయాదిత్యుడు అమోఘవర్షుని ఆదేశము చొప్పున గంగకూటము నాశ్రయించి యుండిన గాంగ సైన్యమునోడించెను.

అమోఘవర్షుని మరణానంతరము గుణగుడు స్వాతంత్ర్యమును ప్రకటించుట చేత అమోఘవర్షుని జ్యేష్ఠపుత్రుడగు కృష్ణరాజు అతనిపై దండు వెడలెనని యూహింపబడుచున్నది. ఈ దండయాత్రను గుఱించి తెలియు విషయము లత్యల్పము. ఇమ్మడి కృష్ణరాజు రణ పరాజితుడయ్యెనని మాత్రము తెలియవచ్చుచున్నది.

ఈతడు తన దక్షిణ దండయాత్ర యందు తన సహాయము నర్థించిన ఒకానొక చోళునకు సహాయమొనర్చెను. ఆ చోళుని పేరును, అతనిపై దండెత్తి వచ్చిన అజ్ఞాత శత్రువు పేరును తెలియవచ్చుట లేదు. మొదటి చాళుక్య భీముని అత్తిలి తామ్ర శాసనములో గుణవిజయాదిత్యుడు పాండ్యులకడ నుండి హేమమును, పల్లవులకడ నుండి రజతమును హరించెనని చెప్పబడినది.

***డాహుల దండయాత్ర*** : గుణగవిజయాదిత్యుని దండయాత్రలలో నెల్లనిది కడు ప్రసిద్ధమైనది. ఈ దండయాత్రయందు గుణగుని ప్రతిపక్షులు కృష్ణసంకిలులు యుద్ధకార్యమంతయు నర్మదా భాగీరథుల మధ్యనుండు డాహుల దేశమందు జరిగినది. ఈ దండయాత్ర యందు గుణగునకు కృష్ణసంకిలులపై సంపూర్ణ విజయము చేకూరినది. ఈతడు రాష్ట్రకూటుల బిరుదములన్నియు ధరించి, యావద్దక్షిణ భారత భూమికి అధునాధుడని ప్రకటించెను. రాష్ట్రకూట చక్రవర్తికి బదులు తాను సామ్రాజ్యాధిపత్యము వహించి, అధికారము నిర్వహించుట దుర్ఘటమని గ్రహించి అతని రాజ్యాధికారము నాతనిచే ఇచ్చివేసెను. డాహుల దండయాత్ర ముగిసిన పిమ్మట గుణగ విజయాదిత్యుడు చిరకాలము జీవించి యుండలేదు. నలుబదినాలుగేండ్ల కాలము రాజ్యభారము వహించి జరాభార పీడితుడై క్రీ.శ. 892వ సంవత్సరమున దేహము చాలించెను. ఈతని రాజ్యము దక్షిణమున నెల్లూరిపురము వరకును, పశ్చిమమున చాల భాగము నైజాము మండలములోనికిని, ఉత్తరమున మహేంద్రగిరి వరకును వ్యాపించెను.

**మొదటి చాళుక్య భీముడు (క్రీ.శ. 892-921)** : గుణగవిజయాదిత్యుడు తనకు సంతతి లేకపోవుటవలన తన తమ్ముడైన విక్రమాదిత్యుని యువరాజ్య పదమునకు అభిషిక్తుని గావించెను కాని యువరాజ విక్రమాదిత్యుడు అన్న సజీవుడై యుండగనే స్వర్గస్థుడాయెను. కావున గుణగ విజయాదిత్యుని పిమ్మట యువరాజ విక్రమాదిత్యుని పుత్రుడైన మొదటి చాళుక్య భీముడు రాజ్యాధిపత్యమును వహించెను. ఇతని అభ్యుదయమును సహింపని కొందరు దాయాదులు అతనిపై ద్వేషమును వహించి రాష్ట్రకూట రాజైన ఇమ్మడి కృష్ణరాజు సహాయమును గోరగానాతడు వేంగీ దేశముపై దండెత్తి మంచికొండనాడు మొదలగు పశ్చిమ సీమల నాక్రమించెను. చాళుక్య భీముడు వారికి చేజిక్కినను రాజ్యము మాత్రము స్వాధీనముకాలేదు. ముదిగొండ చాళుక్య వంశజుడును, స్వామిభక్తి పరాణుడునునగు కుసుమాయుధుడును సామంతరాజు చాళుక్య భీముని హితులగు మఱికొందరు దొరలతోగూడ రాష్ట్రకూటులతో బోరి విజయమునుగాంచెను. ఈ సంగ్రామము జరుగుచుండగా చాళుక్య భీముడు శత్రువుల బారినుండి తప్పించుకొని తన యనుచరులను చేరెను. తరువాత బలముగట్టి రాష్ట్ర కూటులపైబడి ఓడించి, క్రీ.శ. 814వ సంవత్సరమున పట్టాభిషేకముగావించుకొనెను. ఈతని కాలముననే ఇమ్మడి కృష్ణరాజు మరియొక మారు దండెత్తి వచ్చెను. ఇది మొదటి దండయాత్రకన్నను కడు భీకరమైనది. ఈ యుద్ధమున చాళుక్య భీముని పుత్రుడు, షోడషవర్ష వయస్కుడైన "ఇఱిమర్తిగండడు" వీరస్వర్గము చూరగొనెను. యుద్ధము జరిగిన తావులలో నిరవద్యపుర, పెరువంగూరు గ్రామసంగ్రామములు ముఖ్యమైనవి. ఈయవాంతరము గడిచిపోయిన పిమ్మట దేశమున శాంతి నెలకొనెను. ఈతడు క్రీ.శ. 921లో మరణించెను.

మొదటి చాళుక్య భీముని తరువాత కొందరు రాజులు క్రీ.శ. 921-945 వరకు పాలించిరి. ఈ రాజులలో చివరివాడు రెండవ చాళుక్య భీముడు. ఈతని రెండవ కుమారుడే అమ్మరాజ విజయాదిత్యుడు.

**అమ్మరాజ విజయాదిత్యుడు** : ఈతడు రెండవ చాళుక్య భీముని రెండవ కుమారుడు. మొదటివాడు దానార్ణవుడుండ రాజ్యమీతనికేల సంక్రమించెనో తెలియదు. ఈతని ఇఱువదియైదేండ్ల కాలమును మూడు ఘట్టములుగ విభజింపవచ్చును. ప్రథమ ఘట్టము 945 నుండి 955 వరకు. ఈ కాలమున ఇమ్మడి చాళుక్య భీమునిచే నోడిపోయిన యుద్ధమల్లుడు తిరిగి అమ్మరాజునెదిరించి యుద్ధమునందు నిహతుడయ్యెను. ఈతని తరువాత ఈతని కుమారులైన బాదప, ద్వితీయ తాళపులు ఇమ్మడి కృష్ణరాజు సహాయముచే వేంగిపై దండెత్తిరి. ప్రధాన రజభృత్యులు కూడ రాజద్రోహమునకు పాల్పడినను ధైర్యమును కోల్పోక పోరెను కాని ప్రతి పక్షులను యెదుర్కొనజాలక పారిపోయెను. కాని తిరిగి ఈతడు విపక్ష సామంతులను సమాధానపరచి వారి సహాయముచే వేంగీ సింహాసనముననున్న తాళపరాజును ఓడించి వేంగిన మరల స్వాధీనపరచుకొనెను. రెండవ ఘట్టము 955 నుండి 956 వరకని చెప్పవచ్చును. ఈ కాలమున రాష్ట్రకూట ముమ్మడి చక్రవర్తి వేంగిపై దండెత్తి వచ్చెను. అమ్మరాజు కృష్ణుని ఎదుర్కొనజాలక కళింగమునకు పారిపోయెను. అంతట కృష్ణుడు వేంగీ రాజ్యమును దానార్నవున కొసంగెను. కాని తిరిగి అమ్మరాజ కళింగము నుండి వచ్చి వేంగిని స్వాధీనపరచుకొనెను. మూడవ ఘట్టము 956 నుండి 970 వరకు. ఈ కాలమున సవతి తమ్ముడగు దానార్ణవుడు తిరుగుబాటు చేసెను. ఈతడు అమ్మరాజును చంపి సింహాసనమాక్రమించినట్లు తెలియుచున్నది. అమ్మరాజు భయమెరుగని జోదు; రణలాలసుడు; గజశాస్త్ర పారగుడు.

**దానార్ణవుడు (970-1002)** : అన్నను చంపి రాజ్యమునాక్రమించినను మూడు సంవత్సరములకన్న నెక్కువ రాజ్యము చేయలేదు. ఈతని తల్లి ఉర్జపాయను నామె కళింగ రాజకుమార్తె. ముదిగొండ చాళుక్య వంశీయులైన సామంతులకు దానార్ణవుడు పొత్తపినాడు విషయములో 300 గ్రామముల ఏలుబడిని అనుగ్రహించెను. ఈ రాజు తరువాత 27 సంవత్సరములు వేంగీ రాజ్యము అరాజకమునకు గుఱియయ్యెనని శాసనములు వర్ణించుచున్నవి. రెండవ అమ్మరాజునకు ఆవలింక బంధుగుడైన జటాచోడ భీముడను పెడకంటి దేశ ప్రభువు వేంగిపై దండెత్తి, దానార్ణవుని చంపి అతని పుత్రులైన శక్తివర్మ, విమలాదిత్యులను వెడల నడచి యాంధ్ర దేశమునందు విశేష భాగమును క్రీ.శ. 970 మొదలు 999 వరకును పాలించెను. క్రీ.శ. 985 ప్రాంతమున చోళ సింహాసనము నధిష్ఠించిన రాజరాజ కేసరివర్మ దానర్ణవుని పుత్రులను చేరదీసి వారిలో ద్వితీయుడైన విమలాదిత్యునకు తన కూతురగు కుందవ్వనిచ్చి పెండ్లిచేసి పెద్దవాడైన శక్తివర్మ యొక్క పక్షము నవలంబించి క్రీ.శ. 999లో బహుళ సైన్య

పరివృత్తుడై వేంగి రాజ్యముపై దండెత్తి జటాచోడ భీముని జంపి శక్తివర్మను రాజును జేసెను. ఇట్లు చేయుట వలన వేంగీ ప్రభువులు చాళుక్యుల కనురక్తులైరి. ఈ చాళుక్య చోళ సమ్మేళ నోదంతము మూడవ ఘట్టమునకు నాందియైనది.

**మొదటి శక్తి వర్మ 999–1011** : ఈతడు చోళసహాయమువలన మరల పితృపైతామహమైన రాజ్యము నధిష్ఠింపగలిగెనుకాని వేంగి మునుపటివలె స్వతంత్ర రాజ్యము కాదు. వేంగి చోళ సామంత రాజ్యములలో నొక్కటిగ పరిగణింపబడుచుండెను. ఈతడు స్వరాష్ట్ర పరిపాలన విషయమున ఎక్కువ స్వేచ్ఛననుభవించుచుండినను, రాష్ట్రేతర వ్యవహారములలో మాత్రము స్వతంత్రము లేకపోయెను. చోళ చక్రవర్తి ప్రాపు కలిగినను శక్తివర్మ వైదేశిక దండయాత్రను ఎదుర్కొనవలసివచ్చెను. సత్తిగ నామాంతరుడైన సత్యాశ్రయుడు క్రీ.శ. 1006 వ సంవత్సరమున బయలునంబియను సేనాధిపతి నాయకత్వమున సైన్యమును వేంగిపై పంపెను. బయలునంబి వేంగిప్రవేశించి ఎనమదల, ధరణికోట దుర్గములను కాల్చి చేబ్రోలునందు విడిసెను. ఈ దండయాత్రను ఎదుర్కొన శక్తివర్మ ఎట్టి ప్రయత్నము చేసెనో తెలియదుకాని చోళ రాజగు రాజరాజ సత్యాశ్రయుని బలములను వేంగి నుండి వెడలగొట్టెను. పిదప శక్తివర్మ నిశ్చింతతో రాజ్యము పాలించి క్రీ.శ. 1011 సంవత్సరమున కాలగతినందెను. ఇతని రాజ్యకాలమున తరచు యుద్ధములు నడచుచుండినను దేశము ఆర్థికముగ నభివృద్ధిచెందెను. ద్వీపాంతర వర్తక మవిచ్ఛిన్నమై సాగెను. శక్తివర్మకు చాళుక్య నారాయణుడనియు, చాళుక్య చంద్రుడనియు బిరుదులుగలవు. ఈ బిరుదులతో ముద్రితములయిన నాణెములు కొన్ని "అరకాను" తీరప్రాంతమున కానవచ్చినవి.

**విమలాదిత్యుడు క్రీ.శ. (1011–1018)** : మొదటి శక్తివర్మ యనంతరము రాజ్యాధిపతియయ్యెను. రాజమార్తాండ, ముమ్మడిభీమ బిరుదు లీతనికిగలవు. ఇతనిని గూర్చి చెప్పదగిన చరిత్రాంశము లేవియు లేవు. ఇతనిపై తిరిగి కర్ణాటకులు ఎత్తిరాగా తన మామ సహాయముతో వారిని వెడలనంపెననియు చారిత్రకులూహించుచున్నారు. విమలాదిత్యున కిరువురు భార్యలుగలరు. వారిలో చోళ చక్రవర్తియగు రాజరాజ కేసరివర్మ దుహితయైన కుందవయొకతె. ఈమెయందు కలిగిన కుమారునకు రాజరాజని మాతామహుని పేరు పెట్టిరి. ఈతని యెడల గల యభిమానముచే విమలాదిత్యుడితనికి పసితనముననే యౌవరాజ్య పట్టాభిషేకమొనర్చెను. విమలాదిత్యునకు మేళవయను నామెయందు విజయాదిత్యుడను పుత్రుడుద్భవించెను. మొదట శైవుడయినను విమలాదిత్యుడు అపరవయస్సున జైన ధర్మము స్వీకరించెను. ఇతను తన గురువగు దేశిగణాచార్యుడయిన త్రికాల యోగి సిద్ధాంత దేవునికి విశాఖపట్టణమందలి రామతీర్థములో 'రామకొండ'యను గుహాలయమునొకదానిని నిర్మించి యిచ్చెను.

**రాజరాజనరేంద్రుడు (క్రీ.శ. 1019–1061)** : విమలాదిత్యుని యనంతరము అతని పుత్రుడు రాజరాజు రాజ్యాధిపతియయ్యెను. కాని రాజ్యము వెంటనే అతని వశము కాలేదు. ఈతని సవతి తమ్ముడగు విజయాదిత్యుడు కర్ణాట, కళింగ, గాంగ రాజులతో సఖ్యము చేసి వారి సహాయముతో వేంగి నాక్రమించెను. ఈ సమయమున ఇతని మేనమామయైన రాజేంద్రచోళుడొక ప్రణాళికను నిర్ణయించి వేంగీ రట్టవాడలపై ఏక సమయమున దండెత్తుట వలన కర్ణాట రాజగు జయసింహుడోడి పారిపోయెను. యుద్ధమువలన దేశమున సంక్షోభము పుట్టుటచేత జయసింహుడు మిత్రుడైన విజయాదిత్యునకు సహాయము చేయలేకపోయెను. ప్రత్యక్షముగ నీతడు సహాయమొనర్పకపోయినను శత్రువులను రెచ్చగొట్టి ఉపద్రవము చేయుచు చోళులపై తిరుగుబాటు చేసెను. రాజేంద్రచోళుడు అతని దండనాథుని సాయముతో తిరుగుబాటు నణచి, తన కుమారిత యగు అమ్మంగదేవిని రాజరాజ నరేంద్రునకిచ్చి వివాహమొనర్చి క్రీ.శ. 1022 ఆగస్టు 22వ తేదీన రాజరాజునకు వేంగి యందు పట్టాభిషేకమొనర్చెను. రాజరాజు పట్టాభిషిక్తుడై తొమ్మిది సంవత్సరములు శాంతియుతముగ రాజ్యపాలన మొనర్చెను. కాని విజయాదిత్యుడు తిరిగి జయసింహుని సహాయముచే వేంగిపై దండెత్తి రాజధానియైన బెజవాడను స్వాధీనము చేసికొని పాలింప దొడగెను. అంతట రాజరాజు మాతులుడగు రాజేంద్రునాశ్రయింపగా నాతడు విశ్వాసపాత్రుడయిన ఒక బ్రాహ్మణ సేనాధ్యక్షునికి గొప్ప సైన్యమును, దళ నాయకుల నిచ్చి కర్ణాటులపై పంపెను. తత్ఫలితముగ రాజరాజు రాజ్యమును మరల వశపరచుకొని యధాపూర్వకముగా పాలింపదొడగెను. ఈ విషయము చాళుక్య భీమవరమునగల శాసనమువలన తెలియుచున్నది.

రాజేంద్రచోళుడు మరణించినంతనే జయసింహుని కుమారుడగు ఆహవమల్ల సోమేశ్వరుడు వేంగీరాజ్యమును జయించెనని అతని శాసనములవలన తెలియుచున్నది. కాని 1047 నాటి ఒక శాసనమునుబట్టి వేంగీ రాజ్యము సమస్తమును కర్ణాట రాజుల స్వాధీనము కాలేదని చెప్పవచ్చును. అయినను చివర దినములలో రాజరాజ నరేంద్రుడు ఆహవమల్ల సోమేశ్వరునితో సంధిచేసుకొని వారితో మైత్రి కలిగి వర్తించెనని తెలియుచున్నది. ఈ సంధిమూలమున ఆతడు విద్యావ్యాసంగముచేత తన కాలమును పండిత గోష్ఠియందును, భాషాపోషణయందును గడుపుచు క్రీ.శ. 1061-62లో కాలగతినందెను.

**రెండవ శక్తి వర్మ, ఏడవ విజయాదిత్యుడు క్రీ.శ. 1061-1076** : రాజరాజునకు అమ్మంగదేవియందు రాజేంద్రుడనునొక కుమారుడు కలిగెను కాని ఆతడు తండ్రి వెనుక రాజ్యాధిపతి కాలేదు. రాజేంద్రుని పినతండ్రియైన విష్ణువర్ధన విజయాదిత్యుడు రాజ్యమునాక్రమించుకొని తనుస్వయముగా రాజ్యభారమును వహింపక తన పుత్రుడైన రెండవ శక్తివర్మకు పట్టాభిషేకము చేసెనుకాని ఆతడు ఒక యేడాది కాలము రాజ్యపాలనముచేసి రణరంగమున నిహతుడయ్యెను. కుమారుడు గతించిన పిదప విజయాదిత్యుడే రాజ్యము చేయుచుండెను. రాజేంద్రుని మామయైన రెండవ రాజేంద్రచోళ చక్రవర్తి విజయాదిత్యుని వేంగినుండి పారద్రోలి రాజేంద్రుని అతని తండ్రి రాజ్యమునందు ప్రతిష్ఠింప ప్రయత్నము చేసెను. కాని అవకాశము కలుగలేదు. రెండవ రాజేంద్ర చోళుడు గతించిన వెనుక వీరరాజేంద్రుడు పలుమారు దండయాత్రలు నలిపి వేంగి, కళింగ చక్రకూటములను జయించి, వేంగి రాజ్యమును దాని హక్కుదారుడైన మేనల్లుడు రాజేంద్రుని కీయక అతని పినతండ్రియు విద్వేషియు నయిన విజయాదిత్యునకిచ్చెను. దీనికి కారణములను చారిత్రకులెన్నియో విధముల నూహించుచున్నారు. తరువాత స్వల్పకాలములోనే వీరరాజేంద్రుడు మృతినొందుటవలన వేంగికి వచ్చి విజయాదిత్యునివెడల నడచి క్రీ.శ. 1070లో రాజ్యాభిషేకము చేసికొనెను. ఈ యువకుడు మహాశూరుడై విస్తృత సామ్రాజ్యాభిలాషియైయుండెను. కావున అధిరాజేంద్రుడు మృతినొందుటవలన చోళరాజ్యమునాక్రమించుకొని కుళోత్తుంగచోడ చక్రవర్తియను అభిదానముతో రాజ్యము చేసెను. ఇతడు చోళసామ్రాజ్యమునే జన్మదేశముగ తలంచియుండుటచేత వేంగి చోళరాజ్యాంతర్గతమయిన సామ్రాజ్యమండలమాయెను. ఈ విధముగ తూర్పు చాళుక్య సామ్రాజ్యము క్రీ.శ. 625 మొదలు 11వ శతాబ్ది వరకును విలసిల్లెను.

**లేములవాడు చాళుక్యులు** : చాళుక్య వంశజులు శాఖోపశాఖలై తామరతంపరగ అభివృద్ధిచెంది పెక్కుదేశములనేలిరి. అందు తెలంగాణములోని కరీంనగర మండలమునకు చెందిన వేములవాడ రాజధాని తత్పరిసర ప్రాంతములను ఏలినవారు లేములవాడ లేక వేములవాడ చాళుక్యులు. వీరి మూలపురుషుడు బాదామి సత్యాశ్రయ పులకేశి వల్లభుడు. ఈ వంశమున పది తరములవారు వేములవాడలో రాచరికము నెరపిరి. వీరిలో క్రీ.శ. 8వ శతాబ్ద మధ్యమున వెలసిన వినయాదిత్య యుద్ధమల్లుడు ప్రథముడు.

**మొదటి యుద్ధమల్లుడు క్రీ.శ. (750-775)** : కొల్లిపర శాసనములో ఇతడు తురుష్క, యవన, కాశ్మీరాది దేశములను జయించినట్లు గలదు. వేములవాడ శాసనము ప్రకారముగానీతడు సపాదలక్ష దేశము పాలించెననియు, పర్భిణి శాసనముల ప్రకారము చిత్రకూటమును దుర్గమమైన దుర్గమును పట్టుకొనెననియు గలదు.

**మొదటి అరికేసరి** : వినయాదిత్య యుద్ధమల్లున కిరువురు కుమారులు. అందు అరికేసరి ఒకడు. ఈతని తమ్ముడు వీరగ్రహుడు. అరికేసరి తండ్రి తదుపరి రాజయ్యెను. ఈతని సంతతివారి శాసనములందీతడు ధృవుని యాజ్ఞచొప్పున వేంగీ త్రికళింగముల జయించెననియు, అదియు రాష్ట్రకూట ధారావర్షుని కాలమనియు చెప్పబడినది. రాష్ట్రకూటులకు వీరు సేనానయకులై యుందురు. కొల్లిపర శాసనములవలన అరికేసరి బాగుగా చదువుకున్నవాడనియు, వ్యాకరణము, గజతంత్రము, తర్కము, ధనుర్వేదము, ఆయుర్వేదము మున్నగువానిలో ప్రవీణుడనియు, సమస్త లోకాశ్రయ, త్రిభువనమల్ల, రాజత్రినేత్ర సాహసరామ బిరుదులుగలవాడనియు తెలియుచున్నది. ఇవియన్నియు రాష్ట్రకూటుల బిరుదములు. అరికేసరి కొడుకు మొదటి నరసింహవర్మ. ఆతని కొడుకు రెండవ యుద్ధమల్లుడు. వీరిని గూర్చి అంతగా తెలియరాదు.

**ఖద్దెగడు** : ఇతడు 'సోలదగండ' బిరుదుగలవాడు. గొప్ప విజేత. ఇతడు వేంగీ పాలకుడైన చాళుక్య భీముని ఒక యుద్ధమునోడించి జలములందు మొసలివలె పట్టుకొనెనని పర్భిణీ శాసనములు, పంపభారతము చెప్పుచున్నవి. బద్దెగడు


రెండు మార్లు రాష్ట్రకూట సైన్యముల వెంబడి వేంగిపై దండెత్తి యుండెను. క్రీ.శ. 895 ప్రాంతమున మరణించెను.

**మూడవ యుద్ధమల్లుడు** : ఈతడు బద్దెగని కుమారుడు. యుద్ధము లందనిష్టుడు. ఇతని గూర్చి అధికముగా తెలియదు. ఈతని కుమారుడు రెండవ నరసింహుడు. ఇతడు ఇంద్ర రాజును రాజు పక్షమున ఉత్తర హిందూ దేశముపై దండెత్తలాట సప్త మాళవములను జయించెను. తన సైన్యమును యమునానదిని దాటించుకొని కన్యాకుబ్జ పట్టణముచేరి తురంగములను గంగలో నీరు ద్రావించి మరలి వచ్చెను. ఇంద్ర రాజ సోదరి ఔకవ్వ నువివాహమాడెను. ఆమెయందితనికి ఇమ్మడి ఆరికేసరి జన్మించెను. ఈతడు క్రీ.శ. 930 వరకు పాలించెను. ఇతడు తండ్రికన్న రాష్ట్రకూటులకు సన్నిహితుడు. రాష్ట్రకూట మూడవ ఇంద్రుని ప్రాపున పెరిగినవాడు ఈతని రాణులు రేవక నిర్మది, లోకాంబికయనువారు. ఇతని ఘనకార్యములన్నియు అరికేసరి శాసనమువలన తెలియుచున్నవి. అరికేసరికిద్దరు కుమారులు. అందు వాగరాజు తండ్రియనంతరము రాజై మూడవ కృష్ణునకు సామంతుడై తన చక్రవర్తితో చిత్తూరునందలి మెల్పాడి జైత్రయాత్రలయందు పాల్గొనెను. ఇతడు సంతానరహితుడై మరణించినట్లు తెలియుచున్నది. లోకాంబిక కుమారుడగు భద్రదేవుని కుమారుడు మూడవ అరికేసరి తరువాత రాజయ్యెను. ఈతని గూర్చి అధికముగా తెలియవచ్చుటలేదు. రేపాకలో సబ్బి మండలమందు సోమదేవసూరియను నాతనికి బద్దెగదేవ నిర్మతమైన శుభధామజినాలయమునకు వెల్లవేయించుటకై ఒక గ్రామము దానము చేసెను. ఈతని తాతయగు రెండవ అరికేసరి బిరుదములే ఈతనికి గలవు. కళ్యాణి చాళుక్యులవలన నీ వంశము అంతమొందినట్లు తెలియుచున్నది. ఆంధ్రదేశమునందు వెలసిన చిన్న చాళుక్య కుటుంబములలో ముదిగొండ చాళుక్యులొకరు. వీరు తెలంగాణమునకు తూర్పు భాగమున నుండు మంచికొండ సీమపై ప్రభుత్వము నెరపిరి. వీరు రణమర్ధకసీమను పాలించుచుండిరి. మంచికొండ దీనిలో నొక భాగము. ఈ వంశములోని మొదటి కుసుమాయుధుడు ప్రధమ చాళుక్య భీముని కాలములో నుండెను. రాష్ట్రకూటులు చాళుక్య భీముని రాజ్యములోని రణమర్ధక సీమనాక్రమించుకొనగా ముదిగొండ చాళుక్య ప్రభువు రాష్ట్రకూటులనోడించి తరిమివేసి కొఱవి ప్రాంతమును తూర్పు చాళుక్యులకర్పించెను. కొఱవి శిలాశాసనములవలన మంచికొండ లేక ముదిగొండ చాళుక్యుల విషయము తెలియవచ్చుచున్నది. వీరుకాక లాట చాళుక్యులు గుజరాతు చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు గలరు. కాని వారికి ఆంధ్రదేశముతోనెట్టి సంబంధమును లేదు. ఈ పైన చెప్పబడిన చాళుక్య వంశములకు మూలకంద ప్రాయమైనది బాదామి రాజ వంశము.

(మన సంస్కృతి - చరిత్ర)

## *స్వరనైవేద్యం*

✧ "... ***మిసిమి*** జులై సంచిక, నాల్రోజులనాడు, నా కంటపడింది. అదీ ఒక మిత్రుని సౌజన్యంతో. దానికి కారణం కూడా అందులోని వ్యాసమే. *వాగ్దేవికి స్వరనైవేద్యం* పేరుతో డా. వోలేటి పార్వతీశంగారు వ్రాసిన వ్యాసం ప్రచురించారు.






మాష్టారిని గురించిన ఎన్నో వ్యాసాలు, గ్రంథాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా మాష్టారి పాటపైన విస్తృతంగా చర్చ జరిగింది కానీ మొదటిసారి మాష్టారి పద్యంపైన ఇదొక విపులమైన వ్యాసంలా తోచింది. రంగస్థలం మీద గిరికీలు కొట్టే ఆనాటి పద్యాన్ని ఆ గిరికీలు దాటించాలని, ఆయన ఎంత ప్రయత్నం చేశారో, ఎన్నెన్ని ప్రయోగాలు చేశారో, అన్నీ ఒక్కసారి గుర్తుకు వచ్చాయి. హార్మోనియం దగ్గర పెట్టుకుని, ఎన్నెన్నో పద్యాలు ఆయన సాధన చేయడం నాకూ బాగా జ్ఞాపకం. ఆనాటి, వారి కష్టానికి ఫలితం కదా! ఈ విశ్లేషణ అనిపించింది. పద్యంపట్ల మాష్టారి హృదయం ఏమిటో ఈ వ్యాసం ఆవిష్కరించింది. ఎందుకనో ఈ వ్యాసం ఆంగ్లంలోకి కూడా అనువదింపజేస్తే బావుండునేమో అనే తలంపు కలిగింది. ఏమైనా ***మిసిమి***కి, ప్రత్యేకించి వోలేటి పార్వతీశం గారికి కృతజ్ఞతలు......"

**– *ఘంటసాల సావిత్రి*** *(ఘంటసాల మాష్టారి సతీమణి – వాయిస్ మెయిల్)*



కొవ్వలి లక్ష్మీనరసింహారావు

# 'కొవ్వలి' నవలల్లోని వస్తువైవిధ్యం

– *లింగాల రామతీర్థ*

కొవ్వలి లక్ష్మీనరసింహారావు 1912 పశ్చిమగోదావరి జిల్లా తణుకులో పుట్టారు. దాదాపు 7, 8 దశాబ్దాల క్రితం వ్యవహారిక భాషలో రచనలు చేయడం మహాపాపంగా భాషామ తల్లికి ద్రోహంగా భావించబడుతు ఉన్న రోజుల్లో అంటే 1935 ఆయన మొదటి నవల *పల్లెపడుచులు* దగ్గర నుంచి 1975 *కవిభీమన్న* 1001 నవల పూర్తిచేసేదాకా, అంటే 40 సంవత్సరాలపాటు తెలుగునాట చదువరులను, పాఠకులను తయారుచేసిన అక్షర విప్లవకారుడు కొవ్వలి.

గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యవహారిక భాషావాదానికి నిలువెత్తు ఏకలవ్య శిష్యుడు కొవ్వలి. ఈనాటి తరానికి అక్షరవారధి. మొదటి నవల *పల్లెపడుచులు* తన తల్లి లక్ష్మీనరసమ్మకు అంకితమిచ్చారు. దీనికి స్వాతంత్ర్య సమర బావుటా *మాకొద్దీ తెల్ల దొరతనం* వెలువరించిన గరిమెళ్ళ సత్యనారాయణగారు మొదటి పీఠిక వ్రాశారు. *దాసీ పిల్ల* కు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి ముందుమాట వ్రాశారు.

స్కూల్ ఫైనల్ అయ్యాక లక్ష్యం, గమ్యం లేని జీవితంతో సంచారిగా మారాడు. తండ్రిగారు వీరిని కో ఆపరేటివ్ ట్రైనింగ్‌లో పెట్టారు. కానీ ఒకనాటి సాహిత్యంలోనే విప్లవ జ్వాలలు రేకెత్తించవలసిన కొవ్వలి మనస్సు చదువు మీద, ఉద్యోగం మీద లగ్నం కాలేదు.

ఆనాడు కో ఆపరేటివ్ ట్రైనింగ్ పూర్తిచేసి, ఏ గుమస్తాగానో ఆయన వెళ్ళిపోయివుంటే, ఆధునిక నవలా సాహిత్యంలో వికసించవలసిన (అనేక) 1001 కుసుమాలు మొగ్గలోనే వాడిపోయి ఉండేవి. రాజమహేంద్రవరములో ఉన్న నాళం కృష్ణారావుగారు ఏర్పాటు చేసిన గౌతమీ గ్రంథాలయాన్ని, సామాజిక విప్లవ ప్రదాత కందుకూరివారు స్థాపించిన గ్రంథాలయాన్ని అందుబాటులో ఉన్న అన్ని గ్రంథాలయాలను ఔపోసన పట్టారు. అన్ని రకాల సాహిత్య గ్రంథాలపై అభిరుచి పెంచుకొన్నారు. ఒకసారి వేసవి సెలవుల్లో తన పెద్దక్క ఊరు పశ్చిమగోదావరి జిల్లా పోడూరు వెళ్ళారు. అక్కడ ఉన్న గ్రంథాలయాలలోని పుస్తకాలన్నీ చదివారు. ఇలా ఉండగా ఒకనాడు పక్కింటావిడ ఒక కవి వ్రాసిన *మహాభారతం*లోని పేజీ చించి తన బిడ్డ మలాన్ని ఎత్తిపారేయుడం చూశారు. భావి కవి హృదయం ఆక్రోశించింది. వెంటనే ఆమెతో "ఏమ్మా! ఎప్పుడయినా చదివావా" అని అడిగారు. తల అడ్డంగా ఊపింది ఆ ఇల్లాలు. తానెప్పుడూ చదవలేదనీ, చదివినా అందులో భాషను అర్థంచేసుకొనే శక్తి తనకు లేదని, ఆమె అక్షర జ్ఞానం లేనిదానినని వాపోయింది. ఆమె సమాధానం కొవ్వలిలో ఆలోచన రేకెత్తించడమే కాక, ఆ క్షణంలో కొవ్వలి రెండే లక్ష్యాలను తన జీవితానికి నిర్దేశించుకొన్నారు.

"భాషని ఆకాశమార్గం నుంచి నేలమీదకు దింపాలని, గ్రాంథిక భాషలో ఉన్న సాహిత్యాన్ని, ఆనాటి కవులు ప్రజలపై రుద్దుతున్నారని, చదువుమీదకి మనసు పోని ఏ స్త్రీ అయినా సరే ఆమెచేత పుస్తకం పట్టుకుని చదివేటట్టు చేయాలని, అక్షర జ్ఞానం స్త్రీలకు, సామాన్యులకు చాలా అవసరమని, వారు మాట్లాడుకొనే వ్యవహారిక భాషలోనే తాను, తన రచనలను అందివ్వాలని ప్రగాఢ సంకల్పం పూనారు కొవ్వలి. సాహిత్యమంటే తెలియని అజ్ఞానం అధికంగా ఉన్న రోజులవి. దీనికి విరుగుడుగా కొవ్వలి సంకల్పం 'ఒక అక్షర యజ్ఞానికి పెద్ద వైజ్ఞానిక విప్లవానికి' నాందిగా చెప్పవచ్చు.

గ్రాంథిక భాషాశైలి నడుం విరగ్గొట్టే కవులింకా రాలేదు, వికాస యుగపు దశ అది. అందరికీ అందుబాటులోని వెలలో, సామాన్యులకు అందుబాటులోని వ్యవహార శైలిలో తన రచనలను అందించాలనే కంకణం కట్టుకొన్నారు కొవ్వలి. తనకంటూ ప్రత్యేకమైన బాణీని, వాక్యశైలిని లోకానికి

చాటాలని రచనా వ్యాసాంగమే తన జీవిత సర్వస్వంగా ఎంచుకొన్నారు కొవ్వలి. *పల్లెపడుచులు* నవలలో ఆనాటి జరుగుతున్న కాలం నుంచి దండి ఉప్పుసత్యాగ్రహంలో భర్తలతో, అన్నదమ్ములతో సమానంగా స్వాతంత్రోద్యమ కాంక్షతో ఉద్యమాలలో పురుషులతో సమానంగా ఆడవారు (స్త్రీలు) ఎలా పాల్గొన్నారో, వారి కింకర్తవ్యపు బోధను, గాంధీ ఆశయ లక్ష్యాలను తమ జీవితాలలో ఎలా నింపుకొన్నారో తెల్పారు కొవ్వలి. ఆర్థిక, సామాజిక, సాంఘిక సంఘర్షణలకు దర్పణంగా తన కలాన్ని ఎక్కుపెట్టారు కొవ్వలి.

అట్లే *పండుగ మామూలు* నవలలోని స్త్రీకి విద్యాబుద్ధులు అలవరచుకొంటే, తన స్వేచ్ఛా విచక్షణతో సంస్కారవంతమైన జీవితాలతో కులాంతర వివాహాలకు తమ స్వయం నిర్ణయాధికారాలను ఎలా నిర్ణయించుకోగలరో తెలిపారు. ఎలక్షన్‌లో కూడా పురుషులతో సమానంగా ప్రచారాలు చేయడం, గాంధీజీ సిద్ధాంతాలను అలవరచుకోవడం, ప్రతి ఇంట రాట్నాలు వడకడంలాంటివి ఎలా చేసేవారో చిత్రీకరించారు అరవింద పాత్రద్వారా. ఈ సమాజానికి స్త్రీ విద్య ఆవశ్యకతను చాటారు కొవ్వలి. *పగటివేషం* లో స్త్రీల కళాపిపాసను పెంచుకొని, విద్య నేర్చితే సమాజంలో నాట్యశాల పెట్టి ముందుతరానికి చక్కటి కళాకారులనందివ్వవచ్చు అని చెప్పారు. *ఆషక్* నవలలో వేశ్యవృత్తిని ఖండిస్తూ, వారి జీవితాలలో కూడా నీతి, నిజాయితీ, స్వచ్ఛమైన ప్రేమైక జీవనానికి తమ జీవితాలు ఎలా త్యాగం చేసుకొంటారో తెలిపారు. జాతినిబట్టి బుద్ధులుండవనే సత్యాన్ని లోకానికి చాటారు. వెర్రి వెంగళాయ్ పాత్రద్వారా మూఢనమ్మకాలతో వారి జీవితాలు ఎలా తారుమారవుతున్నాయో తెలిపారు. *పగటివేషం* నవలలోనే *కన్యాశుల్కం*తో మూడోపెళ్ళికి తెగబడి కన్న కూతుర్ని కడతేర్చే స్థాయికి ఎలా తెగబడ్డారో తెలిపారు. *పెళ్ళిచూపులు* నవలలో వరకట్న పిశాచి మధ్యతరగతి కుటుంబాలలో ఎలాంటి ఆత్మాహుతులు జరుగుతున్నవో లోకాన్ని హెచ్చరించారు. *తప్పేముంది* నవలలో అక్రమ సంబంధాలను నిరసించారు. *లంబోదర* నవల ద్వారా వయోవృద్ధ భేదాల వలన అనర్థాలు, యుక్తవయస్సులో ఉన్న కన్యలు పునర్వివాహాలకై అక్రమ సంబంధాలకు తెగబడుట చూపారు. *బ్రతకడమెందుకు* నవల ద్వారా సాటి మానవులను, అంటరానివారిని చేరదీసి, వారికి మానవత్వపు దృక్పథంతో ఎలా సేవచేయాలో చెప్పారు. *అలివేణి* నవల ద్వారా బాల్యవివాహాలను ఖండిస్తూ, వితంతు పునర్వివాహాలను సమర్థించారు. *ఇంతి చామంతి పూలబంతి, గంగ – యమున – సరస్వతి, ఇల్లరికం – మేనరికం – కోడంటికం* నవలల ద్వారా ఆనాటి సమాజపు పోకడలను యువతీయువకుల ప్రేమ త్యాగాలను పెద్దవాళ్ళ ఔదార్యాలను, ఛీత్కారాలను చిత్రించారు. *భయంకర్, జయశ్రీ, రాణి* పేర కొన్ని వందల డిటెక్టివ్ నవలలను వెలయించారు. కొవ్వలివారి 1001 నవలలు వేటికవే వస్తువైవిధ్యంతో కూడుకొన్నవి.

ఇలా కొవ్వలి నవలలు ఆనాటి సామాజిక జీవన చిత్రణకు నిలువెత్తు ప్రతిబింబాలుగా నిలిచాయి. అందరినీ అలరించే ఆమోదయోగ్యమైన నవలలు రచించిన రచనలను రసవత్తరముగా తెలుగునాట వెలయించి ప్రపంచ నవలా సాహిత్యానికే తలమానికంగా ఇంక ఎవరికీ సాధ్యంకాని శిఖర సమానంగా 4 దశాబ్దాలుపాటు అప్రతిహంగా అందించిన సాహిత్య సేవ చేశారు కొవ్వలి. దీనికి గుర్తుగా ఉస్మానియా, మద్రాసు, శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయాలు మాన్యతం పత్రాలు (ప్రశంసాపత్రాలు) ఇచ్చి గౌరవించాయి.

భారత ప్రభుత్వం విద్యాశాఖ కూడా ఆయనను గౌరవించింది. మద్రాసు హైకోర్ట్ న్యాయమూర్తి రామస్వామి గారు 'సాహిత్య నవలా సార్వభౌమ' అనే బిరుదును ప్రదానం చేశారు. ప్రఖ్యాత సినీ గాయకుల పి.బి. శ్రీనివాస్‌గారు కొవ్వలి వారిని *నవలల తాత* అని సంబోధించేవారు. పామరులకు పండిత భాష అర్థం కాని కాలంలో తన జన వ్యవహార భాషతో 1001 నవలలు సృష్టించిన కొవ్వలి తెలుగు సాహితీ వనంలో ఎన్నడూ వాడని కుసుమం అని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుర్లపాటి కుటుంబరావుగారు ప్రశంసించారు. 7, 8 దశాబ్దాల క్రితమే తెలుగునాట మామూలు పాఠక జనానికి చదువు రుచిని అలవాటు చేసి, అక్షర జ్ఞానాన్ని, సామాజిక జ్ఞానాన్ని తన నవలల ద్వారా భాషపై ఒక డిగ్నిటీని, అవగాహనను కల్పించిన అక్షర ఉద్యమకారుడు కొవ్వలి లక్ష్మీనరసింహారావు. తన పేదరికాన్ని హాలాహలంగా దిగమింగి, అక్షర ఉద్యమాన్ని ఉపాధికోసం దిగజార్చకుండా *వెయ్యి నవలలు – రచనలు* చేసిన యోధుడు కొవ్వలి లక్ష్మీనరసింహారావు అనే పేరు తెలుగు సారస్వతంలో ఉన్న *త్రయసింహాలు*గా చరిత్ర పరిశోధకుడు ఆచార్య నిడదవోలు వెంకట్రావ్‌గారు వెల్లడించారు. 1865లో పుట్టి తెలుగు వ్యాస సంకలనానికి ఆద్యుడు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారైతే,

1867లో పుట్టి హాస్య నవలలకి ఆద్యుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహారావు రెండోవారైతే 1912లో పుట్టి, తెలుగు నవలా సాహిత్య చక్రవర్తిగా భాసిల్లినవారు కొవ్వలి లక్ష్మీనరసింహారావుగారు మూడవవారిగా కలిసి త్రయసింహాలుగా అభివర్ణించారు.

60 ఏళ్ల క్రితం తెలుగు దేశంలో జనబాహుళ్యం కోసం, మధ్యతరగతి స్త్రీలకు ఆమోదయోగ్యంగా రచనలు చేసినవారు కొవ్వలి వారని నిర్మాత చక్రపాణిగారి ప్రశంస. తెలుగులో పఠనాసక్తిని పెంపొందించడానికి కృషి చేసిన వారిలో ప్రథముడు నా సోదర సమానులు కొవ్వలి వారని కొడవటిగంటి కుటుంబరావు చాటారు. రైళ్ళల్లోను, బస్సుల్లోను కొవ్వలి నవలల కల్పనా ప్రతిభకు, రచనా విధానానికి అల్లికల, పరిసరాలను, వాళ్ళను వాళ్ళు మైమరచిపోయి దిగవలసిన స్టేషన్ దాటిపోయేవారని అభినేత్రి భానుమతిగారు ప్రశంసించారు. ఇలా అక్షర పట్టాభిషేకానికి నీరాజనాలై, అలా ప్రతీ నవలా సామాజిక దర్పణానికి ప్రతిబింబాలుగా విరాజిల్లాయని ప్రశంసించారు పెద్దలు.

ద్రాక్షారామ భీమేశ్వరుణ్ణి దర్శించుకొన్న మరునాడు కుటుంబ సభ్యుల సమక్షంలోనే 1975 జూన్ 8న ఈ లోకం విడిచారు.

లింగాల రామతీర్థ
హైదరాబాద్. ఫోన్ : 986 636 2839.

---

# మా నాన్న కొవ్వలి లక్ష్మీనరసింహారావు

*– కొవ్వలి నాగేశ్వరరావు, కొవ్వలి లక్ష్మీనారాయణ*

**మా** నాన్నగారు వ్యాపార దృక్పథంతో నవలలు రాయలేదు. సాంఘిక చైతన్యం కోసమే రాశారు. ప్రత్యేకంగా స్త్రీలను ఉద్దేశించి సరళ శైలిలో రాశారు. అందరికీ అర్థమయ్యేలా నవలలు రాసి తెలుగువారిలో 'పఠనీయతను' పెంపొందించారు. మహాకవి దాశరథి కృష్ణమాచార్యులుగారు పలికిన మాటలు చాలు మా నాన్నగారి గొప్పతనానికి. "నా చిన్ననాడు 1940 ప్రాంతంలో నేను చిన్న తరగతుల్లో చదువుకుంటున్నప్పుడు మా ఊళ్ళో ప్రతివారి చేతుల్లో కొవ్వలి నవల కనపడింది. ఒక్క రాత్రిలో ఒక నవల అవలీలగా కొవ్వలి రచించేవారని చెప్పేవారు. ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో నవలా రచనకు విశిష్టమైన స్థానం ఉంది. అలాంటి ప్రక్రియను ఏనాడో చేపట్టి విజయవంతంగా నిర్వహించిన శ్రీ కొవ్వలివారు లక్షలాది ఆంధ్ర ప్రజల హృదయాల్లో స్థిరమైన స్థానం ఏర్పరచుకొన్నారు."

1912లో తణుకులో మా నాన్నగారు జన్మించారు. అయితే తండ్రిగారి వృత్తిరీత్యా రాజమహేంద్రవరంలోనే నివసించి రాజమహేంద్రవరం వాసిగానే చెప్పుకొంటారు. చిన్నప్పుడే మాతృవియోగం సంభవించటంతో తండ్రి పెంపకంలోనే పెరిగారు. పూటకూటి ఇంటి భోజనంతోనే పెరిగారు. పదహారు సంవత్సరాలు నిండేసరికి స్కూలు ఫైనల్ పరీక్ష రాశారు. మా నాన్నగారి ఆవేదన ఏమిటంటే కొంతమందికే అందుబాటులో ఉండేలా పుస్తకాల ధరలున్నాయి. సామాన్యులకి అందుబాటులో ఉండేలా తక్కువ వెలకు పుస్తకాలు అందించాలి. గ్రాంథిక భాషలో కంటే వ్యావహారిక భాషలో రాస్తే చాలామందికి అందుతాయి. ఫలితంగా కథలు, నవలలు రాయటం మొదలుపెట్టారు. ఆయన కలం నుంచి వెలువడిన మొదటి నవల "పల్లెపడుచు". దీనిని ప్రముఖ జాతీయకవి, తమ గురువు అయిన గరిమెళ్ళ సత్యనారాయణ గారికి చూపించి, వారి అభినందనలు పొందారు. గరిమెళ్ళవారు దానికి పీఠిక కూడా రాశారు. రెండవ నవల ''దాసీపిల్ల'' రాసి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారికి పంపి వారి ఆశీర్వచనమూ పొందారు. వారి ఉత్తరం వెయ్యి ఏనుగుల బలం ఇచ్చిందని ఒకచోట రాసుకొన్నారు. రాజమండ్రిలో ప్రముఖ ప్రచురణకర్త శ్రీ కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్‌వారు. వారు ప్రచురిస్తే మరింత ప్రచారం లభిస్తుందని ఒక నవల రాసి మా నాన్నగారు వారికిచ్చారు. వీర వెంకయ్యగారు దానిని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి అభిప్రాయం కోసం పంపితే వారు "భాషాద్రోహం చేసే ఇటువంటి రచనలు ప్రచురిస్తే వంశ క్షయం అవుతుంద"ని చెప్పారట. దాంతో ఆయన ఈ నవలను ప్రచురించటానికి సమ్మతించలేదు. అయితే ఇక్కడే ఒక మరపురాని సంఘటన జరిగింది. ఒకరోజున వీరాస్వామి అనే పోస్ట్‌మాన్ వచ్చి వీరవెంకయ్యగారి ఉత్తరాలూ అవీ ఇచ్చి పక్కనే వ్రాతప్రతిలో ఉన్న ఈ నవల తీసుకొని చదవటం ప్రారంభించాడు. గంటలు గడుస్తున్నా ఆ పోస్ట్‌మాన్ తన డ్యూటీ మర్చిపోయి నవల చదివి "దీనిని ప్రచురిస్తున్నారా?"

అన్నాడట. వీరవెంకయ్య గారు పండితాభిప్రాయానికి విరుద్ధంగా ఉండటం వల్ల ప్రచురించటంలేదన్నారట! కానీ వీరాస్వామి అనే ఆ పోస్ట్‌మెన్ ఈ నవల అచ్చువేస్తే బహుళ జనాదరణ పొందుతారని నొక్కి చెప్పారట! అప్పుడు వీరవెంకయ్యగారు ఆ నవలను ప్రచురించడం కాపీలన్నీ అమ్ముడు కావడం జరిగింది. ఆ నవల పేరు "ఫ్లవర్‌గరల్". దాంతో మా నాన్నగారిని పిలిపించి, మరికొన్ని రచనలు ఇమ్మని, పన్నెండు రచనలకు కొంత పారితోషికం ఇస్తామనీ చెప్పారు. అయితే మా నాన్నగారు తక్కువ వెల పెడితేనే రాసిస్తానన్నారు. అప్పటి నుంచి విరామం లేకుండా రాత్రింబవళ్ళు నవలలు రాస్తూనే ఉన్నారు. ఒక్క సంవత్సరంలో వంద నవలలు రాశారంటే ఎంత అద్భుతం! ఆశ్చర్యం!

అప్పట్లో తెలుగునాట కొవ్వలి పేరు రామనామంలా మార్మోగేది. ముఖ్యంగా స్త్రీ పాఠకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. "పాఠకులకు నేనేమి అందజేశాను? నాకు అంటూ ప్రత్యేకంగా కొంతమంది పాఠకులు ఏర్పడ్డారు. కనుక హృదయాన్ని ఆకట్టుకునే బరువైన రచనలు అందించాలని" పునరాలోచించారు. ఆనాటి సాంఘిక వాతావరణానికి, సాంఘిక దురాచారాల నిరసనకి ఈ నవలలు దర్పణాలు. కేవలం కాలక్షేపం కోసమే రాసినవి కావు. మా నాన్నగారి నవలలు ఎక్కువగా బస్‌స్టాండ్‌లో రైల్వే బుక్‌స్టాల్స్‌లలో విపరీతంగా అమ్ముడయ్యేవి. తినుబండారాలతోపాటు కొవ్వలి పుస్తకాలు కొనుక్కునేవారు. అందుకని కొందరు మా నాన్నగారి నవలలన్నీ "రైల్వే సాహిత్యం" అని చులకన చేశారు. షష్టిపూర్తి సంచికలో పండితులు, కవులు, విమర్శకుల అభిప్రాయాలు, వ్యాసాలు పరిశీలిస్తే మా నాన్నగారిపై "కాలక్షేప నవలా రచయిత" అనే ముద్రపడినందుకు దిగులు కలుగుతుంది. ఆయన నవలల్ని చదివి పరిశీలించిన వారు ఆ మాటలు అనలేరు! నిజానికి నవలలు అంటే పెద్దవి కావు. చిన్నచిన్న నవలలే! మా నాన్నగారు సినిమా రచనలు కూడా చేశారు. సినీనటి కన్నాంబకి అనుగుణమైన పాత్రతో సినిమాకి కథ రాయమంటే రాశారు. అది "తల్లి ప్రేమ" అనే సినిమాగా వచ్చి అప్పట్లో విజయవంతమైంది. ఆ తరువాత *స్త్రీ సాహసం, శాంతి, మా గోపి, బీదల ఆస్తి* వంటి వాటికి రచనలు చేశారు (శరత్ నవలలు తప్ప మరొకటి సినిమాలకు పనికిరావని ధోరణి సాగుతున్నప్పుడు డి.ఎల్. కొవ్వలి నవల సిపాయి కూతురును సినిమాగా తీశారు). "భయంకర్" అనే పేరుతో రాసిన సీరియల్ నవల "చాటుమనిషి" ఉగ్రరూతలూగించింది. ఆ తరువాత జానపద గాథ ఇతివృత్తంగా "విషకన్య" రాశారు. ఇంకా "రాణి" "జయశ్రీ" అనే కలం పేర్లతో కూడా రాశారు. 25 భాగాలు సీరియల్‌గల "జగజ్జాణ" ఆ రోజుల్లో గొప్ప పేరుపొందింది! ముప్పయి రెండో ఏట దామరాజు వారి ఆడబడుచు లక్ష్మీదేవిని వివాహమాడారు. మా నాన్నగారు మా అమ్మలో భార్యకంటే తల్లిని చూశారు. ఆమె లాలనలో, ఆప్యాయతలో మా నాన్నగారి కలం పరవళ్ళు తొక్కింది. మా నాన్నగారి రచనా విషయంలో సహకారం తప్ప ఎప్పుడూ జోక్యం చేసుకోవటంలేదు. మొదట్లో పబ్లిషర్స్‌తో మాట్లాడి నవల ఖరీదు పన్నెండు పైసలుగా నిర్ణయించారు. కొంత కాలానికి పావలా (ఇరవై అయిదు పైసలు) అయింది.

మా నాన్న ఇన్ని నవలలు రాసినా ధనార్జన చేయలేదు. ఏ పూటకి ఆ పూట గడుస్తోంది అంతే. ఎందుకంటే సంపాదన ఆయన దృష్టి కాదు. తాను చెప్పవలసింది ఉందనీ, *తెలుగువారిలో పాఠకుల్ని పెంచాలనీ,* వారిలో చైతన్యం తీసుకురావాలనీ మాత్రమే రాశారు. మా నాన్నగారు మాతో ఇలా అంటూ ఉండేవారు : "ఏరా! మీరెవ్వరూ వెయ్యి పుస్తకాలు రాయక్కర్లేదు. కనీసం వెయ్యి పేర్లు సృష్టించగలరా?" అని. నిజమే! అది మా వల్ల కానిపని. గుడిపాటి వెంకటాచలం గారు "ఆ రోజుల్లో కొవ్వలిని తమ కౌగిలిలో బిగించని ఆడపిల్లలుండేవారు కారు" అని చమత్కరించారు.

మా నాన్నగారు ఆత్మాభిమాని. ఎన్ని అవకాశాలొచ్చినా, సంపాదనకు వీలున్నా తన సిద్ధాంతాలతో రాజీపడకుండా స్వతంత్రంగానే జీవించారు. ఉన్నదాంతోనే తృప్తిపడే జీవితాన్ని గడిపిన ధన్యజీవి. ఆయనకి నలుగు సంతానం. కుమారులిద్దరినీ ఉన్నత చదువులు చదివించారు. ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేశారు. మా నాన్నగారు ద్రవ్యరూపేణా మాకు ఏమీ ఇవ్వకపోయినా కీర్తి ధనాన్ని సంపాదించి వెళ్ళారు. భార్య మరణించాక "మంత్రాలయం"వంటి ఆధ్యాత్మిక నవలలు రాసి రెండు సంవత్సరాలకే 1975 జూన్ 8వ తేదీన ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామి ఆలయంలో సంతానం సమక్షంలో కన్నుమూశారు. మా నాన్నగారు కారణజన్ములని భావిస్తూ ఉప్పొంగిపోతూ ఉంటాం.

*(మా నాన్నగారు - కీర్తిశేషులైన అరవైరెండుమంది సాహితీ ప్రముఖుల జీవిత విధానాలు - డా. ద్వా.నా. శాస్త్రి)*

# తెలుగు నాటకంలో రచయిత్రుల పాత్ర

*– ఎన్. తారక రామారావు*

"**నా**టకరంగం పూర్తిగా మగవాళ్ళ ఆధీనంలో ఉంది. నాటక రచయితలు, ప్రయోక్తలూ, విమర్శకులూ, అధ్యాపకులూ – అందరూ మగవాళ్ళే కనిపిస్తారు. నాటక రంగంలో నాటకానుభవము, నాటకపు విలువలు, ప్రమాణాలు, అన్నీ సంపూర్ణంగా పురుష స్వామ్యపు భావజాలం తయారుచేసిన చట్రంలోనే ఇమిడి ఉండటం ఆశ్చర్యం కాదు. సామాజిక, రాజకీయ సమస్యల్ని నాటక రంగంలోకి తీసుకొచ్చిన పురోగామి ప్రయోక్తలు కూడా స్త్రీల విషయం వచ్చేసరికి పురుష స్వామ్యపు దృష్టితోనే ప్రవర్తిస్తారు. స్త్రీవాద దృక్పథం కాదు కదా అసలు స్త్రీ దృక్పధానికి ఆ మాటకొస్తే, స్త్రీల భాగస్వామ్యానికి, ఏమాత్రమూ జాగా ఇవ్వని నాటకరంగమే, ప్రస్తుతం కూడా కొనసాగుతోంది.

తెలుగు నాటకరంగాన ఆడవాళ్ళ ప్రమేయం పరిమితం చేయబడుతూ ఉండటంవలన, గణనీయ సంఖ్యలో నాటకరంగాన ఆడవాళ్ళు లేరు. కవిత, కథ, నవలలాంటి సాహిత్య ప్రక్రియల్లో ఆడవాళ్ళ ప్రభావం ప్రస్ఫుష్టంగా ఉందిగానీ, నాటక రచనలో, ప్రముఖంగా ఆడవాళ్ళెవరూ, ప్రవేశించలేదు. స్త్రీల సమస్యలకు సంబంధించిన నాటకాలు కూడా పురుషుల ఆలోచనారీతులకు అనుగుణంగానే రూపొందుతున్నాయి. స్త్రీల సమస్యలన్నీ, నాటకాలలో ఇంకా పురుష దృక్పథంతోనే పరిష్కరింపబడుతున్నాయి.

**– డా. జయప్రభ**

*నాలుగో గోడ, తెలుగులో ఆధునిక నాటకం*

✧ ✧ ✧

డా. జయప్రభ వ్యక్తీకరించిన అభిప్రాయం, అక్షరసత్యం నాటికీ నేటికి. ఈ పరిస్థితులు కారణాలు ఏమిటి? అన్న అంశం పరిశీలిస్తే– ప్రపంచ నాటకరంగ చరిత్ర కొంచెం అవగాహన చేసుకోవాలి. మాతృస్వామ్య వ్యవస్త నుండి సమాజం పితృస్వామ్య వ్యవస్తగా రూపుదిద్దుకోవడంవల్ల స్త్రీ – దేవతగా, గృహలక్ష్మిగా పరిమిత కార్యక్రమాలకు బందీ అయింది. కుటుంబ పోషణ, పిల్లల్ని కనటం, పోషించటం, వారి అభివృద్ధికి కృషిచేయడంలాంటి పరిమితుల మధ్య స్త్రీ – సంగీతం, సాహిత్యం – లలిత కళలకు దూరమైంది – అన్ని దేశాలలో. ఆర్థిక రాజకీయ, సామాజిక, మతపరమైన అంశాలలో పురుషుల ఆధిపత్యం పెరిగింది. నియమాలు నిబంధనలు, సంప్రదాయం, ఆచారాలు – అన్న స్త్రీ స్వేచ్ఛకు, భావుకతకు బంధనాలైనాయి అనాది నుంచీ ఆధునిక సమాజం వరకు. కొన్ని మతసంస్థలు – స్త్రీలపై ఆంక్షలు విధించాయి. నాటకాలను వ్యతిరేకించాయి. గ్రీకు, రోమన్, ఈజిప్ట్‌లాంటి దేశాల సాహిత్యం – నాటకరంగ చరిత్ర పరిశీలిస్తే పురుషాధిక్యత ఎంతగా ఉందో అర్థమవుతుంది. నాటక రచయితలు, ప్రయోక్తలూ, నటులు అందరూ పురుషులే – స్త్రీల భాగస్వామ్యం అస్సలు లేదు. ఒకప్పుడు ఈజిప్ట్‌లో నటులు, గాయకులు, సాహిత్యకారులు ఏ విధమైన సాక్ష్యం చెప్పటానికీ అనర్హులని శాసనం ఉండేది.

ప్రపంచ సాహిత్యం పరిశీలిస్తే లేదా నోబెల్ ప్రైజ్ పొందిన సాహిత్యకారులను పరిశీలిస్తే నాటకరంగంలో ప్రముఖంగా ఎంతమంది స్త్రీలున్నారు? అందునా స్త్రీ నాటకరంగ రచయిత్రులెంతమంది ఉన్నారు? అసలు లేరనే చెప్పవచ్చు. ఇది ప్రపంచ చరిత్ర స్థూలంగా! భారతీయ – సాహిత్యం నాటకరంగ చరిత్ర పరిశీలిస్తే – సంస్కృత నాటకంలో పురుషాధిక్యతే ఎక్కువ. ఎక్కడా స్త్రీ రచయితలు – అందునా నాటక రచయిత్రులు లేరు. కారణాలు పరిశీలిస్తే 'నాటకాంతం సాహిత్యం'

***"శ్రీహర్షో నిపణఃకవి, పరిషదప్యేషా గుణగ్రామిణీ***
***లోకేహరిచ వత్సరాజ చరిత్రమ్ నాట్యె దక్షా వయామ్"***

అన్న లాక్షణికుల అభిప్రాయాలు కూడా రచయిత్రులపై ప్రభావం చూపించాయి, భయపెట్టాయి. పైగా వేదాలు స్త్రీలు, శూద్రులు చదవకూడదన్న ఆంక్షలు స్త్రీలలో ఉత్సాహాన్ని తగ్గించాయి. భారతదేశంలో కులవ్యవస్థ, కొంతవరకు స్త్రీలు నాటకరంగంలోకి రాకపోవటానికి కారణం. అంతేగాక 'నటవిటగాయకులు పంక్తిబాహ్యులు' అన్న సాంఘిక ఆంక్షలు, అవిద్య, బాల్యవివాహాలు, సతీసహగమనం, విదేశీ దండయాత్రలు, కొన్ని కులాల్లో అమలులో ఉన్న 'ఘోషా పద్ధతి' – ఇలా ఎన్నో కారణాలు స్త్రీలను నాటకరంగంవేపు రాకుండా చేశాయి. 'కూచిపూడి నృత్యం' ఈ మధ్య కాలందాకా పురుషులకే పరిమితం కావడం సత్యమేగదా! ఆధునిక తెలుగు నాటకం, శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు, శ్రీ గురజాడ అప్పారావు పంతులుగార్ల పుణ్యం,శ్రీ గిడుగు రామ్మూర్తి వ్యావహారికోద్యమం – 1940లో ఆంధ్ర నాటక కళాపరిషత్ ఆవిర్భవించింది. తెలుగు నాటక పునర్జననానికి నాంది పలకటం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆరుబయట రంగస్థలంపై ప్రయోగాత్మక నాటక ప్రదర్శనలు, సర్వశ్రీ అబ్బూరి రామకృష్ణారావు, పాకాల రాజమన్నార్, డా. కూర్మా వేణుగోపాలస్వామి, బళ్ళారి రాఘవలాంటివారి కృషి – ఇవన్నీ తెలుగు నాటకం ఎదగటానికి, సాంకేతికంగా అభివృద్ధి చెందటానికే తోడ్పడ్డాయి.

**ఇది గత చరిత్ర**

తెలుగు సాహిత్యంలో, తొలి తెలుగు రచయిత్రి 'మొల్ల' ఆ తర్వాత ముద్దుపళని. క్రీ.శ. 17వ శతాబ్దంలో శ్రీమతి పసుపులేటి రంగాజమ్మ 'మన్నారు దాసవిజయం' అనే యక్షగానం రచించి, తొలిరూపకం వ్రాసిన మహిళగా గుర్తింపు పొందింది. పద్యనాటక రచనలు పరిశీలిస్తే తొలి తరం రచయిత్రులు, కొందరు నాటక రచనలో తమ సామర్థ్యం చూపారు. అయితే ఈ నాటకాలన్నీ ప్రదర్శనకు నోచుకోలేదు. కారణం ప్రదర్శనాపద్ధతులపై వీరికి అవగాహన లేకపోవడం – భాష, సంభాషణలు గ్రాంథిక భాషలో ఉండటం ఒక కారణం.

1. శ్రీమత్ కాంచనవల్లి కనకాంబ

*అభిజ్ఞాన శాకుంతలము* (1929), *హంస విజయము* (1935)

2. శ్రీమతి జూలూరి తులశమ్మ

1. *గులేబకావళి*, 2. *పుష్పలీలావతీ నాటకం* (1909)

3. శ్రీమతి కందాళచూడమ్మ

1. *కమలాపరిణయము* (1918)

4. శ్రీమతి గుండు అచ్చమాంబ

1. *కాళహస్తీశ్వర కల్యాణోత్సవం* (1904)

5. శ్రీమతి పి. సీతాంబ

1. *సముద్ర మథనము* (1933), 2. *దిలీప* (1934)

6. శ్రీమతి కె. బాలసరస్వతి

1. *భక్తతుకారాం* (1937)

7. శ్రీమతి సీరము సుభద్రాంబ

1. *సురభి విజయము* (1934)

8. శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవి

1. *నర్మద* (1939)

9. నాటక సరస్వతి పేరున అజ్ఞాత రచయిత లేదా రచయిత్రి వ్రాసిన నాటకాలు 1. *వరవిక్రయము* (1925), 2. *రాధాకృష్ణ* (1921) 3. *మధుసేవ* (1928).

*తెలుగులో పద్యనాటకాలు, 20వ శతాబ్దం, తెలుగు నాటకం*

బ్రిటిష్ వారి పాలనలో క్రైస్తవ మిషనరీలు తెలుగు ప్రాంతాల స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేశాయి. దానితో అంతవరకూ విద్యకు దూరమైన స్త్రీలు పాఠశాలలు, కాలేజీలలో చేరడం – ఉద్యోగాల్లో ప్రవేశించడంవల్ల సమాజంలో చైతన్యం వచ్చింది. ఆంధ్ర మహిళా సభ, శారదానికేతన్ కృషి అపూర్వం. ఒకానొకనాడు గుఱ్ఱం జాషువా స్త్రీ విద్యకేగాక స్త్రీ రచనలనుగూడ ఆహ్వానించాడు.

***"కాంత మగవారితో చేయగలపకున్న / తలపనేల యనర్థంబు తప్పదనుచు భారత క్షోణిచిత్తంబు కోరగింప, వెలది / కలము పట్టినదినాటి వెలదిమిన్న"***

ఆధునిక తెలుగు సాంఘిక నాటక రచన చేసిన రచయిత్రుల్లో కనుపర్తి వరలక్ష్మమ్మ ప్రముఖురాలు. *మహిళా మహోదయం, పునఃప్రతిష్ఠ, లేడీస్ క్లబ్, రాధ పెళ్ళి, జీవనరాగం, జ్యోతి* నాటికలు వ్రాశారు. ఇందులో చాలావరకు ప్రదర్శితమైనాయి. దేశిరాజు భారతీదేవి నాటక రచన చేసినా, వెలుగులోకి రాలేదు. ప్రచురణ కాలేదు. పాలగుమ్మి సుమతి *తెగని బంధాలు* నాటిక 1955లో నవ్యసాహితీ సమితి నిర్వహించిన నాటికల పోటీలలో ద్వితీయ బహుమతి పొందింది. పొన్నలూరి పద్మావతి (1974) రచించిన *మరబొమ్మలు* నాటికలో ఇతివృత్తాన్ని ఒక యధార్థ సంఘటనతో జోడించి, స్త్రీల మనోధైర్యాన్ని ప్రతిబింబించేలా రచన సాగింది. మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్ *ఇంటర్వ్యూ*,

డి. సుజాతాదేవి వ్రాసిన *పరమార్థము, తనదాకా వస్తే* నాటికలు సమాజంలో స్త్రీలు – పెళ్ళి, ఉద్యోగం – సంప్రదాయం – ఆరోగ్య సమస్యలు మొదలైన సమస్యలు ప్రస్తావించడం జరిగింది.

కురుమద్దాలి విజలయక్ష్మి *ముళ్ళల్లో గులాబి,* రాయప్రోలు హైమ *కొత్త కోడలు,* ఇల్లిందల సరస్వతీదేవి, న్యాయపతి కామేశ్వరి బాలల కోసం నాటికలు వ్రాశారు. వాసిరెడ్డి సీతాదేవిగారు రంగస్థలంపై నటించిన అనుభవం ఉంది. ఆమె *గ్రహబలం, ఇంద్రదర్బార్, గాలి* అనే నాటికలు రంగస్థలం మీద ప్రదర్శనకు అనువుగా వ్రాశారు. డా. వాసా ప్రభావితిగారు, దువ్వూరి సుబ్బమ్మగారు ఉద్యమ స్ఫూర్తితో *దేశ భారతీదేవి* కాక *సంఘం చేసిన భిక్షుణి, కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త* లాంటి హాస్య, వ్యంగ్య నాటికలు వ్రాశారు. మాదిరెడ్డి సులోచనగారు *అమ్మకానికో అబ్బాయి – కొనటానికో అమ్మాయి* నాటకంలో వరకట్న సమస్యను హృద్యంగా చెప్పారు. ఇది ప్రదర్శితమైంది. ఆకాశవాణి – దూరదర్శన్ – తదితర మాధ్యమాలు విరివిగా జనబాహుళ్యంలోకి వచ్చాక చాలామంది రచయిత్రులు నాటక రచనా ప్రక్రియలో ప్రవేశించారు. అలాంటివారిలో శారదా అశోకవర్ధన్ ప్రముఖ రచయిత్రి. *పిసినారి భార్య – రోగిష్టి భర్త, మళ్ళీ వచ్చిన వసంతం, మనసున్న మనిషి, మబ్బుతెర, కుంతీ పుత్రిక, ఆఫీసరు భార్య* – ఇలా అటు ఆకాశవాణికీ రంగస్థలానికీ అనువుగా ఎన్నో నాటికలు వ్రాశారు. *మబ్బుతెర* నాటకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం అందుకున్న రచయిత్రి శారదా అశోక్ వర్ధన్. ఆధునిక రంగస్థలానికి అనువుగా నాటకాలు వ్రాసిన డా. చిల్లర భవానీదేవి, *బొబ్బిలి యుద్ధం* నాటకం అనేక ప్రదర్శనలు పొందింది. ఇంకా *స్వయంవరం లో సరిగమలు, చిరజీవనం, క్విట్ ఇండియా* మొదలైన నాటికలు వ్రాశారు.

అత్తలూరి విజయలక్ష్మి *మ్యాచ్‌ఫిక్సింగ్* బహుళ జనాదరణ పొందిన నాటిక. *అంతర్మథనం, రంగస్థలం, మేమూ మనుషులమే* లాంటి అనేక నాటకాలు వ్రాసిన విజయలక్ష్మి, *ఉత్తరం* నాటకం రసరంజని, హైదరాబాద్ వారి నాటక రచన పోటీల్లో బహుమతి పొందింది. *వాళ్ళు ఆరుగురు* నాటిక ద్వారా ఓల్గా నాటక రచయిత్రిగా, కూడ తన ప్రతిభ కనపరిచారు. చలం సృష్టించిన స్త్రీ పాత్రలలో కొన్నింటిని, రంగస్థలంమీద ఆవిష్కరించి ఆ పాత్రల స్వరూప స్వభావాల పరిణతిని నాటిక ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఆకాశవాణి ద్వారా ఎందరో రచయిత్రులు నాటికలు వ్రాశారు. వారిలో తురగా జానకీరాణి ఒకరు. *నీ జీవితం నాకు కావాలి* అనే నాటికల సంపుటిని ఆమె ప్రచురించారు.

ఏ. శ్యామలాదేవి, గోవిందరాజు సీతాదేవి, డి. కామేశ్వరి, వేదుల శకుంతల, రంగనాయకమ్మ, బీనాదేవి లాంటి కథ, నవలా రచయిత్రులు – ఆకాశవాణి ద్వారా తమ నాటికలను ప్రచారం చేశారు.

హిందీ, తమిళం, కన్నడ భాషల నుండి తెలుగు నుండి ఇతర భాషలలోకి నాటకాలను అనువదించినవారిలో అత్తిలి పద్మావతీకృష్ణ, సి. భార్గవీరావు, మొదలి సరస్వతి, యల్లంరాజు సరోజ నిర్మల, ఆర్. శాంతసుందరి, తెన్నేటి సుధాదేవి, ఝాన్సీ కె.వి. కుమారిలాంటి విశిష్ట రచయిత్రులన్నారు.

ఆకాశవాణి ద్వారా నాటికలు వ్రాసిన వారిలో బలభద్రపాత్రుని రమణి, డి.బి. లక్ష్మి, కొండేపూడి నిర్మల, కె. ఉషారాణిలాంటివారి కృషి ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

తెలుగు నాటక రంగంలో, రచయితలు చాలా తక్కువగానే ఉన్నారనేది నిర్వివిదాంశం.

*ఈ సందర్భంలో డా. చి. భవానీదేవి గారి అనుభవ సారాంశం గమనించతగ్గది. "స్త్రీలు నాటకాలు రచించగలరు కానీ ప్రదర్శితం కాని నాటకానికి సార్థకత లేదు నాటకాలను పత్రికలు ప్రచురించవు. నాటక ప్రదర్శన అత్యంత ఆర్థిక భారంతో కూడిన పని. రచయిత్రులు రాసిన నాటకాలు సంపుటాలుగా ప్రచురించడం కూడా వ్యయప్రయాసలతో కూడిన పని. పరిషత్తు నాటకాల్లో రచయిత్రుల నాటకాలు చోటుచేసుకోకపోవటానికి అక్కడ ఉండే ప్రత్యేక పురుషాధిపత్య ప్రపంచం పరిస్థితులే కారణమని అందరికీ తెలుసు."*

**రచయిత్రులను నాటకాలు రాయకుండా ఎవరూ ఆపలేదు, ఆపలేదు కూడా! ఈ దిశగా ఆలోచిస్తే నాటక రచయిత్రులు ఎక్కువమంది లేకపోవటానికి కారణాలు వెతకవలసిందే.**

ఎన్. తారక రామారావు
హైదరాబాద్.
ఫోన్ : 040 - 238 338 78.

# అధ్యక్షోపన్యాసం

## (ఏడవ దశకం నాటకం)

– కూర్మా వేణుగోపాలస్వామి

**నాటక కళోపాసకులారా!**

**70** సంవత్సరం నాట్య కళా పరిషదధ్యక్ష స్థానానికి నన్నాహ్వానించిన మీ అందరికీ నా ధన్యవాదాలు. ఈ గౌరవం సామాన్యమైనది కాదు. ఔచిత్యాన్ని పాటించి మీరిదివరలో ఆంధ్రప్రేక్షక లోకానికి చిరపరచితులైన ఉత్తమ నటులనే ముఖ్యంగా ఈ స్థానానికి ఆహ్వానించి యున్నారు. కాని, అప్పుడప్పుడు కొందరు కృతికర్తలూ, నాట్యకళాపోషకులూ, ప్రజాసేవాపరాయణులూ, యీ జ్ఞానాన్ని అలంకరించి యున్నారు. ఈ నలువురికి ఉన్న గుణగణాలుకాని, అధికారంగాని నాకు లేవని నేనెరుగుదును. అయితే చిరకాలం నుంచీ పరిషత్తుతో సన్నిహితమైన సంబంధం నాకు లేకపోలేదు. సాధారణ సభ్యుడుగా, కోశాధికారిగా, ఉపాధ్యక్షుడుగా, నాటక ప్రయోగ నిర్ణేతగా పరిషత్కార్యక్రమంలో వ్యవహరిస్తూనే ఉన్నాను. కాని యీ కారణాలవల్లనూ, వ్యక్తిగతంగా నాయందు కల ఆదరాభిమానాలవల్లనూ, నన్నీనాడు గౌరవించడం లేదని ననేనుకుంటాను. కడచిన తొమ్మిదేళ్ళనుంచీ నిర్విరామంగా ఆంధ్ర కళాపరిషత్తులో సాగుతూ ఉన్న నాటకోద్యమంతో, నాకుగల సంబంధమే ఈ గౌరవానికి కారణమని నేను భావిస్తున్నాను. విశాలమైన తెలుగు సామాజిక లోకానికి వినోదాన్ని కల్పించే నాటక సంస్థలను మూడుగా విభాగింపవచ్చును. నాట్యమే జీవనముగా అవలంబించి వ్యవహరించువారందరూ ఒక విభాగమునకు చెందినవారు. వీరిని నాట్య వ్యావహారికులనిగాని, వాచిక సౌలభ్యం కోసం వ్యావహారికులనిగాని అనవచ్చును. రెండవ విభాగానికి చెందినవారికి లాభంతో నిమిత్తం లేదు. కేవలం కళాప్రియత్వమే వీరికి ప్రధానము. వీరిని కళాభిలాషులని పిలువవచ్చును. మూడవ విభాగమున విశ్వకళాపరిషత్తులకు అనుబంధంగా నిర్వహించే నాటక సంస్థలను పరిగణించక తప్పదు.

**వ్యావహారిక రంగస్థలం** (Professional Theatre) :

దేశాంతరాలలో చాలావరకు వ్యావహారిక రంగస్థలమే ఉత్తమంగా కనిపిస్తున్నది. ఆ దేశాలలో కళాభిలాషుల (Amateurs) ఎడల, వ్యావహారికులకు నిరాదరణ మెండు. తిరస్కార భావం కూడా ప్రబలంగా ఉందని చెప్పవచ్చు. ఏదో ఒక వృత్తిని సమర్థతతో నిర్వహించుకొనగలవానికి, తన్మూలంగా తన జీవనాన్ని సంపాదించుకోవడం సహజమైన పని. ఆ కారణంవల్ల వ్యావహారిక నటులలో ఉత్తమ శ్రేణికి చెందినవారంటే నాకు చాలా గౌరవం. వారు కల్పించే వినోదం అసల్పమని ఒప్పుకోక తప్పదు. సులభ సాధ్యమైన సంగీతంతో, శ్రావ్యమైన పద్యపఠనంతో, వ్యావహారిక నాటక రంగాలు ఉత్తమమైన ప్రజావినోదాన్ని కల్పిస్తున్నవి. ఆంధ్ర నాటక రంగంలో చిరపరిచితులైన స్వర్గీయ హరిప్రసాదరావు, ముంజులూరి కృష్ణారావుగార్లున్నూ, నేటివారిలో డి.వి. సుబ్బారావు, స్థానం, బందా, మాదవపెద్ది ప్రభృతులు, పద్యపఠనంలోనేగాక, నటనలో కూడా ఆరితేరినవారు. అట్టివారికి నా నమస్కృతి. కాని వ్యావహారిక రంగస్థలంలో అభినయానికి అంతగా ప్రాముఖ్యం ఉన్నట్లు కనిపించదు. నిరక్షరాస్యులైన సాధారణ సామాజికుల అల్పసంస్కారానికి అనుగుణంగా నటించి, ఉత్తమ నాటక మర్యాదలనుగాని, రంగప్రసాధనాన్ని గాని పాటించడంలేదు. కొంత మంచి సంస్కారమూ, ప్రజ్ఞా కల యువకులు కొందరు ఇందులో లేకపోలేదు. కాని వారు ఏమాత్రం విగ్రహపుష్టి ఉన్నా అచిరకాలంలోనే చలనచిత్ర వ్యామోహంవల్ల, నాటకాలకు స్వస్తిచెప్పి సినిమాలలో చేరుతున్నారు. ఈ విధంగా పోయినవారు పోగా మిగిలినవారిలో అభినయ చాతుర్యంగాని, రంగశిల్ప నైపుణ్యంగాని లేక, వ్యావహారిక నటబృందం నానాటికీ క్షీణిస్తూంది.

**కళాభిలాషిసంఘాలు** (Amateur Associations) :

ఆంధ్రదేశంలో మొదటినుంచీ, కళాభిలాషుల ప్రభావం చాలా యెక్కువగా కనిపిస్తుంది. ధర్మవరం కృష్ణమాచారి, రాఘవ మొదలైన నాట్యకళాభిలాషులు, పాశ్చాత్య ఖండములలోని ఉత్తమ సంప్రదాయముల ననుసరించి మన దేశమున కేవల కళాదృష్టితో సర్వాంగసుందరముగ రంగస్థలమును నిర్మించుటకై యెడతెగని కృషిచేసియున్నారు. నేడు నాట్యకళాపరిషత్సౌధమునకు తెనుగుదేశములోని, వివిధ ప్రాంతములకు చెందిన యీ కళాభిలాషులే మూలస్తంభములుగా నిలిచియున్నారు. వారి ప్రయత్నమే

భవిష్యదాంధ్ర నాటక వికాసానికి దారితీస్తుందని నా విశ్వాసం. కాని వారు శ్రమప్రయాసలకు లోనై ప్రవర్తింపవలసి వస్తున్నది. వారికి ధనము లేదు. చేరదీసిన నట బృందమునందు సర్వవ్యాప్తమైన ప్రజ్ఞ లేదు. స్త్రీ పాత్ర నిర్వహణానికి వ్యావహారిక రంగస్థలంలోని నటీమణులనే ఆశ్రయింపవలసి వస్తున్నది. ఇచ్చట కూడా సినిమా వ్యామోహంవల్ల నటులు తరచుగా నాటక రంగాన్ని పరిత్యజిస్తున్నారు. ఇది యువకులకు సహజ లక్షణమే కావచ్చును కాని, కళాభిలాసి సంఘాలకు తీరని అపచారమని చెప్పక తప్పదు. ఎందరు పరిత్యజించిననూ, కళాభిలాషుల యుత్సాహము సన్నగిల్లదనీ, మున్ముందు వారి శ్రమ ఫలించి ఉత్తమ ఆంధ్ర నాటకరంగం ఆవిష్కృతం కాగలదనీ నా అభిప్రాయం.

**విశ్వ కళాపరిషత్తు – పరిశోధక నాట్యమండలి**

(Varsity Experimental Theatre) :

విశ్వ కళాపరిషన్నాట్యమండలి నాట్యకళా పరిషత్తునకు శాఖగా వ్యవహరించుటకు వీలు లేదు. ఇందుకు రెండు కారణములున్నవి. ఒకటి నేటి పరిస్థితుల ననుసరించి, యీ రంగస్థలంమీద స్త్రీలు – విద్యార్థినులుగాని ఇతర నటీమణులుగాని – స్త్రీ పాత్రల నభినయింపరాదని యొకనిషేధమున్నది. ఇందువల్ల, నాట్య కళా పరిషత్తు పోటీలలో వీరికి పాల్గొనే అవకాశం కూడా లేకపోయింది. రెండవ కారణం – విశ్వ కళా పరిషత్తు యాజమాన్యమున లేని యే సంస్థలతోనూ పొందుపెట్టుకొనుటకు చట్టము సమ్మతించదు. ఇటువంటి సన్నిహిత సంబంధం సాధ్యం కాకపోయినా, అన్యోన్య సహకారం పెంపొందించడానికి మాత్రం యే ఆటంకమూ ఉండదు. నేటి నా సభాధ్యక్షతకు అడిగిన వెంటనే అత్యంతాదరముతో విశ్వకళాపరిష దుపాధ్యక్షులొసగిన అంగీకారమే తార్కాణము.

విశ్వ కళా పరిషన్నాట్య సంస్థ కేవలం పరిశోధక (Experimental) సంస్థ కావడంచేత, క్రొత్తక్రొత్త నాటకాలను ప్రయోగించడానికి అవకాశం కలుగుతున్నది. దీనికి విశేషంగా ధన సాహాయ్యం అవశ్యకం కాదు. కాబట్టి ప్రదర్శనాలకు ప్రవేశ శుల్కం లేదు. ప్రేక్షకులందరికీ ఉచితం. శబ్ద గ్రహణావిష్కరణలకూ, తేజః ప్రసారాలకూ, చిత్రారోహణకూ అనుకూలించే యంత్రసామగ్రి సంపూర్ణంగా అందుబాటులో ఉండటంవల్ల, నాటక ప్రయోగం సలక్షణంగా సాగుతున్నది. అధ్యాపక వర్గంలోని వివిధ శాస్త్ర ప్రవీణుల సహకారం లభ్యమౌతున్నది. సాధారణంగా ఏకాకం నాటకాలే ప్రదర్శించినా, అప్పుడప్పుడు సంపూర్ణ నాటకాలు కూడా ప్రయోగించటం జరుగుతూ ఉంది. ఈ ప్రయోగాలలో వ్యక్తం అవుతున్న ప్రావీణ్యమూ, రంగప్రధానమూ, నేపథ్య రచనా నైపుణ్యమూ, విదేశములందలి ఉత్తమ మర్యాదలతో తులతూగజాలియున్నవి. ఇటీవల నటావతంస శ్రీ బందా కనకలింగేశ్వర రావుగారిచే ప్రసాదింపబడిన "నటరాజ విగ్రహం"వల్ల, విద్యార్థి లోకంలోని నాటకోత్సాహము అధికమైనది. బహూకరణము "ఉత్తరు నాటక బృందము"నకు ప్రతి సంవత్సరమూ బహుమతిగా యీయబడుతుంది. అభినయ చాతురికి ప్రత్యేక బహుమానము – ఈ బహుమతి ప్రదానమునకు నటనా ప్రావీణ్యమే కొలబద్ద. ఈ విషయాన్ని అనుసరించి, యీ సంవత్సరం పట్టుమని పద వాక్యములైనా లేని పాత్రను నిర్వహించిన నటునకు కేవలం అభినయౌచిత్యమును పాటించి బహుమతి యీయబడినది. ఇదిగాక రంగాలంకరణానికీ, నేపథ్య రచనకూ, నిర్వహణకూ వేర్వేరు బహుమతులున్నవి.

పైన ఉదహరించిన విభాగాలు పరస్పర విరుద్ధాలు కావు. అవియన్నియూ అన్యోన్య సహకారంతో తమతమ ప్రాబల్యాన్నీ ప్రాముఖ్యాన్నీ పెంపొందించుకోవచ్చు.

వ్యావహారిక నాట్య పరిశీలనంవల్ల, ఇతరులు, అభినయ మర్యాదలూ, రంగభూమియందు ప్రవర్తించే పద్ధతులూ, స్వర సంయమక్రమం (Voice Control) మొదలైన ముఖ్యాంశములు గ్రహించవచ్చును. కళాభిలాషులకుగల సదుపాయములు వేరు. వారికి లాభాపేక్ష లేదు. స్త్రీ పాత్రల నిర్వహణంలో విధి నిషేధాలు లేవు. ధన మాశించి నిరర్థకాలైన నాటకాలు ప్రదర్శించవలసిన బాధ లేదు. విశ్వకళాపరిషత్తు ప్రదర్శనాలు చూడడంవల్ల, నేపథ్య రచనా, వేషధారణా, రంగాలంకరణం తేజోవర్ణ శబ్దసంయోజనమూ, ఇవిగాక విద్యార్థి బృందంలో కనిపించే సుశిక్షణ, పూర్వప్రయోగ (Reharsal) పద్ధతులవల్ల కలిగే సాముదాయక కృషీ, నేర్చుకోవచ్చు. ఈ విధంగా మూడు తెగల నుంచీ నేర్చుకోవలసిన గుణపాఠములెన్నో ఉన్నవి. భవిష్యదాంధ్ర నాటక వికాసానికి ప్రధానంగా యే సంస్థ సహాయభూతం కానున్నదో, మనం నిర్ధారణ చేసి చెప్పలేముకాని, తెలుగు రంగస్థలంలో నూతన చైతన్యం కలిగించడానికి మనమందరమూ గమనింపదగిన కొన్ని ముఖ్యవిషయాలను కొంత పరామర్శిస్తాను.

**క్రొత్త నాటకాలు :**

నిర్వాహకులూ, అధిక సంఖ్యాకులైన నటులూ, సామాజికులూ క్రొత్త నాటకాల కోసం ఉత్కంఠతో నిరీక్షిస్తున్నారు. సుస్థిరంగా మనదేశంలో పాదుకొన్న పూర్వ నాటకాలపై మనకెంత అభిమానం ఉన్నా, తెనుగు నాటకం క్రొత్త బాటలు త్రొక్కి, నూతన రంగ పరికరాలతో, నవీన పద్ధతులతో నేటికాలపు అభ్యుదయ భావాలకనుగుణంగా పురోగమించాలని కోరనివారుండరు. మన కృతికర్తలందరూ ప్రదర్శన యోగ్యంగా క్రొత్త పద్ధతులతో నాటకాలు వ్రాసి, యీ కొఱతను తీరుస్తారని నేనాశిస్తున్నాను.

కొన్ని సంవత్సరాల క్రిందట, ఉత్తమమైన క్రొత్త తెనుగు నాటకానికి మన పరిషత్తు వేయినూటపదార్లు బహుమానంగా ప్రకటించింది. కాని యీ ప్రకటనను అనుసరించి పంపిన నాటకాలలో ఒక్కటి కూడా సలక్షణంగా లేకపోవడంవల్ల, బహుమాన ప్రదానం జరగలేదు. దీనికి కారణం, 1934లో రచయితలకు అభినవ నాటక రచనా పద్ధతులు సమగ్రంగా తెలియకపోవటమే. ఇప్పుడు ఆ స్థితి మారినది. ఇటీవల పరిషత్సమావేశాలలో ప్రదర్శించిన నాటకాలు యీ రచనా నైపుణ్యాన్ని యెక్కువగా వ్యక్తం చేయగలిగినవి. ఈ బహుమానాన్ని ఈనాడు పునరుద్ధరించినట్లైతే, ఉత్తమ నాటకం తప్పక మనకు లభిస్తుందని నా గట్టి నమ్మకం.

నాకు ప్రత్యేకంగా ఏకాకం నాటకాలపై అభిమానం. ఈ సంవత్సరంలో రచించిన ఉత్తమ ఏకాంయిక నాటికకు నూటపదార్లు పారితోషికం యీయదలచి, నా యీ నిశ్చయాన్ని యీ సభామధ్యంలో ప్రకటిస్తున్నాను. ఈ విధంగా నిర్లిప్తమైన నాటకం ప్రదర్శించటానికి కూడా నేను పూనుకొంటాను – అధికంగా స్త్రీ పాత్రలు లేకపోతే. ఇదేవిధంగా మరొక చిన్న బహుమానం విశ్వ కళా పరిషత్తులోని విద్యార్థులకు ప్రత్యేకంగా బహూకరించటానికి నిశ్చయించాను.

**రంగసామగ్రికి సంబంధించిన వృత్తాంతము :**

నేటి నాటక ప్రయోగ పద్ధతిలో ఒక పెద్ద లోటు కనిపిస్తుంది. వివిధ నాటకములలో, దేశ కాలానుగుణంగా ఉద్దేశింపబడ్డ ఆచార మర్యాదలూ, వేషాలంకారాలూ వీటిని గురించిన వృత్తాంతం మనకు లభ్యం కావడంలేదు. చారిత్రక నాటక రచనకు మనదేశంలో ఎంతో అవకాశం ఉంది. నాటక యోగ్యాలైన చారిత్రక సన్నివేశాలు ఎన్నో ఉన్నవి. కాని ఇలాంటి నాటకాలను సులక్షణంగా ప్రయోగించడానికి కావలసిన సామగ్రి అందుబాటులోలేదు. ఈ లోపాన్ని తీర్చేనిమిత్తం ఈ క్రింది విషయాలను గురించి చారిత్రకమైన జ్ఞానాన్ని సేకవరించవలసి ఉంటుంది. 1. వస్త్రధారణ విధానము, శిరోవేష్టన పద్ధతి, వేషసంస్కారం, వివిధాలంకార రీతులు, 2. నానావిధ అస్త్రశస్త్రములు, శకట, వాహనాలు, 3. శిల్పపద్ధతి, బహిరంతర గృహాలంకరణాలు, సుఖాసనములు, శయ్యలు, గృహోపకరణములు. ఈ వృత్తాంతం సమగ్రంగా సేకరించడం సాధ్యమేనని, ఈ శాఖలో సుశిక్షితులైన అడివి బాపిరాజువంటివారు నమ్ముతున్నారు. దీనికి వ్యయమూ, ప్రయాసా ఎంతైనా కావలసి ఉంటుంది. ప్రభుత్వ సహాయంవల్లా చలనచిత్ర నిర్మాతల ఔదార్యంవల్లా ఈ పని త్వరలో నెరవేరుతందని ఆశిస్తాను. ఇందువల్ల, లభ్యంకాబోయే విజ్ఞానం ముఖ్యంగా చలనచిత్ర నిర్మాతలకు లాభదాయకంగా ఉండి తీరుతుంది. కాబట్టి, వారే ఈ మహత్కార్యానికి తోడ్పడాలి.

**జాతీయ నాట్య మందిరము – నాట్య విద్యాకేంద్రము**

ఈ రెండు సంస్థలనూ స్థాపించే నిమిత్తం మన అధ్యక్షులైన శ్రీశ్రీ ఉయ్యూరు కుమార రాజావారి ఆధ్వర్యాన ఒక కమిటీ ఆంధ్రదేశమందలి అన్ని ప్రాంతాలూ పర్యటించిన సంగతి మీ అందరికీ విశదమే. ఆ కమిటీ నివేదిక ప్రభుత్వమునకు సమర్పించినా ఇంతవరకూ ప్రకటితం కాలేదు. ఈ సందర్భంలో, ఈ విషయాన్ని పురస్కరించుకొని కొంత విమర్శింపక తప్పదు. జాతీయ నాట్యమందిర నిర్మాణావశ్యకతను గూర్చి భిన్నాభిప్రాయములు లేవు. ఆంధ్ర రాష్ట్రమునకు సంబంధించినంతవరకు విజయవాడయే ప్రధాన కేంద్రమని అంగీకరించక తప్పదు. నాట్య విద్యా కేంద్రం (Academy of Dramatic Art) కూడ జాతీయ నాట్య మందిరానికి అనుబంధంగానే ఉండి తీరవలెనని నా అభిప్రాయం. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు యాజమాన్యమున ఒక నాట్యకళాశాఖ నిర్మించాలని మొదటినుంచీ కొన్ని సూచనలు అనేకులు చేస్తూవచ్చారు. దీనిని గురించి క్రీ.శే. శ్రీ రాఘవ 1930 నాటికే ఒక చిత్తు ప్రణాళికను పంపిన సంగతి మనమెరుగుదుము. దీనిననుసరించి పరిషత్కార్యవర్గము 1930 నాటికి ఒక కమిటీని నియోగించింది. దీని పర్యవసానం యేమైనదో తెలియదు. ఈలాటి శాఖలు అమెరికాలోను, ఇంగ్లండులోను కొన్ని

విశ్వవిద్యాలయాలలో నెలకొల్పటం అందరికీ తెలిసిన విషయమే కాని ఈ విషయాన్ని సుదీర్ఘంగా మననం చేసిన తర్వాత నాకు తోచినదేమంటే, ఈ విద్యా కేంద్రాన్ని ఫ్రాన్స్ దేశంలోవలె నాట్యమందిరానికే అనుబంధంగా నిర్మించటం సమంజసమని, ఈనాటి సాంఘిక వ్యవస్థలో ఈ మార్గమే సవ్యమైనదని నా ఊహ. ఇచ్చట సమావిష్టులైన విజ్ఞులందరూ, దీనిని సమగ్రంగా చర్చిస్తారని విశ్వసిస్తున్నాను.

**పురపాలక నాట్యశాలలు :**

జాతీయ నాట్యమందిర నిర్మాణమటుంచి, ముఖ్యంగా ప్రతి పట్టణంలోనూ ఒక సుప్రతిష్టితమైన నాట్యశాల ఎంతో ఆవశ్యకం. ఇప్పటి చలన చిత్రశాలలు నాటక ప్రదర్శనాలకు ఏ మాత్రము అనుకూలించుటములేదు. ఉత్తమ నాటక ప్రదర్శనాలవల్ల కలిగే వినోదాన్ని ముఖ్యంగా భావించే ప్రతి పురపాలకాధికారీ, యీ నిర్మాణానికై గట్టి కృషి చేయవలసి ఉంటుంది. పట్టణమందలి జన సంఖ్యనుబట్టి, 200 మొదలు 1010 మందివరకు సుఖంగా ఆసీనులగుటకు చాలిన నాట్యశాలలు నిర్మించాలి. ఈ శాలలు స్థానిక నాటక సమాజములకుగాని, పట్టణాంతరముల నుంచి పర్యటించ వచ్చిన సమాజములకుగాని, మితమైన బాడుగకు ఇస్తూ ఉండాలి.

**నాట్యగోష్ఠి** (Little Theatres) :

మన కళాభిలాషులందరికీ నాట్యగోష్ఠీ పద్ధతులే మార్గదర్శకాలు కాదగ్గవి. నా మిత్రులైన అబ్బూరి రామకృష్ణరావుగారు 1940 సంవత్సరంలో తలపెట్టి శ్రమించిన ఈ నాట్యోద్యమం, అకాలపరిణతమైనందువల్లనూ, ఆంధ్ర సామాజిక లోకంలో నూతన నాట్య పద్ధతులను గ్రహించటానికి సంసిద్ధత లేనందువల్లనూ, ఉద్దిష్ట ఫలాన్ని పొందలేకపోయింది. కొప్పరపు సుబ్బారావుగారు 1945లో నా అధ్యక్షతను నెలకొల్పిన తెనుగు లిటిల్ థియేటర్ ఉద్యమం ప్రారంభంలో ఉద్దేశించిన లక్ష్యాలను సాధించలేకపోయినది. కాని ఈ ఉద్యమంలో, నా విశ్వాసం ఇంకా గాఢంగానే ఉంది. మన కళాభిలాషులు, అల్పసంఖ్యాకులైన సంఘసభ్యులకే ఉద్దేశించి, కొద్ది ప్రయత్నంలో, తమతమ పట్టణములలోనే ఒక్కొక్క నాటకానికి నాలుగైదు ప్రదర్శనలు ఏర్పాటు చేయడం మంచిది. సంఘ సభ్యుల నుంచి వచ్చు ఆదాయంతో, మొదటి ప్రదర్శనం జరపవచ్చు. ప్రజల ఆదరణనుబట్టి, తక్కిన ప్రదర్శనాలు కూడా లాభదాయకంగా చేసుకోవచ్చును.

**పరిషత్పత్రిక :**

కడచిన సంవత్సరమే ఈ విషయాన్ని చర్చించి యున్నాము. కాని, ఇంతవరకూ ఒక సంచిక కూడా వెలువడలేదు. మాసపత్రికగా దీనినుద్దేశించటంవల్ల, పత్రికా నిర్వాహకులు మోయలేని భారాన్ని తమపై వేసికొన్నట్లైనది. నా అభిప్రాయం యేమంటే, మనకు ఒక త్రైమాసిక పత్రికగాని, అధమం అర్ధవర్ష పత్రికగాని చాలునని, ఈ విషయమై మీరందరూ కలిసి చర్చించాలి. ఈ పత్రికలో ఎన్నికగన్న ఏకాంక నాటికలూ, సంపూర్ణ నాటకాలూ నాట్యసంబంధ వ్యాసాలూ ప్రకటిస్తే బాగుంటుంది. మన లక్ష్యాలు వెంటనే సిద్ధింపకపోవచ్చు. ప్రభుత్వ రథం శ్రీఘ్రగామిగాదు. ప్రజా ప్రబోధం కూడా అంత త్వరలో సాధ్యమయ్యేది కాదు. ఈ విషయాన్ని గుర్తించి, మహాకళాభిలాషులు కేవలం పైవారిపై ఆధారపడకుండా స్వశక్తిని పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలి. మనం పరస్పర సహకారమూ, స్నేహబుద్ధీ ముఖ్యంగా అలవరచుకోవాలి. సినిమాతో, రేడియోతో మనకు విరోధం లేదు. మనం ఎంతో శ్రమించి ఇచ్చిన ఉత్తమ నటీనటులు, సినిమాలోనికి తరలిపోవడంవల్ల, మనకు తీరని హాని జరగటం నిజమే. కాని అలా తరలిపోయే యువతీ యువకులపై మనకు కోపం లేదు. ఈ క్రొత్త సినిమా లోకంలో ఉండి కూడా, మొదట తామందరిని పెంచి పెద్దచేసిన నాటక సంప్రదాయమును వారు విస్మరించరని మనమాశిద్దాం. ఇక రేడియో నాటకానికి ఎంతో సహకారి. దీనివల్ల, మన కళాభిలాషులకు కొంత ధనలాభం కలగటమే కాకుండా, ప్రఖ్యాతి కూడా లభిస్తుంది. తెనుగు నాటకరంగం నిరాటంకంగా వర్ధిల్లు సూచనలు కనిపిస్తున్నవి. నాటక ప్రదర్శనాలపై మన ప్రభుత్వం వినోద శుల్కాన్ని తొలగించటం చాలా శుభప్రదం. మనమందరమూ, ప్రభుత్వానికి హృదయపూర్వకంగా కృతజ్ఞత చూపించాలి. నాట్యకళాభిలాషులకు ఇది ఉత్సాహ కారణం. సావధానంగా, ఇంతవరకు నా మాటలు విన్నందుకు మీ అందరికీ కృతజ్ఞుణ్ణి. పరిషత్కార్యక్రమం నిరంతరాయంగా సాగగలదనే శుభాకాంక్షలతో ముగిస్తాను.

(ఆంధ్ర నాటక కళాపరిషత్తు రజితోత్సవ సంచిక)

# గురజాడ అప్పారావు గారి ఉత్తరం

*అప్పారావుగారు ఒంగోలుముని సుబ్రహ్మణ్యంగారికి రాసిన లేఖలో* Have I made vice attractive? *అని మధురవాణి గురించి మథనపడ్డారు.*

చారిత్రాత్మకమైన ఈ అప్పారావుగారి లేఖను గుడిపాటి వెంకటచలంగారు తెనుగు చేశారు. చలంగారి అనువాదాన్ని చదవండి.

"కన్యాశుల్కం ప్రూఫ్‌లు దిద్దుతున్నాను. చదువుతోంటే నాకు ఆహ్లాదం కలుగుతోంది. గ్రంథకర్త తన పుస్తకాల్ని చదివి తానే ఆశ్చర్యపడితే గ్రంథంలో నిజమైన స్వారస్యం ఉందన్నమాటే. గ్రంథకర్తకే పుస్తకం ఆకర్షకంగా ఉంటే అందరికీ ఉంటుందని నిశ్చయమే. మీనాక్షి వొచ్చిన రంగాలు చాలా జ్ఞానాపాదకాలుగా ఉన్నాయి. నేను పూర్వ గ్రంథాల్లోంచి ఉదాహరణలివ్వగలను.

కళాదృష్టితో ఆదర్శవంతంగా చేసినప్పటికీ Artistic Idealisation కూడా Realistic (ఉన్నదున్నట్టు)గా వ్రాసినట్టయితే ప్రజల నైతిక అభిప్రాయములకు విరుద్ధంగా ఉండే ఘట్టాలు తటస్థించక మానవు. కొంతవరకు నైతిక ఖండనం ప్రత్యేక తత్వాల మీద ఆధారపడి ఉంటుంది. మీ పట్టాభి రామమూర్తిగారి సహవాసంలో మీరు పెరగడంవల్ల మీకు అవినీతి అంటే కంటకమని నాకు తెలుసు. వేశ్య అనేసరికి అదిరిపడతారు.

కావ్యాల్లోని న్యాయస్మృతి కావ్యన్యాయంతో మారింది. నేను జీవితాన్ని చిత్రిస్తున్నాను. కళాపరంగా కొంత ఔన్నత్యాన్నిస్తాను.

నేను కళారాధకుణ్ణే. ఐనప్పటికీ సంఘం యెడల బాధ్యత ఉంది నాకు. నా పుస్తకం చదివేవారు నన్ను వొక ప్రశ్న వెయ్యవచ్చు. నేను దుర్మార్గాన్ని ఆకర్షణీయంగా చేశానా అని. చెయ్యలేదని నా నమ్మకం. మొదటి ముద్రణలో మధురవాణి జీవం లేని ఘోరంగా తయారైంది. ఈ ముద్రణలో ఆమెను పూర్ణంగా చిత్రించాను. నేను ఆమెను చూసి భ్రమసిపోతున్నాను. కనుక ఆమెని చివర రంగంలో సంస్కరణం చేశాను. ఇంక మీకు అభ్యంతరం ఉండకూడదు. పైకి కనబడేదానికన్న బలమైన నైతిక భావాన్ని పొందింది నా పుస్తకం. జీవితాన్ని నేను చులకనగా భావించనని తెలుస్తుంది. హాస్యంతో పొంగిపోయే పుస్తకంలో జీవితంలో గంభీరత్వాన్ని చూపడం చాలా కష్టమైన పని. ప్రయత్నించాను!

వేశ్యలోని మానుషత్వాన్ని మరచిపోకండి. ఆమె సుఖదుఃఖాలు మీవిగాని, నావిగాని అయిన సుఖదుఃఖాలకు ప్రాముఖ్యతలో తీసిపోవు. సంఘంలో లెఖ్ఖలేని వ్యభిచారులైన భర్తలూ, భార్యలూ ఉన్నారు. స్పష్టంగా తన వృత్తిని తెలియబరిచే వేశ్య వారందరికన్నా అధమురాలెట్లా అవుతుంది? పైగా వేశ్య వివాహ ప్రమాణాన్ని భగ్నం చేయడంలేదు వీళ్ళవలె.

'ఆంత్రోపాలజి' (పురాతన మనుష్యుల చరిత్ర నుంచి తెలుసుకునే శాస్త్రం) వల్ల మన సాంఘికాభిప్రాయాలు మార్చుకోవలసిన అవసరం కలిగింది. స్పష్టంగా గోచరించే విషయాన్ని కప్పిపుచ్చడంవల్ల ఏమీ లాభంలేదు.

వివాహ బంధాలను ఇంత గొప్ప చేయడంలో అర్థమేమిటి? సాంఘిక పరిణామంలో వివాహ సంస్థ యొక్క ప్రాముఖ్యతను నేను తగ్గించ చూస్తున్నానుకోకండి. గడచిన శతాబ్దంలో ప్రపంచం జ్ఞానంలో మారింది. వివేకవంతులైన మనుష్యులు పాత అభిప్రాయాల విలువను పరీక్షించడం ప్రారంభించారు. వివాహ సంస్థ మానవాభివృద్ధికి తోడ్పడిన మాట వాస్తవమే కాని వివాహ బంధం ఛేదించకూడదనే అభిప్రాయం వల్ల ఎన్ని చెప్పతరం కాని దారుణ కృత్యాలు తటస్థిస్తున్నాయో మరవకూడదు. అంతేకాదు. ఇంగ్లీషు వారిలో పెళ్ళి (సివిల్ కాంట్రాక్ట్) చట్ట సంబంధమైన వొడంబడికగా ఉంది. *షెల్లీ, జార్జి ఇలియట్* దాన్ని తోసేసి తిరిగారు. నవీనయుగపు స్త్రీ చరిత్రను పునర్లిఖింపబోతోంది.

గొప్ప నవలలో ప్రేమకథ అపురూపమవుతోంది లేక ప్రాముఖ్యత లేని స్థానానికి వెడుతోంది. ఈ స్త్రీ పురుష శరీర ఆకర్షణ విషయమై వాఙ్మయం ఎందుకు అనంతమైన భేదాలతో చిత్రిస్తుంది? కామ సంబంధమనే మాటను గమనించండి. శుద్ధ శరీర సంబంధాన్ని స్పష్టంగా చూపుతోంది. వొడిలిపోయిన యాభైఏళ్ళ సుందరిని యువకుడెందుకు మోహించడు? చక్కగా వికసించిన రోజా

పువ్వువలె, బాగా ఉడికే కూరవలె యవ్వనవంతురాలు యింద్రియాల్ని ఆకర్షిస్తుంది. పాచిన ఆహారం గాని, వొడిలిని పువ్వుగాని ఎంత అయిష్టమో ముదిరిన స్త్రీ కూడా అంతే. ముందెప్పుడో రొట్టె పాచిపోతుందనిగాని, రోజా వొడిలిపోతుందనిగాని అవి కొత్తగా, మనోహరంగా ఉన్నప్పుడు ఎవడన్నా అనుభవించడం మానుకుంటాడా? జీవితమూ, సౌందర్యమూ అశాశ్వతములనే వేదాంతం సరైనది కాదు. పైగా తరుణ మందే అనుభవించాలనే అభిప్రాయానికి బలమైన ప్రోత్సాహ కారణమౌతుంది. పాపం అమితత్వంలో ఉంది. అమితత్వం ఎక్కువకాలం ఎట్లాగూ దాగదు.

జీవితంలోనూ, వాఙ్మయంలోనూ కూడా మోహం తన ఉచిత స్థానాన్ని అధిష్టించాలి. ప్రస్తుతం దానికి అమితమైన ప్రాముఖ్యానిస్తున్నారు. 'కేటో' తన భార్యని ఎవరికో ఎరువిచ్చాడు. పురాణాలు చదవండి తెలుస్తుంది.

నిజంగా జరుగుతున్న సంగతుల్ని చూడాల్సి వొస్తుందని కళ్ళు మూసుకోవద్దు. డాక్టరులాగు కత్తి తీసి పుండు కోసి పరీక్షించాలి. ఆశయంగా చూపించ తగినది మానవుడి ప్రేమ. క్రీస్తు బోధించిందిగాని, బోధించాడని అనుకునేదిగాని అదే. తన కవిత్వంలో షెల్లీ చాటింది ఆ ప్రేమే. జీవించే మతం కింద బుద్ధుడు బోధించింది ఆ ప్రేమనే. బౌద్ధమతాన్ని ఏనాడు నాశనం చేసిందో ఆనాడే హిందూదేశం మతీయమైన ఆత్మహత్య చేసుకుంది.

ఈ ఆచారాలనే యెర్రకాంతిని పరిశోధనాలయం నుంచి తొలగించి, ఈ కామ సంబంధాన్ని పూర్తిగా, వివరంగా పరీక్షించాలని నా కోరిక. చరిత్రాత్మ జీవశాస్త్రాత్మకంగా పరిరక్షించి, దాని సరియైన స్థానాన్ని యీ కామానికి ప్రసాదించి తీరాలి. జీవితంలో యథార్థాన్ని మీరు ప్రేమిస్తున్నారు. 'సెంటిమెంటు'లోని యదార్థాన్ని యెందుకు ప్రేమించరు? పురుషుడి అధికారం కింద యెంత నీచమైన బానిసత్వాన్ని స్త్రీ అనుభవిస్తుందో నాకు తెలుసు. మీరు మాత్రం ఆలోచించుకోలేరా?

బీదలూ, కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భర్తల విషయమై ఆ భార్య లేమనుకుంటూ ఉంటారో ఆలోచించుకోండి. మీ చుట్టూ కనబడే కుటుంబాలను 'స్టడీ' చేయండి. కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భార్యలో? అంటారు మీరు. కాని వారు పురుషుల బానిసలేకద. మనకన్న ఆడవాళ్ళు ఎక్కువ పవిత్రత చూపాలని విధిస్తున్నాము. దానివల్లనే యింత వ్యత్యాసం కలుగుతోంది. నిర్మలులుకాని పురుషులందరినీ మీరు ద్వేషిస్తారనుకోండి పనిబట్టి. ఇంక మీరు ద్వేషించని స్నేహితులు ఎంతమంది మిగులుతారు? స్త్రీకి సాధ్యమైన దానికన్నా ఎక్కువ ప్రజ్ఞను పురుషుడు కోరుతున్నాడు గనక స్త్రీ బాధపడుతోంది. తన మనసు తీరేట్టు, స్త్రీ తనని పూజించడంలేదని పురుషుడు దుఃఖభాజనుడైనాడు. 'జెలసీ' అంటే ఏమిటి? భర్త అందంగా లేడు. భార్య అతని రూపాన్ని యెట్లా మెచ్చుకుంటుంది? అందంగా ఉన్న పరపురుషుడి యెడల అనురాగాన్ని ఆపుకోలేదు. కాని అట్లాంటిది మహాపాతకమంటారు మీరు. ఎంత దుస్సాధ్యం! భర్త చవట అయినా భార్య మాత్రం ఆయన మేధాశక్తుల్ని మెచ్చుకునే తీరాలి. ఇట్లా ఎంతవరకన్నా, ఎన్ని విషయాల్లోనో ఊహించుకోవచ్చు యీ అగచాట్లు.

జపానులో గెయిషా పద్ధతి సంగతి వినేవుంటారు మీరు. కామ విషయమైన నీతి జపానులో చాలా తక్కువ. కాని వారి జాతీయతకికాని, మత జీవనానికిగాని, భాగ్యసమృద్ధికిగాని ఏ లోటూ రాలేదు. ఆశ్చర్యం ఏమిటంటే, ఆ దేశంలోనే ముఖ్యంగా గొప్ప రాజకీయ ఆదర్శాలున్నాయి.

సెంటిమెంట్ అవతలపెట్టి యీ కామవిషయమై నా అభిప్రాయం ఇదీ. సంఘం వల్ల విధింపబడిన చట్టాలు ఉన్నాయి, వాటిని మన్నించటం మన విధి. కామ వ్యవహారాన్ని శాంతంగా నడిపించేందుకు అవి ఉండవలసిందే.

ఆ చట్టాలు అన్యాయమని తలిచి వాటిని బహిరంగంగా సంస్కరింప పూనినప్పుడు తప్ప వాటిని మీరడం గొప్ప నేరం. ఆ చట్టాలకి లోబడి ఉన్నా వాటిని పరీక్షించి వాటి న్యాయాన్యాయ విచారణ చేసేందుకు ప్రతివారికీ స్వతంత్ర్యం ఉంది. నిర్మలత్వం అవసరం అనే సెంటిమెంటుని నేను మన్నిస్తాను. కాని ఆ సెంటిమెంటు యొక్క నిజస్వభావమేమిటి, దాని హద్దులెంతవరకు, దాని అసలు అర్థమేమిటి, అది ఏ మార్గంగా పనిచేస్తోంది, నిర్మలత్వమంటే దేంట్లో ఉంది? నేను నమ్ముతున్నదేమిటంటే ప్రస్తుత సాంఘిక శాసనాలు ఈ కామ విషయమై ఎవరికీ అందుబాటులో లేనంత కఠినంగా ఉన్నాయి. కనకనే నేరాలు మీరిపోయినాయి. మనలో మనం వాస్తవం వొప్పుకోవలసిన కాలం వొచ్చింది. ఇదంతా ఎందుకు వ్రాశానంటే నేను వ్రాయబొయ్యే నాటకం యీ సమస్యల్ని గురించి" అని వ్రాశారు అప్పారావుగారు.

# వేల్చేరుతో మధురవాణి



*నారాయణ నారాయణ* అంటూ మధురవాణి ప్రవేశిస్తుంది.

**వేల్చేరు** : ఎన్నియో యుద్ధములారితేరిన, ఎందరో పెద్దలతో ముచ్చటించిన మధురవాణి ఇలా కటాక్షించిందేమీ?

**మధుర** : భీష్మాచార్యులవంటి ఆవంత్స వారు ప్రయాణం కట్టారని తెలిసి పలకరించి పోదామనీ, పనిలో పని తమని దర్శించుకుందామనిన్నూ....

**వేల్చేరు** : ఇది నాకు చాలా మంచిరోజు సుమా! The sun is not set yet, దేవతలు నిర్నిమేషులు కదా! మరి పురాణం వారిని నిద్ర లేపారెందుకు?

**మధుర** : ఎందుకా? మీరీ మధ్య అప్పారావుగార్ని బ్రిటీష్ వారి తొత్తులన్నారని, *కన్యాశుల్కాన్ని* ఆంగ్లంలో *గర్ల్స్ ఫర్ సేల్* అని అనువాదం చేశారని అందులో 'ముందుమాటలు' – 'వెనుక మాటల' మధ్య 'మధ్య మాటలు' చొప్పించారని, వివిన మూర్తి గారు తెగ వాపోయారు. తరువాత నాకు పునర్జన్మనిచ్చిన ఆలపాటి వారి **మిసిమి**లో చాలా చర్చ జరిగిందని మాదాకా వచ్చింది. మీకు ఈ వయసులో, అదీ నూరేళ్ళు నిండిన 'కీర్తి'కి తారు పూయాలని ఎందుకనిపించింది?

**వేల్చేరు** : మరీ అలా సూటిగా పోటు మాటలతో దాడి చేస్తే ఎలాగా? అలా కూర్చో. స్కాచ్ సేవిస్తూ మాట్లాడుకుందాం.

**మధుర** : మర్యాదలకు ఏంగానీ, అమృతం తాగేవాళ్ళకు ఈ కాచి వడపోతలు ఎందుకులెండి? విషయానికి రండి.

అప్పారావుగారు ఆంగ్లం చదవటం పాపమా? అయితే మీరు ఏలూరు సి.ఆర్. కాలేజీలో ట్యూటర్‌గా మొదలై బెటర్‌మెంట్ కోసం ఆంధ్రా యూనివర్శిటీకి వెళ్ళి, ఆ సందర్భంలో దోణప్ప గారి పుణ్యమా అని విస్కాన్‌సిన్ విద్యార్థులకు ఆంగ్ల పాఠాలు చెప్పి, అదే వంకతో విదేశాలకు వెళ్ళింది తెల్లవాళ్ళ తొత్తుగా పనిచేయటానికేనా? అదే లోకమని అక్కడే సెటిలైపోయి ఎనభయ్యో పడిలో బుద్ధి సమర్తాడినట్లు ఇప్పుడు అప్పారావుగారిని, నన్ను, నాటకాన్ని మూల్యాంకనం చేయవలసిన పని ఎందుకొచ్చింది? *కన్యాశుల్కాన్ని గర్ల్స్ ఫర్ సేల్* అని తప్పుడు అనువాదం ఏ ఉద్దేశంతో చేశారు. మీ తెల్లవాళ్ళు ఏ డాక్టరేట్ ఇస్తానన్నారు ఇప్పుడు ప్రత్యేకంగా?

**వేల్చేరు** : నీకు ఈ విషయాలన్నీ ఎవరు చెప్పారు?

**మధురవాణి** : గ్లోబలైజేషన్! గిరీశం గారు ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీ పెట్టారు. సి.సి. కెమెరాలు, పెన్‌ఐ లు, పెన్‌డ్రైవ్‌లు.... ఆయనగారి ఆదాయం మూడు సెల్‌లు, ఆరు సిమ్‌లులా ఉంది. ఇప్పుడు ఇన్‌ఫర్‌మేషన్ ఈజ్ ద పవర్!

**వేల్చేరు** : చాలా కోపంగా ఉన్నావు. ఇంత కోపంలో ఉన్నప్పుడు నేనేం చెప్పినా ఉపయోగం ఉండదు. అయినా నా అభిప్రాయాలు మధ్యమాటలో వెల్లడించాను. నీకు గిరీశం ఇంగ్లీషు నేర్పాడు కదా, చదివి తెలుసుకో.

అయినా ఈ మధ్య భారత్‌లో అసహనం పెరిగిపోయిందిలే....

**మధుర** : (కోపంగా) *కన్యాశుల్కా*నికి భారత్‌లో అసహనమంటూ ముడిపెడతారా... ఇక్కడే మీ వలస బుద్ధి బయటపడుతుంది.

**వేల్చేరు** : వలస వలస అంటున్నావు, మేము భారతీయులమే కదా! ఇక్కడ నుంచి ఇంద్రసభకే కదా వచ్చేది!

**మధురవాణి** : పౌరసత్వం మార్చుకున్నవాళ్ళు పాశ్చాత్యులకిందే లెక్క. మీరంతా డాంటే ఇన్‌ఫెర్నోకే వెళతారు. మమ్మల్ని కలిసే అదృష్టం, అవకాశం లేదులెండి.

**వేల్చేరు** : అంత పాపం మేమేం చేశాం? నేను యాంటినాచే కదా! ఎటొచ్చీ అమెరికాలో ఎవరితోనైనా బాహాటంగా స్నేహం చేయవచ్చు.

**మధురవాణి** : విషయాన్ని పక్క దారి పట్టిస్తున్నారు.. కరటకశాస్త్రిలాగా.

**వేల్చేరు** : నా విద్యార్థులలో గిరీశాలు ఉన్నారుగాని, కరటక శాస్త్రుల్లు లేరు, ఇక్కడ అవసరమూ లేదు. ఒకసారి అమెరికా రారాదూ!... ఆటా–పాటా, తానా–తందానా వగైరాలు చూడవచ్చు.. పైగా మీకు మా దేశంలో చాలా గౌరవం తెలుసా.

**మధురవాణి** : మీరిచ్చిన గౌరవం చాలు. *కన్యాశుల్కాన్ని ద డౌరీ* అంటే మీ సొమ్మేమీ పోదుకదా! 'అమ్మకానికి అమ్మాయిలు' అంటే ఎంత సిగ్గుచేటు. ఏదోరకంగా పుస్తకాలు అమ్ముకోవటానికి ఇదొక ఎత్తు.

**వేల్చేరు** : తెలుగు సినిమాలు తెలుగు రాష్ట్రాలలోకంటే అమెరికాలో ఎక్కువగా ప్రదర్శింపబడుతున్నాయి తెలుసా...

**మధురవాణి** : తెలుగు సభలు ఎప్పుడూ విదేశాలలో జరుగుతుంటాయి ఎందుకో? తెలుగు అంతరించిపోయేది ఎక్కడో? ఇదంతా వలసల పుణ్యం కాదా? మరి మీరు వలస పాలన గురించి చులకనగా మాట్లాడటం తగునా?...... మీరు ఈ మధ్య ఖాదర్ కవిత్వం ఇంగ్లీషులోకి మార్చారట!

**వేల్చేరు** : అవును. విస్కాన్సిన్ యూనివర్శి వారు ప్రచురించారు. చాలామంది విద్యార్థులు చదువుతున్నారు.

**మధురవాణి** : మీరు ప్రమాదంలో పడినట్లే!

**వేల్చేరు** : అంటే?

**మధురవాణి** : అంటే ఏముంది – ఆమాత్రం తెలియని అమాయకులా – ఖాన్‌లందర్నీ వెనక్కు పంపుతున్నారుగా.. అమెరికాలో ఖాదర్ పద్యం మీరు పబ్లిక్‌గా చదివారంటే మీరిక మూటాముల్లే సర్దుకోవచ్చు.

**వేల్చేరు** : భారత్‌లో ఉన్న అసహనం అక్కడ లేదులే.

**మధురవాణి** : మీరు వి.ఎన్. ఖాన్ ఎప్పుడయ్యారు? పొరపాటున అమెరికా ఎయిర్‌పోర్ట్‌లో అలా చెప్పేరు.. అంతే సంగతులు – కథ అడ్డం తిరుగుతుంది....


*ఇంకావుంది...*

# అట్టమీద బొమ్మలు



హల్దంకర్

**ఈ** క్రింది చిత్రం చూడగానే మీకేమనిపిస్తుంది?
ఎవరు వేశారనిపిస్తుంది?
దానికి సమాధానం ఒక్కటే!
ఇది రవివర్మ వేసిన అనేక గొప్ప చిత్రాలలో ఒకటని మీరే కాదు, చాలామంది పొరబడతారు.
నిజానికి ఈ చిత్రాన్ని వేసిన చిత్రకారుని పేరు హల్దంకర్.
సలరం లక్ష్మణ్ హల్దంకర్ అతని పూర్తిపేరు.
ఈ చిత్రకారుడు దీనికి పెట్టిన పేరు గ్లోరీ ఆఫ్ ది ల్యాంప్ లేదా కాంతి ప్రజ్వలనం. మహారాష్ట్రలో సవంతవాడి అనే పేరుతో ఒక చిన్న ప్రిన్సిలీ స్టేట్ ఉంది. నవంబరు 25, 1882లో హల్దంకర్ అక్కడ దైవ ధన్య బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. చిత్రకళా నైపుణ్యం చిన్నతనంలో అతని చేతివేళ్ళను ఆశ్రయించాయి. ఇతను వేసిన చిత్రాలను సరిదిద్ది, ప్రోత్సహించినవారు మరొక గొప్ప చిత్రకారుడైన ఎస్.ఎస్. మాలంకర్.



(కొన్ని సాంకేతిక కారణాలవల్ల ఈ చిత్రాన్ని ముఖచిత్రంగా వేయలేకపోయాం)

ఈ బాలచిత్రకారుని చిత్రాలు చూసిన ప్రాథమిక ఉపాధ్యాయులు సవంతవాడి రాజుగారికి, ఈ కుర్రవాని ప్రతిభ గురించి వివరించారు. మెట్రిక్యులేషన్ సవంతవాడిలో పూర్తయిన తర్వాత డ్రాయింగ్ రెండవగ్రేడ్ పరీక్షలో హల్దంకర్ ఉత్తీర్ణుడయ్యాడు. సవంతవాడి మహారాజు ఆర్థిక సహాయంతో బొంబాయిలోని జె.జె. స్కూల్ చిత్ర కళాశాలలో ప్రవేశం సులువుగానే లభించింది. అతని చదువుకయిన ఖర్చంతా రాజుగారే భరించారు.
అక్కడ ఉపాధ్యాయులుగానున్న కేదారి గణపతిరావు, మహదేవ్ విశ్వనాథ్ దురంధర్, ఎ.కె. ట్రినిడేడ్ లాంటి ప్రముఖుల శిష్యరికంలో ఐరోపా చిత్ర కళారీతిలో తర్ఫీదు పొందారు. తైలవర్ణ చిత్రాలు, జలవర్ణ చిత్రాలు వేయటంలో రెంటిలోనూ సమాన ప్రతిభ కనబరిచాడు. చదువు ముగిసిన పిమ్మట అదే కళాశాలలో ఉపాధ్యాయునిగా నియమితుడయ్యాడు.
విద్యార్థి దశలో ఉండగానే అనేక బహుమతులు కైవసం చేసుకున్నాడు. అతని చిత్ర ప్రదర్శన బొంబాయి, మద్రాసు, సిమ్లాలోనే కాక లండన్‌లో రాయల్ సొసైటీ ఆఫ్ బ్రిటీష్ ఆర్టిస్ట్ సహకారంతో ప్రదర్శితమైంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ ప్రభుత్వపు గవర్నర్ పతాకం 1910, 1927, 1932 సంవత్సరాలలో పొందగలిగాడు. అప్పటి రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా మొదటిసారిగా సన్మానం పొందిన చిత్రకారుడిగా పేరుగాంచాడు. ఇటాలియన్ ఎన్‌సైక్లోపిడియా ప్రపంచంలోనున్న ముగ్గురు ప్రముఖ జలవర్ణ చిత్రకారులలో హల్దంకర్ ఒకరని పేర్కొన్నారు.
అప్పటి సాంప్రదాయాన్ననుసరించి అతని వివాహం దగ్గర బంధువుతో చిన్ననాడే జరిగింది. నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు కలిగారు. పెద్దవాడు గజానన్. తండ్రిలానే పేరుమోసిన జలవర్ణ చిత్రకారుడు. మూడవ కుమారుడైన భవన్‌రావ్ హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో తనదంటూ ఒక స్థాయిని ఏర్పరచుకున్నాడు. మిగిలినవారంతా తమ స్థాయినిబట్టి జీవితంలో స్థిరపడ్డారు.
కొంతకాలం అక్కడ పనిచేసిన తర్వాత 1908వ సంవత్సరంలో 'హల్దంకర్ ఫైన్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూషన్'ని ప్రారంభించాడు.


1918లో ఆ ఇన్‌స్టిట్యూట్ 'ఆర్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా'గా పేరు మార్చుకుంది. హల్దంకర్ అధ్యక్షునిగా బొంబాయిలోని చిత్ర కళా ఉపన్యాసకులు అందులో సభ్యులుగా ఉండేవారు. హల్దంకర్ వేసిన వ్యక్తి రూప చిత్రాలకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. ప్రసిద్ధులైన మదన్ మోహన్ మాలవీయ, జగన్నాథ్ శంకర్ సేఠ్, సవంతవాడి మహారాజు, జాన్ భీమాండ్, శ్రీమతి & శ్రీ వెస్లీ విల్సన్ చిత్రాలు ప్రసిద్ధిగాంచినవి. అనేక కమిటీలలో, సొసైటీలలో భాగస్వామ్యం వహించాడు. 'మహారాష్ట్ర చిత్రకార్ మండల్' అధ్యక్షునిగా పనిచేశాడు. చిత్రకళకు సంబంధించి చిత్ర కళా బోధన ఏ విధంగా రూపుతీసుకొని, ఆధునిక పద్ధతిలో బోధించాలి అన్న విషయంపై ఏర్పడిన 'హన్స మెహతా కమిటీ'కి అధ్యక్షునిగా పనిచేశాడు. మన దేశంలోని 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియం' బొంబాయి, 'నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్' బొంబాయి, ఢిల్లీ, 'మాస్కో అకాడెమీ ఆఫ్ ఆర్ట్' మాస్కోలలో అతని చిత్రాలు ప్రదర్శించబడుతున్నాయి.


మోహిని

హల్దంకర్ 1968వ సంవత్సరంలో తన రంగుల లోకాన్ని వదలి తరలిపోయాడు. అతనికి అత్యంత పేరుతెచ్చిన చిత్రాలలో 'లేడీ ఆఫ్ ది ల్యాంప్' ముఖ్యమైనది. దీపావళి పండుగనాడు తన మూడవ కూతురు గీత ఒకచేత్తో దీపాన్ని పట్టుకుని, మరోచేత్తో ఆ దీపం ఆరిపోకుండా అరచెయ్యి అడ్డంపెట్టి, నడుచుకుంటూ వస్తుండటంతో కాంతి ఆమె ముఖంపై పరావర్తన చెంది ప్రసరించిన దృశ్యాన్ని చూసి, తన్మయుడైన హల్దంకర్ దీనిని ఒక కథావస్తువుగా తీసుకుని ఆ కాంతి ప్రజ్వలాన్ని అలానే కాన్వాస్‌పై మలిచాడు. హల్దంకర్ చిత్రాన్ని ఉత్తేజితులైన ఎందరో వర్ధమాన చిత్రకారులు అలాంటి దీపసుందరులను కాన్వాస్‌పై తీర్చిదిద్దారు. అందులో ఈ ముఖచిత్రం ఒకటి.


దారి చూపే దేవత


ఈ చిత్రం యొక్క అసలు ప్రతి *మైసూర్ మహారాజు ప్యాలెస్‌లోనున్న* జయచామరాజు వడియార్ వారి 'తైలవర్ణ చిత్రాల మ్యూజియం'గా పేరుగాంచిన *జగన్‌మోహన్ ప్యాలెస్‌లో* ఉంది (1861వ సంవత్సరంలో మైసూర్ మహారాజా నివసిస్తున్న రాజభవనం కాలి బూడిదవటంతో కృష్ణరాజ వడయార్-III తాత్కాలికంగా జగన్మోహన్ ప్యాలెస్ అనేదానిని నిర్మించి, అందులో కొంతకాలం కుటుంబంతోపాటు నివసించారు. ఆ తరువాత ప్రస్తుతమున్న మహారాజా ప్యాలెస్ మైసూర్‌లోకి 1912వ సంవత్సరంలో తన మకాంను మార్చుకున్నారు. దీనిని అంబా ప్యాలెస్‌గా పిలుస్తారు. 1915వ సంవత్సరంలో దీనిని 'ఆర్ట్ గ్యాలరీ'గా మార్చారు. 1955వ సంవత్సరంలో దీనిని 'జయ చామ రాజేంద్ర ఆర్ట్ గ్యాలరీ'గా మార్చారు). ఈ చిత్రం యొక్క అసలు ప్రతి మైసూర్ మహారాజా ప్యాలెస్‌లోనున్న 'జయ చామ రాజేంద్ర ఆర్ట్ గ్యాలరీ' తైలవర్ణ చిత్రాల మ్యూజియంలో ఉంది. అక్కడ హల్దంకర్ వేసిన ఈ ఒక్క చిత్రం, రవివర్మ వేసిన అనేక చిత్రాలతోపాటు ఒకే వరుసలో ప్రదర్శించబడటంతో చాలామంది ఇది రవివర్మ వేసిన చిత్రమని పొరపాటుబడుతున్నారు. రవివర్మ, దురంధర్, హల్దంకర్ 20వ శతాబ్దపు తొలిదశలో భారతీయ జీవన రీతిని ఐరోపా చిత్ర కళా రూపంలో పొందుపరచినవారిలో ప్రసిద్ధులు.


దండి యాత్ర
(చార్‌కోల్ డ్రై ప్యాస్టల్ ఆన్ పేపర్ : కేశవ్)

✧ ✧ ✧

1932 వ సంవత్సరంలో దండి యాత్రను ఒక దండయాత్రగా గాంధీ నడిపించిన చారిత్రాత్మక సంఘటన. కేశవ్ ఇందులో గాంధీ దృఢసంకల్పం ఆ నడకలోనే కనిపించేలా చిత్రించారు.

ఇది కాగితం మీద బొగ్గుతో వేసిన బొమ్మ.



క్రోమోసోమ్ కథనమ్

# మృత్యువు

– ముక్తవరం పార్థసారధి

**క్రోమోసోమ్ కథనమ్ – 18**

మెదడులోని కణాల మధ్య కొత్త సంబంధాలు ఏర్పరచుకోవటమే జ్ఞానసముపార్జన అనుకుంటే కొన్ని పాత సంబంధాలను తెలుసుకోవటం కూడా అందులో భాగమేనని గ్రహించాలి. మెదడు కణాల మధ్య అనవసరమైన సంబంధాలు చాలా ఉంటాయి. ఎదుగుదల క్రమంలో ఇవి క్రమంగా తగ్గుతాయి. ఇలా జరగడంవల్లే ఇది మనకో ఉపయోగకరమైన పనిముట్టులా తయారైంది. రాతిని చెక్కి శిల్పి రూపాన్ని సృష్టించినట్టుగా, మన కళ్ళు, దృష్టి శిల్పిలా పనిచేస్తాయి. మరే క్షీరదానికైనా, కళ్ళంగంతలు కట్టి పెంచితే దాని మెదడు ఇలా ఎదగదు.

మెదడు ఎదిగే క్రమంలో, రోజుకో మిలియన్ కణాలు నశిస్తాయని ఒక అంచనా. గర్భంలో ఉన్నప్పుడు కూడా ఈ కణాలు నశిస్తూనే ఉంటాయి. ఇలా జరగకపోతే మనకు ఆలోచించే శక్తి కలిగేదే లేదు.

ced-9 వంటి జన్యువుల ప్రోత్సాహంతో కణాలు సామూహిక ఆత్మహత్యలకు పాల్పడతాయి. శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉండటం కోసం ఒక అంగం చేస్తున్న త్యాగమిది. శరీరం లోపల కణాల మధ్య సంబంధం తేనెటీగలకూ, తేనెతెట్టెకూ ఉన్నటువంటిదే. కాని 600 మిలియన్ సంవత్సరాలు ఇవి సహకరించుకుని పెద్ద శరీరాలుగా మార్పు చెందాయి. 50 మిలియన్ సంవత్సరాల క్రితం ఈ ప్రక్రియ మరింత వేగవంతమయి ఉంటుంది. అయితే ఇవి అప్పుడప్పుడూ తిరుగుబాటు చేస్తాయి. కొన్ని తేనెటీగలు తమను తాము పునరుత్పత్తి చేసుకుంటాయి. కణాలకు సంబంధించినంతవరకూ, తిరుగుబాటు ఒక నిరంతర సమస్యే అనటంలో సందేహం లేదు.

అయితే, కాన్సర్ కారకమైన ఈ పునర్విభజన / పునరుత్పత్తిని ఆపే వెసులుబాటు కూడా ఉంది. శరీరంలో ఇలాంటి కణాలను ఆత్మహత్యకు ప్రోత్సహించే స్విచెస్ (switches) కొన్ని ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. వీటిలో అతి ముఖ్యమైన స్విచ్ tp53 (1979లో దీని గురించి తెలిసింది). క్రోమోసోమ్ 17 మీదుంటుంది. కాన్సర్ గురించి క్రోమోసోమ్ చెప్పిన కథ ఇది. ఇక చదవండి.

1971లో రిచర్డ్ నిక్సన్ కాన్సర్ మీద యుద్ధం ప్రకటించినప్పుడు, శాస్త్రజ్ఞులకు శత్రువెవరో కూడా తెలియదు. "టిష్యూ కొద్దిగా పెరిగింది. అంతే" అనుకున్నారు. కాన్సర్‌లన్నీ వారసత్వంగానే సంక్రమించవు, అన్నీ అంటురోగాలూ కావు. "అసలు కాన్సర్ అనేది ఒక రోగం కాదు. అనేక రోగాలు కలిస్తే ఏర్పడే పరిస్థితి" అంటారు. దీనికి బాహిరమైన కారణాలే ఎక్కువని కూడా ఒక నమ్మకం. పొగగొట్టాలు శుభ్రం చేసేవాళ్ళకు జననాంగాల వెనక భాగంలో కాన్సర్ వచ్చినప్పుడు అది బొగ్గు పొగ వల్ల వచ్చి ఉంటుంది అనుకున్నారు. హిరోషిమా ఆటంబాంబు బాధితులకు రేజియేషన్‌వల్ల లుకేమియా వచ్చిందన్నారు. సిగరెట్లు తాగేవాళ్ళకు పొగాకు వల్లా, షిప్‌యార్డ్ కార్మికులకు అస్బెస్టాస్ ఫైబర్‌లవల్లా రావచ్చు. అయితే ఇన్ని రకాల కాన్సర్‌ల మధ్య సంబంధమేమిటని ప్రశ్నిస్తే వృణాలను నయంచేసే రోగనిరోధక శక్తి తగ్గటమే కారణం కావచ్చుననుకున్నారు.

కాన్సర్ పరిశోధన దిశగా సాగిన ప్రయోగాల్లో, తొలుత 1960లలో బ్రూస్ ఏమ్స్, DNA బలహీనపడితే ఇది వస్తుందని గ్రహించాడు. అంతే కాన్సర్ ఒక జన్యుపరమైన జబ్బు. అయినా ఇతర సంప్రదాయిక శాస్త్రజ్ఞులు ఈ విషయాన్ని అంగీకరించలేదు. అరుదుగా కాన్సర్ వారసత్వంగా

సంక్రమిస్తుంది. మొత్తంమీద చివరికి 1979లో, జన్యువులే కాన్సర్‌కు కారణమన్న విషయం నిరూపితమైంది.

ఏ జన్యువులు, కాన్సర్ జన్యువులు - Oncogenes గా మారతాయి. ఇతర జన్యువులు పెరగడానికి ప్రోత్సహించే జన్యువులను Oncogenes అంటారు. గర్భంలోను, తరువాతా ఎదగాలంటే జన్యువులు పెరగటం అవసరమే. తగిలిన గాయలు మానాలన్నా జన్యువులు పెరగాల్సిందే. కాని ఎక్కువకాలం ఈ జన్యువులు 'స్విచ్ ఆఫ్' స్థితిలో ఉండటం అత్యావశ్యకం. ఇది jam అయినప్పుడు పరిస్థితి ప్రమాదకరంగా ప్రాణాంతకరంగా మారుతుంది. శరీరంలో ఉన్న 100 ట్రిలియన్ కణాలతో జీవిత కాలంలో Oncogenes ఒకదానితో ఒకటి ఎదురుపడి, ఘర్షణపడి jam అయ్యే అవకాశాలకు కొదవలేదు. ఇలా జరగడానికి సిగరెట్లు, వగైరా అక్కర్లేదు. అయితే, ఎదుగుదల కనిపించినప్పుడు దాన్ని అడ్డుకునే వ్యవస్థ కూడా ఉంది శరీరంలో. 1980లలో ఆక్స్‌ఫర్డ్‌లోని హెన్రీ హారిస్ కనుగొన్న ఈ జన్యువులను tumor - suppressor - genes అన్నారు. Oncogenes కు పూర్తి విరుద్ధమైనవివి. Oncogenes jam అయితే కాన్సర్ రావచ్చు. tumor - suppressor - genes jam కాకపోతే కాన్సర్ వస్తుంది.

tp53 మ్యుటేషన్ ప్రాణాంతక కాన్సర్ ప్రధాన లక్షణం. ఇది ఎక్కువగా వృద్ధాప్యంలోనే సోకినా, ఇటీవల ప్రతి దశాబ్దంలోనూ పేషెంట్ల సంఖ్య రెట్టిపంవుతుందన్నది తెలిసింది. మనిషి ఎంత ఎక్కువకాలం బతికితే, అతని Oncogenes jam on అయ్యి tumor suppressor genes, Jamoff అయే అవకాశం అంతెక్కువ ఉంటుంది. అయినా ఇది శరీరం కాన్సర్ యుద్ధంలో ఓడిపోయినట్టు కాదు. ప్రతి 300 ట్రిలియస్ కణాల్లో, వంద మిలియన్ బిలియన్ సెక్ విభనలు మరీ ఎక్కువేమీ కాదు అంటాడు రాబర్ట్ లైన్‌బర్గ్.

tp53 జన్యువు పొడవు 1,179 అక్షరాలు. ఇందులో p53 ప్రొటీన్ ఉంటుంది. ఈ p53 ని Guardian Angel of Genome "జీనోమ్ రక్షక దేవత" అంటారు. ప్రమాదకరమైన కణాలను ఆత్మహత్యలకు ప్రోత్సహిస్తుంది. ఈ ప్రక్రియను apoptosis అంటారు.

మ్యుటేషన్ కాక ముందు మనకు Oncogenes అవసరమే. కొత్త చర్మం రావాలన్నా, కొత్త రక్త కణాలు అభివృద్ధి చెందాలన్నా, గాయాలు మానాలన్నా ఇవి కావాలి.

apoptosis కాన్సర్ నివారణకు మాత్రమే కాదు, అంటువ్యాధుల నుండి కూడా మనల్ని కాపాడుతుంది. ఈ ప్రక్రియవల్ల వైరస్ సోకిన కణం ఆత్మహత్య చేసుకుంటుంది (తమ జాతి బతకటం కోసం చీమలు, తేనెటీగలు ఇలాగే ఆత్మహత్యలు చేసుకుంటాయని మనకు తెలుసు). అయితే ఈ ప్రక్రియను ప్రతిఘటించే వైరస్‌లూ ఉన్నాయి. గ్లాండ్యులర్ ఫీవర్‌కు కారణమైన ఎప్‌స్టైన్ – బార్‌వైరస్ రోగం సోకిన కణాలు ఆత్మహత్యలు చేసుకోకుండా అడ్డుపడుతుంది. సర్వైకల్ కాన్సర్‌ను కలిగించే హ్యూమన్ పాపిలోమా వైరస్ tp53, ఇతర Tumor suppressor genes ను స్విచ్‌ఆఫ్ చేస్తుంది.

మెదడు కణాల్లో అవసరానికన్నా ఎక్కువ apoptosis జరగటంవల్ల హంటింగ్టన్స్ డిసీజ్ వస్తుంది (మరణించిన మెదడు కణాలు మళ్ళీ పుట్టవు). Brain damage is traversable అనటానికిదే కారణం. ఎదిగిన మెదడులో న్యూరాన్స్‌ను రీజెన్‌రేట్ చేయటం సాధ్యపడదు. న్యూరాన్‌లోకి వైరస్ ప్రవేశించి, దాని apoptosisకు అడ్డుపడుతుంది.

ced9 ఇతర జన్యువులవల్ల మెదడులో సామూహిక ఆత్మహత్యలు జరగటానికి కూడా ఇవే సూత్రాలు వర్తిస్తాయి. అంటే న్యూరాన్‌ల apoptosis వల్లనే నేర్చుకోవటమనే ప్రక్రియ సాధ్యపడుతుంది. ఇలా జరగటం వల్ల మరణించినవి మరణించగా, మిగిలినవాటి జీవన ప్రమాణం పెరుగుతుంది.

ఇది ఈ apoptosis అనేది వికేంద్రీకరణ చెందిన వ్యవహారం. ఇది ఎప్పుడు, ఎక్కడ జరగాలో శాసించే వాళ్ళెవరూ లేరు. అంటే, ప్రతీ కణంలోనూ ఈ కార్యక్రమం దేనికదిగా కొనసాగుతుంది. అంతేకాదు, జీవితకాలంలో ఒక వ్యక్తి apoptotic వ్యవస్థలో మార్పులు జరగవు. ఎందుకంటే, శరీరంలోని న్యూరాన్‌ల ఎంపిక వల్ల ఈ ప్రక్రియ జరగదు. కణ ఆత్మహత్యల వ్యవస్థ, పుట్టినప్పుడు ఎలా సంక్రమించిందో, జీవితమంతా అలాగే కొనసాగుతుంది.

**క్రోమోసోమ్ కథనమ్ – 19**

**చికిత్సలు**

*మన సందేహాలే మన శత్రువులు* –*షేక్స్‌పియర్*

ప్రస్తుతం మనం, జెనెటిక్ కోడ్‌ను ఎడిట్ చేయగలిగిన సామర్థ్యాన్ని అలవర్చుకున్నాం. జెనెటిక్ కోడ్ ఇప్పుడు అర్థంకాని లిపి కాదు. సమాచారమంతా కంప్యూటర్లో పెట్టేశాం. దాంట్లో అవసరమైనచోట మార్పులు, చేర్పులు చేసుకోగలం. ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి, ఎంతవరకిలా

చేయటం సబబు అన్న విషయమే ఇప్పుడు మాట్లాడుకుందాం. Genetic Manipulation సమర్థనీయమా?

జెనెటిక్ రీసర్చ్ అనగానే, మనకు లేబరేటరీలో మనలాంటి మరో మనిషిని సృష్టించవచ్చు అనే సందేహం కలుగుతుంది. కొన్ని శతాబ్దాల తర్వాత ఇది సాధ్యం కూడా కావచ్చు. ప్రస్తుతానికి మాత్రం వ్యక్తుల మధ్య జన్యుమార్పిడే, లేదా ఇతర జంతువుల, మొక్కల జన్యువులను మనకోసం వాడుకోవటం అనుకోవాలి. ఒకవేళ ఇది సాంకేతికంగా సాధ్యమైనా, ఇలా చేయటం ఎంతవరకు సబబు?


క్రోమోసోమ్-19 మీద ఉన్న ఒక జన్యువు కొలోన్ కాన్సర్‌ను నిరోధిస్తుంది. ట్యూమర్ సప్రెసర్‌ల గురించి గత అధ్యాయంలో కొద్దిగా చెప్పుకున్నాం. దీన్ని DCC అంటారని తెలుసుగాని, ఇది వెన్నుపూసలోని నరాల ఎదుగుదలకు మాత్రమే సహాయపడుతుంది. ట్యూమర్ సప్రెషన్‌తో దీనికి సంబంధం లేదు. ట్యూమర్ సప్రెసర్ జన్యువును దీనికి దగ్గర్లోనే ఉంటుంది గాని, దాని గురించి ప్రస్తుతానికి పూర్తి సమాచారం లేదు. ఈ జన్యువులో లోపముంటే మాత్రం కాన్సర్ వచ్చే అవకాశాలెక్కువ. భవిష్యత్తులో ఎవరైనా జెనెటిక్ ఇంజనీర్ ఈ లోపభూయిష్టమైన జన్యువును - పాడైన స్పార్క్‌ప్లగ్ తీసి కొత్తవి పెట్టినట్లుగా ఆరోగ్యకరమైన దానితో మార్చే అవకాశముందా? ఉంది. త్వరలో ఇది సాధ్యపడవచ్చు.

ఒకప్పుడు Cut and paste చేయడానికి మనం కత్తెర, జిగురు ఉపయోగించాం. ఇప్పుడు కంప్యూటర్లలో cut and paste ఎంత సులభమైపోయిందో మీకు తెలుసు. జన్యువుల cut and paste లో ఉపయోగించటానికి, ప్రకృతి మనకు ligase అనబడే ఎంజైంను ప్రసాదించింది. DNAలోని అక్షరాలను అవసరంకొద్దీ మార్చుకోవటానికి అవసరమిది. 'కత్తెర'లాంటి Restriction Enzymes బాక్టీరియాలో ఉంటాయని 1968లో తెలిసింది.

1972లో స్టాన్ ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన పాల్ బెర్గ్, వైరల్ DNAను సగంలో తెంచటానికి ఈ Restriction Enzymesను తొలిసారి ఉపయోగించాడు. ఆ తర్వాత, అవసరమైన మార్పులు చేసి, తిరిగి అతికించటానికి Ligaseను వాడాడు. అలా ప్రారంభమైంది జెనెటిక్ ఇంజనీరింగ్‌లో నూతన శకం. ఇప్పుడు మనం ఇష్టప్రకారం, క్రోమోసోమ్స్‌లోకి జన్యువులను ప్రవేశపెట్టగలం. పల్‌బర్గ్ ప్రయోగం తర్వాత, ఒక సంవత్సరంలోనే జెనెటిక్ ఇంజనీరింగ్‌తో కప్ప నుండి తీసిన ఒక జన్యువును కడుపులోని బాక్టీరియాలో ప్రవేశపెట్టారు.

అయితే ఈ విషయం తెలిసిన వెంటనే, సాధారణ ప్రజలే కాదు శాస్త్రజ్ఞులు కూడా తీవ్రంగా స్పందించారు. జెనెటిక్ ఇంజనీరింగ్‌లో ఇంత దూకుడు మంచిది కాదన్నారు. 1974లో దీనిమీద (జెనెటిక్ ఇంజనీరింగ్) నిషేధం కూడా విధించారు. ఏ జీవిలో ఉండే జన్యువులు ఆ జీవిలో ఉండటమే సబబు. జీవజాతుల సంకరం అవాంఛనీయమన్నారు. ఇలా సుదీర్ఘ చర్చల తర్వాత 1975లో ఏసిలామార్‌లో జరిగిన సదస్సులో ప్రభుత్వ పర్యవేక్షణలో పరిమితంగా ఇంజనీరింగ్ ప్రయోగాలు చేయవచ్చునని తీర్మానించారు. అంటే, శాస్త్ర పరిశోధనల మీద ఆంక్షలకు అంగీకరించారు. 1990లో నైతిక విలువలకు లోబడి శాస్త్రపురోగతి జరగాలన్న అభిప్రాయం బలపడింది.

మొత్తంమీద అలా జరిగింది బయోటెక్నాలజీ ఆవిర్భావం. జెనెటిక్, సీటస్, బయోజెన్ వగైరా సంస్థలు ఈ రంగంలో పోటీపడ్డాయి. ఇది అపరిమిత లాభాలను ఆర్జించిపెట్టే కొత్త వ్యాపారం. వైద్య, ఆహార, పారిశ్రామిక అవసరాల కోసం బాక్టీరియాతో మానవ మాంసకృతుల్ని




ముంచుకొస్తున్న మృత్యువు

తయారు చేశారు. ఇది విఫల ప్రయోగంగానే మిగిలింది కాని, 1980లలో బాక్టీరియాతో హ్యూమన్ గ్రోత్ హార్మోన్ సృష్టించారు.

అయితే, జెనెటిక్ ఇంజనీరింగ్‌లో పారిశ్రామిక వేత్తలున్నా, శాస్త్రజ్ఞులెక్కువ లాభపడ్డారు. హ్యూమన్ జీనోమ్ శకలాలతో కూడిన పెద్దపెద్ద లైబ్రరీలేర్పడ్డాయి. అంటే, అధ్యయనం సులభతరమైంది.

ఈ నేపథ్యంలో రూపుదిద్దుకున్న హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్, జీనోమ్ టెక్స్ట్ తయారుచేయగలిగింది. 2000 సంవత్సరంలో జూన్ 26 నాడు, 'జీనోమ్ చిత్తుప్రతి'ని సిద్ధం చేశారని ప్రకటించింది ఈ ప్రాజెక్ట్.

1989 నాటికి, అనేక అవాంతరాలను అధిగమించి జెనెటిక్ ఇంజనీరింగ్ గొప్ప పురోగతి సాధించింది. రెట్రోవైరస్‌ల సహాయంతో కుందేలు జన్యువులను కోతుల కణాలలో ప్రవేశపెట్టారు. క్లోనింగ్ చేసిన మానవ జన్యువులను (మానవ) కణాలలో ప్రవేశపెట్టారు. కాన్సర్ చికిత్సలో, Severe combined immuno Deficiency (SCID)లో జన్యుమార్పిడి ద్వారా చికిత్సలు జరిగాయి. అయినా gene therapy ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. గుండె మార్పిడి చికిత్సలంత తరచుగా జన్యుమార్పిడి చికిత్సలు జరిగే రోజు ఎంతో దూరం లేదు.

అయితే, వ్యాపార కారణాలరీత్యా, మొక్కల్లో జెనెటిక్ ఇంజనీరింగ్ ఉపయోగం బాగా పెరిగింది. ఇప్పుడు త్వరగా కుళ్ళిపోని టొమాటోలను, చీడపీడలను తట్టుకునే పత్తినీ, బంగాళాదుంపల్నీ, మొక్కజొన్ననూ ఈ పద్ధతిలో పండిస్తున్నారు.

అయినా మీడియా పుణ్యమా అని, రేడియోలో, టి.వి.లో జెనెటిక్ ఇంజనీరింగ్ అభిలషణీయమా కాదా అన్న చర్చకొనసాగింది. ఇలాంటి ప్రశ్నలకు 'అవును, కాదు' అన్న జవాబులుండవు. జంతువుల్లో కూడా జన్యుమార్పిడి జరుగుతోంది. ఈ పద్ధతివల్ల వాటికి ఎలాంటి పిల్లలు పుట్టాలో నిర్ణయించవచ్చు. ట్రాన్స్‌జెనిక్ ఎలుకలతో చాలా ప్రయోగాలు జరుగుతున్నాయి. మైక్రోఇంజెక్షన్ల స్థానంలో ఇప్పుడు కొత్త టెక్నిక్‌లు అమల్లోకొచ్చాయి. మూడురోజులు వయసున్న ఎలుక పిండంలో Embryonic Stem cells (ES cells) ఉంటాయి. వీటిని వేరుచేసి, జన్యువులతో ఇంజెక్ట్ చేస్తే జన్యు విభజన జరుగుతుంది. ట్రాన్స్ జెనెటిక్ జంతువులు శాస్త్రజ్ఞులకే కాదు, వ్యాపార పరంగా కూడా లాభసాటిగా పరిణమించాయి. ట్రాన్స్‌జెనిక్ గొర్రెలు, పశువులు, పందులు, కోళ్ళను ఇప్పుడు కమర్షియల్‌గా తయారుచేస్తున్నారు (1997లో క్లోన్ చేసిన గొర్రె డాలీ సంచలనం సృష్టించిన విషయం అందరికీ తెలుసు). క్వెచెక్‌లోని ఒక కంపెనీ, సిల్కు దారాలు నేసే సాలీడు జన్యువును, మేకల్లో ప్రవేశపెట్టి వాటి పాలలోంచి ముడి సిల్కు ప్రొటీన్ తయారుచేయటానికి ప్రయత్నించింది. ఈ ప్రయత్నాలు కాస్త వింతగా కనిపించినా, ట్రాన్స్‌జెనిక్ టెక్నాలజీ జంతువుల పెంపకంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నది మాత్రం నిర్వివాదాంశం. ఆహార అవసరాల కోసం ఎక్కువ మాంసం ఇచ్చే జంతువులను, ఎక్కువ పాలిచ్చే ఆవుల్నీ, రుచికరమైన గుడ్లు పెట్టే కోళ్ళనూ జెనెటిక్ మార్పులతో వ్యాపారపరంగా పెంచుతున్నారు.

ఇటీవలే మనుషుల్లోని ఎంబ్రయోనిక్ స్టెమ్ సెల్స్ పరిశోధనలు ఊపందుకున్నాయి. ఇంత జరిగిన తర్వాత ఇంకా మానవ క్లోనింగ్ గురించి సందేహముండక్కర్లేదు. కాని ఆ విపరీత పునఃసృష్టి ఎంతవరకు నైతికమనిపించుకుంటుంది? ఈ భూమ్మీద పుట్టిన మనిషిగా నీ జీనోమ్ నీది. కాని, బాగుంది కదా అని ప్రభుత్వం దాన్ని జాతీయం చేస్తానంటే (క్లోన్ చేసి పుట్టిస్తే అతడు మరో వ్యక్తి అవుతాడు)? మనుషులకు డుప్లికేట్లను కృత్రిమంగా పుట్టించుకుంటూ పోతే పరిణామాలెలావుంటాయి?

కాని, క్లోనింగ్ సాంకేతికంగా సాధ్యపడినా, ప్రజాభిప్రాయం దీన్ని సమర్థించటం కష్టం. టెస్ట్‌ట్యూబ్ బేబీల సంగతేమైంది? గత్యతరం లేదనుకున్న అతి కొద్దిమంది మాత్రమే ఆ పద్ధతినెంచుకుంటున్నారు.

మీరు తెలుసుకోవలసిన ముఖ్యవిషయం మరొకటుంది. క్రోమోజోమ్ 18 మీదున్న ట్యూమర్ సప్రెసర్ జన్యువులో ఏదైనా లోపమున్నట్టయితే gene therapy చేయటం సాధ్యం కాదు. జన్యువులలో వచ్చిన చిక్కే ఇది.

**క్రోమోసోమ్ కథనమ్ – 20**

**నివారణ**

వైద్యరంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా పెరిగిపోయిందంటే, నైతికంగా ఇది ఎంతవరకు సమర్థనీయం అనే సందేహం కూడా కలుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానంవల్ల ప్రాణాల్ని రక్షించవచ్చుననుకొంటే, ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవటంవల్ల (అనివార్యంగా కొన్ని ప్రమాదాలు

పొంచి ఉన్నప్పటికీ) మనం తప్పు చేసినవాళ్ళమవుతాం. రాతియుగంలో ఆటలమ్మకు మందు లేదు. ఈ చిన్న జబ్బుకే జనం పిట్టల్లా రాలిపోయారు. కాని, జెన్నర్ దీనికి తేడాలు కనిపెట్టిన తర్వాత వాడకపోవటం నేరం కాదా? పంతొమ్మిదవ శతాబ్దంలో క్షయరోగానికి చికిత్స లేదు. ఫ్లెమింగ్, పెన్సిలిన్ ఆవిష్కరించిన తర్వాత, దీన్ని ఉపయోగించుకోకపోతే మనం బాధ్యతను విస్మరించినవాళ్ళమే అవుతాం. వైద్య సాంకేతిక రంగంలో జరిగిన ప్రగతి ప్రపంచమంతటా ఉపయోగంలోకి వచ్చింది. విరేచనాలకు చికిత్స లేదు దీని వల్ల పేద దేశాలలో లక్షలాదిమంది పిల్లలు మరణిస్తున్నారు ధనిక దేశాలవాళ్ళు, దీనితో మాకేమిటి సంబంధం అని పరిశోధనలు చేయకుండా ఉండటం సమర్థనీయం కాదుగదా Oral Rehydration Therapy వల్ల కొంత ఉపశమనం లభించింది. ఇలాంటి చికిత్సా విధానాలు ఇంకా ఎక్కువగా అందుబాటులోకి రావాలి.

రెండు ముఖ్యమైన జబ్బులకు (ఒకటి మరణం అనివార్యం అంటుంది. మరొకటి మెదడునూ, గుండెనూ బలహీనపరచి రోగని జీవచ్ఛవం చేసే అల్జీమర్స్ వ్యాధి). ఇప్పుడు జన్యుపరంగా రోగనిర్ధారణ జరుగుతున్నది. చికిత్సలలో కూడా గణనీయమైన ప్రగతి సాధించాం.

ఈ చర్చ మరింత ముందుకు సాగాలంటే, మనం మొదట అపోలిపోప్రొటీన్ – APO - జన్యువుల గురించి తెలుసుకోవాలి. ఈ జన్యువులు A, B, C, E అని నాలుగు రకాలుగా ఉంటాయి. నిజానికి ఒకే క్రోమోసోమ్‌కు సంబంధించిన రూపాంతరాలివి.


అయితే ఇప్పుడు మనం మాట్లాడుకోవలసింది క్రోమోసోమ్ – 21 మీదున్న APOE గురించి. అయితే కొలెస్ట్రాలను, ట్రైగ్లిసెరైడ్ కొవ్వుల గురించి తెలిస్తే తప్ప దీని గురించి చర్చించటం సాధ్యపడదు. బేకన్, గుడ్లలాంటివి తిన్నప్పుడు పెద్ద పరిమాణాల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ మనం జీర్ణం చేసుకుంటాం. అంటే కాలేయం వీటిని జీర్ణం చేసుకుని రక్తంలోకి వదులుతుంది. అయితే ఈ ట్రైగ్లిసిరైడ్, కొలెస్ట్రాల్‌లు నీళ్ళలో కరగవు గనక, లిపోప్రోటీన్స్ అనబడే ప్రొటీన్స్ సహాయంతో ఇవి నెత్తుటిలో ప్రయాణం చేస్తాయి. తరువాత– LDL (Low Density Lipoprotein - Bad Protein)గా మారతాయి. కొలెస్ట్రాల్‌ను వదిలిన తర్వాత HDL (Good cholesterol)గా రూపాంతరం చెందుతాయి.

APOE, E2, E3, E4 అని మూడు రకాలుగా కనిపిస్తుంది. ట్రైగిసరైడ్స్‌ని నివారించటంలో ఇవి ఒక్కొక్కటి ఒక్కోరకంగా వ్యవహరిస్తాయి. అంటే, గుండెజబ్బుల్లో కూడా వీటి ప్రవర్తన భిన్నంగా ఉంటుంది. E2 జన్యువున్నవాళ్ళు కొలెస్ట్రాల్‌గల ఆహారాలు ఇంతే ప్రమాదంలో పడటం ఖాయం. జన్యుపరిశోధనలో మనకు స్పష్టంగా తెలిసిన విషయమిది. అయితే, APOE గురించిన వ్యవహారం ఇంతటితో ముగియలేదు. అల్జీమర్స్ వ్యాధిలో దీని పాత్ర చాలా ఎక్కువ. వృద్ధాప్యంలో ఇది ఎక్కువగా వస్తుంది. కాని కొన్నిసార్లు యువకులు కూడా దీని బారిన పడతారు. నీటిలో కరగని ప్రొటీన్ మెదడు కణాల్లో ప్రవేశించి వాటిని నాశనం చేస్తుంటి. ఇలా జరగటానికి APOE తప్ప మరో మరోకోణం లేదని 1993లో తెలిసింది (అల్జీమర్స్ వ్యాధికీ, అధిక కొలెస్ట్రాల్‌కూ దగ్గర సంబంధముంది). E4 జన్యువువల్లే ఇలా జరుగుతోంది. తూర్పుదేశాల వాళ్ళలో తక్కువగా, తెల్లవాళ్ళలో ఎక్కువగా ప్రభావం చూపిస్తుంది.

E4, E3 నిర్మాణంలో ఒక్కలాగే ఉంటాయి. 3345వ అక్షరం తప్ప E3లో ఇది 'A'కు బదులుగా 'G' ఉంటుంది.

మొత్తంమీద, ఈ శాస్త్రపరిజ్ఞానమంతా అందుబాటులోకి వచ్చిన తర్వాత, జన్యుపరీక్షలు జరిపి, ఎవరికి ఏ జబ్బు వచ్చే అవకాశముందో అంచనా వేయగలుగుతున్నాం. అయితే, కోరుకున్న వాళ్ళందరికీ ఈ APOE టెస్ట్‌లు జరపటం సబబేనా? ఎంతమాత్రం కాదంటుంది బ్రిటన్‌లోని Nuffield council of Bioethics. చికిత్సకు లొంగని జబ్బుల గురించి టెస్ట్‌లు చేసి ప్రయోజనమేమిటి? పైగా APOE4 టెస్ట్‌లో ఖచ్చితమైన ఫలితాలు ఇచ్చే అవకాశం కూడా తక్కువే అంటుంది కౌన్సిల్. వీటివల్ల ఇన్సూరెన్స్ ప్రీమియం పెరిగిపోవచ్చు. లేదా అనేక రకాలుగా దుర్వినియోగం చేయవచ్చునని కొంచెం భయం.

శాస్త్రపరిజ్ఞానాన్ని మనం విజ్ఞతతో, మానవ కళ్యాణానికి ఎలా వాడుకుంటామన్నది ముఖ్యం.




(Matt Ridley రచన ఆధారంగా)
తెలుగు : ముక్తవరం పార్థసారథి
హైదరాబాదు.
ఫోన్ : 9177 678 708.

# మృత్యువొడిలో...

**– కె. శ్రీనివాసులు**

*షేక్స్పియర్ తన హామ్లెట్ నాటకంలో అంటాడు – మృత్యువు అనేది మనకు అర్థంకాని క్షేత్రం. అక్కడ సంచరించి తిరిగి వచ్చిన యాత్రికుడెవడూ అక్కడి తన అనుభవాలను మనకు వివరించిన దాఖలాలు లేవు. అక్కడ అతనికెదురైన కష్టనష్టాలేమిటో మనకు ఏ యాత్రికుడూ చెప్పలేదు. అందుచేత మనం జీవిస్తున్న జీవితం, అది ఎన్ని కష్టాలతో నిండి ఉన్నా, దాన్ని వదులుకోవడానికి మనం సిద్ధంగా లేము.*

*సమస్త ప్రపంచాన్ని అబ్బురపరచిన ఆ నాటకకర్త గతించి 450 సంవత్సరాలు నిండాయి. ఇప్పుడు ఒక యువతి మృత్యులోకంలో విహరించి, తిరిగి మన మధ్యకు వచ్చి తను చూచిన వింతలను, అనుభూతులను వివరించడం షేక్స్పియర్‌నే ఆశ్చరపరచవచ్చు.*

"నేను నేనుగా ఉండటానికి మరణిస్తున్నాను" (Dying to be me) అనే పుస్తకాన్ని అనిత మూర్జానీ అనే వనిత 2012లో ప్రచురించి సంచలనం సృష్టించింది. 2002లో తాను కాన్సర్ బారిన పడిన ఉదంతాన్ని చెబుతూ ఆమె మృత్యుగహ్వారంలోంచి ఎలా బైటపడిందీ వివరించింది. చికిత్సనంతా నిలిపివేసి, డాక్టర్లు ఆమెను కేవలం వెంటిలేటర్ల మీద ఉంచినా, ఆమె కోలుకొని లోకాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచిన చరిత్రే యీ పుస్తకం.

కాన్సర్ ఆమెకు ఏమి నేర్పిందీ, మృత్యువొడిలో ఆమె ఏమి చూచిందీ, కోలుకొన్న తరువాత ఆమె జీవిత దృక్పథం ఎలా మారిపోయిందో, తన శేషజీవితాన్ని ఇప్పుడు ఎలా గడుపుతున్నదో – ఇవన్నీ ఈ పుస్తకం నిండా పరచుకొని ఉన్న విశేషాలు.



అనిత మూర్జానీ

ప్రస్తుతం తన భర్తతో కలసి హాంకాంగ్‌లోనే నివసిస్తూ ఉంది. ఆమెకు హాంకాంగ్ యూనివర్శిటీతో సంబంధాలు ఉన్నాయి.

**అనిత జీవిత విశేషాలు :**

ఆమె తాతగారు శ్రీలంకలో వస్త్రవ్యాపారి. అనితకు రెండేళ్ళ వయసులో ఆ కుటుంబం హాంకాంగ్‌లో స్థిరపడింది. అనితా ఆమె సోదరుడూ అక్కడ ఉండే బ్రిటీష్ క్యాథలిక్ స్కూల్‌లో చదువుకున్నందువల్ల క్రిస్టియన్ మత ప్రభావం వాళ్ళమీద పడింది. ఆ కుటుంబం సింధీ భాష మాట్లాడుతూ, హిందూ సాంప్రదాయాలు అనుసరించేది. ఆ రోజుల్లో హాంకాంగ్‌లో చైనా సంస్కృతి విస్తారంగా ఉండేది. ఆ నాటి పరిస్థితుల్లో ఈ మూడు సంస్కృతులూ అక్కడున్న ప్రజలను ప్రభావితం చేస్తూ ఉండేవి. ఈ మూడు సంస్కృతుల సాలెగూడులో అనిత చిక్కుకోక తప్పలేదు. అందువల్లనే ఆమె వివాహం పెద్ద సమస్య అయిపోయింది. వివాహం మాత్రమే కాదు, అనిత తన జీవితాన్ని తనదిగా జీవించడం కష్టమైపోయింది. ఈ సంస్కృతుల, సంప్రదాయాల ప్రభావం నుంచి బైటపడటం చేదు అనుభవంగా మారింది.

అయినా అనితకు తగిన సింధీవరుడు (పేరు డాని) దొరికాడు. 1995లో వివాహం జరిగింది. ఉద్యోగాలు చేసుకుంటూ జీవితంలో స్థిరపడ్డారు. వెంటనే పిల్లల్ని గురించి ఆలోచించడం అనితకు ఇష్టం లేదు. పిల్లలు వెంటనే కావాలనుకుంటే, దత్తత తీసుకోవడం సముచితం అనుకుంది. భార్యాభర్తలు చర్చించుకొని అదే నిర్ణయించుకున్నారు.

2001లో అనిత ఆప్తమిత్రురాలు "సోనీ"కి కాన్సర్ వచ్చింది. ఆమె హాస్పిటల్‌లో

చేరి చికిత్స తీసుకుంటున్న విషయం అనితను బాధించింది. మరో ఆరునెలల్లో మరో ఆప్తుడు కూడా కాన్సర్ బారిన పడ్డాడు (అనిత భర్త డానీ యొక్క చెల్లెలి భర్త). ఈ రెండు విషాద సంఘటనలూ అనిత అంతరాంతరాళాన్ని కుదిపివేశాయి. తన సమవయస్కులైన ఇద్దరు ఆప్తులు వెంటవెంటనే కాన్సర్‌కి గురికావడం అనితను తీవ్రంగా బాధించింది, భయపెట్టింది.

**అనిత కూడ కాన్సర్‌కి గురి అయింది :**

2002లో తన కుడి భుజంపైన ఏర్పడ్డ కణితికి పరీక్షలు చేయించుకోవడం అనితకు తప్పలేదు. పరీక్షలు కాన్సర్ అని నిర్ధారించాయి. కాన్సర్‌కి హాస్పిటల్‌లో ఇచ్చే చికిత్స ఎలా ఉంటుందో, కిమోథెరపీ రోగుల శరీరాలను ఎలా పీల్చి పిప్పిచేస్తుందో అనితకు బాగా తెలుసు. సోనీ జీవితం ఎలా అంతమైపోయిందో చూచిన అనిత మనస్సు కకావికలమైపోయింది. జీవితానికి అర్థం లేదా అనిపించింది. కోపం, భయం, నిస్పృహ, నిరాశ ఆందోళన – ఇవన్నీ అనితను పెనవేసుకున్నాయి. పాశ్చాత్య చికిత్సా విధానాన్ని నిరాకరించాలనీ, హిప్నోథెరపీ, మెడిటేషన్, చైనా మూలికా వైద్యం వీటిని ప్రయత్నించవచ్చుననుకొంది. ఇండియాకి వచ్చి ఆయుర్వేదం, యోగా ప్రయత్నించింది. కొంతకాలం నయంగా ఉంది అనిపించినా, రెండోసారి ఆ చికిత్సా విధానాలను అనుసరించలేదు. హాంకాంగ్‌లోనే ఉండిపోయింది. కాని తనపట్ల ఇతరులు చూపే దయను, సానుభూతిని తట్టుకోలేకపోయేది. ఇదంతా తన 'కర్మ' అని కూడ అనుకుంది. తన ఆరోగ్య స్థితిని గురించి ఇతరులకు వివరించడం కూడా అసహ్యంగా అయిపోయింది. క్షీణిస్తున్న తన ఆరోగ్యాన్ని నిందించుకోవడం, ఆరోగ్యంగా ఉన్న ఇతరులను చూచి అసూయపడ్డం సామాన్యమైపోయింది. హాస్పిటల్‌కి వెళ్లడం, ట్రీట్‌మెంట్ తీసుకోవడం, తిరిగి ఇంటికి చేరడం అలవాటుగా మారిపోయింది. రానురాను అనిత తనకు తానుగా బట్టలు మార్చుకోవటం కూడా కష్టమైపోయింది. నిస్సహాయంగా హాస్పిటల్‌లో చేరిపోక తప్పలేదు.

"మేము చేయగలిగింది ఇంకేమీ లేదు" అని డాక్టర్లు డానీకి చెప్పడం అనిత విన్నది. క్రమేణా శ్వాస తీసుకోవడం కష్టమైపోయింది. ఆక్సిజన్ వాడక తప్పలేదు.

2006 ఫిబ్రవరి 1వ తేదీ – ఆ రోజు అనిత కళ్ళు తెరచి చూస్తే లోకమంతా కొత్తగా కనపడసాగింది. ఆకాశం బాగా నీలంగానూ, పరిసరాలన్నీ ముచ్చటగానూ కనపడసాగాయి. "నేను లేకపోయినా, లోకమంతా బాగానే ఉంటుంది కదా" అనిపించింది. "నేను బాగా రిలాక్స్‌డ్‌గా అయిపోతున్నట్లు, నన్ను జీవితంతో పెనవేసిన బంధమేతో తెగిపోతున్నట్లు పట్టు సడలిపోతున్నట్లు అనిపించింది". అన్నిటినీ వదలుకొని వెళ్ళిపోవడానికి అనిత చివరిగా సిద్ధమైంది. గాఢ నిద్రలోకి జారిపోతున్నట్లు ఆమెకు అనిపించింది.

**కోమాలో అనిత :**

"నాకు సహజంగానే హాస్పిటల్స్ అంటే అసహ్యం. నా స్నేహితురాలినీ, నా బంధువునీ అవి మింగేశాయి" అంటుంది అనిత. ఆంకాలజిస్ట్ ముఖంలోని షాక్‌ని ఆమె ఇలా అర్థంచేసుకుంది – "అనితను రక్షించడం దుర్లభం."

అయినా అనిత సహజమైన ధైర్యంలోనే ఉంది. తన తల్లినీ తన భర్తనీ ధైర్యంగా ఉండమని చెప్పాలని ప్రయత్నించింది. మాటలు పెగల్లేదు.

"ప్రాణం పోతూ ఉన్న ఆ క్షణాల్లో నా చుట్టూరా ఏమి జరుగుతుందో నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది (నా శరీరంలోని ఇంద్రియాలను నేను వినియోగించుకోలేక పోతున్నప్పటికీ).

"ఏదో కొత్త అవగాహనాశక్తి నాలో చేరింది. దాన్ని "అవగాహన" అని కూడా అనలేము. నేను సమస్తమైన విశ్వంలో చేరిపోతున్నట్లు అర్థమవుతూ ఉంది.

అప్పటికప్పుడు డాక్టర్లు నా శరీరాన్ని స్కాన్ చేసి చూశారు. నన్ను ఐ.సి.యు.కి తరలించి, నాకు ద్రవాలు, ఆక్సిజన్ ఇచ్చే ఏర్పాట్లు చేశారు. ఇవన్నీ నాకు తెలుస్తూనే ఉన్నాయి. వచ్చి పోయేవాళ్ళను గుర్తుపడుతున్నాను, కళ్ళు మూసుకునే డాక్టర్లు, నర్సులు అంటున్న ప్రతిమాటలు, వాళ్ళ ప్రతి కదలికనూ నేను గ్రహించగలుగుతున్నాను. ఇదంతా నాకే నమ్మశక్యం కాకుండా ఉంది. నేను స్వేచ్ఛగా తేలిపోతున్నట్లు అనిపించింది. నాకింక ఈ ట్యూబులు, వీల్‌చైర్లు అవసరం లేదు. నా అంతట నేను తిరగగలను, ఎవరి సహాయమూ లేకుండా. నేను ఊపిరి బాగా పీల్చుకోగలుగుతున్నాను. ఇదంతా నాకే ఆశ్చర్యమనిపిస్తూ ఉంది. హాస్పిటల్ బెడ్‌మీద పడి ఉన్న ఈ శరీరం నాది అని అనిపించడంలేదు. నేను పూర్తిగా విముక్తి పొందిన అద్భుతమైన జీవిని. నాకున్న ప్రతి బాధ, నొప్పి, దుఃఖం తొలగిపోయాయి.

ఇవన్నీ ఒకప్పుడు నన్ను బాధించాయి అనికూడా అనిపించడంలేదు. నా శరీరంలో బందీగా నాలుగేళ్ళు గడిపిన నాకు విముక్తి కలుగుతూ ఉంది. నా శరీరం భారరహిత స్థితికి చేరుకుంది.

**మృత్యువు దగ్గరకి ప్రయాణం :**

ఒక అద్భుతమైన చిత్రపటము నా ముందు ప్రత్యక్షమైంది. అందులోని ప్రతి భాగం ఒక గొప్ప ప్రణాళికలో అంతర్భూతంగా ఉంది. నేను అందులో భాగం అయిపోయి విస్తరించిపోతున్నాను. దానికిమించి నాకు వేరే అస్తిత్వం లేదు.

వేల మైళ్ళ దూరంలో విమానంలో ప్రయాణిస్తున్న నా సోదరుడు అనూప్‌ని చూశాను (మా అమ్మ అనూప్‌కి నా ఆరోగ్యం వార్త చేరవేసిందని నాకు తెలియదు). నన్ను చూడడానికే హాంకాంగ్ వస్తున్న అనూప్ ముఖంలోని వ్యాకులతని నేను పసిగట్టాను.

టైమ్ స్పేస్ విభజన నశించిన చోట నేను సంచరిస్తున్నాను. నా చేతన అనంతంగా వ్యాప్తి చెందింది. నేను ఎక్కడెక్కడో శారీరకంగా సంచరిస్తున్నట్లుగాకాక, నేను కొత్తగా మేల్కొన్నట్లు అనిపించింది. ప్రేమ, సంతోషం, తాదాత్మ్యం నన్ను ఆవరించి ఉన్నాయి.

మూడేళ్ళ క్రిందట కాన్సర్‌తో చనిపోయిన నా స్నేహితురాలు సోని యొక్క అభౌతికమైన ఉనికి (ఎస్సెన్స్) నన్ను చుట్టుముట్టింది, ఒక పరిష్వంగంలాగ. నేను గుర్తించలేని ఎన్నో అభౌతిక రూపాలు నా పట్ల ప్రేమను ప్రదర్శించడం నేను చూశాను. నా చుట్టూ $360^{\circ}$ పరిధిలోని సమస్తం నాకు తెలుస్తూ ఉంది.

అక్కడ వాస్తవికతకు అర్థం వేరు – అది భౌతిక అవగాహనకు భిన్నమైంది. మన భౌతిక వాస్తవికతకు ఉన్న పరిమితులు అక్కడ లేవు. నా శరీరం కూడా ఒక అభౌతిక వాస్తవంగా తెలిసింది. ఈ వాస్తవికతలో అస్పష్టత ఏమీ లేదు. అయినా దాన్ని మాటల్లో చెప్పలేము. నా ఆత్మ యొక్క అందం నేను స్పష్టంగా చూస్తున్నాను.

ప్రయత్న పూర్వకంగా ఎవరూ ఎవరినీ ప్రేమించడం అనేది అక్కడ లేనే లేదు. అందరినీ చుట్టుముట్టే గుణంగా ప్రేమను అక్కడ గుర్తించాను. అది ప్రతి మనిషిని, ప్రతి జంతువును, చెట్టును, కీటకాన్ని, పర్వతాన్ని, సముద్రాన్ని అన్నింటినీ బంధించి ఒక అద్భుతమైన సంబంధంలో ఉంచుతుంది.

కాన్సర్ అన్నది ఒక శిక్ష అనిగాని, 'కర్మ' అనిగాని నాకు అక్కడ తోచలేదు.

దేవుడనేవాడు కృష్ణుడు, బుద్ధుడు, జీసస్ రూపంలో లేడని, ఒక స్థితినే దేవుడుగా స్వీకరించవచ్చునని నాకు తెలిసింది. నేనూ అక్కడ ఉంటున్నది ఒక అభౌతిక స్థితిలోనే, శరీరం – దాని లక్షణాలేవీ లేని స్థితి. ఆ స్థితి అజరామరం. అదొక అద్భుతం ఆ స్థితిలో ఉన్న నాకు అనిపించిందేమిటంటే ఈ లోకంలో ఉన్నప్పుడు నేనెందుకు నా హృదయం చెప్పినట్లు నడుచుకోలేదు? నా హృదయగతమైన సత్యాన్ని ఉన్నది ఉన్నట్లు నేనెందుకు అనుసరించలేకపోయాను?

ఇప్పుడు నేను నన్ను కొత్త కళ్ళతో చూచుకోగలుగుతున్నాను. ఈ లోకంలో నేనొక అందమైన ప్రాణినని, ఇక్కడ ఉన్న అందరూ నన్ను కారణరహితంగా ప్రేమిస్తున్నారు.

కొన్ని సంవత్సరాల క్రితం మరణించిన మా నాన్న అభౌతిక రూపం (ఎస్సెన్స్) నన్ను ఆప్యాయంగా పలకరించి, నాకు సలహా ఇచ్చింది – "నీవు ఇక్కడికి రావడానికి ఇది సరైన తరుణం కాదు. అయినా నీవు నాతో వస్తావా, లేక నీ శరీరంలోకి వెళ్ళిపోతావా అన్నది నీ నిర్ణయమే. ఈ హద్దు వరకు రావడానికి మాత్రమే నీకు అవకాశం ఉంది. హద్దు దాటి ముందుకెళితే వెనక్కి రాలేవు."

నా హద్దు నాకు తెలిసింది – హద్దు అంటే గీత కాదు. కంటికి కానరాని గడప (threshold). అప్పుడు నేనెవరినో నాకు తెలిసింది. నా నిజరూపం ఏమిటో నేను గ్రహించాను. నేను నా మునుపటి జీవితాన్ని స్వీకరించడానికి నిర్ణయించుకుంటే, నా జబ్బు పూర్తిగా నయమవుతుంది అన్న అవగాహన నాకు కలిగింది. తిరిగి వెళ్ళిపోయి నేను చూచిన అద్భుతాలన్నీ అసంఖ్యాకమైన మనుషులకు వివరించగలను. నేను ఇక్కడ అవగాహన చేసుకున్న ప్రేమను, నిజమైన ఆత్మస్వరూపాలను లోకంలోనివారికి చెప్పగలను.

మా నాన్న, సోని ఇద్దరూ కూడా నాతో ఇలా అన్నట్లు నేను గ్రహించాను – "నీకిప్పుడు సత్యం తెలిసింది. నీవంటే నిజంగా ఏమిటో నీవు గ్రహించావు, తిరిగి వెళ్ళిపోయి నిర్భయంగా జీవించు."

**కాన్సర్ నుండి అద్భుతమైన విముక్తి :**

నేను నన్ను అద్దంలో చూసుకున్నప్పుడు, నన్ను నేను పోల్చుకోలేకపోయాను. క్షీణించిన కండరాలు, వెంట్రుకలు రాలిపోయిన తల, వెక్కిరిస్తున్న కళ్ళు, చెక్కిళ్ళు నా ప్రస్తుత

స్థితిని అంచనా వేయడానికి డాక్టర్లు పరీక్షలు చేశారు. ఎముకల్లోని మజ్జను బయాప్సీ చేశారు. కాన్సర్ ఉన్న లక్షణాలు దొరకలేదు. తన వ్రణం అంత త్వరగా ఎలా కరిగిపోయింది? ఇంకొన్ని టెస్టులు చేసినా అదే ఫలితం వచ్చింది. నన్ను అయిదు వారాలు అబ్జర్వేషన్‌లో ఉంచారు.

2006 మార్చి 9 న నన్ను ఇంటికి పంపారు.

నన్ను చూడడానికి వచ్చిన శ్రేయోభిలాషులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. కాన్సర్ నుండి ఎలా బయటపడ్డానో తెలియక తికమకపడ్డారు. కొత్తకొత్త డాక్టర్లు నేనున్న హాస్పిటల్‌కి చేరుకుని, వివరాలు సేకరించుకుని వెళ్ళారు. నన్ను ఇంటర్వ్యూ చేశారు. ప్రపంచంలో చాలాచోట్ల నన్ను గురించి చర్చలు, సమావేశాలు, కాన్ఫరెన్స్‌లు జరిగాయి. నాలాంటి కేసు చరిత్రలో లేదు అన్నారు. నా కాన్సర్ విముక్తిపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి.

**కొత్త కళ్ళతో జీవితాన్ని దర్శించటం :**

ఈ లోకంలో ఉన్న ప్రతిదీ పరమ అద్భుతంగా అనితకు కనబడసాగింది. సాధారణమైన విషయాలు కూడా ఆశ్చర్యకరంగా, యాంత్రికంగా తోచసాగాయి. తన రూమ్‌లో ఎప్పటినుంచో ఉంటున్న వస్తువులన్నీ కొత్తగా కనబడుతున్నాయి. తన పాత సోఫా అద్భుతమైన పనితనంతో నిండి ఉన్నట్లు అనితకు అనిపించింది. చాలాకాలంగా వాడలేకపోయిన తన కారును వీధి మలుపులు తిప్పుతున్నప్పుడు తన చేతులు, కళ్ళు, కాళ్ళు ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు అనిత గమనించింది.

సహజంగా స్వేచ్ఛాయుతమైన భావాలున్న యువతి. అయినా కాన్సర్ తనపై దాడిచేసినపుడు, నిస్సహాయంగా ఉండిపోక తప్పలేదు. తన భర్తపై పూర్తిగా ఆధారపడక తప్పలేదు. ఇప్పుడు తనకు విముక్తి కలిగిన తర్వాత డాని తన ఉద్యోగంలో చేరిపోయాడు. అనిత వాళ్ళ తల్లి, సోదరుడు వాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

మరలా ఏదో వ్యాపకం పెట్టుకోవటం అన్నది అనితకు చిత్రంగా తోచింది. ఇతరులతో తనకున్న సంబంధాలు మునుపటిలాగ ఉండటానికి వీల్లేదనిపించింది. ఇక్కడున్న మనుషుల విలువలతో రాజీపడలేకపోతుంది. అనిత ప్రాధాన్యతలు మారిపోయాయి. ఏదో ఒక ఉద్యోగంలో చేరి డబ్బు గడించడం, యాంత్రికంగా జీవించడం కుదరదు అనుకున్నది. తన NDE (Near Death Experience) తనను ఏకాకిని చేసిందా? ముందులాగ స్నేహితులతో మాట్లాడలేకపోతూ ఉంది. ఒంటరిగా బీచ్‌లో కూర్చొని, ఐస్‌క్రీం తింటూ, ఇసుకలో కాళ్ళు కదపటం చిత్రమైన అనుభూతిగా అనిత భావిస్తూ ఉంది. అన్నింటిలోనూ ఆమెకు దైవత్వం గోచరిస్తూ ఉంది. ప్రతి జంతువులో, ప్రతి కీటికంలో కూడ. దోమల్ని సహితం చంపలేకపోయేది. *ప్రతి ఉదయం ఆమెకు కొత్తగా తోచేది. ప్రతి రోజు ఒక అడ్వెంచరే.* సిటీలోని వీధులు, భవంతులు, వంతెనలు అన్నీ ఆశ్చర్యకరంగా కనపడుతున్నాయి. తాను కొత్తగా జన్మించినట్లుంది. పాత స్నేహితులతో మెలగటం ఇబ్బందిగా ఉంది. ఆమెలో వచ్చిన మార్పులను వాళ్ళు గుర్తించలేరు. అనిత తన భర్తతో మాత్రం చాలావరకు మునుపటిలాగే ఉంటూ ఉండేది. అతనికి తెలుసు ఆమెలోని మార్పులు. డానీలో అనితకు తన అనుభూతుల్ని, భావాల్ని పంచుకోవడం సులభంగా ఉంది. పుస్తకం రాయమని అనితను ప్రోత్సహించింది డానీనే.

**NDE తర్వాత అనితలో వచ్చిన మార్పులు :**

నాకు దేనిపట్లా భయం లేకుండా పోయింది. జబ్బులన్నా, వార్ధక్యం అన్నా, చావు అన్నా, ఆస్తిపాస్తులు పోతాయన్నా భయపడడం తెలియకుండా పోయింది. ఈ లోకం వాస్తవం అనిపించడంలేదు. నేను NDE లో చూచిందే నిజమైన లోకం. *ఈ లోకంలో ఉన్న విలువలన్నీ తప్పుగా తోస్తున్నాయి.*

అనితను సమీపం నుండి గమనిస్తూ ఉన్న డానీలో కూడా మార్పులు వచ్చాయి. తన కలలను వాస్తవం చేసుకోమని అనిత అతన్ని ప్రోత్సహించింది. ఇతరుల కోసం పనిచేయడంకంటే, తమకోసమే తాము పనిచేయడం మంచిది అనుకున్నారు దంపతులు.

వాళ్ళు చిన్న ఇంట్లోకి మారారు. అది హాంకాంగ్ పొలిమేరల్లో, ఒక చిన్న గ్రామం. తమ జీవితాన్ని కొత్తగా ప్రారంభించారు. సహజంగా, నిరాడంబరంగా జీవించడం నేర్చుకున్నారు.

NDE వల్ల అనితలో వచ్చిన పెద్ద మార్పు – జీవిత వాస్తవాలను చూసే దృక్పథంలో. జీవితాన్ని బయట నుండి కాకుండా, అంతర్గతంగా అర్థంచేసుకొని విలువ కట్టటం. ఇంతకు ముందు ఆమె జీవితం పరిస్థితుల ప్రభావంలో గడిచేది. ఇప్పుడు అలా కాదు –

"నాలో దైవత్వం ఉంది. సమస్త విశ్వంలో అవిభాజ్యమైన భాగాన్నే నేను. విశ్వంలో ఉన్నదంతా, ఉన్నవన్నీ పరస్పర

సంబంధంలోనే ఉన్నాయి. ఇదొక కాస్మిక్ వెబ్ (బ్రహ్మాండమైన సాలెగూడులాంటిది). మనం అందరం ఆధ్యాత్మిక జీవులం. ఈ విషయాలు మనుషులు గ్రహించలేకపోతున్నారు'' అంటుంది అనిత.

అనిత అవగాహన చేసుకున్న మరొక విషయం నిజమైన సంతోషం, ఆనందం మనల్ని మనం ప్రేమించుకోవడంలోనే ఉన్నాయి. నాలో నేను దర్శించుకోవడంలోనూ, హృదయం నిర్దేశించిన మార్గంలో నడుచుకోవడంలోనూ ఉన్నాయి. అంతేగాని మన సంస్కృతి, సంఘం నిర్దేశించినట్లు ప్రవర్తించడంలోనూ రావు.

తన స్నేహితులు అంటున్నారు గదా – తన సమీపంలో ఎనర్జీ మార్పులు సంభవిస్తున్నాయని. ఆ విషయంపై బహిరంగంగా ఏమీ చెప్పలేనంటుంది అనిత.

ఇంతకు ముందులాగ అనిత అందరితో కలగలపుగా ఉండడం లేకపోయినా, ఆమె ప్రాధాన్యత ఏమిటంటే "నేను నేనేగా ఉండటం" అంటుంది ఆమె.

**కాన్సర్ అదృశ్యం కావడం ఒక ప్రారంభమే :**

నా NDE ని అందరికీ చాటించాలన్న ఉత్సాహం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. కాని ఒక సందేహం నాలో కలక్కపోలేదు. నా NDE ని ఇతరులు ఎలా స్వీకరిస్తారో? నా పట్ల నేను నిజాయితీగా ప్రవర్తించడం నేను మానలేదు. నాలోని ఆనందం చెక్కుచెదరలేదు.

2011 మార్చిలో, సునీత (ఎమిరేట్స్‌లో హోలిస్టిక్ ట్రైనింగ్ సెంటర్ నడుపుతున్న నా స్నేహితురాలు) నన్ను దుబాయ్‌కి ఆహ్వానించింది. అక్కడ నా NDE అనుభవాలను జనంతో పంచుకోమని కోరింది. వెళ్ళాను. అక్కడ సమావేశమైన వారందరూ నా అనుభవాల ప్రభావానికి బాగా స్పందించారు. ఆ గదిలో ఏదో శక్తిపూర్వకమైన మార్పు సంభవిస్తున్నట్లు అందరూ భావించారు.

దుబాయ్‌లో ఉండగానే ఒక ఇ-మెయిల్ ద్వారా నాకు అందిన సమాచారం ఏమిటంటే Hay House వాళ్ళు నా అనుభవాలను పుస్తక రూపంలో ప్రచురించడానికి నిశ్చయించారు. ఈ వార్త నాకు మంచి బర్త్‌డే గిఫ్ట్ అయింది. అంతకు ముందే నేను – NDE కి పుస్తక రూపం ఇవ్వాలని అనుకుంటూనే ఉన్నాను. నా NDE ని గురించి రేడియో షోలు, ఉపన్యాసాలు, వ్యాసాలు చాలా వస్తున్నాయి.

**నేను ఎందుకు అనారోగ్యంపాలయ్యాను?**
**ఎలా బయటపడ్డాను?**

నేను ఉపన్యాసాలకు వెళ్ళినప్పుడు చాలామంది అడిగే ప్రశ్న – "మీకు ఎందుకు కాన్సర్ వచ్చింది?" ఒక్క మాటలో చెప్పాలంటే "భయంవల్ల". నాకు కాన్సర్ అంటే వల్లమాలిన భయం. జీవించడం అన్నా, చనిపోవడమన్నా భయమే. ఎందుకంటే, చాలా చిన్నతనం నుంచి కొన్ని భయాలు మనలో చేరిపోతాయి. ఇతరులు నన్ను ద్వేషిస్తారేమోనన్న భయం, నేను అందరిలాగా అందంగా, తెలివిగా లేనన్న భయం. అన్నీ మనలో ఉన్నాయి. ఈ భయాలవల్ల నేను చేసే ప్రతి పనీ ఇతరులను మెప్పించడానికేగాని, నా ఇష్టప్రకారం చేయలేకపోయేదాన్ని. అందుచేత నేను నేనుగా లేను. ప్రతి వ్యక్తీ ఒక అద్భుతమైన జీవే అన్న స్పృహ మనకు లేదు. ఆ స్పృహ ఉంటే భయం మనలో కలిగేది కాదు.

నాకు దగ్గరగా ఉన్న ఇద్దరు వ్యక్తులు కాన్సర్‌కి గురికావడం నన్ను కుంగదీసింది. అప్పుడు కాన్సర్ గురించి చాలా చదివాను. మనం తినే ఆహారం వల్లా, మనం వాడే ప్లాస్టిక్ వల్లా, Pestcides వల్ల Preservatives వల్ల కాన్సర్ వస్తున్నట్లు తెలిసింది. వీటి భయాలు కూడా నాలో చేరిపోయాయి. ఏ వైద్య విధానమూ కాన్సర్‌ని నయం చేయలేవు అని జనం అనుకోవడం కూడా నన్ను భయపెట్టింది.

కాన్సర్‌ని తప్పించునే ప్రయత్నంలో ధ్యానం, ఆయుర్వేదం, ఎనర్జీ హీలింగ్, Faith healing, Reki ప్రయత్నించాను. ఇండియాలోను, చైనాలోను ప్రయాణం చేశాను. బుద్ధిస్ట్ మాంక్‌ని కలిశాను. ఇలా నన్ను నడిపింది నా భయమే.

కాన్సర్ బారినపడి, శిథిలమైపోయిన నా శరీరంపై నా పట్టు సడలిపోయినప్పుడు, అన్ని నివారణామార్గాలను వదలిపెట్టి, మానవ అతీతమైన శక్తిమీద ఆధారపడ్డాను. నేను పూర్తిగా Surrender అయిపోయాను. భయం పూర్తిగా తొలగిపోయింది. అప్పుడు నాకు తెలియకుండానే నా నిజస్వభావం నాలో చేరిపోయింది. కాన్సర్ అన్నది ఒక శిక్ష అనుకోవడం ఆగిపోయింది.

భయం నుండి పూర్తిగా విముక్తి పొందిన నేను చేసుకున్న నిర్ణయం (తిరిగి వచ్చేయాలని) శక్తివంతంగా పనిచేసింది. నా శరీరంలోని ప్రతి క్షణం ఆ నిర్ణయానికి ప్రతిస్పందించింది.

ఆ తర్వాత నా శరీరంపైన డాక్టర్లు చేసిన టెస్టులు అన్నీ నెగిటివ్ ఫలితాన్ని ఇచ్చాయి. అత్యంత అద్భుతమైన నా ఆత్మ (Self) చేసిన నిర్ణయమే నన్ను తిరిగి లోకంలో చేర్చింది. ఈ నిర్ణయం ఆలోచనా పూర్వకంగా జరిగింది కాదు. అది ఆలోచనకు అతీతమైంది. అప్పుడు నేను ఆలోచించే స్థితిలోనే లేను. నేనున్నది అస్థిత్వ స్థితిలో (a state of being). అది Pure consciousness (స్వచ్ఛమైన ఎరుక)లో ఉండే స్థితి.

నా జబ్బు నయమవుతుంది అన్న నమ్మకం నన్ను కాపాడింది అని మీరు భావించడం తప్పు. నన్ను ఏ నమ్మకమూ కాపాడలేదు. నా Pure Consciousness మాత్రమే నన్ను రక్షించింది. Pure Awareness అంటే అన్ని విశ్వాసాలూ, నమ్మకాలూ తొలగిపోయిన స్థితే.

“నేను బ్రతకాలి” అన్న నా దృఢమైన కోరికను పూర్తిగా వదిలివేసినప్పుడు, నేను మృత్యువును అనుభవం పొందాను. నేను కావాలనుకున్నదాన్ని వదలుకున్న నాకు స్వభావసిద్ధమైంది దొరికింది.

NDE తర్వాత నన్ను బంధించే నమ్మకాలు, విశ్వాసాలు లేనే లేవు. అపనమ్మకాలూ లేవు. నేను వాటి నుండి విముక్తి పొందిన స్వేచ్ఛాజీవిని. నా ముందు ఎన్నో అవకాశాలు నేను చూస్తున్నాను. అద్భుతమైన జీవితం నా ముందు పరచుకొని ఉంది.

నేను నేనుగా ఉండటం అంటే ప్రేమతో ఉండటం. సర్వాన్నీ ప్రేమించడం. ద్వేషం ఎరగని ప్రేమ. అది కారణ రహితమైనది. ఆ ప్రేమను ఎరిగినవాడు ఇతరులపట్ల ప్రేమను ప్రదర్శించలేడు. అందరికీ అందరిపట్లా ప్రేమ ఉన్నప్పుడు ప్రేమను వ్యక్తపరచవలసిన అవసరం ఎందుకుంటుంది? అప్పుడు శతృత్వం అన్నదే కనబడదు. నేనంటే ప్రేమే అని గ్రహింపచేయడం NDE నాకు నేర్పిన విలువైన పాఠం.

**NDE వల్ల నేను గ్రహించిన ఇతర విషయాలు :**

ఉన్నది ప్రతిదీ విశ్వబంధంలో ఉండేదే. వేరుగా దేనికీ అస్తిత్వం లేదు. ఈ బ్రహ్మాండం మొత్తం ప్రాణంతో తొణికిసలాడుతూ, చైతన్యవంతంగా ఉంటున్నదే. ప్రతి ఆలోచనా ప్రతి భావమూ మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది.

NDEలో మనం గ్రహించే విషయాలనన్నిటినీ వ్యక్తం చేయడానికి మన భాష చాలదు. నేను పొందిన NDE తెరుచుకుని ఉన్న ఒక ద్వారం లాంటిది. దాన్ని మూయడం అసాధ్యం.

NDE కి ముందు అందరిలాగే నేనూ అనుకునేదాన్ని – జీవిత ధ్యేయం నిర్యాణం చెందడం అని, స్వర్గాన్ని చేరడం అని. నా NDE వల్ల నేను భిన్నంగా అర్థం చేసుకుంటున్నాను. ఉన్నచోటనే ఉంటూ తన జీవితాన్ని తాను అత్యంత గుణాత్మకంగా తీర్చిదిద్దుకోవటమే నిర్యాణం అని ఇప్పుడు నేను గ్రహిస్తున్నాను. సత్యమనేది పుస్తకాల్లోనో, మతంలోనో, మరెక్కడో ఉన్నట్లు భావించడం అందరి అలవాటు. అది తప్పు అని నాకు NDE నేర్పింది. విశ్వమంతా మనలోనే ఉంది. నేను శరీరాన్ని మాత్రమే కాదు. నేను స్వచ్ఛమైన చైతన్య రూపాన్ని. నేనే కాదు అందరూ అంతే. అందరూ కలసి విశ్వచైతన్యంలో భాగమే. నేను ఈ శరీరాన్ని, నాది ఈ మతం, నాది ఈ సంస్కృతి అనుకోవడం మూర్ఖత్వం.

యూనివర్సల్ ఎనర్జీ అనేది అందరిలోనూ ప్రవహిస్తుంటుంది. దానికి హద్దులు లేవు. ప్రతి ఒక్కరిలో ప్రవహించేది అదే. అది అద్భుతాలు చేయగలదు, చేయించగలదు. ఈ ఎనర్జి యొక్క స్పృహ మనకు కలగకుండా అడ్డుకునేది మన మనస్సే. మనస్సు యొక్క అడ్డు తొలగిపోయినపుడు యూనివర్శల్ ఎనర్జి యొక్క స్పృహ మనకు కలుగుతుంది. చాలాకాలం మన మనస్సు చెప్పినట్లు చేస్తూ పోతే దానికి లొంగిపోవడం అలవాటు అవుతుంది. మనస్సు చెప్పింది చేయడమే జరుగుతుందిగాని, మనం జీవించడం జరగదు. జీవించడం అంటే పనులు చేస్తూ ఉండడం కాదు, జీవించడం అంటే వర్తమానంలో ఉంటూ మన ఎమోషన్స్‌ని ఫీలింగ్స్‌ని అనుసరించడం.

NDE లో నాకు తెలిసిన మరో విషయం – ద్వేషం, అసూయ, భయం కలిగేది తమ ఔన్నత్యాన్ని తామెరగనివారికే. తమ అత్యున్నత స్థితిని ఎరిగినవారిలో వాటికి చోటు ఉండదు. తమని తాము ప్రేమించలేనివాళ్ళల్లోనే అవి కలుగుతాయి. ఏ వ్యక్తీ చెడ్డవాడు కాదు. చెడ్డ అనేది మన భయంవల్ల ఏర్పడేదే, నా కాన్సర్‌లాగ. మనుషుల్లోని దురాశ కూడా క్యాన్సర్‌లాంటిదే. దురాశ భయానికి మారురూపం. దురాశకు, భయానికీ దూరంగా మనుషులు నివసించేటప్పుడు జైళ్ళు, హాస్పిటల్స్ అవసరం ఉండవు.

నేను నేర్చుకున్నది మరొకటి కూడా ఉంది. నేను ఈ లోకంలో ఉన్నది “ఉండటానికే” నేను నేనుగా ఉండటానికే. ఏదో చేయడానికి కాదు. ప్రతి వ్యక్తి పర్‌ఫెక్ట్ (నిష్కళంకం)గా ఉన్నప్పుడు చేయడానికి ఏముంటుంది? ఏమీ ఉండదు.

కేవలం ఉండటం తప్పు. ఎలా ఉండటం అంటే నేను నేనుగా ఉండటం. ప్రేమ రూపంగా ఉండటం.


ఈ లోకంలో మనుషులు తమ ఆలోచనలు (నియమాలు, నమ్మకాలు, విలువలు) నిర్మించిన చట్రంలో జీవిస్తున్నారు. అందువల్లనే ఈ లోకం మనం చూస్తున్న రూపంలో ఉంది. భిన్నమైన తీరులో ఉండాలంటే మనం ఆ చట్రంలో జీవించడం మానుకోవాలి.

మనలో ఉన్న వెలుగే యూనివర్శల్ ఎనర్జి అని, ఆ వెలుగే మనం అనీ, మనం గ్రహించినపుడు ఈ లోకం పూర్తిగా భిన్నంగా ఉంటుంది.

**నీవు నీవుగా ఉండటం :**

ఇప్పుడు నేను భయం లేకుండా సంతోషంగా జీవిస్తున్నాను. NDE కి ముందు నేను చేసిన ప్రతిదీ భయంతోనో లేక ఇతరుల మెప్పుపొందడానికో – అంటే ప్రతిదీ స్వార్థపూరితంగా జరిగేదే. NDE తర్వాత నేను ఉంటున్నది ఏదో సాధించడానికి అని నేను అనుకోవడంలేదు. నేను చేసేదంతా ప్రేమతోనే. ఏదో ఒక సూత్రాన్నో, సిద్ధాంతాన్నో అనుసరించకుండా, నా హృదయం చెప్పినట్లు నడుచుకుంటున్నాను. ఇందులో నేను తప్పుచేసే అవకాశం లేదు. ఇలా చేస్తున్నందువల్ల నా ఆరోగ్యానికి భంగమే కలగడంలేదు.

NDE కి ముందు నేను ఇతరుల నుండి మార్గదర్శకత్వాన్ని కోరేదాన్ని. NDE తర్వాత నేను తెలుసుకున్నదేమిటంటే ఇతరుల మార్గదర్శకతలో నడిచేవాడు, తనని తాను పోగొట్టుకుంటాడు. నీవు మంచిదని గ్రహించిన దాన్నే నీవు చేయడంతో ఏవో సిద్ధాంతాలను, నీతినియమాలను అనుసరించడం తప్పుతుంది. వ్యవస్థీకృతమైన మతాలవల్ల మన భయాలు తొలగిపోవని తెలుసుకున్నాను. నీవే ఒక Infinite self అని నీవు గ్రహించినపుడు, ఇతరులను అనుసరించడం ఉండదు. అలా చివరికి నా NDE నన్ను దగ్గరకు చేర్చింది. నా వ్యక్తిగత మార్గమే నాకు మార్గదర్శి అయింది. నేను వ్యవస్థీకృత మతాలను ద్వేషించడంలేదు. కాని




ఘర్షణలను పెంచి, హింసను ప్రోత్సహిస్తున్నాయి. అవి సృజనాత్మకతను ప్రోత్సహించవు, నీలోని ఔన్నత్యాన్ని చూడనివ్వవు.

కేవలం ఉండడమే నీ జీవితం అయినప్పుడు, నీవు దేనికోసం శ్రమిస్తావు – స్వార్థరహితంగా, మంచిగా ఉండటం తప్ప. నీలో negative ఆలోచనలు రావడానికి ఆస్కారం ఎక్కడుంటుంది? మనుషులను మంచివారుగా, చెడ్డవారుగా విభజించి చూడటం (అంటే మీరు న్యాయనిర్ణేతలుగా కావడం) అర్థంలేని విషయం అని నాకు NDE నేర్పింది.

నేను చూచిన లోకంలో నన్ను ద్వేషించేవాళ్ళే లేరు. అందరూ నన్ను అభిమానిస్తారు, ప్రేమిస్తారు – అలా ప్రేమించబడడానికి నేను ఏమీ చేయనవసరం లేదు అని కూడా నాకు తెలిసిపోయింది. ఇటువంటప్పుడు నా ప్రవర్తన అంతా లోకహితం కోసమే అవుతుంది అని నేను గ్రహించాను. నా ప్రవర్తనే నా మెసేజ్ అయింది. నాలో ఆతృతగాని, దుఃఖంగాని, భయంగాని లేవు అని మీరు గ్రహించే ఉంటారు. అవి లేని వ్యక్తి సంఘంలో ఎలా నడుచుకుంటారో మీరు సులభంగా అర్థంచేసుకుంటారు.

నేను వాస్తవంగా ఎవరినో గ్రహించి, దానికి అనుగుణంగా నేను నడుచుకుంటున్నప్పుడు, నాలో వికృతమైన ఆలోచనలు ఎలా ఉంటాయి?

నా ఆరోగ్యం చెదిరిపోవడానికి మరొక కారణం – నా దృష్టినంతా బాహ్యప్రపంచం మీద కేంద్రీకరించడమే. అంటే ఇతరులతో పోల్చుకోవటం, వాళ్లతో పోటీపడటం. దీనికి బదులు నా దృష్టిని నాలోకి ప్రసరింపజేసి ఉంటే, నాకు ఎన్నో వాస్తవాలు తెలిసేవి. నా భయాలు, నా సంకుచితత్వం, నా నీచత్వం నాకు తెలిసేవి.

ఇప్పుడు నేను కోరుకునేదంతా దేనికీ తొందరపడకుండా, యూనివర్శల్ ఎనర్జీని నాలో సహజంగా ప్రసరింప చేసుకోవడమే. ప్రతి క్షణాన్ని శ్రద్ధగా గమనిస్తు, నన్ను నేను అర్థంచేసుకుంటూ ఉండటమే. బైట ప్రపంచంలో ఏదో సాధించాలని అనుకోవడంలేదు. నా చేతనను విస్తరింపజేసుకొని, ప్రశాంతంగా జీవించడమే నేను చేయవలసింది.

# కరవది శాసనము – ఒక పరిశోధన

– ముదిగొండ శివప్రసాద్

కరవది గ్రామము ఒంగోలుకు ఉత్తరముగా పదిహేను నిమిషాల ప్రయాణ దూరంలో ఉంది. ఇది ఒకప్పుడు అగ్రహారం. గుండేరు అనబడే గుండ్లకమ్మ తీరాన అద్దంకి రెడ్డి రాజుల కాలంలో వైభవోపేతంగా ఉండేది. ఇక్కడ వేణుగోపాలస్వామి దేవాలయం నూరేండ్ల నాటిది. సాయిబాబా గుడి అభయాంజనేయ దేవాలయములు ఆర్వాచీనములు. ఇక్కడి రామలింగేశ్వరస్వామి వారి దేవాలయము వేయేండ్ల నాటిది.

'ప్రభాతగీతం' పేరున ఒక సాంఘిక నవల వ్రాశాను. ఆ కథ మొత్తం కరవది గ్రామం చుట్టూ తిరుగుతుంది. ఈ కారణంచేత కరవది గ్రామ చరిత్రపై పరిశోధన మొదలుపెట్టాను. నూరేండ్ల నాటి పిశుపాటి వెంకట రంగయ్య రాజా వారి సంస్థానానికి సంబంధించి చాలా విలువైన సమాచారం లభించింది. ఇంతకన్నా ముఖ్యంగా రామలింగేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన ఒక శిలాశాసనం లభించింది. ఇది ఎనిమిది వందల సంవత్సరాల నాటిది. ప్రస్తుతం ఈ శాసనంలోని ఒక ముక్క ఆరు పంక్తులతో ఆలయ ప్రాంగణంలో ఉంది. నిజానికి ఇది రెండువైపుల లిపి కలిగిన శిలాశాసనము. ఇది మొత్తం నష్టమయింది.

ఈ సందర్భంగా జరిపిన పరిశోధనలో మొత్తం శాసనాన్ని పట్టుకోగలిగాను. ఆ వివరాలు పరిశోధక విద్యార్థుల కోసం ఈ వ్యాసంలో అందిస్తున్నాను. ఈ శాసనము కాకతీయ రెండవ ప్రతాప రుద్రుడు ఆంధ్ర దేశాన్ని పాలిస్తున్న సమయంలోనిది. శాసనంలో శక సంవత్సరం 1232 ఉదాహరింపబడింది. అంటే క్రీస్తు శకం 1310 నాటిది.

ఈ శాసనాన్ని వేయించింది ప్రతాపరుద్రుడు కాదు. ఆయన కరవదికి వచ్చాడని కూడా చెప్పలేము.

గుండ్లకమ్మ నదీతీరంలోని కొందరు పదాన్యులు భూమిని స్వామివారికి దానం చేస్తూ వేయించిన శాసనం ఇది. ఇందులో దేవుని పేరు 'రామనాథ' స్వామిగానే పేర్కొనబడింది.

ఇప్పుడు కరవదిలో రామలింగేశ్వరస్వామి పేరుతో ఈ దేవాలయం ప్రసిద్ధమైంది. 'రామలింగేశ్వర' నామంతో ఎక్కువగా విష్ణుకుండినుల కాలంలో దేవాలయాలు వచ్చాయి (ఉదా. కీసర – తెనాలి – ఇత్యాదులు). 1890లో రాజా పిశుపాటి వెంకట రంగయ్య రాజావారు ఈ ఆలయంలో పార్వతీ, వీరభద్రస్వామి విగ్రహాలను ప్రతిష్ట చేశారు. అంటే, అవి తత్పూర్వం ఏమయినట్లు? ఈ చరిత్ర చెప్పేవారు లేరు. నారాయణం కృష్ణమాచార్యుల వారికి తెలిసి ఉంటుంది. కాని వారిప్పుడు లేరు. వారి కుమారుడు రఘు నాకు విరిగిన శాసనం ఫోటో పంపించారు. శాసనం పూర్తి పాఠం ఈ క్రింద ఇస్తున్నాను.

'స్వస్తిశ్రీ శుభ శకవరుషంబులు 1232 అగు నేటి సాధారణ సంవత్సర, శ్రావణ బహుళ 10 – గు – ప్రతాపరుద్ర దేవ మహరాజులు ప్రిథ్వీరాజ్యము సేయంగాను గుండేటి దక్షిణాన కఋవది రామనాథ దేవరకు కాయమ బొప్పందునూ దేవయరెడ్డి గారును రెడ్లూను కాపులునూ సెట్లూను పదునెనిమిది జాతులవారు కూడా చేసిన ధర్మము దేవక్షేత్రము ఎత్తుగలవారు

నుపట్టి – (?) వంగము

సిల్లర సుంకము చేయును (?)

వ్యలేకుండా నిస్తిమి తమ సరకమ్మి (?)

(?) ధర్మము సురము భండి

వరుపుడు (?) చీరె సకల ధాన్యాలూను ఏ సరకమ్మినాను (?) విసామూను పణమున

నరకాసూను నిర్ణయించి సరుకు గొన్నవారు వెట్టెడిది.

అమ్మెడి బెహారీ పెట్టెడిది ఇమెర (?)

తూను పెట్టనీక విఘ్నము సేసినవారు గంగకర్తంగవిలం బొడిచిన

పెద్దకొడుకు కపాలానం గల్లు త్రావిన వారు పంచమహాపాతకాలు బడువారు

కుభుక్తుని పెరనడ్డు సెప్తిమి (?)

**వ్యాఖ్యానము :**

శ్రీ ప్రతాపరుద్ర దేవమహారాజు క్రీ.శ. 1290 నుండి 1323 వరకు ఓరుగల్లు రాజధానిగా పరిపాలించాడు. ఈయనను ఆంధ్ర చక్రవర్తి అనేవారు. కరవది శాసనంలో ఈ విషయం తెలుస్తున్నది. ఇక గుండేరును నేడు గుండ్లకమ్మ అని పిలుస్తున్నారు. నదీ తీరాలల్లో దివ్యక్షేత్రాలు వెలియడం సహజమే. ప్రస్తుతం రామలింగేశ్వర స్వామివారి దేవాలయం

అని పిలువబడుతున్న దైవం ఆనాడు 'రామనాథ దేవర'గా ఈ శాసనంలో పేర్కొనబడ్డాడు. ఈ దానమును వేసినవారు కామయ్య బొప్పండు – దేవరరెడ్డి ప్రభృతులు ఇతరుల పేర్లలో కాపు – రెడ్డి శెట్టి ఇంకా 18 కులాలు ఉదహరింపబడ్డాయి.

ఇందులో

'గు' అంటే గురువారం అని అర్థం.

నేడు కరవది అని పిలువబడే ఈ గ్రామంనాడు కఱువదిగా శాసనంలో పేర్కొనబడింది.

శకట రేఫము కూడా గమనార్హం.

ఫృథ్వి శబ్దమును ప్రిధ్వి అని శిల్పి చెక్కాడు.

రెడ్డి – రడ్లు అనే రెండు రూపాంతరాలు కన్పడుతున్నాయి. చీరె – సకల ధాన్యముల వంటి ఏ సరుకును అమ్మినప్పటికీ (ఏ సరకమ్మినాను)

పణమున అరకాసు సుంకము నిర్ణయింపబడింది.

నిర్ణయించు శబ్దము నిర్నయించుగా చెక్కబడింది.

జాతి = కులము (Caste)

వరుషంబులు – సంవత్సరములు.

సంఖ్యలు = ౧౨౩౨

పదునెనిమిది = (౧౮) అక్షరములు

అర / కాసు = (అరకసు కాసు)

వెయి = (సహస్రము)

పంచ = (ఐదు)

**బహువచన ప్రత్యయములు :**

వరుషంబులు, రెడ్డి (గారు), రెడ్లు (కాపు)లు

మహారాజులు, సెట్లు (సెట్టికి బహువచనము)

మేరలు = కుదుర్చుకున్న నియమములు

పెద్దకొడుకు కపాలములో కల్లు తాగటం అంటే పెద్దకొడుకు మరణిస్తాడని శపించినట్లయింది. ఇంకొక శాసనములో కుక్కమాంసము ప్రసక్తి ఉంది.

బేహారి – వైకృతము (శ–ర) = వ్యాపారి

కపిల = పుల్లావు = పసుపు తెలుపు వర్ణములుగల శ్రేష్ఠమైన గోవు. ఈ శాసనము వలన సాగరాంధ్రము క్రీ.శ. 1310 నాటికి కాకతీయ సామ్రాజ్య అంతర్భాగమని స్పష్టము. ప్రస్తుతం (2016)లో మనకు కరవది దేవాలయంలో 'ప్రతాపరుద్ర మహాదేవ' అనే పంక్తి వరకే లభ్యం. తక్కిన శాసనం అజాగ్రత్త వలన నష్టమైనది. అదనపు సమాచారం : క్రీ.శ. 1295 నాటి ఒంగోలు – నిడవనూరు – భీమలింగేశ్వరస్వామివారి ఆలయ శాసనంలో కూడా శ్రీమన్మహా మండలేశ్వర కాకతీయ ప్రతాపరుద్ర దేవులవారు పృధ్విని పాలిస్తుండగా అని శాసనం ప్రారంభమైంది.

కామయ బొప్పండు : కరవది శాసనంలో ఈయన పేరు మాత్రమే ఉదహరింపబడినది. కారణం అతడు సమకాలికులకు సుపరిచితుడు కాబట్టి. మరి ఈయన ఎవరు? కాకతీయ ప్రతాపరుద్రుని ప్రధానులలో ఒకడు. ఈ విషయం మనకు మరొక శాసనం ద్వారా తెలుస్తుంది. ఆ శాసనం క్రీ.శ. 1299 నాటిది. ఇది ఈడుమూడి శివాలయంలో దొరికింది. 'శ్రీమన్మహా మండలేశ్వర కాకతీయ ప్రతాపరుద్ర దేవ మహారాజుల ప్రధాని పుతావరి కామబొప్పనింగారు తమ తండ్రి దేవయ గారికిన్ని తమ తల్లి పున్నవ లక్ష్మికిని పుణ్యంబుగా కందమూడి రామాజోస్యులకు చేసిన ధర్మం' (తర్వాతి భాగం శాసనం నష్టమైనది).

పున్నవలక్ష్మి అంటే పూర్ణలక్ష్మి అని అర్థం.

కనుపర్తి శాసనం ప్రకారం మోటుపల్లి పెరుమాళ్ళకు చేసిన దానం కనక పర్తిలేక కోశాంబిక లేక కనుపర్తి – సాగరతీర (గ్రామం). క్రీ.శ. 1306లో వేయించిన దానశాసనంలో కామయబొయ్యండు పేరు కనపడుతున్నది.

'మోటుపల్లి పెరుమాళ్ళకు శ్రీమత్ కామయబొయ్యండు రాజానుగ్రహంతో చేసిన దానం.' అనుగ్రహం అంటే ప్రతాపరుద్రుని అంగీకారంతో అని అర్థం. (మోట్టుపల్లె మలమండ్డల పెరుమాల్లకు సమారాధనకు అమ్రుతపడి బాత్రములకు చెదలవాడ స్తలమున కనుపఅతి కామసముద్రం క్రిందను – శాసనపాఠం). ఈ కామయప్రధానిపై ఇంతవరకు ప్రామాణికమైన పరిశోధన జరగలేదు. ఈడుమూడి నాగులుప్పలపాడు సమీపంలో ఉంది. కరవదికి ఇరవై నిమిషాల ప్రయాణ దూరం – అంటే ఇది ఆనాడు తెలుగు చోళుల రాజ్యం. ఈ మొత్తం కాకతీయాంధ్రుల సామంత రాజ్యమేనని సుస్పష్టం. కరవది పూర్వం నెల్లూరు మండలంలో ఉండేది. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఉంది. రైల్వేస్టేషను ఉంది.

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్
ఎం.ఎ., పి.హెచ్‌డి.,
హైదరాబాద్.
ఫోన్ : 960 361 2246

# తెలుగులో తొలి పద్య నిఘంటువులు

- మన్నూరు శివప్రవీణ్

నిఘంటువుకు అభిదానం, అనుశాసనం, కోశం అనేవి పర్యాయపదాలు. వీటిలో నిఘంటువు అన్నపదం ప్రాచీనమైంది. లౌకిక సంస్కృతంలో 'నిఘంటు' శబ్దానికి సూటిగా అర్థం చెప్పేది అని అర్థం. తెలుగు సాహిత్యం ప్రారంభదశలో కావ్యరచనకి, దాన్ని అవగాహన చేసుకోవడానికి సంస్కృత నిఘంటువులనే ఉపయోగించేవారు. 16, 17 శతాబ్దాలలో అచ్చతెనుగు కావ్యాలు వెలువడటం వలన తెలుగులో నిఘంటురచన కూడా 17 శతాబ్ది నుండి ప్రారంభమైంది. దాదాపుగా అన్ని ప్రక్రియలలోనూ సంస్కృతాన్ని అనుకరించి, అనువదించి, అభిమానించిన ప్రాచీన తెలుగు రచయితలు నిఘంటు రచనలో కూడా సంస్కృత పద్ధతుల్నే అనుసరించి నిఘంటువులను రచించారు. తెలుగు నిఘంటు చరిత్రలో ప్రథమదశకు చెందినవి పద్యనిఘంటువులు.

తెలుగులో సుమారు 17 పద్యనిఘంటువులను వెలగా వెంకటప్పయ్యగారు తెలుగు నిఘంటు వికాసంలో (పుట. 5-6) పేర్కొన్నారు. వీటిలో కొన్ని ముద్రితాల, కొన్ని అముద్రితాలు. ఈ పద్యనిఘంటువులలో కవిచౌడప్ప (క్రీ.శ.1616-37) రాసిన సీసపద్యాలను తెలుగులో తొలి నిఘంటువుగా నిఘంటుచరిత్రకారులు పేర్కొన్నారు. గణపవరపు వేంకటకవి (17వ శతాబ్ది) 'పంకజాప్త నీకాశ వేంకటేశ' అనే మకుటంతో 128 సీసపద్యాలతో రచించిన 'వేంకటేశాంధ్రము' తెలుగులో వెలసిన రెండవ పద్యనిఘంటువు. ఆ తరువాత పైడిపాటి లక్ష్మణకవి (17వ శతాబ్ది) 'ఆంధ్రనామసంగ్రహం' అనే పేరుతో 203 పద్యాలలో ఐదువర్గులతో పద్యనిఘంటువును రచించాడు. అందులో కొన్ని భాగాలు వదిలివేయబడ్డాయిని, ఆంధ్రనామసంగ్రహానికి అనుబంధంగా అడిదము సూరకవి 'ఆంధ్రనామశేషము' అనే పేరుతో ఒక నిఘంటువును రచించారు. 18వ శతాబ్దం చివరలో కస్తూరిరంగకవి 344 పద్యాలతో సాంబ నిఘంటువును సంతరించాడు. 'వేంకటేశాంధ్రము, ఆంధ్రనామసంగ్రహం, సాంబనిఘంటువు' ఈ మూడింటిని నిఘంటులక్షణకారులు నిఘంటుత్రయంగా పిలుస్తారు.

**1. చౌడప్ప సీసములు :**

తంజావూరు నాయకరాజులలో విశిష్టఖ్యాతిని పొందిన రఘునాథనాయకుడికి సమకాలికుడైన కవిచౌడప్ప ఈ సీసపద్యాల కర్త. ఇందులో మొత్తం 31 సీసపద్యాలలో సుమారుగా 600 పదాలకు పదనిరూపణ కనిపిస్తుంది. ఇందులో ప్రధానంగా అచ్చతెనుగు పదాలకి, కొన్ని అన్యదేశ్యాలకీ పర్యాయవాచక రూపంలో కొంత అర్థవివరణ ఉంది. రచయిత ఈ సీసపద్యాలలో పదాలను అంత్యాక్షర క్రమంలో కూర్చి ప్రత్యేకతను ప్రదర్శించాడు. ఈ నిఘంటువు అమరకోశం వంటి సంస్కృత నిఘంటువుల ప్రభావంతో రచించబడినప్పటికీ అందులో కనిపించే వర్గ విభజన ఇందులో లేదు. ఇప్పటి తెలుగు నిఘంటువులలో కనపడని దేశ్యపదాలను, నేటి నైఘంటుకార్థాలకన్నా భిన్నమైన అర్థాలుగల పదాలను కొన్నింటిని చౌడప్ప తన సీసపద్య నిఘంటువులో వివరించడం కనిపిస్తుంది.

ఉదా:- "....చిత్తరులనా బొమ్మలత్తరన వలపు"

ఇక్కడ 'అత్తరు' అనే పదానికి 'వలపు' అనే అర్థాన్ని చెప్పాడు. ఇది తక్కిన తెలుగు నిఘంటువులలో కనపడదు.

చౌడప్ప నిఘంటువులో దేశ్య, తద్భవాలతోపాటు సుమారు 52 హిందుస్థానీ, ఉర్దూ పదాలకు కూడా అర్థనిర్ణయం చేయబడింది. 'కలము' అనే పదానికి

పర్యాయపదంగా 'పేనా' అని వివరించడం కనిపిస్తుంది. అయితే ఈ 'కలము' అరబ్బీపదము కాగా 'పేనా' అనేది ఫ్రెంచి భాషాపదం. సంస్కృత పదాలు లేకుండా అచ్చతెనుగు కావ్యాలు రాయాలనే తలంపుతో నాటి కవులు తమకు తెలియకుండానే అరబ్బీ, పారసీ, ఫ్రెంచి మొదలైన పదాలను, అన్యదేశీయ పదాలను ఉపయోగించారు.

క్రీ.శ.16, 17 శతాబ్దాలలో వెలసిన తెలుగు శాసనాలలో నవాబు, ఠాణె, వజీరు, పాదుషా మొదలైన పదాలు గ్రంథస్థాలై ఉండటమే ఇందుకు ప్రబల తార్కాణం. బహుశా ఆ ప్రభావంతోనే చౌడప్పకాని ఆ తరువాతి నిఘంటుకారులు కాని తమ నిఘంటువులలో ఈ అన్యదేశ్యాలకు కూడా పర్యాయ పద నిరూపణం చేసి ఉండవచ్చు. కేవలం 31 సీసపద్యాలతో రచించిన చౌడప్ప సీసపద్యనిఘంటువు ఛందో వైవిధ్యము లేకుండా శతకంలో లాగా ఏకఛందోబద్ధమై ఉంది. ఈ నిఘంటువు తరువాతి నిఘంటువులకు రచనా విధానంలో మార్గదర్శకమై నిలిచిందని చెప్పవచ్చు.

**2. వేంకటేశాంధ్రము :**

17వ శతాబ్దికి చెందిన గణపవరపు వేంకటకవి ఈ నిఘంటు రచయిత. ఇది తెలుగులో వెలసిన రెండవ పద్యనిఘంటువు. దీనికే 'సర్వలక్షణ శిరోమణి' అని మరొకపేరు. ఇది కూడా చౌడప్ప సీసాలలాగానే అచ్చతెలుగు నిఘంటువు. ఈ నిఘంటువులో మొత్తం 128 సీసపద్యాలు కలిగి, శతకలక్షణమైన మకుటనియమం కలిగి ఉంది. ఈ గ్రంథారంభంలో రచయిత తన కోశస్వరూపాన్ని ఈ విధంగా పేర్కొన్నాడు.

*సీ॥ శ్రీకరమ్ముగను దేశీయముల్ తద్భవ*
*ములు తెన్గు పదములు గలయఁ గూర్చి*
*దైవత మానవ స్థావర తిర్యగా*
*ఖ్యల నాల్గువర్గములలర మఱియు*
*నానార్థవర్గుతో నూటయిరువది*
*యెనిమిది పద్యమునువుమీఱ*
*సీసములగ విరచించి యప్పాయముల*
*తుదలందు సంస్కృత పదములునిచి*

*తే॥ యమరసింహ సమానమై యమర సకల*
*కవులు బొగడంగఁ లోకోపకారముగను*
*క్షితిని నాంధ్ర నిఘంటువుగఁ జేసినాడ*
*నంకితంబుగ నీపేర వేంకటేశ*

*(దేవవర్గు. ప. 3)*

ఈ పద్యంలో గణపవరపు వేంకటకవి తన నిఘంటు నిర్మాణపద్ధతుల్ని ఇలా వివరించాడు. మొత్తం 128 సీసపద్యాలలో దేశీయపదాలను, తద్భవాలను, తెలుగుపదాలను దేవ, మానవ, స్థావర, తిర్యక్కులుగా విభజించి, నానార్థాలను మరొక వర్గగా కూర్చి, చివరన సంస్కృత పదాలనిచ్చి, అమరసింహుని అమరకోశముతో సమానమైన ఆంధ్రనిఘంటువును వేంకటేశాంకితంగా రచించానని చెప్పుకున్నాడు.

అమరసింహ సమానమైన నిఘంటువును నిర్మించే క్రమంలో గణపవరపు వేంకటకవి అమరకోశాన్ని అనుసరించినట్లు తెలుస్తుంది. ఈ వర్గ విభజన చౌడప్ప సీసాలలో లేదు. ఇది సంస్కృత నిఘంటువైన అమరకోశ నిర్మాణ పద్ధతి. 'అమరంలోని ప్రథమకాండను అతిక్లుప్తంగా 'దేవవర్గ' అనే పేరుతో 23 పద్యాలను, ద్వితీయకాండను మానవవర్గగా 53 పద్యాలలో, స్థావరవర్గగా 13 పద్యాలతో, తిర్యగ్వర్గగా 13 పద్యాలతో మొత్తం 79 సీసపద్యాలతో వివరించే ప్రయత్నం చేశాడు. ఇక చివరిదైన తృతీయకాండను 23 పద్యాలతో నానర్థవర్గగా వివరించాడు' (తెలుగు నిఘంటువులు – ఒక అధ్యయనం, డా॥ పి. ఉషారాణి గోవిందరాజులు) ఈ అంశాలను పరిశీలిస్తే గణపవరపు వేంకటకవిపై అమరకోశ ప్రభావం ఏ మాత్రముందో అర్థమౌతుంది.

వేంకటకవి అమరకోశాన్ని అనుసరించి, అందులోని పదాలనే తెలుగులోకి అనువదించినా అపూర్వమైన అచ్చతెలుగు పదాలను, పదబంధాలను కల్పించాడు. ఉదాహరణకు విష్ణుః, నారాయణ వంటి విష్ణు సంబంధిత పర్యాయపదాలకు పెరుమాళ్ళు, నల్లదేవర, జిడ్డు సంద్రపుటల్లుడు అని పేర్కొన్నాడు. అయితే సంస్కృత నామాలకు తెలుగులో సమానార్థకాలను చూపే క్రమంలో అతిదీర్ఘమైన, జనవ్యవహారంలోలేని పదాలను ఉపయోగించాడు. ఉదాహరణకు లక్ష్మీ అనే సంస్కృత స్త్రీలింగ శబ్దానికి పాలసంద్రపుకూతురు, కమ్మతమ్మిబిడారు గరితమిన్న మొదలైనవి. అంతేకాక సంస్కృత నామాలకు సమానార్థకాలు

చెప్పే క్రమంలో అన్యదేశ్యాలను కూడా గ్రహించటం కూడా కనిపిస్తుంది.

ఉదా:- బూరగొమ్మతుపాసి (విష్ణు)
ఏనుమొగముల సాహేబు (శివుడు)
బేసికంటి వజీరు పెద్దకొడుకు (వినాయకుడు)

చౌడప్ప సీసాలలో ఇటువంటి పదాలు కనపడవు. అందుకు కారణం అతను సంస్కృత కోశాలను అనుసరించకపోవడం కావచ్చు. వేంకటకవి తరువాతి పద్యనిఘంటుకారులు అందరూ దాదాపుగా ఈ విషయంలో వేంకటకవినే అనుసరించారు.

అమరకోశాన్ని ఆదర్శంగా ప్రకటించినప్పటికీ నిఘంటు నిర్మాణంలో భాగంగా ఛందో నియమంలోను, మకుట నియమంలోనూ, భూతకాలిక క్రియలను అంత్యాక్షరక్రమంలో చెప్పటంలోనూ గణపవరపు వేంకటకవికి, చౌడప్పకు కొంత పోలిక ఉంది. అంతమాత్రాన ఒకరిపై మరొకరి ప్రభావం ఉందని చెప్పటానికి వీలులేదు. కవిచౌడప్ప నిత్యజీవనంలో ప్రజల వ్యవహారంలోని దేశ్యపదాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వగా, వేంకటకవి జనవ్యవహారంలో లేని పదాలను కూడా పేర్కొన్నాడు.

ఏది ఏమైనా వేంకటేశాంధ్రము తరువాతి నిఘంటువులకు ఒక దారిబత్తెంగా నిలబడిందని చెప్పవచ్చు.

**3. ఆంధ్రనామ సంగ్రహం :-**

క్రీ.శ. 17-18 శతాబ్దాలకు చెందిన పైడిపాటి లక్ష్మణకవి ఈ నిఘంటుకర్త. సంస్కృతంలోని అమరకోశంలాగా తెలుగులో ఆంధ్రనామ సంగ్రహం బాగా ప్రాచుర్యాన్ని కలిగి ఉంది. ఈ నిఘంటు ఆరంభంలో పైడిపాటి లక్ష్మణకవి తను ఏర్పరచుకున్న ప్రణాళికను ఇలా పేర్కొన్నాడు.

*తే॥ "దేవమానవ స్థావరతిర్యగాఖ్య*
*వర్గులొనరింతు నానార్థ వర్గుఁ గూడ*
*వర్గములు గాఁగఁగూర్తు నాహ్వాయవములందు*
*నిడుదు వివరించు నెడల సంస్కృత పదంబు"*

*(దేవవర్గు - 4వ పద్యం)*

గణవరపు వేంకటకవి ఆంధ్రనామసంగ్రహాన్ని మొత్తం 209 పద్యాలలో (దేవవర్గు 42 పద్యాలు, మానవవర్గు 81 పద్యాలు, స్థావరవర్గు 20 పద్యాలు, తిర్యగ్వర్గు 20 పద్యాలు, నానార్థవర్గు 29 పద్యాలు) మొత్తం 5 వర్గులుగా కూర్చి, 1788 పదాలను పేర్కొన్నాడు.

వర్గుగా విభజించటంలో వేంకటేశాంధ్రాన్ని పోలి ఉన్నప్పటికీ, ఛందోనియమంలోనూ, మకుట నియమం పాటించటంలోనూ ఆంధ్రనామసంగ్రహంలో కొన్ని వ్యత్యాసాలు కనిపిస్తాయి. వేంకటేశాంధ్రంలో పద్యాలన్నీ ఒకే ఛందస్సులో రచిస్తే, ఇందులో సీసం, కందం, తేటగీతి, ఆటవెలది వంటి ఛందస్సులను ఉపయోగించబడ్డాయి. అంతేకాక మానవవర్గులో అదనంగా అవయవాలపేర్లు, వస్తువులపేర్లు, అమూర్తనామాలు (ప.54), భావార్థకాలు (త్రావుట, క్రోలుట, అనుట), సర్వనామాలు (ప.79) చేర్చబడ్డాయి. క్రియనుండి ఉత్పన్నమయ్యే నామవాచకాలను కూడా పేర్కొన్నారు.

ఉదా:- అరిపె, నవిచె, బనిపె బనిచె (మానవవర్గు-72)

'ఎ' అంత్యాక్షరక్రమంలో వచ్చే విధంగా నిత్య వ్యవహారంలో వచ్చే క్రియా పదాలను మాత్రం వేంకటేశాంధ్రంలోలాగే పేర్కొన్నారు.

లక్ష్మణకవి ఆంధ్రనామసంగ్రహంలో సంస్కృత నామాలకు అచ్చతెనుగు పర్యాయపదాలను చెప్పటంలో వైవిధ్యాన్ని ప్రదర్శించాడు.

ఉదా :- 'నీరుపాప, గాలినెచ్చెలి....' (దేవవర్గు ప.18) అనే పద్యంలో నిరుపాప, గాలినెచ్చెలి వంటి తెలుగుపదాల చివర అనలుడు అనే సంస్కృతపదాన్ని ఇచ్చాడు. ఇలా అన్ని పద్యాలలోనూ ఇవ్వబడింది. ఈ లక్షణం వల్ల ఆంధ్రనామ సంగ్రహాన్ని కంఠస్థం చేస్తే తత్సమపదాలకు సమానార్థకాలైన అచ్చతెనుగు పదాలు లేదా పదబంధాల జ్ఞానం సిద్ధిస్తుందని డా॥ పి. ఉషాగోవిందరాజులు, *తెలుగు నిఘంటువులు - ఒక అధ్యయనం*లో అభిప్రాయపడ్డారు. కవిచౌడప్పసీసాలు, వేంకటేశాంధ్రాలకన్నా ఈ నిఘంటువులోని పద్యాలు కంఠస్థం చేయటానికి సులభంగా ఉండటం వల్ల సంస్కృతంలో అమరకోశంలా తెలుగులో ఆంధ్రనామసంగ్రహానికి అంతఖ్యాతి లభించి ఉండవచ్చు.

వేంకటేశాంధ్రం, చౌడప్పసీసాల లాగా లక్ష్మణకవి మకుటనియమాన్ని, ఛందోనియమాన్ని పాటించలేదు. ఈయన పేర్కొన్న అచ్చతెలుగు పేర్లలో 'పచ్చగుఱ్ఱాల వజీరుండు' వంటిచోట్ల అన్యదేశ్యపదాలు కనిపిస్తున్నాయి. ఇంతకు ముందు చెప్పినట్లు అప్పటి కవులు అన్యదేశ్యాలను

అచ్చతెలుగు పదాలుగానే తమ కావ్యాలలో వాడటం ఒక కారణమై ఉంటుంది.

దేవతానామాలు తెలిపేటప్పుడు సంస్కృత నామవాచకాలకు అనువాదరూపాల్నే వాడటం, కొన్నిచోట్ల రూపాంతరాలను పర్యాయపదాలుగా చెప్పటంలో గణపవరపువేంకటకవి ప్రభావం ఈ ఆంధ్రనామసంగ్రహంలో కనిపిస్తుంది. నిఘంటునిర్మాణ పద్ధతులలో ప్రత్యేకతను చాటుకుని లక్ష్మణకవికి పూర్వం, లక్ష్మణకవికి తరువాత అన్నట్లుగా లక్ష్మణకవి ఈ నిఘంటు రచన ద్వారా విశిష్టస్థానాన్ని పొందాడు.

**4. సాంబ నిఘంటువు :-**

క్రీ.శ. 18 శతాబ్దానికి చెందిన కస్తూరిరంగకవి ఈ నిఘంటుకర్త. ఈ నిఘంటువు అసలు పేరు 'ఆంధ్రనామ నిఘంటువు'. కాని ఈ నిఘంటువును కృతికర్త ప్రతిపద్యమును 'సాంబ' అనే మకుటంతో సాంబమూర్తికి అంకితమిస్తూ రచించడం వలన ఈ నిఘంటువుకు 'సాంబ నిఘంటువు' అని వ్యవహారమేర్పడినట్లుంది.

పూర్వపు నిఘంటుకర్తలలాగానే కస్తూరి రంగకవి కృత్యారంభంలో తాను కూర్చిన నిఘంటు రచనా పద్ధతిని గురించి వివరించాడు.

*సీ॥ శ్రీవెలయంగ దేశియముల్ దెనుగులు*
*దద్భవంబులుఁ గూర్చి దైవవర్గ*
*దనరు మానవవర్గ స్థావరవర్గ తి*
*ర్యగ్వర్గ నన నాలుగలవరించి*
*జల్లులుంపక వ్యర్థ శబ్దముల్ రానీక*
*కుంటి నడతగాక కొరకు లేక*
*యుర్వీజనంబుల కుపకారసరణిగా*
*నాంధ్రనామ నిఘంటువనెడు కృతిని*

*తే॥ గవుల దయచేత నీకటాక్షంబువలన*
*సీసశతకంబుఁ జెప్పెదఁ జిత్తగింపు*
*దనుజసమవర్తి, భక్తహృదబ్జవర్తి,*
*సకల సురచక్రవర్తి శ్రీసాంబమూర్తి ।*

*(సాంబ నిఘంటువు, ప.1)*

సాంబమూర్తికి అంకితంగా 108 సీసపద్యాలలో దేశీయ, తద్భవ, తెనుగు పదాలను దైవ, మానవ, స్థావర, తిర్యక్కులుగా 4 వర్గులుగా విభజించి, వ్యర్థశబ్దాలు రానీకుండా, అన్వయ కాఠిన్యము లేకుండా రచించానని కవి పేర్కొన్నాడు.

ఈ నిఘంటువులోని మొత్తం 108 సీసపద్యములలో దేవవర్గ 20 పద్యాలలోను, మానవవర్గ 51 పద్యాలలోను, స్థావరవర్గ 14 పద్యాలలోను, తిర్యగ్వర్గ 13 పద్యాలలోను చెప్పడమే కాకుండా 10 పద్యాలలో నానార్థవర్గను కూడా చేర్చాడు. ఇందులో మొత్తం 2906 పదాలు పేర్కొనబడ్డాయి.

కస్తూరిరంగకవి కూడా పూర్వ కవులలాగానే అన్యదేశ్య ప్రసక్తి చేయకుండా అన్యదేశ్యాలను కూడా గ్రహించాడు. ఉదాహరణకి దేవవర్గలోని 'కలుఁగులాయపుఁదేజిబలు సిపాయి' (గణపతి), 'మొదటి దిక్కు సుబాదారి' (ఇంద్రుడు) ఇక్కడ సిపాయి, సుబాదారి అనేవి అన్యదేశ్యపదాలు. సంస్కృత పదాలకు అచ్చతెలుగు సమాసాలను పర్యాయపదాలుగా చెప్పటంలో కూడా కస్తూరిరంగకవి పూర్వులనే అనుసరించాడు. ఉదాహరణకు 'గబ్బుచెక్కిళ్ళమెకముమోముగలసామి' (గణపతి), 'తుదచుక్క పేరిటి తొయ్యలిపెనిమిటి' (బలరాముడు).

రూపాంతరాలను పర్యాయపదాలుగా పేర్కొనటంలో కూడా వేంకటేశాంధ్రం, ఆంధ్రనామసంగ్రహాలను అనుసరించినట్లు తెలుస్తుంది.

ఉదా:- మానవవర్గలో కన్నియ - కన్నె; మెయి - మేయి

కృత్యారంభ పద్యంలో పేర్కొన్న విధంగానే రంగకవి 108 పద్యాలలో పద్యసంఖ్యను, ఛందోనియమం, మకుటనియమంతో శతకలక్షణ సమన్వితంగా ఈ నిఘంటువును కూర్చాడు.

**ఆంధ్రనామశేషము :-**

క్రీ.శ. 18 శతాబ్దానికి చెందిన అడిదము సూరకవి ఈ గ్రంథాన్ని ఈశ్వరాంకితంగా రచించాడు.

*ఆ॥ ఆంధ్రనామ సంగ్రహము నందుఁజెప్పని,*
*కొన్ని తెలుగఁగు నుఋుఁగులన్ని గూర్చి*
*యాంధ్రనామశేష మనుపేరఁ జెప్పెద,*
*దీనిఁజిత్తగింపు దేవదేవ ॥*

*(ఆంధ్రనామశేషము, ప.3)*

అని గ్రంథారంభంలోనే తాను ఆంధ్రనామసంగ్రహంలో చెప్పని విషయాలను ఆంధ్రనామశేషంలో చెప్తానని పేర్కొన్నాడు. అందుకు తగ్గట్లుగానే 78 పద్యాలుగల

ఈ గ్రంథంలో ఛందోనియమంలోనూ, మకుట నియమంలోనూ ఆంధ్రనామసంగ్రహం లాగానే పాటించలేదు.

దేవవర్గుతో కాక మానవవర్గునుండి ఈ నిఘంటువు ప్రారంభమౌతుంది. నానార్థాలను అంత్యాక్షరక్రమంలో కూర్చటం, భూతకాలిక క్రియారూపాలను 'ఎ' కారాంతంగా చెప్పటం (ఉదా :- పెంపుసెందె, ప్రబలె మొ॥వి), వంటి చోట్లలో కూడా ఆంధ్రనామసంగ్రహాన్నే అనుసరించాడీ రచయిత. మొత్తం మీద నిఘంటునిర్మాణ పద్ధతుల్లో ఆంధ్రనామసంగ్రహాన్ని అనుసరించి, అందులో చెప్పని అంశాలను కూర్చి దానికి కొనసాగింపుగా ఈ రచన ఆంధ్రనామసంగ్రహానికి నిండుతనం తెచ్చిందనవచ్చు. పై 5 పద్యనిఘంటువులలో ఒక్క కవిచౌడప్ప సీసాలు తప్ప మిగిలిన నిఘంటువులన్నింటిలో కొన్ని సారూప్యాలు కనబడుతున్నాయి. దేవ, మానవ, స్థావర, తిర్యగ్వర్గులు, నానార్థవర్గులుగా 5 వర్గులుగా ఉండటం, ప్రతి నిఘంటువు ప్రారంభంలో కవి తాను కూర్చిన నిఘంటు పద్ధతుల్ని వివరించటం, దీర్ఘసమాసాలతో కూడిన పదబంధాలను సృష్టించటంలోనూ, అన్యదేశ్యాలను దేశీయ శబ్దాలుగా ఉపయోగించటంలోనూ, తెలుగు పర్యాయపదాలనిచ్చి చివరన సూచికగా సంస్కృత పదాలనివ్వటం, సంస్కృతనామాలకు యథానువాదం కల్పించటం, రూపాంతరాలనే పర్యాయపదాలుగా చెప్పటం, భూతకాలిక క్రియారూపాలను 'ఎ' కారాంతంగా అంత్యాక్షర క్రమంలో కూర్చటంలోనూ ఆ సారూప్యత కనిపిస్తుంది.

నిత్యజీవనంలో సామాన్యప్రజలు ఉపయోగించే దేశ్యపదాలకు చౌడప్పసీసాలు ప్రాధాన్యమిస్తే, వేంకటేశాంధ్రము, ఆంధ్రనామసంగ్రహం, సాంబ నిఘంటువు, ఆంధ్రనామశేషములో ప్రజాజీవనంలో వాడుకలోలేని పదబంధాలను, సమాసాలను విరివిగా ఉపయోగించబడ్డాయి.

అయితే తెలుగు కావ్యాలలో ముఖ్యంగా 17, 18 శతాబ్దాలలో వెలువడిన అచ్చతెనుగు కావ్యాలలో కొరుకుడుపడని పదాలను తెలుసుకోవడంలోనూ, కవి హృదయాంతర్గతభావం ప్రకటింపబడడంలోనూ ఈ నిఘంటువులు ఎంతో ఉపకరించాయని చెప్పవచ్చు. నిఘంటునిర్మాణ పద్ధతుల్లో సంస్కృత నిఘంటువులను అనుసరించినా భావి నిఘంటుకర్తలకు ఒక ఒరవడి చూపాయి.

**లోపాలు :**

తెలుగులో వెలసిన ఈ తొలిపద్యనిఘంటువులలో లోపాలు లేకపోలేదు. తెలుగు సాహిత్యంలో తత్సమ పదాలకున్న వ్యాప్తి, ప్రయోగం అచ్చతెనుగు పదాలకులేదు. అందువల్లనే 11 శతాబ్దంలోనే తెలుగు సాహిత్యంలో కావ్యాలు వెలుగుచూసినా 17, 18 శతాబ్దాల దాకా తెలుగు నిఘంటురచన అవసరం కలుగలేదు. 17, 18 శతాబ్దాలలో ఒక సాహిత్య ఉద్యమంలాగా అచ్చతెనుగు కావ్యాలు రావటంతో వాటిలోని ప్రయోగాలను ప్రజలకు తెలపటం కోసం, తత్సమ పదాలకు సమానార్థకాలైన అచ్చతెనుగు పదాల, పదబంధాల జ్ఞానం అచ్చతెనుగు కావ్యకర్తలకు కలగటం కోసం ఈ పద్యనిఘంటువులు రాయడానికి ప్రేరకాలు అయి ఉండొచ్చు. ఈ క్రమంలో అచ్చతెనుగు పదబంధాలు సమాసాలు చెప్పటంలో అన్యదేశీయాలను విరివిగా ఉపయోగించారు.

ఉదా:- మొదటిదిక్కు సుబాదారి - ఇంద్రుడు (సాంబనిఘంటువు, దేవవర్గు)

ఇలా ప్రజల వాడుకలోలేని అతిదీర్ఘమైన పదబంధాలు, సమాసాలను తెలపటం వలన అర్థాన్ని వెతుక్కోవలసి వస్తుంది. దీని వలన పఠితకు విసుగుకలిగే అవకాశం ఉంది.

పద్యసంఖ్యను నియమంగా పాటించటం వలన ఎక్కువ పదాలను చెప్పలేకపోయారని అనిపిస్తుంది.

సమానార్థకాలను సూచించటమే కాని అర్థవివరణ లేకపోవటం పెద్దలోపం. ముఖ్యంగా పద్యనిఘంటువు అవగాహనకు రావాలంటే కంఠస్థం చేయాల్సిందే. ఇది పెద్ద ప్రతిబంధకం. ఇందులోని వ్యవహారదూరమైన పదాలు కవులకు తప్ప సామాన్యజనులకు అర్థం కాకపోవచ్చు.

తత్సమపద బాహుళ్యంలో కొట్టుకొని పోకుండా అచ్చతెలుగులో తత్సమాలకు సమానంగా నూతన పదబంధాలను నిర్మించుకోవడంలో ఈ తొలి పద్య నిఘంటువులు మార్గదర్శకాలుగా చెప్పవచ్చు.



మన్నూరు శివప్రవీణ్
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
ఫోన్ : 944 051 5569.

# కొంపెల్ల జనార్దనరావు

## *ఉదయిని*

*– చెరుకువాడ వెంకట్రామయ్య*



కొంపెల్ల జనార్ధనరావు

**భా***రతి, జ్వాల, నవోదయ, జయంతి,* కృష్ణా పత్రిక వంటి పత్రికలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి.

*ఉదయిని* కూడా అట్లాంటి సేవలు అందించిన ద్వైమాసిక పత్రిక. ఆరు సంచికలకంటే ఎక్కువ రాలేదనుకుంటాను. నా దగ్గర మాత్రం మూడు సంచికలున్నాయి. ప్రముఖ కవులందరూ *ఉదయిని*లో తమ రచనలు ద్వారా ప్రతిభావంతులై, ప్రభావితులైనవారే!

*ఉదయిని* సంపాదకుడు కొంపెల్ల జనార్దనరావు. సంస్కృతాంధ్రాంగ్ల భాషల సాహిత్యాన్ని పుక్కిటపట్టిన అగస్త్యుడు. బ్రహ్మచారి, దేశభక్తుడు, ఖద్దరుదారి.

*ఆంధ్ర పత్రిక*లో, *భారతి*లో ఉద్యోగించారు. గన్నవరపు సుబ్బారామయ్యగారి పర్యవేక్షణలో కాకలుతీరిన సాహితీ విమర్శకుడు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం సమీపంలోని గంగలకుర్రు అగ్రహారంలో జన్మించారు. వేదపండితులకు నిలయం గంగలకుర్రు గ్రామం. శ్రీరంగం శ్రీనివాసరావు – జనార్దనరావు మంచి స్నేహితులు. శ్రీనివాసరావు కవిత్వాన్ని ప్రశంసించి, భుజంతట్టినవారిలో ప్రధములు జనార్దనరావు. శ్రీనివాసరావు 'ప్రభవ' కావ్యాన్ని నిశితంగా విమర్శించినవాడు జనార్దనరావు.

ఆ విమర్శను కృష్ణశాస్త్రిగారు తట్టుకోలేకపోయారని విన్నాను.

శ్రీనివాసరావు 'మహాప్రస్థానం' రచనను కవి పండితులైన పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారికి అంకితం ఇవ్వాలని సంకల్పించాడు. అయితే ! జనార్దనరావు ఆకస్మిక మరణంతో మహాప్రస్థానం కావ్యాన్ని జనార్దనరావుకే అంకితమివ్వటం జరిగింది. నాకు తెలిసినంతవరకూ అట్లాంటి స్మృతికావ్యం (ఎలిజీ) అంకితంగా మరొకరికి దక్కలేదేమో అనుకుంటాను. తెలుగు సాహిత్యంలోనే మొదటి స్మృతి గీతం అదేనని భావిస్తాను.

*"తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం"* అంటూ *"దొంగ లం. కొడుకులు అసలే మసలే యీ / ధూర్త లోకంలో"* అంటాడు శ్రీనివాసరావు. అట్లాంటి జనార్దనరావు *ఉదయిని* సాహిత్య పత్రికను తన సంపాదకత్వంలో ఉదయింపచేశాడు. 1935–1936 సంవత్సరాలలో ఉదయించిందీ *ఉదయిని*. వ్యవహారిక భాషోద్యమకారకులు గిడుగు వెంకటరామమూర్తి గారు ఆశీర్వదించారు. *ఉదయిని*లో 'కిరణాలు' పేరుతో జనార్దనరావు సంపాదకీయం రాసేవారు. 'వాఙ్మయవీధి' పేరుతో పుస్తక సమీక్షలు, 'శృంగాటకం' పేరుతో వ్యాఖ్యలు – విమర్శలూ వచ్చాయి. ఒక ప్రత్యేకత – నిబద్ధతా *ఉదయిని*లో దర్శించుతాము. విశ్వనాథ, శ్రీనివాసరావు, కృష్ణశాస్త్రి, పింగళి, కటూరి, కొడాలి ఆంజనేయులు – ముద్దుకృష్ణ – చావరి బంగారమ్మ కలికొండల వెంకట్రావు – చింతా దీక్షితులు, చలం – వంటి ప్రముఖుల వచనలు *ఉదయిని*లో చోటుచేసుకున్నాయి. ఆచంట జానకిరామ్ ఏకవీర నవలను చక్కగా సునిశితంగా విమర్శించారు.

విమర్శ అలా ఉండాలనిపించింది. చింతా దీక్షితులుగారి 12 నాటికలు 1921 నుండి 1933 వరకు వచ్చినవాటిని పిలకా గణపతిశాస్త్రిగారు సమీక్షించారు. విశ్వనాథవారి 'సీత – కుందమాల' కావ్యం ప్రాకృతము – నన్నయకు పూర్వ సాహిత్యము గురించి మల్లంపల్లి సోమశేఖరశర్మ – అభినవాంధ్ర సాహిత్యము – కవికోకిల దువ్వూరి రామిరెడ్డి ఆధునిక కవిత్వము – శ్రీపాద గోపాలకృష్ణమూర్తి చలం గారి భానుమతి నాటకము కరుణకుమార్ – కొత్తచెప్పులు కథా దీక్షితులుగా 'శంపాలత' బాలానందం కథా వెంపటి నాగభూషణంగా ఆద్యంతాలు జనార్దనరావుగారి విద్యార్థి నాటిక ఉదయినిలో 70 సంవత్సరాలనాడే వచ్చాయి. విశ్వనాథ – కృష్ణశాస్త్రి, పద్యాలు అన్ని సంచికల్లోనూ వచ్చాయి. జనార్దనరావు మంచి సంగీతకారుడు. 'భుజగశయనా' అని

పాడుతూంటే శ్రీనివాసరావు మురిసిపోయాడు. నవ్యసాహిత్య సంగీత పత్రిక ప్రతిభ గురించి *ఉదయిని*లో స్వాగతించడం జనార్దనరావు సహృదయతమ్ నిదర్శనం.

జనార్దనరావుగారి గురించి జనక సోదరి శ్రీమతి చాకలి బంగారమ్మ గారు భీమవరంలో ఉండగా తరచు కలుస్తుండేవాడిని. ఆనాటి కవులందరి గురించి ఎన్నో ముచ్చట్లు చెప్పేవారు. ఆమె కవయిత్రి. బంగారమ్మగారి రచనలు సేకరించి సుహృత్ పరిషత్ (విస్సాకోడేరు)వారు కాంచన విపంచి పేరుతో ప్రకటించారు. ముద్దుకృష్ణ - ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి - దిగుమర్తి సీతారామస్వామిల వంటివారు ప్రశంసిస్తూ తమ అభిప్రాయాలు అందించారు.

జనార్దనరావు అనారోగ్యంతో క్షయతో బాధపడినారు. ఆర్థిక ఇబ్బందులు - అనారోగ్యంతో *ఉదయిని*తోపాటు జనార్దనరావున్నూ అస్తమించారు. అచంట జానకీరాం సహాయ సంపాదకులుగా వ్యవహరించారు. ఋషివంటి వ్యక్తిగా జనార్దనరావుగారిని అభినందిస్తారు జానకిరామ్. *ఉదయిని* సాహితీపరంగా మహత్తర సేవలందించినదనటంలో సందేహం లేదు. ఈ తరంవారికి జనార్దనరావు తెలియదు. *ఉదయిని* తెలియదు.

**జనార్దనరావు రాసిన సమీక్ష - ప్రభవ**

గ్రంథకర్త : శ్రీరంగం శ్రీనివాసరావుగారు,

కవితా సమితి, విశాఖపట్టణం, క్రౌను సైజున 54 పుటలు కలవు. వెల. రూ. 8/-

ఇది కవితా సమితి గ్రంథావళిలో మొదటిది. ఇందు ప్రకృతి గీతములు, ప్రణయ గీతములు, ప్రకీర్ణ గీతములు అను వేర్వేరు విభాగముల పదునారు ఖండ కావ్యములున్నవి. శైలియందు సార్థకత కంటే సమాసతత్పరత ఎక్కువగా గోచరించుచున్నది. ఇంకను విషయానుగుణ్యమైన శైలియందు మార్పులు కనపడవలెను. తెనుగు వాడకము చాలా తక్కువగానున్నది. ఒక్కొక్కచో బడలించు సమాస భూయిష్ఠత యున్నను మొత్తము మీద శైలి బాగుగానున్నది. భావములందును గాంభీర్యమున్నది. భావములకును, భాషకును సామరస్యము సంధించుటకీ కవి యింకను ప్రయత్నించపడగును. ఇది చదివినవారికి కాలక్రమమున ఈ కవి కవిత యింకను సంపన్నము కాగలదను ఆశ పొడమను. భావ స్వాతంత్ర్యమును, భాషా సౌష్ఠవమును మెచ్చదగియున్నది. ప్రకృతి పథముల తత్త్వాన్వేషణము సలుప సమకట్టిన యీ కవి కిశోరమానసము ఉత్సాహ రంజితమై యొప్పుచున్నది.

- కొంపెల్ల జనార్దనరావు, భారతి - 1928, ఆగస్టు


*ఆశీస్సు*

*పర్లాక్రిమిడి 22-7-35*

*శ్రీ ఉదయిని సంపాదకులు మ.రా.శ్రీ. కొంపెల్లి జనార్ధనరావుగారి సన్నిధికి వి. సే. గిడుగు వేంకట రామమూర్తి అనేక నమస్కారములు చేయుచూ మహాశయా! మీ దయవల్ల ఉదయిని మూడు సంచికలూ చదివే భాగ్యము నాకు కలిగింది. అందుకు మీకనేక వందనములు సమర్పిస్తున్నాను. మీవంటి మహానుభావుల విశిష్ట రచనలు ప్రకటించడానికి వేరుగా ఒక పత్రిక ఉండడము ఉచితమే, ఆవశ్యకము కూడాను. ఈ సంచికలలోని కొత్త రచనలు, మీవీ మీ పత్రికలవీ, శ్రద్ధగా పరిశీలించినవారికి, తెలుగు సాహిత చరిత్రలో కొత్తయుగము ఏర్పడుతూ ఉన్నట్టు తోచకపోదు. ఇంగ్లీషు బంగాలీయము విదేశీయ భాషలలోని కొత్త రచనలు చదివి, నవ్య కావ్య రసాస్వాదనము చేసి తృప్తి పొందిన తెలుగు రసికులు వెయ్యి తెలుగు మాసపత్రికలను, అందులోనూ ఉదయిని, జ్వాల వంటి వాటిని, ఇటుపైని ఈసడించడానికి కారణముండదు. నేటి తెలుగు భాషలో నేటి భూలోకము ప్రతిఫలించేట్టు చేయగల తెలుగు లేఖకులున్ను తెలుగు కవులున్ను, అన్యదేశీయులతో తులతూగగలవారు, తయారవుతున్నారని ఈ పత్రికలు విశదము చేస్తూ ఉన్నవి. వీరికి తగిన సాయమూ ప్రోత్సాహమూ ఉంటే నవ్యసాహిత్యమూ అన్నివిధాలా అభివృద్ధి పొందుతుంది. గుణజ్ఞులో, సదయులో అయిన తెలుగువారు, స్త్రీలో పురాణులూ, వీరి రచనలు సవిమర్శముగా చదివి, ఇతరులు చేరి చదివేటట్టు చేస్తూ ఉంటే అభివృద్ధికి అనుకూలమయిన పరిసరములు ఏర్పడుతాయి. పట్టణములలోను పల్లెలోను నవ్య సాహిత్యమందభిమానముగల వారున్నారు. వార్కి తమ మిత్రులకూ కొత్త రచనలు చదివి వినిపించి వాటిలోని గుణములు మీరు గ్రహించేటట్టు చేయడమూ వారికి విహిత ధర్మమే.*

*ఇట్లు విన్నవించు*

*గి.వెం. రామమూర్తి*



గి.వెం. రామమూర్తి

# దెయ్యాల రాత్రి

- కాంద్రేగుల నాగేశ్వరరావు

ఈ మధ్య తెలుగు చిత్రసీమలో దెయ్యాలు ముఖ్య ఇతివృత్తంగల సినిమాలు ఎక్కువగా వస్తున్నాయి. రాంగోపాల్ వర్మ వేసిన ఈ దెయ్యపు విత్తనం శాఖోపశాఖలుగా పెరిగి, వటవృక్షమై విస్తరించింది. ఈ సినిమాలు చూస్తున్నవారంతా దెయ్యాలపై నమ్మకం ఉన్నవారు కాకపోవచ్చు. కాని ఆ చిత్రాలలో ఉండే ఉత్సుకత, గగుర్పాటుతనం, థ్రిల్ మరో కథావస్తువులో ఉండదు. చీకటి, ఒంటరితనం, నిశ్శబ్దాని చీల్చుకుంటూ వచ్చే శబ్దాలు అనే ఈ మూడు సూత్రాల నుంచి కథావస్తువు తయారవుతుంది.

ప్రపంచవ్యాప్తంగా హర్రర్ చిత్రాలకు మినిమమ్ గ్యారంటీ ఉందని సినీ ప్రముఖులు నమ్ముతారు. జపాన్‌లాంటి కొన్ని దేశాలలో వీటికి ప్రత్యేక ఛానల్స్ ఉన్నాయి. బ్రిటన్‌లోని హేమర్ ఫిలింస్ అనే సంస్థ ఉంది. వీరు కొన్ని వందల హర్రర్ చిత్రాలు తీశారు. 1957లో, ప్రజలను హడలెత్తించిన హర్రర్ ఆఫ్ డ్రాకుల అన్న చిత్రం ఈ సంస్థ నుంచి వచ్చినదే. హాలోవిన్, 1, 2, 3, 4 అంటూ ఎన్ని సిరీస్ వచ్చాయో మనం లెక్కపెట్టలేము.

హాలీవుడ్‌లో భయానకమైన దెయ్యాలు, భూతాల చిత్రాలు చూసేవారు, ఇష్టపడేవారు చాలామంది ఉన్నారు. వీటిని హర్రర్ చిత్రాలని, Halloween చిత్రాలని పిలుస్తారు. హర్రర్ అంటే భయంకరమైన అనే అర్థం ఉందని అందరికీ



తెలిసిందే. Hallow అనే మాటకు పరిశుద్ధ పరచటం, విగ్రహానికి సంప్రోషణ చేయటం అనే అర్థాలున్నాయి. మరి దాని నుంచి తత్సమంగా ఉద్భవించిన Hallowen అనే మాటకు అర్థం ఏమిటి? ఈ పదానికి చాలా చరిత్ర ఉంది. ఇది ఇప్పటిది కాదు. క్రీ.పూ. 500 సంవత్సరాల నాటినుండి వాడుకలో ఉంది. ఇంగ్లాండు దేశపు ఉత్తర భాగమైన ఐర్లాండ్‌లో సెల్టిక్ జాతికి చెందినవారు జీవిస్తున్నారు. క్రైస్తవ మతం కాలిడక పూర్వం అక్కడి ప్రజలు పేగన్ మతస్థులు. పేగన్ మతం పేరు కాదు. పేగన్ అంటే బహుదేవతారాధన. ఈజిప్టు, బాబిలోనియన్, ఇండియా, చైనా, గ్రీస్, రోమ్, అరబ్ అన్ని దేశాలలోని ప్రజలు దేవుడు ఒక్కడు కాదు, అనేకులు అని భావిస్తూ ప్రతి ప్రకృతి శక్తికి ఒక రూపాన్ని సృష్టించి, పూజించుకునేవారు.

యూరోప్, అమెరికాలలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 31వ తేదీ రాత్రి, Hallowen నైట్ అనే పేరుతో దయ్యాల పండుగ? జరుపుకుంటారు. దీనిని పండుగనే అందాం. ఎందుకంటే ఇది ఒక వేడుకగా సాగుతుంది. ఊరిలోని ఆబాలగోపాలం ఇందులో పాల్గొంటారు. చనిపోయినవారి ఆత్మలు ఆ రోజు మరో లోకం నుంచి భూమి మీదకు వస్తాయని ఆ రోజు రాత్రంతా తిరుగాడతాయనే ఒక మూఢనమ్మకానికి ప్రతీక ఈ పండగ. మరణించిన పితృదేవతలు ఆకలితో అలమటిస్తారని, వారికోసం కొన్ని పప్పు ధాన్యాలు, వంటలు చేసి, ఇంటి ముందు ఉంచుతారు. అలా చేయకపోతే వాళ్ళు ఆకలితో అలమటించి, శాపనార్థాలు పెడతారని, పంటలను పాడుచేస్తారని, కుటుంబాలు వృద్ధిలోకి రావని విశ్వసిస్తారు. ఆ రోజు సాయంత్రం ఇంట్లో దీపాలను వెలిగించకుండా ఇంటి బయటకువచ్చి మంటలు వేస్తారు. ఆ రాత్రంతా పిల్లలు, దెయ్యాల ముసుగులు ధరించి, ఇతరులు భయభ్రాంతులయ్యేలా అల్లరి పట్టిస్తారు. తోడేళ్ళ అరుపులు, నక్కల ఊళలను అనుకరిస్తారు. ఇంటింటికీ పోయి, తలుపులు



దెయ్యాల వేషధారణ

తడతారు, అల్లరి చేస్తారు. ఇంటివారు తలుపులు తీసి, తాము భయపడుతున్నట్లు నటిస్తారు. పిల్లలకు తినుబండారాలు, బొమ్మలు, ఆటవస్తువులు కానుకలుగా ఇస్తారు. ఆ తర్వాత బోన్‌ఫైర్ (భోగిమంట లేదా హోలీ నాటి కాముని దహనం) మండిస్తారు. ఆ మంట అగ్రభాగాన విరిగిపోయిన కుర్చీ ఉంచి, అందులో దయ్యం ఆకారంలో ఒక బొమ్మను కూర్చోబెడతారు. కొన్ని దేశాలలో దయ్యం వేషం వేసుకొని ఒక మనిషే కూర్చుంటాడు. మంటలు పెద్దవి కాక మునుపే అతను చాకచక్యంగా తప్పించుకుంటాడు. మంటలు పెద్దవైన తరువాత మంటల చుట్టూ చేరిన జనం హాహాకారాలు పెడతారు. పెద్ద గోలతో సంబరం పూర్తవుతుంది. ఎవరింటికి వారు వెళతారు. అప్పుడు ఇంట్లో దీపాలు వెలిగిస్తారు.

నిజానికి అక్టోబర్ 31తో ఐరోపా దేశాలలో వేసవి పూర్తవుతుంది. మంచు కురవటం ఆరంభమవుతుంది.

క్రైస్తవ మత ప్రాబల్యం హెచ్చిన తరువాత దీనిని పక్కన పెట్టాలనే ప్రయత్నం జరిగింది. ఈ దెయ్యాల రాత్రికి కొంతకాలం స్తబ్థత ఆవహించింది. కానీ క్రీ.శ. 1745 నుంచి ఇది ఒక వెర్రిగా తిరిగి మొదలైంది. మనలో జీర్ణించుకుపోయిన సంప్రదాయం, మనల్ని వీడదు అన్న దానికి నిదర్శనం ఈ రోజు. ప్రజలు అంత సులువుగా దీనిని వదలరని తెలుసుకున్న క్రైస్తవ పెద్దలు దీనికి అంగీకారం తెలిపారు. ఇది జరిగిన మరునాడు అనగా నవంబరు 1 వ తేదీన నూతన సంవత్సర ఆరంభం అవుతుంది.




దీనినే ఆల్ సైయింట్స్ డే గా ప్రకటించారు. అంటే దయ్యాల రాత్రి గడిచి, దేవతల పగలు ప్రారంభమవుతుందన్నమాట. కీర్తిశేషులైన మతాచార్యులు, దేశభక్తులను ఆనాడు చర్చిలో స్మరించుకుంటారు. క్యాథలిక్ మతం అధికార మతంగా ప్రకటించబడిన అన్ని దేశాల్లోను అది సెలవురోజు. కొందరు క్రైస్తవులు ఆనాడు మాంసం ముట్టరు.

పాశ్చాత్య దేశాలలో దెయ్యాలకు, భూతాలకు ప్రతీకలుగా గబ్బిలాలు, సాలిపురుగులు, మానవ కంకాణాలు, నల్ల పిల్లి, పొడవు కర్ర కలిగిన చీపురుకట్ట, జొన్న కంకులను ప్రతీకలుగా ఉపయోగిస్తారు. Halloween అన్న మాటకు ఆల్ సైయింట్స్ అనే అర్థం కూడా ఉంది. ఈ రోజు ఒక గుమ్మడికాయను తీసుకొచ్చి, దాని లోపల గుజ్జును పూర్తిగా తొలగించి, దానికి కళ్ళు, ముక్కు, రంపపు ముళ్ళలాగా ఉండే నోటిని చెక్కి, లోపల కొవ్వొత్తిని వెలిగిస్తారు. వీటిని జాక్‌లాంటర్న్ అంటారు. 'కొవ్వొత్తితో ఆటలాడకండి ప్రమాదం' అంటూ గస్తీ తిరుగుతున్న పోలీసులు హెచ్చరిస్తారు.

అమెరికాలో ఒక సంవత్సరం మొత్తంలో తయారయిన కొవ్వొత్తులలో నాలుగవ భాగం ఆ రోజు అమ్ముడుపోతాయి.

ఇందులో ఏమాత్రం శాస్త్రీయత లేదని పాల్గొనేవారందరికీ తెలుసు. ఇదొక మూఢాచారం అని కూడా తెలుసు. అయినా ప్రాచీన సంప్రదాయాలను పాటించటంలో ఒక హుషారు ఉంది, ఒక తమాషా ఉంది, ఆనందం ఉంది అంటాడు ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు ఫెలినీ తీసిన అమర్‌కార్డ్ అన్న ఫ్రెంచి చిత్రంలో ఒక పాత్ర.



కంకాళం, సాలెపురుగు



ముత్తులక్ష్మీ రెడ్డి

# డాక్టర్ శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డి

- నటరాజ రామకృష్ణ

రష్యా ప్రజలు విజయం సాధించారు. రష్యాలో విప్లవం ముగిసింది. తరతరాలుగా బానిసలుగా జీవిస్తూ వచ్చిన పీడిత రష్యా ప్రజలకు దాస్య విమోచనం కలిగింది. వారి హృదయాలలో కొన్ని శతాబ్దులుగా పేరుకొనిపోయి గడ్డకట్టిన వారి దుఃఖం, కోపం కట్టలు తెంచుకొని వరదలై పారినందువల్లనే అక్కడ విప్లవం చెలరేగింది.

ఆనాడు వారు నిస్సహాయులు. అందువల్లనే వారి జీవితాలలో ఆనాటి ప్రభువులు, పాలకులు ఆడుకొన్నారు. ప్రజలు కూడా మనుషులేనని, వీరికి మనసులుంటాయని, ఆశలు, ఆదర్శాలూ ఉంటాయని ఆనాటి ప్రభువులు ఆలోచించలేదు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను కీలుబొమ్మలుగా వాడుకొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించి ప్రభువుల మీద తిరగబడ్డారు. విజయం సాధించారు, జారు ప్రభుత్వం పతనమైంది.

ఆ కోటల్ని, ఆ కోటల్లోని రాజమందిరాలని, వాటిలో, అంతఃపురాల్ని, సుందర శిల్పాల్ని అంతవరకు అనుభవించడమే కాదు కనీసం కంటితో చూడని ఆ సామాన్య ప్రజల రక్తమాంసాలను ప్రభువులైన కొందరు ప్రభువులు పీల్చి, వారిని పిప్పి చేసి, ఈ దివ్య భవనాలలో విలాసంగా తమ జీవితాలను గడిపారు అని ఆ ప్రజలు భావించి, నమ్మి ప్రభువులపై తిరగబడ్డారు. ప్రభువులు ఆ విప్లవంలో మడిసారు ఆ ప్రజలు ఎవరిమీద వారి కసిని తీర్చుకోగలరు? ఆ ప్రభువులపై నుండిన వారి కోపం ఆ ప్రభువుల భోగభాగ్యాలపైకి మరలింది. వారి కోటలను ధ్వంసం చేశారు. వారి విలాస వస్తువులను నాశనం చేశారు. సుందర శిల్పాలను, చిత్రలేఖనాలను అగ్నికి ఆహుతి చేశారు. రాజసౌధాల్లో ఎక్కడ చూసినా విధ్వంసకాండ చెలరేగింది అలాంటి సమయంలో కొందరు మేధావులు, పెద్దలు లెనిన్ మహాశయుని వద్దకు వెళ్ళి “మహాశయా! ఇదంతా ఏమిటి? మనం ప్రభువుల మీద తిరుగుబాటు తీసుకొని వచ్చింది ఈ విధ్వంసం కోసమేనా? మన దేశంలోని సుందర మందిరాలు, సుందర శిల్పాలు మొదలైనవన్నీ నాశనమైపోతే మనకేం లాభం? ఆపుచేయించండి మహాశయా!” అని వాపోతూ వేడుకొన్నారు. లెనిన్ మహాశయుడు వారి ఆవేదనను గ్రహించి “ఈ ప్రజలు అమాయకులు, వారు చాలా కోపంతో ఉన్నారు. వారికి ఇప్పుడు మంచీ చెడ్డా తెలియదు. కొద్ది రోజుల్లోనే వారి కోపం చల్లారిపోతుంది. వారికప్పుడు విచక్షణా జ్ఞానం వస్తుంది. ఈ సుందర భవనాలు ఉండినచోటనే ఇంతకన్నా మంచి దివ్య సౌధాలను వారు నిర్మించగలరు. వారు ప్రజాసంస్కృతి ప్రతిబింబాలను రూపొందించగలరు” అని ప్రశాంతంగా సమాధానం చెప్పాడు.

ఆయన చెప్పినట్టే జరిగింది. ప్రాచీన సంస్కృతి పూర్తిగా నాశనం కాకముందే ఆ విప్లవకారుల కోపం శాంతించింది. కొత్త పాత మేలికలియకలతో ఒక ఉత్తమ నూతన, ప్రజా సంస్కృతి అక్కడ వెలసిందని రష్యాదేశం పర్యటించిన నేను ఒక కళాకారునిగా గ్రహించాను. నేనేకాదు ఏ కళాకారుడైనా ఈ విషయాన్ని గ్రహించగలడు. శ్రీమతి ముత్తు లక్ష్మి రెడ్డి గారు తీసికొని వచ్చిన దేవదాసీ చట్టం ఈ రష్యా విప్లవం వంటిదే. ఈమె హృదయం నవనీతం. ఆమె గొప్ప విద్యావంతురాలేగాక గొప్ప సంస్కారవంతురాలు. ఆమె భర్త ఒక మహాపురుషుడు. ఆదినుండి మనదేశంలోని కొందరు స్త్రీలు వారి జీవితాలను కళకు అర్పిస్తూ వచ్చారు. అయితే వారు అనుభవిస్తూండిన పడరాని పాట్లకు, అవమానాలకు శ్రీమతి ముత్తు లక్ష్మి రెడ్డి గారి హృదయం ద్రవించింది.

"అంబను అమ్మగా ఆరాధించే ఈ హైందవజాతిలో ఆ అంబ బిడ్డలను, ఆ యమ్మను తమ కళలతో ఆరాధించే ఆమె ఆడబిడ్డలను, తమ జీవితాలను ఆ కళలకు అర్పించిన ఆ కళాజీవులను గౌరవించకుండా ఈ సంఘం ఎంత చిన్నచూపు చూస్తున్నది? ఏమిటీ వింత?" ఇదే శ్రీమతి ముత్తు లక్ష్మి గారి ఆవేదనగా ఉండేది. నేడు దక్షిణాది నాట్యకళ గురించి వ్రాసేవారిలో చాలామంది స్వర్గీయ ఈ కృష్ణయ్యరు, శ్రీమతి రుక్మిణీ అరుండేలు గురించి, ఇంకా ఇతర నాట్యకళావేత్తల గురించి, ప్రస్తావిస్తూ ఉంటారుగాని శ్రీమతి ముత్తు లక్ష్మి రెడ్డిని గురించి ఆమె తెచ్చిన చట్టం గురించి మాట మాత్రంగానైనా ముచ్చటించరు. ఈమె కళలకు ఒనగూర్చిన మేలేను గూర్చి తెలియజేయరు. ఆనాటి కళాకారులకు ఆమె చేసిన మేలును గురించి ఈనాటి కళాకారులకు తెలియజేయాలన్న ఉద్దేశ్యంతోనే ఈ మొదటి మాటను వ్రాస్తున్నాను.

ఈ యమ్మను నేను నా చిన్నప్పుడు ఎరుగుదును. ఆమె భర్త శ్రీ రెడ్డిగారిని కూడా ఎరుగుదును. వీరికి ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దవానితో నాకు పరిచయముండేదిగాని స్నేహం లేదు. రెండవ కుమారుడు శ్రీ కృష్ణమూర్తితో నాకు స్నేహముండేది. కన్న కుమార్తెలు ఆమెకు లేరుగాని సమాజంలో మోసగింపబడ్డ ఆడపడుచులందరూ ఆమె కుమార్తెలే. తమిళనాడులో నుండిన ఒక గొప్ప యోగిని అవ్వయ్యార్ పేరిట ఈమె ఒక "అవ్వాయి హోమ్"ను స్థాపించారు. ఈ యనాథ శరణాలయంలో అనేకమంది అభాగ్యజీవులను చేర్చుకొని వారి చీకటి బ్రతుకులకు వెలుగును ప్రసాదించారు. ఈ యనాథలకు ఆమె బాసగటా, వెలుగు బాటగా నిలిచారు. ఈ యమ్మది అమృత హృదయం. నేను ఆమెను దర్శించుకొన్ననాటికే ఆమె వృద్ధురాలు. ఆమె చిన్న పిల్లలను కూడా ప్రేమతో ఎంతగానో ఆదరించేవారు తల్లినే మరిపించేవారు. ఆమె ప్రేమను చవిచూసినవారికే ఆమె ప్రేమ అర్థమవుతుంది. ఆమె స్థాపించిన అవ్వాయి హోంలో ఉండి, చదువుకొని, ఉన్నత పదవులకు వచ్చినవారెందరో నేడు ఉన్నారు. వారిలో కొందరు ఉత్తమ జీవితాలను గడుపుతున్నారు. ఈ యమ్మ రామకృష్ణా మిషన్లో సభ్యులుగా ఉండేవారు. ఈ మిషన్ ఆదర్శాలు ఆమెకు బాగా నచ్చాయి. అందువల్ల ఆమె తరచుగా ఈ మిషన్‌కు వచ్చి స్వామిజీలను దర్శించి వేళ్ళేవారు. మమ్మల్ని ఆప్యాయంగా పలకరించి, వెళ్ళేవారు. కొన్నాళ్ళు నా సోదరి శారద ఆమె వద్ద ఉండి, చదువుకొంది. అందువల్ల నాకు ఆమెవద్ద చిన్నప్పుడు చనువు ఏర్పడింది. నేను ప్రతివారం ఒక్కసారైనా వెళ్ళి ఆమెను దర్శించి వచ్చేవాణ్ణి. శ్రీ రెడ్డిగారికి కూడా నా యెడల వాత్సల్యం ఉండేది. నాకు ఒకసారి అర్ధ సంవత్సరం పరీక్షల లెక్కల్లో నూటికి నూట ఇరవై రెండు మార్కులు వచ్చాయి. ఆమెతో ఈ విషయం చెప్పేవరకు నా సంతోషం ఆగలేదు. ఆమె నన్ను ప్రేమతో అభినందించి, ఇంకా బాగా చదువుకోమని చెప్పారు. ఈ విషయం ఆమె రెడ్డిగారికి చెప్పి, నన్ను ఆయన సరసన కూర్చోబెట్టి మిఠాయి పెట్టారు. తల్లిదండ్రులను విడిచి దూరంగా రామకృష్ణా మిషన్‌లో ఉన్న నాకు ఆమె మాతృమూర్తిగా కనిపించేవారు. నావంటి వారిని ఇంకా ఎంతమందినో ఆమె ఆదరించారు. వారి జీవితాలలో ఆనందజ్యోతులు వెలిగించారు. వివేకానందులు వారు చెప్పినట్టు ఆమె ప్రతి మానవునిలోను మాధవుణ్ణి చూసేవారు. ఆమె ఒక మహత్తరమహనీయ వ్యక్తి. నేడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన, ప్రపంచమంతా భరతనాట్యం పేరుతో ప్రచారమౌతున్న తంజావూరు నాట్యం గురించి పెద్దలెందరో ఉపన్యాసాలు ఇస్తూ ఉంటారుగాని శ్రీమతి ముత్తు లక్ష్మీ రెడ్డి గారి గురించి ఒక్క చిన్న మాటను కూడా ప్రస్తావించరు సరిగదా ఆమె నాట్యకళకు వ్యతిరేకి అని గూడా అంటారు.

శస్త్రచికిత్స అవసరమైనప్పుడు శస్త్రవైద్యుడు నిర్దాక్షిణ్యంగా మన శరీరంలో ఆ భాగాన్ని కోస్తాడు. అప్పుడు తాత్కాలికంగా మనకు బాధ కలిగినా దాని సత్ఫలితాన్ని తర్వాత మనం అనుభవించి ఆనందిస్తాం. అదేవిధంగా ఆమె ఈ కళ విషయంలో శస్త్రచికిత్స చేశారు ఊహించలేనంత, చెప్పనలవి కానంత మేలు నాట్యకళకు జరిగింది. ఆమె నాట్యకళను వ్యతిరేకించలేదు. ఆనాటి సాంఘిక దురాచారాలను వ్యతిరేకించారు ఆమె ఆనాడు ఆ చట్టాన్ని ప్రతిపాదించకుండా యుండియుంటే ఈనాడు అన్ని కులాలవారు ఈ నృత్యకళను ఇంతగా అభ్యసించి ఉండేవారు కారు. ఇంతమంది కళాకారులు భారతదేశంలో తయారయ్యేవారు కారు. ఈ నాట్యకళకు ప్రపంచంలో ఇంత పేరుప్రఖ్యాతులు వచ్చేవి కావు. పూర్వం నాట్యకళారాధనకే తమ జీవితాలను అంకితం చేసిన కొంతమంది జీవితాలు దుర్భరంగా ఉండేవి. వారి సౌందర్యం, వారి ఆటపాటలు, వారి తెలివితేటలు, వారి కవితా ప్రవచనాలు కొంతమంది రసిక హృదయులకు

అవసరమయ్యేవి. వీటిని పూర్తిగా అనుభవించేవారు. కాని సంఘంలో వారు నీచులుగా చిత్రీకరించబడ్డారు. ఇదీ వారికి దక్కిన ప్రతిఫలం. అది ఆనాటి సాంఘిక వ్యవస్థ. ఈ సాంఘిక వ్యవస్థను ఈ సాంఘిక వ్యవస్థను చూచి శ్రీమతి ముత్తు లక్ష్మీరెడ్డి గారి హృదయం ద్రవించిపోయింది. అందువల్లనే ఆవె దేవదాసీ చట్టాన్ని చేపట్టారు. దేవాలయాల్లో ఆ దేవాలయాలకు అర్పించబడిన కొందరు స్త్రీలు నృత్యపూజ చేసేవారు. ఈ ఆచారాన్ని ఆమె అరికట్టాలనుకొన్నారు. కొందరు స్త్రీలను గుడికి అర్పించే విధానాన్నే అరికట్టాలని ఆమె అనుకొన్నారు. ఈ స్త్రీలు నృత్యకళను ఆరాధించకపోయినా ఫరవాలేదు. వారు తోటి స్త్రీలలతో కలిసి గౌరవంగా జీవించాలన్నదే ఆమె ధ్యేయం.

ఈ కళారాధనను ఒక ప్రత్యేక కులంవారికే ఎందుకు పరిమితం చేయాలి? కులాల ననుసరించి కుల విద్యను కులవృత్తిగా చేపట్టాలన్నది పాతకాలపు వ్యవస్థ. అందరూ అన్ని వృత్తులను చేసికొంటున్న ఈ ఇరవయో శతాబ్దిలో దేవదాసీలు మాత్రమే ఈ నృత్యకళకు వృత్తిపరంగా ఎందుకు కట్టుబడి ఉండాలి? ఇతర వృత్తుల్లాగే ఈ వృత్తిని గూడా అందరూ ఎందుకు చేపట్టకూడదు? నాట్యకళ ఉత్తమమైనది, సంపూర్ణమైనది. సంగీత సాహిత్యాల సమ్మేళనంతో మానవ హృదయ భావాలను వ్యక్తీకరించే కళ, మోక్ష సాధనకు దగ్గిర మార్గం అని పెద్దలు యీ కళను కొనియాడుతూ ఉంటారు కనుక ఇటువంటి కళ ఏ కొద్దిమందికో పరిమితం కాకూడదు. అందరూ ఆరాధించాలి. కాని పూర్వం ఇలా జరగలేదు. అందుకే ఆమె దేవదాసీ చట్టాన్ని తీసుకొని వచ్చారు. దీంతో దేవాలయాల్లో నృత్యపూజలు అంతమొందాయి. ఆమె నాట్యకళకు వ్యతిరేకి అని విమర్శలు వచ్చాయి. వాటికి ప్రతివిమర్శలు వచ్చాయి. అదొక చిన్న యుద్ధంగా పరిణమించింది. ఆ తర్వాత ఈ కళకుగల పవిత్రతను చాలామంది గుర్తించి తమ బిడ్డలకు నాట్యకళను నేర్పించారు. నేడు నేర్పిస్తున్నారు. దీనిని ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారానికి నేనూ చాలా కృషి చేశాను. అయితే ఈ కళలోగల పరమార్థాన్ని ఎంతమంది నిజంగా అర్థంచేసుకున్నారో నేను చెప్పలేను.

శ్రీమతి ముత్తు లక్ష్మీరెడ్డి గారు మానవునిలో మాధవుణ్ణి చూసిన మహావ్యక్తి. మానవుణ్ణి మాధవునిగా గౌరవించాలని అభిలషించిన అమృత హృదయిని. ఆమెవల్లనే నాట్యకళకు ఈనాడు ఉన్నత దశ వచ్చింది. అందుకే ఆమెను ఈ "రుద్రగణిక"లో ముందుగా నేను స్మరిస్తున్నాను.

---

## ఇండియన్

**అ**మెరికా నుంచి ట్రంప్ భారత్ చూడటానికి వచ్చి ఆశ్చర్యపోయాడు. ఎంత సంపద – ఎలాంటి ప్రకృతి. తరగని సమృద్ధి వనరులు – జీవనదులు – హిమగిరులు – ఎమరాల్డ్‌లాంటి కేరళ – బంగారంలాంటి రాజస్థాన్ – గుజరాత్ – ఓహో కులూమనాలి – ఇక నగరాల సోయగాలు చెప్ప పనిలేదు. హిమాలయాలు – గంగా యమునలు – ఆయన ముగ్ధుడైపోయి తిరిగి వెళ్ళి అమెరికాలో తన అనుభవాలు చిన్న సభలో చెప్తున్నాడు.

"అలాంటి దేశం ఎక్కడా లేదు, అంతటి చరిత్ర – తాత్త్విక విచారణ, వేదభూమి, ప్రకృతి శోభ, వనరులు ఎవరికుంటాయి – నిజంగా అద్భుతం" అంటున్నాడు. వినేవారు ఆశ్చర్యపోతున్నారు. అందులో ఒక భారతీయ సంతతివాడు 'సార్, మీరు ఇండియన్లను కలిశారా, వారితో మీ సంభాషణా విశేషాలు చెప్పండి.'

ట్రంప్ – "ఇండియన్‌నా – ఎవరూ తారసపడలేదే.. కాశ్మీర్‌లో కశ్మీర్‌వాడు, పంజాబ్‌లో పంజాబివాడు – రాజస్థాన్‌లో రాజస్థానీ – కలిశారు. ఎంతో గౌరవంగా మాట్లాడారు, ఎన్నో మర్యాదలు చేశారు. ఇంకా దక్షిణాదిన తమిళనాడు తమిళ తంబితో ఆంగ్లంలో చక్కగా మాట్లాడాను. కేరళలో క్రిస్టియన్, ముస్లిం, హిందువులందరితో తిరిగాను. తెలంగాణాలో తెలుగువారి ఆతిథ్యం స్వీకరించాను. ఆంధ్రలోనూ తిరిగాను. కానీ ఎక్కడా ఇండియన్ నాకు కలువలేదు. ఇండియన్‌లు ఎక్కడ ఉంటారో తెలియక ఢిల్లీ వచ్చాను. అక్కడ ఇండియన్ ఆర్మీ – ఇండియన్ నేవీ – ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అని ఉన్నాయి. అవి తప్ప ఎక్కడా ఇండియన్ కనిపించలేదు" అంటున్నాడు ట్రంప్.

అవును, ఇండియాలో ఇండియన్లు ఎక్కడున్నారు?

# కలెవరం కైఫియత్

- *కడియాల వెంకటేశ్వరరావు*

సర్ ఆర్థర్‌కాటన్ కృష్ణాబ్యారేజ్ నిర్మాణానికి 160 సంవత్సరాల ముందుగానే సీతానగరం వద్ద కరకట్టల నిర్మాణం గావించి దిగువ కృష్ణా తీరాన్ని, తెనాలి ప్రాంతాన్ని సస్యశ్యామలం గావించిన అపర భగీరథుడు. కనకదండి సోమన్నగారిని గురించి మొదటిగా 1811లో సేకరించబడిన కలెవరం కైఫియత్‌లో పేర్కొనబడినది. ఈయన కలెవరం గ్రామంలో నివసించేవారని, కుతబ్‌షాహీ పాలనలో అబ్దుల్ హసన్ సుల్తాన్‌గా (తానీషా) పరిపాలిస్తున్న కాలంలో వీరివద్ద పెద్ద వజీరులైన అక్కన్న మాదన్నలకు పౌరహితులుగా ఉండేవారని, అందువల్ల దయచేసి వీరికి కలెవరం సర్వాగ్రహారంగా ఇచ్చి, కూచిపూడి సమితికి జాగీరుదారుగా నియమించబడ్డారని తెలుస్తుంది. మాదన్న మహామంత్రి 1674-75 ప్రాంతాల్లో రాజ్యంలో ప్రవేశపెట్టిన కొత్త సంస్కరణలో భాగంగా ఈయన అనేక ప్రజాహిత కార్యక్రమములు చేపట్టి, గ్రామాలలో వాపీకూప తటాకాలను నిర్మించారని, వ్యవసాయదారులకు అనుకూలంగా ఎన్నో కాలువలు కూడా వీరిచే నిర్మించబడ్డాయని యిప్పటికీ ఈ ప్రాంతంలో వినికిడి ఉంది. ఆ కాలంలో బెజవాడకు దిగువున సీతానగరం గండి వద్ద తుంగభద్రానది మహాప్రవాహం వచ్చి కూచిపూడి సంతు గ్రామాలను వరదపెట్టి ముంచెత్తేదని, నాటి గ్రామాలు, పంటపొలాలు పూర్తిగా మునిగిపోయేవని తెలుస్తుంది. దీనికి సోమన్న గారు చింతించి, ఈ తుంగభద్రానదీ ఉపద్రవాన్ని కట్టడిచేసేందుకు ఆలోచించి నాటికి ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో తెనాలికి 40 కి.మీ. దూరంలో బెజవాడకు దిగువున ఉన్న సీతానగరం వద్ద కరకట్టలను పెద్ద బండరాళ్ళను ఉపయోగించి, వీటిలో సీసము, సత్తు కరిగించి పోసి ఈ కరకట్టల నిర్మించారని తెలుస్తుంది. సర్ ఆర్థన్ కాటన్ బెజవాడ ఆనకట్ట నిర్మాణాలు చేపట్టకముందే 160 సంవత్సరాలకు ముందుగ ఈ సీతానగరం వద్ద కరకట్టల నిర్మాణం గావించి, తుంగభద్రా వరద ప్రవాహాలను కట్టడిచేసి, తెనాలి ప్రాంతాన్ని సస్యశ్యామలంగా చేసారు. అంతేకాక వీరు అక్కన్న - మాదన్నలకు పురోహితులుగానే కాకుండా హితులుగా కూడా వీరి రాచకార్యాలలో, పరిపాలనలో సహాయపడ్డారని కైఫియత్‌లో ఉదహరించిన కొన్ని అంశాలను బట్టి తెలస్తుంది. కనకదండి సోమన్నగారికి కనకదండు లక్ష్మన్న అనే సోదరుడు ఉన్నట్లుగా మరో కైఫియత్ ద్వారా తెలుస్తుంది. వీరి కుటుంబం గురించి మిగిలిన వివరాలేవి తెలియవు. పూర్వం నుండి వీరు కలెవరంలోనే నివసించేవారని కైఫియత్ పేర్కొనటమే కాకుండా పూర్వం కలెవరం గ్రామంలో కనకదండువారు ఈప్రాంతాన్ని పరిపాలించారన్న ఒక వినికిడికూడా ఉంది. వీరు కలెవరంలో నివసించిన గృహం ఉన్న ప్రాంతం గుర్తించబడింది.

కొండవీటి దండకవిలె ననుసరించి క్రీ.శ. 1579 తరువాత కొండవీటిసీమ 14 సముతులుగా విభజించబడినది.

**సముతులు, అందలి గ్రామములు :**

| | | |
|---|---|---|
| 1. | పాలడుగు | 14 గ్రామాలు |
| 2. | ప్రత్తిపాడు | 14 ॥ |
| 3. | నూతక్కి | 14 ॥ |
| 4. | పొన్నూరు | 44 ॥ |
| 5. | మునిగోడు | 56 ॥ |
| 6. | రావిపూడి | 12 ॥ |
| 7. | గుంటూరు | 34 ॥ |
| 8. | పులివర్రు | 52 గ్రామాలు |
| 9. | సంతరావూరు | 10॥ |
| 10. | చేబ్రోలు | 36॥ |
| 11. | మంగళగిరి | 33॥ |

| | |
|---|---|
| 12. నాదెండ్ల | 100॥ |
| 13. కూచిపూడి | 54॥ |
| 14. తాడికొండ | 22॥ |
| **మొత్తం గ్రామాలు** | **495 గ్రామాలు** |

కనకదండి సోమన్న గారు కూచిపూడి సమితికి జాగీరుదారుగా షుమారు 1675-76 ప్రాంతంలో నియమించబడి ఉంటారని భావించబడుతుంది. కుతుబ్‌షాహీల పరిపాలనా కాలంలో తెనాలి కూచిపూడి సమితిలో ఒక గ్రామంగానే ఉంది. తెనాలి గోవర్ధనస్వామి దేవాలయంలో ఉన్న 1489 ఎ.డి. నాటి ఒక శాసనంలో "తెనాలి నగరి" అని పేర్కొనబడినది. తిరిగి ఈ తెనాలి గ్రామ స్థాయికి ఎప్పుడు చేరిందో తెలియదు.

*శ్రీ వక్షజ పటీర కుంకుమ రజశృంగ్గారి తోర స్థల*
*ప్రావిర్భావ మగాత్తెనాలి నగరీ గోవర్ధనాధీశ్వరః ।*
*శాకెరుద్రపయోధి చంద్రగణితే సౌమాభిదే వత్సరె*
*వైశాఖే సిత పక్షగే వారిదినే దేవద్రుమూల స్థలే ॥*

కఠెవరం కైఫియ్యత్తు :- ది 17-11-1811న పులిగడ్డ మల్లయ్య అనే లేఖకునిచే సేకరించబడినది.

"కట్టెవరం" కూచిపూడి సమితి సర్కారు ముత్తుంజా నగరు. ఈగ్రామానికి పూర్వం నుండి కట్టెవరం అను పేరు ఉందని, క్రీ.శ. 1134 ముందు గజపతి గణపతి దేవుడు బ్రాహ్మణులకు ఇచ్చిన 44 గ్రామాదులు అగ్రహారములుగా ఇచ్చేటప్పుడు, యీ గ్రామం కూడా సదరు అగ్రహారములలో చేరింది. ఈ గ్రామానికి కరణీలు వారి సంప్రతి, లక్కరాజు వారి సంప్రతి. ఈ గ్రామానికి అగ్రహారీకులు కనకదండ్డెవారు పూర్వం నుండి ఉండినారు. మొగలాయీ ప్రభుత్వంలో తానీషా పాదశహావారు రాజ్యం చేసేటప్పుడు వీరి దగ్గర పెద్ద వజీరులైన అక్కన్న - మాదన్నల వారికి కన్కదండి సోమన్నగారు పౌరోహితులై యుందురు. గనుక వారియందు దయచేసి కట్టెవరం సర్వాగ్రహరాములు ఇచ్చి, కూచిపూడి సముతు జాగీరు యిచ్చినారు. కనుక వారు అంద్దలములు మొదలైన బహరి బహుమానములు పొంది వచ్చి స్తలములో ప్రవేసించి సదరహిసముతు అబాదాను చేయుచినంతలో కృష్ణానది నుంచి సీతానగరం గండీన తుంగ్గభద్ర మహాప్రవాహంగ్గా వచ్చి కూచిపూడి సముతు గ్రామాలు వరదబెట్టి ముంచివేస్తూ వచ్చే వరకు కనకదండి సోమన్న గారు విచారించి, అనేక ద్రవ్యం వ్యయం చేసి విస్తారం కామటీలను వుంచ్చి సత్తు, సీసం వగైరాలు కాపించి, శిలలనందు బోయించి సీతానగరపు గండిలోనుంచి తుంగభద్ర ప్రవాహం రాకుండా కట్టించినారు. కనుక కూచిపూడి సంతు గ్రామాలకు వరద ఉపద్రవములు నిలిచి, విస్తారంగా పంటలు పండి, ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారినట్లు కైఫియ్యతు తెలియచేస్తుంది. సదరహినకనకదండి సోమన్న గారు కట్టెవరంలోనే కాపురం ఉండినారు. కనుక, ఈ గ్రామానికి ఈశాన్య భాగమందు శివాలయం కట్టించి, తన పేరిట సోమేశ్వరస్వామి అను పేరుపెట్టి లింగమూర్తిని ప్రతిష్ఠచేసి స్వామివారికి ఎదుటన పెద్ద నందికేశ్వరుని నిలుపవలెనని, పని ఆరంభించి చేయుస్తుండగా, ఇంతలో హైదరాబాదులో తుర్కలు అంతా ఏకస్తులై తానీషా వారి దగ్గర పితూరీచేసి అక్కన్న - మాదన్న గారిని తలలు గొట్టినప్పుడు ఇక్కడికిన్ని వారు వచ్చి ఈ కన్కదండి వారిని శిరచ్ఛేదములు చేసిపోయినారు. గనుక తత్సంత్తివారు అందటనే ఖిలమైపోయినట్లుగా కట్టెవరం కైఫియ్యత్ తెలియచేస్తుంది." కైఫియ్యత్ తో పేర్కొన్న పెద్ద నందికేశ్వరుని నిర్మాణం ఆగిపోయి తరవాత కాలంలో ఒక చిన్న నందిని మాత్రమే ఆలయంలో ఉంచారు. ఇది ఇప్పటి దేవాలయంలో ఉంది. ఈ కైఫియ్యత్తును అనుసరించి, కన్కదండివారి కుటుంబం పూర్వం నుండి కఠెవరం గ్రామంలోనే నివసించినట్లుగా తెలియవస్తుంది. కాబట్టి, కట్టెవరం గ్రామనామ ప్రశస్థి గురించి తెలసుకొనవలసి ఉంది. కఠెవరం కైఫియత్ పూర్వం నుండి ఈ గ్రామాన్ని కట్టెవరంగా పిలుస్తున్నారని తెలుస్తుంది. కఠెవరం కైఫియత్ యొక్క విషయసేకరణ 1811 ఎ.డి. లో అప్పటికి ఈ తెనాలి ప్రాంతాల్లో కైఫియత్‌లు సేకరించిన పులిగడ్డ మల్లయ్య అనే లేఖకుని ద్వారా జరిగినట్లుగా తెలుస్తుంది. కఠెవరం పేరు పురాతనమైనదే. గ్రామం ఆవర్భవించిన తరువాత ముందుగా ఈ గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయం, చెన్నకేశవస్వామి వారి ఆలయం పూర్వం ఈ గ్రామంలో ఉండేవని, ప్రస్తుతం ఈ గ్రామంల్లో ఉన్న దేవాలయాలకు ఎదురుగా ఉన్న మార్గంలో కుడివైపున ఉండేవని, వీటికి ఎదురుగా కనకదండి సోమన్నగారి స్వగృహం ఉండేదని తెలుస్తుంది. ఈ పురాతన చెన్నకేశవస్వామి వార్ల దేవాలయానికి చెందిన స్వామివారి విగ్రహం ఒకటి ఇప్పటి ఆంజనేయస్వామి వారి గుడిలో ఉంది. శివాలయం తాలూకు విరిగి తుప్పుపట్టిన ఒక ధ్వజస్థంబం తాలూకు శిధిలాలు

షుమారు 80 సంవత్సరాల క్రితం ఈ ప్రాచీన దేవాలయాలు ఉన్న ప్రాంతంలో కనిపించేవని గ్రామస్తులు తెలియచేస్తున్నారు. కనుక, ఈ పూర్వ దేవాలయాల ఉనికి కలెవరంలో ఉన్నట్లుగా భావించవచ్చు. ఈ నీలకంతేశ్వర స్వామి వారి పేరుమీద ఈ గ్రామానికి నీలకంతేశ్వరం లేక కంతేశ్వరం అనే పేరు స్థిరపడిందని, కాలక్రమంలో ఈ కంతేశ్వరం కలెవరంగా పిలువబడుతుంది అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. శివునికి నీలకంతేశ్వరుడు, జలకంతేశ్వరుడు, తల కంతేశ్వరుడు, త్రిపురాంతకేశ్వరుడు అనే వివిధనామాలు ఉన్నాయి. కలెవరం సమీపంలోని గుడివాడ గ్రామంలోకూడా మరో నీలకంతేశ్వర స్వామివారి దేవాలయం ఉంది. బహుశ ఇవి కాకతీయులనాటి దేవాలయాలు కావచ్చు.

ఇందుకు ఉదాహరణగా ఆంధ్రదేశమంతటా శివుని పేరుతో అనేక గ్రామాలకు పేర్లు ఉండటం మనం గమనించవచ్చు. ముఖ్యంగా నిజామాబాద్ పట్టణం, (నిజామాబాద్ జిల్లా) మధ్యన నీలకంతేశ్వర స్వామివారి దేవాలయం ఉంది. ఈ ఆలయానికి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ఇప్పటికి కంతేశ్వర్‌గా పిలుస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఉర్దూ భాషా ప్రభావం వల్ల కంతేశ్వర్ అయి ఉంటుంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూడా శివాలయాల పేరుతో ఉన్న అనేక గ్రామాలు ఉన్నాయి. ఉదాహరణగా :- విజ్జేశ్వరం, చౌడేశ్వరం, మల్లేశ్వరం, కాళేశ్వరం (వరంగల్ జిల్లా), అంతేకాక మన ప్రఖ్యాత త్రిపురాంతకేశ్వరస్వామి వారి దేవాలయం ఉన్న గ్రామాన్ని త్రిపురాంతకంగా పిలుస్తున్నాను.

కలెవరానికి గ్రామదేవత మల్లమ్మ ఈ దేవాలయాన్ని కడియాల కోటయ్యగారు వారి ధర్మపత్ని సరమ్మ గారు నలనామ సంవత్సరంలో ఈ దేవాలయాన్ని నిర్మించింది. 7-12-1916న శిఖర ప్రతిష్ట చేసినట్లుగా దేవాలయం ముఖమండపంపై శాసనంలో ఉన్నది. కలెవరంలో ఉన్న మల్లేశ్వరస్వామి వారి ఆలయం, రామాలయం, ఆంజనేయస్వామి వారి దేవాలయాలు గ్రామకరణాలైన లక్కరాజు వారి పూర్వీకులచే నిర్మించబడినట్లుగా శాశనాధారాలు ఉన్నాయి. ప్రస్తుతం వారే ట్రస్టీలుగా ఉన్నారు.

**కృష్ణా తుంగభద్ర ప్రవాహాలు, తుంగభద్రానది అంతర్ వాహినిగా ప్రవహిస్తుందా ?**

కృష్ణానదిని మన ప్రాచీన గ్రంథాలలో కృష్ణవేణ్యాం, కృష్ణవేణి అని పేర్కొన్నారు. భారతదేశంలోని పుణ్య నదులలోనేకాక ముఖ్యమైన నదులలో ఇది ఒకటి. పూణే నగరానికి దక్షిణాన పడమటి కనుమలలో మహాబలేశ్వరం వద్ద పుట్టి దక్కన్‌పీఠభూమి గుండా ప్రవహించి, బెజవాడ వద్ద తూర్పు కనుమలు దాటి, దివిసీమవద్ద పాయలుగా చీలి బంగాళాఖాతంలో కలుస్తుంది. దారిలో చిన్న,పెద్ద అనేక ఉపనదులు వచ్చి కృష్ణను కలుస్తున్నవి. తుంగ, భద్ర అనేవి రెండు నదులు. తుంగా నది శృంగేరివద్ద భద్రానదిని కలుస్తుంది. దీనినే తుంగభద్రానది అంటారు. ఇది చివరికి కృష్ణానదిలో మహబూబ్‌నగర్ జిల్లా, ఆలంపూర్ వద్దనున్న కూడలి వద్ద కలుస్తుంది. దీన్ని కూడలి సంగమేశ్వరంగా పిలుస్తున్నారు.

**కృష్ణా జిల్లా మాన్యువల్‌ను అనుసరించి బెజవాడ వద్ద ఉన్న కృష్ణ తుంగభద్రా ప్రవాహాలు :-**

1766లో కొండపల్లి సర్కార్, 1788లో గుంటూరు సర్కార్, ఈస్టిండియా కంపెనీ స్వాధీనంలోకి రాకముందే కృష్ణా జిల్లాలను వ్యవసాయానికి మరలించుకొనే ప్రయత్నాలు జరిగాయి. నది ముఖద్వారంలో భూతలమంతా సమంగా ఉండే దివిసీమలో కృష్ణా వరద జలాలను వృత్తాకారంలోని జలాశయాలలో నిల్వ చేసుకోవడం ద్వారా పంటపొలాలకు నీళ్ళు పారించుకునే ప్రయత్నాలు జరిగేవి. అయితే నదికి ఆవతలి వైపున బెజవాడకు దిగువ భాగంలో సహజ జలమార్గాలు ఉండేవి. బహుశా అవి కృష్ణానది ప్రాచీన భూతలాల మార్గాలో, ఆనవాళ్ళో లేదా వరదల మూలంగా ఏర్పడిన మురికినీటి మార్గాలో అయి ఉండవచ్చు అని తెలుస్తుంది. ఈ జల మార్గలలో ఒకటైన తుంగభద్ర సీతానగరంకు సమీపంలో ప్రారంభమై నిజాంపట్నం వద్ద సముద్రంలో కలుస్తుంది. నాటి ఆంగ్లేయులు కూడా ఈ నదీ ప్రవాహాన్ని తుంగభద్ర కాలువగానే పిలుస్తూ వచ్చారు. అంతేకాక, దుగ్గిరాల గ్రామంలో ఉన్న కేశవస్వామి వారి దేవాలయంలో క్రీ.శ. 1214 నాటి 44 పంక్తులు ఉన్న శాసనంలో కూడా ఈ నదీ ప్రవాహాన్ని దైవస్వరూపంగా భావించి తుంగభద్రా దేవిగా కూడా పిలువబడింది.

*అనన్తరమ తుంగ్గ భద్రాదేవి ప / శ్రిమతః పొలిమెర కుంటు అనన్త / (ర) మనైరిత్యాం తుగ్గ భద్రాదేవి ద/ క్షిణ ముముఖమైన మదుక*

కనుక ఆనాటికి దక్షిణ పడమర డెల్టా అంతటా ముఖ్యంగా ఈ తుంగభద్రా నీటి ప్రవాహాలే గ్రామాలకు

పట్టణాలకు ముఖ్య నీటి వనరులుగా ఉన్నాయి. ఈ శాసనాన్ని బట్టి పురాతన కాలం నుండి తుంగభద్రానది ప్రవాహము దుగ్గిరాలకు తూర్పు వైపునకు ప్రవహిస్తుందని, ఈ ప్రాచీన తుంగభద్రానదీ ప్రవాహాలు వరదల సమయంలో పూర్వం నుండి కూచిపూడి సంతు గ్రామల పైబడి విలయాన్ని సృష్టించినట్లు తెలుస్తుంది. తరువాత బెజవాడ వద్ద 1855 నాటికి ఆనకట్ట నిర్మించిన తరువాత ఈ పురాతన తుంగభద్రా ప్రవాహ మార్గాలను అనుసరించే ఇప్పటి కాలువలు త్రవ్వబడ్డాయని స్పష్టమౌతుంది. దుగ్గిరాల లాకువద్ద నుండి ఈ పెద్ద కాలువ నుండి చీలి, మూడు కాలువలు తెనాలి, కూచిపూడి మొదలైన గ్రామలగుండా ప్రవహించి నిజాంపట్నం చేరుతున్నాయి. ఈ దుగ్గిరాల లాకుల నుండి పడమరవైపుగా కొమ్మమూరు కాలువగా పిలువబడే మరో పెద్ద కాలువ సంగం జాగర్లమూడి మీదగా 109 కి॥మీ॥ వద్ద చిన్నగంజాం గ్రామానికి పడమరవైపుగా ప్రవహిస్తుంది. ఈ పెద్ద కాలువను బకింగ్‌హామ్ కెనాల్ అని కూడా పిలుస్తున్నారు. ఇది మద్రాసు వరకు చెరుతుందని తెలుస్తుంది.

కృష్ణానది ప్రాచీన కాలం నుండి బెజవాడ నుండి నదికి రెండు వైపులా పాయలుగా ఏర్పడి కృష్ణా డెల్టా అంతట ప్రవహించిన ఆధారాలు కనిపిస్తున్నాయి. ఆనవాలుగా ఈ నది ప్రవహించిన మార్గాలలో ఇసుకరేవులు, గుండ్రని గుళకరాళ్ళు కనిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా ఈ మధ్యకాలంలో వద్దపూడి వద్ద నిర్మించిన ఓవర్ బ్రిడ్జి నిర్మాణ కోసం తూర్పువైపున త్రవ్వబడిన పునాదులలో పెద్ద ఇసుకరేవు బయల్పడింది. బహుశ ఇది నదీ ప్రవాహానికి చెందిన పూర్వరేవు ప్రదేశం అయి ఉంటుంది. ఇది తూర్పున ఉన్న తుంగభద్రా మెయిన్ కెనాల్‌కు సమీపంలోనే ఉంది. అలానే తెనాలి డెల్టాకి సమీపంలో ఉన్న గ్రామాలలో నీటి బోర్లు వేసే సందర్భంగా భూమి లోపల షుమారు 20–30 అడుగుల లోతులో గరప ఇసుక, నున్నగ ఉన్న గుళకరాళ్ళు బయటపడుతుంటాయి. భూమిలోపల ఉన్న నీటి ప్రవాహా వేగానికి దొర్లుకుంటూ రావటం వల్ల ఇవి నున్నగా మారి ఉంటాయి. కనుక, ఇవి పురాతన కృష్ణాపాయలకు సంబంధించిన ప్రాచీన ప్రవాహ మార్గాలు అయి ఉండవచ్చు. ఇందువల్ల పూర్వం కృష్ణా ప్రవాహాలు ఈ డెల్టా ప్రాంతం అంతటా పాయలుగా చీలి పల్లపు ప్రాంతాలలో ప్రవహించి ఉంటాయని భావించబడుతుంది. ఇలాంటి కొన్ని ప్రాచీన నదీప్రవాహాలు భూమిలో అంతర్ వాహినులుగా మారి ఉంటాయని భావిస్తున్నాను.

**కైఫియత్‌ల నిర్మాణం – వీటి సేకరణల వెనుక కల్నల్ కాలిన్ మెకంజీ గారి కృషి :**

కనకదండి వారి ఉదంతం మొదటిగా కతెవరం కైఫియత్‌లోనే చేర్చబడి ఉంది. పూర్వం 1811, 1812 సం॥ల కాలంలో కల్నల్ కాలిన్ మెకంజీ గారి ఆధ్వర్యంలో కృష్ణా – గుంటూరు జిల్లాలో ఉన్న గ్రామాలన్నింటికీ గురించిన చరిత్ర, ఇతర వివరాల గురించి కైఫియత్‌ల రూపంలో సేకరించబడ్డాయి. మెకంజీగారికి కావలి వెంకట బొర్రయ్య సోదరులు ఈ కైఫియత్‌ల నిర్మాణానికి ఎంతో సహకరించినట్లుగా తెలుస్తుంది. వీరి క్రింద నియమించిన గుమస్తాలు ప్రతి గ్రామానికి వచ్చి ముఖ్యంగా కరణాల వద్ద నుండి గ్రామ పెద్దల నుండి కూడా గ్రామాల వివరాలు, దేవాలయాలచరిత్ర గురించి, పూర్వపు చరిత్రల వినికిడుల గురించి, అప్పటికే మన పూర్వీకులు చరిత్రను రికార్డు చేసిన తాళపత్ర గ్రంధాల రూపంలో ఉన్న కొన్ని యాదస్తులు (గండికోట యాదస్తు) దండ కవిలెం (కొండవీటి దండ కవిలెలు) కూడా వీరు సేకరించేవారు. ఇలా సేకరించబడిన కైఫియత్‌లలో ఒకటైన కతెవరం కైఫియత్‌లో ముఖ్యంగా కనకదండి సోమన్నగారి గురించిన వివరాలు సేకరించబడ్డాయి. ఇప్పటికి వీరి ఉదంతం గురించి ఇవే ముఖ్యమైన ఆధారాలు, అంతేకాక కృష్ణాడెల్టా ప్రాంతంలో అనేక గ్రామాల చరిత్రలు కూడా కైఫియత్‌ల రూపంలో సేకరించబడ్డాయి. కనుక, ఈ కైఫియత్‌ల నిర్మాణం గురించి మన చరిత్రకు మహోపకారం చేసిన కల్నల్ కాలిన్ మెంకజీ గారి గురించి తెలుసుకోవలసి ఉంది. ఆంగ్లేయులు మన దేశాన్ని 300 సం॥లు పరిపాలించారు. ఇంగ్లాండ్ నుండి వచ్చిన అధికారులలో ఎక్కువమంది మన దేశాన్ని దోచుకున్నవారే. అందులో అతి కొద్దిమంది మాత్రం మన దేశాన్ని, భాషను, సంస్కృతిని గౌరవించి, మన ప్రజలను ప్రేమించారు. అందులో ముఖ్యంగా ఆంధ్రరాష్ట్రానికి మహోపకారం చేసిన సర్ ఆర్థర్ కాటన్, సి.పి. బ్రౌన్‌లాంటి వార్లతో పోల్చదగ్గవారు కల్నల్ కాలిన్ మెకంజీ. ఈయన 1810లో మద్రాస్ ప్రాంత సర్వేయర్ గా నియమించబడ్డారు. 1816లో భారతదేశం మొదటి సర్వేయర్‌జనరల్‌గా కూడా నియమించబడ్డారు. వీరికి స్వతహాగ ఉన్న చరిత్ర అధ్యయనం

పట్ల ఉన్న ఆసక్తితో మొదటి నుండి ఆంధ్రప్రదేశంలో ఉన్న గ్రామాల పట్టణాల చరిత్రలను కైఫియత్‌ల రూపంలో సేకరించి, భద్రపరచినారు. 1795 నుండి 1816 వరకు దక్షిణ భారతదేశంలో ఉద్యోగం చేసినప్పుడు, మెకంజీ తాళపత్ర గ్రంధాలు, వ్రాత ప్రతులు 1560 వరకు సేకరించారు. ఇవి కాక అతని సేకరణలో ప్రధానమైనవి (1) స్థానిక చరిత్రలు 2,070 (2) శాసన పాఠాలు 8,076 (3) దేశపటాలు 79 (4) బొమ్మల పెయింటింగ్స్ 2,630 (5) నాణాలు 6,218, (6) శిల్ప చిత్రాలు 106, (7) పురాతన వస్తువులు 40 ఇవన్నీ మెకంజీ తన స్వంత డబ్బు రూ. 15,000/-ల ఖర్చు చేసి సేకరించారు. మెకంజీ సేకరణలను అతని మరణానంతరం కంపెనీ పరంగా వార్న్ హేస్టింగ్స్ 10,000/- డాలర్లకు కొన్నారు. ఈ సేకరణలన్నీ మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో భద్రపరచబడినాయి. ప్రపంచ చరిత్రలో అన్ని చారిత్రక వస్తువులను సేకరించినావారు మరొకరు లేరు. అంతేకాక మెకంజీ కృషి వలనే అమరావతిలో బౌద్ధస్థూపం ఉన్న విషయం వెళ్ళడయింది. అప్పటికే ఈ బౌద్ధ స్థూపం ఇటుకల కోసం, సున్నం తయారుచేసేందుకు ఆనాటి పాలరాతిపై చెక్కబడిన శిలాఫలకాలు ధ్వంసం చేయబడ్డాయి. ఈ విషయాన్ని తెలుసుకొని 1792 లో అమరావతిని మొదటిగా దర్శించిన మెకంజి ఆనాటి రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు వారిని కలసుకొని ఈ అమరావతి స్థూపం యొక్క ప్రాముఖ్యతను తెలియచేసి, ఈ స్థూపాన్ని రక్షించవలసినదిగా వెంకటాద్రినాయుడు గారికి విన్నవించారు. అందుకు జమిందార్ దయతో అంగీకరించారని మెకంజి తెలియజేశారు.

**కుతుబ్‌షాహీల పరిపాలనా కాలంలో కనకదండివారు అక్కన్న మాదన్నలకు సహాయకులుగా ఉండేవారా ?**

కనకదండి సోమన్నగారు కుతుబ్ షాహీల పరిపాలనలో అబ్దుల్ హసన్ తానీషా సుల్తాన్ (1672-1687)గా ఉన్నప్పుడు, వారి ప్రధానులైన అక్కన్న, మాదన్న (1674-1686) లకు పౌరోహితులుగా ఉన్నందువల్ల వీరికి కఠెవరం గ్రామం సర్వాగ్రహారంగా కూచిపూడి సమితి జాగీర్‌దార్ గా నియమించబడ్డారు. ది. 08-10-1685న హైదరాబాద్ నగరం పై మొఘల్ సేనలు దండెత్తి 8 మాసాల ఘోర సంగ్రామం తరువాత హైదరాబాద్ నగరాన్ని ఆక్రమించుకోవటం, అంతకు ముందుగానే సుల్తాన్‌తో పాటు నాటి ముఖ్య రాజబంధువులు, అధికారులతో కలసి సుల్తాన్ గోల్కొండలో ప్రవేశించటం, అదే సమయంలో 16-3-1686న కోటలో అక్కన్న మాదన్నలు హత్య గావించబడటం, వెంటనే కొంతమంది ముస్లిం సర్దార్‌ల దండు గుఱ్ఱాలపై హైదరాబాద్ నుండి కఠెవరంలో ఉన్న కనకదండివారిపై దండెత్తి వారిని కుటుంబ సమేతంగా హత్య గావించడం లాంటి సంఘటనలు జరుగటం వల్ల కఠెవరం కనకదండివారి చరిత్ర కుతుబ్‌షాహీల పాలనలో వారి ప్రధానులైన అక్కన్న - మాదన్నలతో ముడివడి ఉన్నట్లుగా మనకు తెలుస్తుంది. వీరు కుతుబ్‌షాహీల ప్రధానులకు పౌరోహితులుగానేకాక, వీరి హితులుగా కూడా ఉన్నట్లుగా వారికి రాజకీయపరంగా పరిపాలనాపరంగా కూడా కనకదండివారు సహాయపడినట్లుగా భావించబడుతుంది. అందువల్లనే వీరిపై ఉన్న ఆగ్రహంతో అక్కన్న మాదన్నలతో పాటు కనకదండీ వారిని కూడా శత్రువులుగా భావించి, కఠెవరం వరకు వచ్చి వారిపై దాడిచేసి కనక దండి వారిని శిరచ్ఛేదనం చేసినట్లుగా, అంతటితో కనకదండివారి వంశం ఖిలం అయినట్లుగా తెలుస్తుంది.

**ఆనాటి కుతుబ్‌షాహీలనాటి అబ్దుల్ హసన్ తానీషా పరిపాలన, నాటిప్రధానులైన అక్కన్న - మాదన్నల ప్రజాహిత సంస్కరణలు :**

1674 ప్రధమపాదంలో మాదన్న ఒక పెద్ద రాజ్యానికి ప్రధాని అయినాడు. పైసా లేని ఖజనా, శాంతిలేని దేశం, యంత్రాంగం లేని పరిపాలన, రాని పన్నులు, భద్రతలేని ఊళ్ళు, కుంటుపడిన పరిశ్రమలు, రాజభక్తిలేని సైన్యం రాజ్యాన్ని అమ్మజూపే అధికారులు. రాజశాసనాన్ని మన్నించని యూరోపియన్ వర్తకులు, శివార్లపై పొంచివున్న మొఘులాయిల ముప్పు వారసత్వాన మాదన్నకు లభించాయి. ఈ మాదన్న ప్రధాని కాగానే ముందు పాడుబడిన గ్రామాలను పునర్ వ్యవస్తీకరించబూనినాడు. వాపీకూప తటాకోద్యానవనాలు పునరుద్ధరించాడు. గౌరవనీయులైన స్థానికులను వంశ పారంపర్యులగు గ్రామాధికారులుగ నియమించాడు. దేవాలయాలకు, పండితులకు, సైనికాధికారులకు తదితర మాననీయులకు భూ ఖండాలు, గ్రామాలు, అగ్రహారాలు, మాన్యాలు, జాగీర్లు ఇవ్వబడేవి. మాదన్నచే అనేక కొత్త జాగీర్లు, అగ్రహారాలు, ఈయబడ్డాయి. అట్లు ఇయ్యబడిన ధర్మశాసనాల్లో అభివృద్ధి కార్యకలపాలకు సంబంధించిన

నిబంధనలు ఉండేది ఈ ప్రజాహిత సంస్కరణల కాలంలోనే కనకదండి వారికి షుమారు 1674-75 సంవత్సరాలలో కలెవరం సర్వాగ్రహారంగానూ, కూచిపూడి సమతికి జాగీర్‌దార్‌గా నియమించబడ్డారు. దీన్ని బట్టి కనకదండి సోమన్న గారికి కూచిపూడి సమితి జాగీరు ఇవ్వబడిన వెంటనే తుంగభద్రా వరద ముంపునుండి కూచిపూడి సమితి గ్రామాలను. రైతులను కాపాడేందుకు తెనాలికి షుమారు 40 కి.మీ. దూరాన ఉన్న సీతానగరం దగ్గర తుంగభద్రా గండిని పూడ్చలసిన అవసరం ఉందని భావించి, ఎంతో ద్రవ్యం వ్యయం చేసి గండిని పూడ్చేందుకు సిద్ధపడ్డారు. మాదన్న మహా ప్రధాని గారు ప్రజాహితం కోరి వారి హయంలో చేపట్టిన కొత్త సంస్కరణలో భాగంగానే కనకదండి సోమన్నగారు ఆలోచించి, ఈ తుంగభద్రా ప్రవాహాన్ని సీతానగరం వద్ద పెద్ద కరకట్టలు నిర్మించి, కట్టడిచేసేందుకు బహుధనం ఖర్చుచేసి, తుంగభద్రా వరద ప్రవామాన్ని నివారించి, కూచిపూడి సంతు గ్రామాలకు వ్యవసాయదారులకు మహోపకారాన్ని చేసారు. వరద ఉధృతినిబట్టి ఈ సీతానగరం గండిలో పెద్ద బండరాళ్ళను వేసి, సీసం, సత్తు కరిగించి అప్పటికి ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కరకట్టలను నిర్మించినట్లుగా తెలుస్తుంది. భారతదేశంలో మరే ఇతర చోట్ల 17వ శతాబ్దంలో ఈ విధంగా సీసం, సత్తు లాంటి లోహాలను ఉపయోగించి కరకట్టలను గాని, ఆనకట్టలను కాని నిర్మించిన దాఖలాలు కనిపించవు.

సీతానగరం దగ్గర గండిగుండ తుంగభద్ర ప్రవాహం వరద పేర్కొనబడింది. వరద ప్రభావం అరికట్టుటవల్ల ఈ కూచిపూడి సమితి సస్యశ్యామలమైనదని. తుంగభద్ర ప్రవాహాన్ని అరికట్టుటవల్ల కనకదండి వారు ఖిలమైపోయినట్లు చుండూరు ఖపియత్‌లో కూడా పేర్కొనబడింది. కనుకదండు వారు ప్రభుత్వము చేశేటప్పుడు సీతానగరం దగ్గర కృష్ణాలో పయిలు నష్టంకింద వస్తూ వుండ్డేవి గన్కు తుంగభద్రప్రవాహం రాకుండ్డా కట్టించ్చి బహు బంద్దోబస్తు చేశి తుంగభద్ర గుప్తగామిని చేసినారు. ఇదే విషయాన్ని కృష్ణానది శాపవశాన తుంగభద్ర గుప్తగామీ అయినట్లు ఆ నాటికి జనశృతిలో ఉన్న పురాణ కదనాన్ని చుండూరు కైఫియత్ ఈ విధంగా తెలియజేస్తుంది. "యీ లాగ్ను మహాప్రవాహగామియైన తుంగభద్ర మనుష్య ప్రయత్నం చాతను గుప్త గామి కావడాస్కు హెతువు యెమంట్టెం పూర్వం తుంగభద్ర వుత్పత్తి స్థానం నుంచ్చి వచ్చి కృష్ణలో సంగ్గమమై ఒక ప్రవాహంగానే కొంతదూరం వచ్చి సీతానగరం దగ్గరను కృష్ణాతోటే నేను నీతో కూడా సాగర సంగ్గమమయితే నా పేరు ప్రకటన యంతమాత్రం లేకుండ్డా పోతుంద్ది గన్కు నేను యిక్కడి నుంచ్చి ప్రత్యేకంగా ప్రవహించ్చి సాగర మంద్దు సంగ్గమ మవుతాను అని చీలే యడల కృష్ణకు కోపం వచ్చి నీవు పూర్వం నాతోటి కూడ సముద్ర సంగ్గమమయ్యేటట్టుగా వచ్చి కరారు తప్పితివి గన్కు కొంతకాలాన్కు మనుష్యుల చాత బంద్దించ్చబడి గుప్తగామి అవుదువుగాక అని శపించినది అనిన్ని ఆ హెతువువల్ల తుంగభద్ర గుప్తగామి అయ్నిది అనిన్ని చెప్పినారు మహా ప్రవాహం కట్టుటవల్ల కస్కదండ్డివారు వృద్ధిలేకుండ్డా పోయినారు యీ దేముళ్ళకు పూర్వం యీ గ్రామంలో వుండే వృత్తి క్షేత్రములు మొగలాయితోను హరించ్చబడ్డవని తెలియజేస్తుంది. మన పురణాలు శాస్త్రాలు స్వేచ్ఛావాహిని అయిన నదీ ప్రవాహాన్ని అడ్డుకోరాదని తెలియచేస్తున్నాయి. ఈ కారణంగా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి బ్యారేజ్ నిర్మాణ సమయంలో అనేక కష్టాలు పడవలసి వచ్చినది. గోదావరి ఆనకట్ట నిర్మాణానికి పునాదులు త్రవ్వేందుకు భయపడి కూలీలు ఎవ్వరూ రాలేదు. తరువాత ఎన్నో ప్రయాసలు పడి బ్యారేజి నిర్మాణపు పనులు లేటుగా ప్రారంభించబడినవి అని కాటన్ చరిత్ర తెలియజేస్తుంది.

కనకదండివారి గురించి, జనశృతంగా కలెవరంలో ఇప్పటికి చెప్పుకుంటారు. పూర్వం 50 సంవత్సరాల క్రితం మా చాలమాల కంచర్ల ఎఱ్రసుబ్బయ్య పూర్వం ఈ ప్రాంతాన్ని కనకదండోరు పరిపాలించారని, హైదరాబాదు నుండి సాయిబులు ఇక్కడికి వచ్చి కనకదండి వారిని చంపివేసి, ఆడచెర పట్టారని, అప్పుడు ఆడవారందరూ నగలతో సహా బావిలోకి దూకి చనిపోయారని నాతో చెప్పేవారు. కనుక కైఫియత్ పేర్కొన్న కనకదండివారి ఉదంతం, జనశృతిలో ఉన్న కనకదండివారి గురించి ఉన్న స్మృతులను బట్టి ఇది యదార్ధగాధగా భావించబడుతుంది.

అక్కన్న, మాదన్నదల మేనల్లుడు కంచర్ల గోపన్న భద్రాచలం తహశీల్దారుగా ఉన్నారు. వీరు తహశీల్దారు పనిచేయు చున్నప్పుడు భద్రాచలంలో రామాలయం నిర్మించి, 6 లక్షల ప్రభుత్వ ధనం ఖర్చు చేసినందుకు ఖైదు చేయండి, గోల్కొండ కోటలో బంధీగా ఉన్నారు. అప్పటికీ అక్కన్న

⇨

# హోరు....

*అంతశ్చేతనలో సంవత్సరాలుగా అణగారి, ఇప్పుడు - ఇక్కడ ఈ సముద్రపు హోరులో ఆకాశం చీకటిలో, కొలంబస్ నలుపులో - చీకటి చిలికించి సుడులు తిరిగి నురగలు పొంగి తన అస్తిత్వాన్ని చల్లగా దహించి - తనను పునీతను చేస్తుందో, స్వతంత్రురాలిగా పునర్జన్మనిస్తుందో ఈ అనిర్వచనీయమైన ఆలోచన - ఆవేదన - అనురాగపు వేదన.....*

**ఇద్దరు utopian వ్యక్తుల లౌకిక జీవనం :**


అణగారిన అంతశ్చేతన - మానసిక వేదన - నరక యాతన అందులోనూ స్త్రీ హృదయ రోదన రూపుకట్టించటం ఎంతటి సాహసం! ఎంచుకోలేని ఆలోచనలు, పంచుకోలేని అనుభూతులు, ఏమిపోయిందో, తిరిగి రాదని తెలిసి సముద్రపుటుప్పులో కలిసిన దుఃఖం! సుభద్ర - తిరుగుబాటు - సుధాకరం మీదా? ఎప్పుడు మొదలయిందో తెలియని నాగరకత చక్రంమీదా? అనేక అవస్థలు పడుతున్న సమకాలీన వ్యవస్థమీదా? కాదు - ఇది మనిషి - ప్రకృతికి ఏర్పడిన అంతులేని అగాథం! తిరిగి వెళ్ళలేని కాలపు రహదారి - వన్ వే!

ఈ ఎగొని మరి ఎక్స్టసికి ఎన్ని పదబంధాలు -

ఇష్టంలేని పోరాటం, ఎగరాలని లేని నల్ల సీతాకోకచిలక, సరదాగా తీరానికి వచ్చిన జలచరాలు! జారిపోతున్న చిరునవ్వు, సాయంకాలానికి మబ్బుపట్టింది, మనిషి సహజ వాతావరణం నుంచి వేరుచేస్తే నిజమైన మనిషి బయటకొస్తాడు, ఇప్పుడు ఇద్దరికీ కవచాల్లేవు! సముద్రం - ఆకాశం కలిసి ఏంచేస్తాయి - అది చూస్తూనే సంవత్సరం గడిపేశాను! సముద్రం - మన ఒంటరితనాన్ని అనంతం చేస్తుంది - ఆకాశం మన అస్తిత్వాన్ని అంతం చేస్తుంది - ఈ అవస్థలో 12 నెలలు, వందల రోజులు, వేల గంటలు, లక్షల నిమిషాలు, కోట్ల క్షణాలు అలవోకగా ఆనందంగా - అలౌకికంగా గడిపాను!

⇨

మాదన్నలు తానీషా మంత్రులుగానే ఉన్నారు. తరువాత తానీషా గోపన్నను విడిచిపెట్టటం జరిగింది. కనకదండి సోమన్నగారు కంచర్లగోపన్న గారు సమకాలీనులుగా తానీషా ప్రభుత్వంలో ఉన్నతోద్యోగులుగా నియమించబడి అక్కన్న మాదన్నలకు ముఖ్యులుగా ఉన్నారు. ఇద్దరూ దేవాలయ నిర్మాణాలు సాగించారు. కంచర్లగోపనన్న చరిత్రలో ఏమైనదీ తెలియదు కాని, రామదాసుగా కీర్తించబడినాడు. ముస్లింల పరిపాలన కాలం నుండి భద్రాచలం రాములవారికి ఇప్పటికి ప్రభుత్వం నుండి తలంబ్రాలు పంపించబడుతున్నాయి. కానీ కనకదండివారి చరిత్ర కనుమరుగైపోయింది. వీరు కృష్ణానదికి సీతానగరం దగ్గర గండికి అడ్డుకట్టవేసి కూచిపూడి సమితి గ్రామాలేకాక సీతానగరం నుండి నిజాంపట్నం వరకు ఉన్న గ్రామాలకు వరద ప్రమాదం లేకుండా నివారించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసినట్లు కఠెవరం కైఫియత్ తెలియచేస్తుంది. 17వ శతాబ్దంలోనే తెనాలి ప్రాంతానికి ఎంతో మేలు చేకూర్చిన కనకదండి సోమన్న గారిని అందరు మర్చిపోయారు. గోదావరీ జిల్లాల్లకు సర్ ఆర్థర్ కాటన్‌లాగా కృష్ణాతీర ప్రాంతానికి కనకదండి సోమన్న గారు ఒక అపర భగీరదుడే. మన తెనాలి డెల్టా ప్రాంతానికి తన స్వంత సొమ్ముతో నిస్వార్ధంగా ఈ ప్రాంత గ్రామాల రక్షణకు, రైతుల క్షేమం కోరి, సీతానగరం వద్ద కృష్ణా కరకట్టల నిర్మాణాలను కావించి, ఇప్పటికి 340 సంవ్సతరాలకు పూర్వమే కృష్ణా తీరంలోని గ్రామాలకు, ప్రజలకు ఎనలేని మహోపకారం చేసిన కనకదండి వారిని ఈ కృష్ణా పుష్కరాల సందర్భంగా స్మరించుకోవలసి ఉంది. కుతుబ్‌షాహీల చరిత్రలో అక్కన్న, మాదన్నలతో పాటు కనక దండివారు సంస్మరణీయులే.



సముద్రం – పర్వతాలు, ఎడారి, అరణ్యం మనిషి అల్పత్వాన్ని గుర్తుచేస్తాయి. 'ప్రేమ పెళ్లి కాదు' (సుభద్రది). ప్రతి పెళ్లి ప్రేమకాదు! సంసారంలో ప్రేమ ఎంత నాటకం! మొదటిసారిగా ఖాళీ అయిపోయింది! ఆగిపోయిన ఇంజను గమనవేగంతో సాగటం! పాపం పాత సుభద్ర పూర్తి పరాధీన. బూరోక్రసీ ఆటోక్రసీ, హిపోక్రసీ, రాక్షసి, దయబాలిక్, మెటాలిక్ రియాలిటీ! స్నానాల గదిలో తెలీకుండా, తనకు తెలియని అనంత జలరాశిలో నల్లటి మచ్చలాంటి ఓ జాలరి క్షేమం, ఆమెకతిముఖ్యంగా తోచింది! అద్భుతం. అలలు తప్ప సముద్రం ఖాళీ! (that the rude seas grew civil at her song... - *Shakespeare*) విశృంఖలమైన సంతోషం, ప్రేమ, విద్యుత్తులాగ ఓజోన్‌లో కలిసి.... నరాల్లో – తుఫానులో సరుగుడు చెట్లులా. And certain stars shot madly from their speres ! గాలిలో కంగారుపడే గడ్డిపోచ! అలాంటి ఆలోచన! తనలో ఏదో భాగం – తన మాట వినటంలేదు! ఎప్పుడూ అంతే! దారి తెలియక పిచ్చి గీతలు గీసినట్టు తిరిగింది! పిచ్చి గీతల దారే బ్రతుకు. చెట్టులోనో – ఆమెలోనో కలిసిపోతే ఎంత బావుండును! మనకా అదృష్టం ఏదీ? 'పచ్చటి రహస్యం'లో దారితప్పిన..... నరాల్లో దాగిన భయం! రహస్యానికి రంగు ఉంటుందా? వెన్నెల్లో తడిసే ఈల తోట! తళతళ మెరిసే సముద్రం – వెన్నెల్లో తీరం చల్లగా వెన్నెల పీలుస్తూ ఈ లోకానికి సంబంధం లేని అందం! అలలు విసిరేసిన జలకన్యలా – అలలతో విసిగి విశ్రాంతికి వచ్చిందేమో! రక్తంతో – నరాల్తో పోరాడే ప్రాచీన (ఆధునిక?) మానవుడి తపన – వేడి టార్నెడో, సన్నని వెన్నెల జల్లులో తెల్లగా దహించుకుపోయి, సముద్రం, కరిగిన వెండిలా! వెండి కరిగితే సుభద్ర! అర్థరహితమైన కలలు – అసలు కలలకు అర్థాలు చెప్పటమేమిటి? అవి కలలు! యౌవనం వదిలేసిన తోలు కవచం! మరి, చెమర్చటానికే కళ్ళు! wild thought! పిల్ల కెరటంలా అయిలమ్మ! (ఆమె అయిలమ్మలో పరకాయ ప్రవేశం చేయగలిగితే ఎంత బాగుండును!) సముద్రానికీ – తీరానికీ పుట్టాడు! అందుకే కొలంబస్ వీపునిండా ఇసక!

జీవితం అంటే మానసిక స్థితా? పడవలో – సముద్రంలోకి కొలంబస్‌తో వెళ్లలేని నిస్సహాయత – సుభద్ర తిరుగుబాటు! సముద్రం ఎప్పుడూ నిండుగానే ఉంటుంది – మనసే మైదానంలా ఖాళీ! ఎదురుగా అనంతమైన సముద్రం! చిన్ని తొట్టిలో నీళ్ళు జీవితం! చీకటి చిటికితే వెలుగొస్తుందా? ఉల్లిపొరలు తీస్తే తన అస్తిత్వం ఏది? సీతాకోకచిలుకకు ముసలితనం ఉంటుందా? అతన్ని కాదనకలిగింది! ఎంతటి విజయం! భార్యాభర్తల మధ్య ప్రేమ – అది మిథ్యే! జానెడు దూరంలో ఉన్నా దాటలేని తీరం! సుభద్ర తిరుగుబాటు – సరే చివరి 'కొస'మెరుపు! ఇరవయిఏళ్ళనాడు రాసిన – ఈ రసరేఖ – తెలుగు రచయితలకు ఇప్పటికైనా (ముఖ్యంగా రచయిత్రులకు) కంటబట్టేనా? తిరుగుబాటులో ఔచిత్యం – సాంద్రత, సముద్రపు హోరు వినపడేనా? లేక సుభద్ర బెజవాడలో దిగిందా, దిగితే ఎన్నాళ్ళుంది? అసలు హైదరాబాద్ వెళ్ళిందా? ఎందుకు వెళ్ళివుండదు? ఈ ప్రశ్నలతో సతమతమవుతున్నారా?

***కొస*** *: సుభద్రను ఎన్నిమార్లు స్నానమాడించారు గడుసుగా?*

*వాళ్ళు పిల్లల కోసం భోజనానికి పిలిచిన గడ్డపోళ్ళల్లో మీరూ ఉన్నారా?*

(తల్లావఝ్ఝల ప. శాస్త్రి 'హోరు'లో పడి....)



# అతడొక త్రివర్ణమాల

– వోలేటి పార్వతీశం

గలగలా పారే నీళ్ళను చూసి నది ప్రవహిస్తోంది అనుకుంటాం. నదికి ప్రవాహమున్నట్టే, కాలానికీ ఉంటుంది. తేడా, అల్లా ఎక్కడుందీ అంటే, నీళ్ళు ప్రవహించడాన్ని కళ్ళు గమనిస్తాయి. కానీ కాలం ప్రవహించడాన్ని కళ్ళు గమనించలేవు. నీళ్ళ ప్రవాహం కళ్ళముందుది కనుక, అనుభూతినిస్తుంది. కాలప్రవాహం గమనించేది కాదు కనుక, అనుభవంలో తెలుస్తుంది. అప్పుడప్పుడు నీళ్ళు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. కానీ, కాలానికి క్షణం కూడా స్థిరత్వం ఉండదు. అది ప్రకృతిలోని నైజం. ప్రకృతి మొత్తం కాలాధీనం. ప్రకృతిలోని ఏ అంశమైనా, కాలానికి అనుగుణంగా మారుతూనే ఉంటుంది. ఈ మార్పు విషయంలో సాహిత్యానికీ మినహాయింపు లేదు.

సాహితీ ప్రవాహంలో మార్పులకు ఆనవాళ్ళుగా కవిత్వాన్ని మలుపుతిప్పినవాళ్ళు కొందరైతే, కవులుగా మలుపులు తిరిగినవాళ్ళు కొందరు. ఈ రెండు రకాల వర్గాలకు సంకేత చిహ్నాలుగా నిలిచి సాహితీ లోకంలో అహమహమికలుగా నడచినవాళ్ళు ఇద్దరున్నారు. ఒకరు శ్రీరంగం శ్రీనివాసరావు, మరొకరు శ్రీరంగం నారాయణబాబు. వయసువారీగా చెప్పాలంటే, శ్రీరంగం నారాయణబాబునే ముందు చెప్పాలి. 1906 ఆయన జనన వసంతం. కవితా ప్రపంచంలో వీరి పరిచయమేర్పడే నాటికే ఇతడొక విలక్షణ వ్యక్తి. ఉక్తిలోనూ, వేషంలోనూ వైలక్షణ్యం ప్రస్ఫుటంగా కనిపించేది. గిరజాల జుట్టు, చుడీదారు పైజమా, ఆపైన షుర్వా. అచ్చమైన భావకవిగా ఆహార్యాన్ని దిద్ది తీర్చుకున్న నారాయణబాబు, తొలిదశలో పదహారణాల భావకవి. వింశతి వసంతాల వయస్సుదాటేనాటికి, 'వలపు చెలమలు' అంటూ కవిత్వ రచన చేసి, ఆనాటి ఆంధ్ర పత్రిక ద్వారా, ఈ భావకవి తన అస్థిత్వాన్ని ప్రకటించినవాడు.

*"మనకు సహకారియగుచు మన్మథుడు వెదకి*
*వాడి యలుగుల గాడి త్రవ్వంగ క్రొత్త*
*చెలమలేర్పడి తేటలౌజలములూరె*
*సలవితములైన యీ తీపి వలపు చెలమ*
*లందు తేరిన యవ్వి శ్రీ చందనోప*
*మానురాగ సుధాగంధిలామల ప్రఁ*
*సన్న పావన తోయముల్ సకియ! యవియు*
*నింకిపోవును. నీవు గ్రహింపకున్న"*

ఇలా నవీన కవన మార్గ ప్రధాన రహదారిపైనే పరిచయమైన నారాయణబాబు, చీకటిలో మిణుగురులా వెలిగాడు. 'మిణుగురు మీటు' అనే ఖండికలో

*"మవ్వపు వలపు తారల మువ్వ మ్రోత*
*సవ్వడులు లేని ఈ నిశాసమయమందు*
*చెప్పుచుందువు శీద్యోత జీవులకును*
*వెలుగు సరియింప నర్తింపవలయునంచు"*

*మవ్వపు వలపు తారల మువ్వమ్రోత* అనటం, నారాయణబాబుకు మాత్రమే చేతనైన భావార్ద్ర ప్రకటనా గరిమ. అలాగే *సంధ్యావేగమనే* ఒక ఖండికలో, నారాయణబాబును గమనిస్తే ప్రకృతి పారవశ్యంలో ఎంతగా మునకలు వేశాడో మనకి తెలిసి వస్తుంది.

*"చీకటులు ద్రావి జీవించు చెలియ జూచి*
*వెన్నెలల్ క్రోలి, విహరించు వెలరిగాంచి*
*సంధిసేయగ మింటను సంధ్యమెరసి*
*రాయబార గీతాలాపరాజిమ్రోయ*
*సంధ్య చివురాకు దోనెలో చల్లనైన*
*తుహిన బందువు నా చుక్క తో చెనంత."*

విరుద్ధ స్వభావాలు కలిగిన ఇద్దరు ఇంతుల మధ్య, రాయబారం కూర్చేందుకు, సంధిసూత్రంలా సముద్భవించిన

తారను, దొన్నెలోని మంచు బిందువులా సంభవించడం, పతిత హృదయాన్ని పరమానందభరితం చేస్తోంది. అంతేకాదు, ఆయన తొలినాళ్ళ కవితల్లో మానవతా సంస్పర్శ, ఒక జీవనాడిలా పెనవేసుకుపోయింది. 'మిణుగురు పాట' అనే ఖండికలో

*"ముదురుటాశల జగతి, నిదుర బరువుల క్రుంగె*
*కదలు చీకటి యెదల కాలుకదపగ కలదు.*
*కాలానిలపుకేళ కలగి తొట్రిలు తేట*
*ఈ మిణుగురు పాట*
*ఏ యెడద కోసమో......"*

ముదిరిన ఆశ అనడం, జగత్తులో ఆశ ఎంత బలీయమైనదో అపూర్వంగా ఆవిష్కృతమయింది. మరొక ఖండికలో 'వేశ్య'ను దర్శించిన విధం గమనించండి

*"దంతపు వీణెతేనేమి, ఒళ్ళు*
*తెగిపోయిన తీగ బతుకు*
*మేళన చేయని హృదయం*
*నీవ్రేళ్ళకు బాధ మిడులు*
*నను ముట్టకు"*

వెలకట్టబడిన తనువుతో, వేదనామయిలా జీవించే వెలది అంతరంగావిష్కరణం ఎంత కరుణామయంగా ఉందో. మానవీయ కోణానికి, కవి ఎత్తిన పతాకలా గోచరిస్తోంది.


భావాలను అక్షరీకరించటంతో మాత్రమే సరిపెట్టినవాడు కాదు నారాయణబాబు. అచ్చమైన భావకవిలా, వాటిని స్వరపేటికలో ఉంచి, స్వరాలలో ముంచి కర్ణపేయంగా పలికించినవాడు.

*"నా నివాసమ్ము తొలుత గంధర్వలోక*
*మధుర సుషమాసుధాగాన మంజువాటి*
*ఏనొకవియోగగీతిక"*

అంటూ దేవులపల్లిని,

*"లోకాలు నాకేలనే / కోకిలా బాల కృష్ణుడు చాలునే"*

అంటూ తురగా వెంకట్రామయ్యని నారాయణబాబు పాడుతూ ఉంటే, ఇంతకన్నా కవిత్వానికి పరమావధి ఏముంది? అని శ్రీశ్రీకి కూడా అనిపించేదట. తనకు ముందరి కవులనే కాదు, తన కాలంలోని యువ కవుల కవితలు కూడా కంఠస్థం చేసి రాగయుక్తంగా పాడుతుంటే, విజయనగరం రసప్లావితమయ్యేదట.




చలువ కళ్ళజోడు ధరించినంతకాలం, వేసవిలో కూడా, లోకం చల్లగా ఉందనే భావన కలుగుతుంది. ఆ చలువ కళ్ళజోడును తీసేస్తే, గ్రీష్మతాపం ఏమిటో తెలిసివస్తుంది. *అలా చలువ కళ్ళజోడును జారవిడిచినవాడు నారాయణబాబు* అని సినారె చెప్పిన మాటలు, మనకిక్కడ గమనికలు. అసలు కళ్ళతో చూడటం ప్రారంభించటం నారాయణబాబు కవన జీవనంలో ప్రధానమైన మలుపు. "ఏముందీ!" అంటూ గేయం వ్రాశాడు.

*"కొమ్మలు తలలూపగ / కమ్మని కోకిల*
*కూజితాలకు / వెన్నెల విహారములకు*
*కన్నెగాలి కౌగిళ్ళకు / ఇదా కాలం, కాదందీ"*

అద్దాలు జారవిడిచాకా, జీవితపు అసలు రంగులు కనిపించాయి. పొరలు తొలగి, ఒడలు రగిలే వేసవి తాపాలు స్పర్శకు అంది వచ్చాయి.

*"పాతాళమ్మున పతితులు / పలవించే మాటల, జిలిబిలి తేటల*
*చీకటి గుండె కదిల్చే / జాలి పాట పాడమంది*
*లోపలకే చూడమంది"*

భావ కవిత్వంలోని ఆదర్శవాద కవితా శాఖ నుంచి, వాస్తవిక శాఖకు ప్రయాణించినవాడు, అతి వాస్తవిక, అధివాస్తవిక ధోరణుల విచికిత్సను దాటినవాడు. అతి నవ్యతను అపేక్షిస్తూ ఒక భీభత్స ధోరణిని కూడా ప్రదర్శించినవాడు – ఒకానొక గీతంలో

*"మృత్యువాసంగే / మాతృ కరమ్ముల*
*విధవ కానుపు / పెదిమల / వెలుగై వెలిగి*
*నలు పెక్కిందీ సంధ్య*

*చచ్చిన తల్లి శవం / మెళ్ళో గజ్జెల / పట్టెడలో / ఉల్లాసంగా*
*ఆడుకునే / పసిపిల్లాడులా / గాలి"*

కొత్త చూపు పొంది, కవిత్వాన్ని మరో వర్ణంలోకి మలచుకునే ముందర, ఒకానొక సందర్భంలో నారాయణబాబు తనను గురించి, తానే ఇలా అన్నాడు.

***"హృదయములో పొగలు, సెగలు రేగి, వీధి కాలువ నీటిలో, బురదలో ఆపశోపాలు పడిపోతున్న శ్వనాథుడు. ఊరి బయట పొలంలో ఇనకిరణాలు క్రౌర్యంతో, కాయక్లేశ***

*పడుతున్న, సేద్యగాని శరీరం మీద పండిస్తున్న, ఘర్మ మౌక్తికాలతో, ఒక తాజ్‌మహల్ కట్టాలని బుద్ధిపుట్టింది"* అంటూ స్వీయావిష్కరణం చేసుకున్నాడు.

నారాయణబాబులో మరో రెండు ప్రత్యేక పార్శ్వాలను ప్రస్తావించుకోవలసిన అవసరం ఉంది. ఆయనకు, పౌరాణిక కథలపైనా, శాస్త్రీయ సంగీతంపైనా, సమస్కంధమైన అవగాహన ఉంది. ఈ విశేషాంశాల్ని ఆయన కవితా ఖండికలే మనకి పట్టి చూపిస్తాయి. బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలపైన ఆహవ శంఖం పూరించిన సమరయోధుడు భగత్‌సింగ్‌ను, శ్వేత ప్రభుత్వం ఉరితీసింది. ఆనాటి యువతరం, ఈ సంఘటనపై సాగర కెరటంలా విరుచుకుపడింది. భగత్‌సింగ్ జీనవ సరళిని విశేషంగా అధ్యయనం చేసిన నారాయణబాబు, ఒక ఖండకావ్యమే రచించాలని అనుకున్నాడట. ఈ సందర్భంలో ఒక కొత్త పురాణ మార్గాన్ని ఎంచుకున్నాడు నారాయణబాబు. ఒక పౌరాణిక కథన సన్నివేశంలో శివుడు తన ఫాలనేత్రజ్వాలతో ఇంద్రుణ్ణి భస్మం చేశాడట. ఆ సమయంలో మిగిలిన నేత్రానలాన్ని మూడు భాగాలుగా విభజించి సింధూ నదీ గర్భంలోను, గంగా గర్భంలోనూ, సాగర గర్భంలోనూ నిక్షిప్తం చేశాడట. నిప్పులాంటి మనిషి భగత్‌సింగ్‌కు ఈ నేపథ్యాన్ని నారాయణబాబు అద్భుతంగా అన్వయించాడు.

*"సింధుగర్భమున / గంగ కడుపులో*
*లవణ సాగరపు లోతుల్లో / దాగిన నేత్రాగ్ని*
*మానవ రూపం దాల్చింది / మన్నె వెలిగించింది*
*మిన్నె పొగచూరింది"*

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్‌సింగ్ ఒక అగ్నిశిఖలా వెలగినవాడు. అందుకే

*"మంటల్లోనే పుట్టాడు / మంటల్లోనే పెరిగాడు*
*మంటల్లోనే మడిశాడు"*

అంటూ, నారాయణబాబు, భగత్‌సింగ్‌ను అనలావతారమూర్తిని చేశాడు. ముందు చెప్పుకున్నాం కదా! సంగీతమన్నా ఈ కవికి మహా ఇష్టమని. నారాయణబాబుకు సంగీతంలో అభినివేశమే కాదు, అభిజ్ఞ వుంది. 'కదన కుతూహల రాగం' అంటూ ఒక రాగాన్ని శీర్షికగా చేసి కవిత చెప్పాడు.

*రుధిర జ్యోతిర్ / జల్వానా లలనా / ప్రియుండ / విప్లవ ఋషిని విద్రోహ కలిని / ఆహవరంగం నా / హృదంతరంగం / పగిలిన ఖలేజాలే / నా / పాటల జలేజాలు / మర ఫిరంగినై / మహతిగ మీటి / కదన కుతూహల రాగం / వినిపిస్తాను / అగ్గిని కురిపిస్తాను*

ఒక రాగాన్ని శీర్షిక చేసుకుని, కవిత చెప్పిన సందర్భాన్ని ఎంపిక చేసుకుని, కవి సంగీత పరిచయాన్ని అంచనా కట్టలేముకదా! అందుకే ఇదికూడా గమనించండి. ఆగర్భ దరిద్రుల పక్షాన నిలచిన ఈ కవి, మరొక సందర్భంలో దరిద్ర సంగీతాన్ని ఎలా వినిపించాడో

*చెప్పనా! / కష్టమైన / సంకీర్ణపు / నరజాతికి / ఆకలి / ధ్రువతాళం*

*ఆకలితో / నా కడుపు / అగ్నివీణ వాయిస్తే / దీపక రాగం*
*దిక్కులకెగబ్రాకి / ఆకాశం అంటుకుంది / ఆర్పండి / ఆర్పండి*

రాగతాళాల లక్షణాలు సాకల్యంగా తెలిసిన కవి నారాయణబాబు. తన కవన ధోరణికి అనువుగా వాటిని ప్రయోగించాడు. నారాయణబాబు కవిత్వం చాలావరకు గాన యోగ్యం. నిజానికి తానే, శ్రవణ శుభగంగా, రాగ భావ తాళ సమన్వితంగా పాడేవాడు. సుప్రసిద్ధ వాయులీన విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడుగారిని, మైసూరు రాజావారు, తమ దర్బారులో సత్కరించిన సందర్భానికి పరవశించి, *ఫిడేలు నాయుడిగారి వేళ్ళు* అంటూ కవిత చెప్పాడు. తదనంతర కాలంలో విజయనగరంలో నాయుడిగారి గౌరవ పురస్సరంగా జరిగిన విందులో వైదిక విద్వాంసులు దానిని స్వరపరిచారు. చొప్పలి భాగవతారుగారు రసరమ్యంగా గానం చేశారట. ఇక్కడ ఇంకొక ఆసక్తికర విషయమేమిటంటే, నాయుడిగారబ్బాయి బాబూరావు వాయులీన సహకారం అందించారట.

రాత్రిని, జీవితాన్ని పడుగు పేకల్లాగా అల్లి, 'తెనుగు రాత్రి' అంటూ కవిత చెప్పాడు.

*"శూన్యమ్ముగు చూపులతో / శుష్కించిన దేహముతో / పేదవాని కడుపుమంట / కాలి పేలిపోవు కోర్కె / గగనమ్మున చుక్క ....... / ........ / పసితనమున పెండ్లి / భర్త పరమ పదము జేర / విధవ / మసక మసక యౌవనమున్ / కుసుమించే తల్లి తలపు / గుండెల్లో పాలపాట / ఆకాశపు పాల బాట / ఆంధ్ర యువక జీవనార్తి / కాలిన మేడల నుంచి / ఆరిన వాడల నుంచి / ధూమమ్మెగజిమ్మె / చీకటి దుమ్మురేగు/ తెనుగురాత్రి"*

సర్రియలిజాన్ని శ్రీశ్రీ అతి వాస్తవికత అంటే, నారాయణబాబు అధివాస్తవికత అన్నాడు. ఆ ధోరణిలో మౌనశంఖం పూరించాడు. తెలుగు సాహిత్యంలో ఇదొక

విలక్షణ ప్రయోగం. అందుకే దీనిని శ్రీశ్రీ ప్రత్యేకంగా ప్రస్తుతించాడు.

*"మౌనము శంఖమై చెరగు మాయగ నేత్రపతంగ బింబ వి
ధ్యానము కొంగనెత్తురులు త్రాగెడు నల్ల తురాయి పూవుగా
వేనలిపై అవే అయిదువేల కుళీర కుఠార దారుణ
ప్రాణశిలీంధ్రముల్ తిరుగుబాటు తుపాకి తుపాను కానుపుల్"*

బుద్ధి బలాన్ని ప్రయోగించి, సవరించే ప్రయత్నాలు చేయకుండా, సుప్త చైతన్యాన్ని మాటల ప్రవాహానికి వదలిపెట్టాలనే అధివాస్తవిక మూలసూత్రాన్ని నారాయణబాబు పాటించాడు. కవిగా తానెవరో నారాయణబాబుకి తెలుసు. కానీ లోకానికి తెలియదు. అందుకే తానెవరో చెప్పాడు.

*"నా చైతన్యమంతా / సప్తసముద్రాల సహస్రకోటి బాహువుల / మెరసే నురగై ఘుయ్యిమంది / నా ఎముకల మూలుగులో / చంద్రోదయమైంది నా శరీరం / కాశ్యప భస్మరాశియై తరళించింది / నా ప్రాణం భగీరథుడైంది / నా వెన్నెముక మీద / ఆకాశ గంగా జలపాతం వర్షించింది / నా పొత్తికడుపు / హిమాచల తనయ / తన చల్లని మంచు హస్తాలతో నిమిరింది"*


"మనిషికి మానసికమైన శృంఖలాలు అనేకం. ఫలితంగా ఊహలూ సంకుచితమే. ఈ శృంఖలాలు తెంచాలంటే ఏదో ఒక ఘాతం గట్టిగా తగలాలి. అలాంటి తాడనమే అధివాస్తవిక ధోరణి" అని హెర్బర్టురీడ్ సర్రియలిజం ఉద్యమానికి నాయకత్వం వహిస్తూన్న సందర్భంలో అన్న మాటల్ని శ్రీశ్రీ తన అనంతంలో ఉటంకిస్తాడు. అటువంటి తాడనం కోసమే రచన చేస్తున్నప్పుడు మౌనశంఖంపైన ఫిర్యాదు చేయటం సబబు కాదని, ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో తీర్మానించారు. నిశ్చితాభిప్రాయాలను ప్రకటించటంలో నారాయణబాబు ముందు వరుసలోనే ఉంటాడనే సత్యాన్ని, ఆయనను అధ్యయనం చేసినపుడు, మనం సుస్పష్టంగా గమనిస్తాం. నారాయణబాబు చెప్పిన ఈ అభిప్రాయం మీద కాస్తతం దృష్టిని లగ్నం చేయండి.

ఈ కాలంలో వాత్సాయనుడు, మనువు కారు, మాబుషులు. మార్క్స్, ఫ్రాయిడ్ వీళ్ళే బుషులు. భాషాసంపన్నులు మాకు విరోధులు. కావ్యలక్షణాలన్నీ అవలక్షణాలు. వ్యక్తాన్ని వీడి, వ్యక్తావ్యక్తంలో ఈతకొడతాం. ఏదోవిధమైన శక్తి మమ్మల్ని పూనుతుంది. మాచేత వ్రాయిస్తుంది. సాహిత్య వృక్షం మీద కూర్చుని, ఊగిసలాడటం. ఇందులో అనర్థము, ప్రయోజనమూ కూడా ఉన్నాయి. ప్రయోజనాన్ని వినియోగించుకొని, అనర్థాన్ని విసర్జించడం, కొమ్ములు తిరిగిన కవి చేయగలిగిన పని.

నారాయణబాబు రచనా పర్వంలో కథలు, వ్యాసాలు కూడా ఉన్నాయి. వాటిల్లో సినిమాలున్నాయి. నాటకమూ ఉంది. కొమ్మూరి వెంకట్రామయ్యగారి సంపాదకత్వంలో అప్పట్లో వెలువడిన 'తెలుగు సినిమా' పత్రికలో వ్యాసాలు వ్రాశాడు. అలాగే అబ్బూరి రామకృష్ణారావుగారి 'నటాలి' నాటక కంపెనీలోనూ పనిచేశాడు. అయితే ఈ రచనలేవీ నారాయణబాబు అస్థిత్వాన్ని సాహితీ లోకంలో బలంగా ప్రకటించటానికి ఉపయోగపడ్డట్టు తోచదు. నారాయణబాబు అనగానే ఛటుక్కున స్ఫురించేది కవిస్వరూపమే.

ఆరుద్ర ఒక సందర్భంలో అన్నారు "శాస్త్రజ్ఞులు అతి చిన్న మాత్రలో ఇమిడే ఆహారాన్ని కనిపెడుతున్నారు. నారాయణబాబు కవితలు అలాంటివే. అయితే ఈ మాత్రలు వేసుకుంటే, సత్తువ ఉన్నా, కడుపు నిండదు కనుక, ఆహారం కూడా తినక తప్పదు. ఈ అనవసరపు తిండి ఏనాడు తినడం తప్పుతుందో, ఆంధ్ర సాహిత్యంలో నారాయణబాబు వ్రాసిన అతి చిన్న పాదాల మాత్రల కవిత్వం అర్థమై అరుగుతుంది. అందరూ ఆదరించేదవుతుంది." అంతేకాదు, "కవిత్వంలోనే అరాచకవాది, సాహిత్యంలోనే విప్లవకారుడు. వ్యక్తిగత జీవితంలో నియమాలు, నిష్ఠలూ ఉన్నవాడు. తెల్ల కాగితంలాంటి ఒంటరి జీవితం మీద, చక్కగా రూళ్ళు గీసుకుని, గుండ్రంగా, కుదురుగా ఉన్నంతలో బతికాడు. సుమతీ శతక కర్త సుభాషితాన్ని సూటిగా అమలు పరచినవాడు" అంటూ కితాబు కూడా ఇచ్చాడు.

ఇతర ప్రక్రియల్లోనూ ప్రవేశమున్నా, సంగీతంవంటి కళారూపాల్లో అభిజ్ఞ ఉన్నా, సాహితీ లోకంలో శ్రీరంగం నారాయణబాబు, కవిగానే తన అస్థిత్వాన్ని ప్రచలితంగా ప్రకటించాడు. భావకవిగా ప్రారంభించి, అతి, అధివాస్తవిక ధోరణులు దాటి, అభ్యుదయ మార్గంలోనూ కవిత్వం చెప్పి, తెలుగువాళ్ళ కవనాకాశంలో అతడొక త్రివర్ణమాలగా ఆవిష్కృతుడయ్యాడు.




డా. వోలేటి పార్వతీశం
హైదరాబాద్.
ఫోన్ : 944 003 1213.

# గూడు వదిలిన పక్షి

నెల రోజుల నుంచీ దిగులుగా ఉంది.

డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల లిస్టు, ప్రాజెక్టు వర్కు.

ఈ విధంగా ముప్పయి కాగితాలపైన తెచ్చుకున్నాడు.

గేటు, గీటు ఇంకా ఎన్నో పరీక్షలు రాశాడు – అన్నీ 90ల పైనే. పది అమెరికా యూనివర్శిటీలకు అప్లికేషన్లు పంపాడు. అందులో రెండింటినే ఎంచుకున్నాడు. ఒక్కదానికే వీసా అప్లికేషన్ ఇచ్చాడు. అదీ అయింది. వారం రోజుల్లో పాస్‌పోర్ట్ వీసా ముద్రతో వచ్చింది. ఇదంతా ఈ నెలరోజుల్లో పదిహేనురోజులు గడిచిపోయాయి. వారం రోజులు షాపింగ్ అని అవసరమున్నవి లేనివి ఏదో హడావుడి. గందరగోళం – మరో వారం గడిచిపోయింది. రోజు గడుస్తున్న కొద్దిగా గుండెలో ఒక్కో అర ఖాళీ అయిపోయినట్లు దిగులు మూసుకొస్తోంది. ఇంట్లో అందరి విసుగూ నేనే మోయాలి – అదో బరువు. ఒక్కడే కావటంతో ఫోకస్ అంతా వాడిమీదే – నాకే కాదు – అందరిదీ – అంటే ఇంట్లో ఉన్నదే వాడుగాక ముగ్గురం – నేనుగాక ఇద్దరు. ఆయన – మామగారు. మామ తామరాకు మీద నీటిబొట్టు – జీవితం నేర్పుతుంది కాబోలు.

చివరికి మిగిలింది – ఈ దిగులంతా కమ్మింది నన్నే – అమ్మను కదా – వాడికి గోరుముద్దలు తినిపించిన దగ్గర్నుంచి అక్షరాలు నేర్పించిన క్షణం నుంచి, వాడి చదువు గురించే నా శ్రద్ధ అంతా – ఎందుకు అని ఎప్పుడూ నన్ను నేను ప్రశ్నించుకోలేదు – స్కూలు, 12 వరకూ అప్రతిహతంగా నడిచిపోయింది. సహజంగా – తెలివితేటలున్నా – స్కూలు వాతావరణం, స్నేహితుల గ్రూపు, ఒకటో రెండో ట్యూషన్లు అన్నీ అక్కరకు వచ్చాయి.

ఐ.ఐ.టి.లో వచ్చినా పూనా అని పంపలేదు. దూరమని! ఇంటికి పది కిలోమీటర్లలో ఇంజనీరింగ్ కాలేజీ! వాడు కోరిన బ్రాంచిలో చేర్పించాను – మెరిట్ రాంక్ – డొనేషన్ కట్టలేదుకదా – కారు కొనమన్నాడు. నెలరోజులు మల్లగుల్లాలు పడి లైసెన్సు ముందు తీసుకొని కారు కొనిచ్చాడు వాళ్ళ నాన్న. కాని బాధ్యత అంతా నాదే అన్నట్లు తాళాలు నా చేతిలో పెట్టి–

మొదటివారం – వాడి కారు వెనకాలే ఈయన వెళ్ళాడు. నమ్మకం కుదిరిన తర్వాత ఒక్కడినే వదిలేశాడు. నాలుగేళ్ళు ఎగిరిపోయాయి – సునాయాసంగా.

అప్పుడు ఈ అమెరికా గురించి దిగులు లేదు కాని – వాడి టార్గెటు అదే అని తెలుసు.

అన్ని టెన్షన్‌లే. అమెరికా ఎయిర్‌పోర్ట్‌ల నుంచి స్టూడెంట్ వీసావాళ్ళని వెనక్కి పంపించేస్తున్నారని వార్తలు – టెన్షన్ – వీసా వస్తుందా రాదా – అని టెన్షన్

వచ్చిన తర్వాత ఎక్కడ నుంచి పంపాలి – దగ్గరవాళ్ళకే చెప్పకుండా ఎక్కడ నుంచి విమానం ఎక్కుతున్నాడో తెలియకుండా ఎయిర్‌పోర్ట్‌కు కూడా వెళ్ళకుండా వాడ్ని పంపించివేస్తుంటే ఒకటే దిగులు.

మధ్యలో అమ్మ ఫోన్! చెప్పటానికి కూడా తప్పించుకోవలసి వచ్చింది... ఏడుపు తన్నుకువస్తుంటే...



ఎందుకిదంతా?

ఏమో? అమెరికా పిచ్చికి అర్థం ఉందా?

వెళ్ళిపోతున్నాడంటే అయోమయం అయిపోయింది. అందరినీ విసుక్కోవటం, ఏడుపు – వాడు చూడకుండా!

పాదాలు కందకుండా పెంచాను. అన్నీ గదిలోకే అందించాను – వాడి గది చూడాలి – అదో హైటెక్కు లేబొరేటరి.

హాబీ ఫోటోగ్రఫీ – 50 వేలు పెట్టి నికాన్ కెమెరా కొన్నాడు – ఫోటోషాపు చేసి డబ్బులూ సంపాదించాడు.

మార్కులు 90 దాటితే నాకు 50 వేలు ఖర్చు – ఐఫోన్ – అట్లాగే కొన్నాడు.

ఇప్పుడు వాడు ఎగిరిపోయిన తర్వాత, అక్కడకు చేరాడా? ఎయిర్‌పోర్ట్‌లో వాణ్ణి ఆపలేదుకదా – వాడి కోసం రమ్మన్న రాజు వచ్చాడా? రీసివ్ చేసుకున్నాడా? అన్నీ ప్రశ్నలే.

'అమ్మా' జాగ్రత్తగానే చేరాను అని వాడి కబురుతో ఒక దిగులు తీరింది.

కానీ, అసలు దిగులు ఇప్పుడే మొదలయింది. వాడి గదిలోకి వెళ్ళి చూస్తే దుఃఖం పొంగుకొచ్చింది. ఛ – ఏమిటిది అనుకుంటూనే ఆపుకోలేకపోయాను. గది అంతా వాడున్నప్పుడు ఎలా ఉండేదో – అలాగే సర్దాను – టి.వి. తుడిచాను, రిమోట్లన్నీ కొత్త బాటరీలు వేశాను.

అన్ని ఐ–పాడ్, స్కైప్‌లో వాడికి చూపించాను. 'అమ్మా' వద్దే – నాకు 'హోమ్ సిక్‌నెస్' వస్తుంది అన్నాడు.

అదీ మానేశాను.

వారానికి ఒకసారి స్కైప్‌లో మాట్లాడే ఏర్పాటు చేసుకున్నాం. మిగతా ఆరు రోజులు? అయినా – ఏం తింటున్నాడు – ఎలా చేసుకుంటున్నాడు – ఎవరితో ఉంటున్నాడు – ఎప్పుడూ ఇల్లు దాటిపోలేదు – ఎంత దిగులు – కని, పెంచి, చదువు చెప్పించి అమెరికాపాలు చేయటానికా? అయినా అమెరికాలో చదవకపోతే ఏమవుతుంది? ఇండియా గొడ్డుపోయిందా? మరెందుకు ఈ పరుగులు? గూడు వదలిన పక్షి – మళ్ళీ గూటికి చేరేనా? నా దిగులు తీరేనా?

తల్లి మనసు తల్లడిపోతున్నది...

# ఏయెన్నార్ ఏమన్నారు?

**బ**డి చదువుకు ఆస్కారం లేదు. నమస్కారం పెట్టే సంస్కారం తెలియదు. తండ్రి అండలేదు – అమ్మ కష్టంతోనే కాలం గడిచేది.

ఈ మూలాల నుంచి ప్రపంచం నలుమూలలా గుర్తింపు తెచ్చుకోవటానికి దేవతల వరాలు కావాలి – లేదా స్వయంకృషి తన చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచి పరిస్థితులను అవగాహన చేసుకొనే లౌకిక జ్ఞానం పెంచుకోవాలి. ఏ పనీ తెలియని ఆ స్థితిలో రంగస్థలం మీద నటన, కనీసం వ్యాకరణం తెలియని భాషను నేర్చుకొనే తన ప్రయత్నం చిన్న చినుకులా రాలి – అది తన చెమట చుక్కే – సెలయేరై, మహాప్రవాహమై తెలుగు జాతికి ఒక జీవ కళావాహినిగా మిగిలిపో జేసిన వ్యక్తి – ఎంతటి హేతువాది, స్థిరసంకల్పి, సుస్థిరచిత్తుడు అయివుండాలి?

తొంభై సంవత్సరాల జీవనయానంలో డెబ్బైఐదు సంవత్సరాలు వెండి తెరే ఆయనకు ఆట మైదానం. అ ఆ లు చదవకపోయినా తన వృత్తి విశ్వవిద్యాలయంలో పదుల సంఖ్యలో డాక్టరేట్ చేశారు.

అటువంటి పరిణత జ్ఞానితో కాస్సేపు ముచ్చటిస్తే ఎలా ఉంటుంది?

*ఆ ఆలోచనతోనే **మిసిమి** నాలుగు గంటలపాటు జరిపిన సంభాషణ సందర్భంగా ఆయన సమాధానాలు చెప్పిన కొన్ని ప్రశ్నలను పాఠకుల ముందు ఉంచుతున్నాము. మీరే ఏయెన్నార్ అయితే వీటికి ఏం సమాధానం చెప్పగలరో వ్రాసి, **మిసిమి** కి పంపండి. ఆయన సమాధానానికి దగ్గరగా వచ్చిన రచనకు ఒక ఏడాది **మిసిమి** బహుమతిగా పంపుతాం. ప్రతి నెలా రెండు ప్రశ్నలు ఉంటాయి.*

---

***మిసిమి :*** మీ సినిమాలు చూస్తూ పెరిగాం – మీ అందాలను అభిమానిస్తూ మెలిగాం – మీ సిల్కు లాల్చీలు మేమూ వేసుకున్నాం – మీ బెల్టు చెప్పులు మేమూ తొడిగాం – అద్దం ముందు గంటలు గంటలు గడిపాం – మీలాగా కనపడాలని....

మిమ్మల్ని మొదటిసారిగా ప్రత్యక్షంగా చూసి మీరూ మాలాంటివారేనని నమ్మాం – మీరు ఆకుపచ్చ కోటులో మెరిసిపోతుంటే మా ఆనందానికి హద్దేలేదు. ఇదంతా ఎందుకు? ఈ క్రేజ్‌కి ఏ పేరుపెట్టాలో తెలియక 'అభిమానం' అన్నాం – ఈ రకంగా ఒక తరానికి మీరు దగ్గరయ్యారు. దీనికి మరోవైపు మీరు ఉన్నారు.

1 **దీనిని మీరు ఎలా స్వీకరించారు?**

***మిసిమి :*** మీరు మాకు ఎప్పుడూ సమస్యే – కేవలం అదృష్టం – జాతకాల మీద నడిచే ఈ సినిమా వ్యాపారంలాంటి వృత్తిలో – మీరు నాస్తికులనిపించుకున్నారు. సహస్ర చంద్రులను చూసినా మీ వెలుగు అలాగే మెరుస్తోంది.

2 **దీనిని ఎలా వివరిస్తారు?**



మీ సమాధానాలు 15 అక్టోబర్, 2016లోపు పంపండి.

ఆగస్టు **మిసిమి** *కమ్మతెమ్మెరలు*లో చెరుకువాడ వెంకట్రామయ్యగారు ఎన్నో పాత విషయాల గురించి వివరిస్తూ, "బారిష్టర్ పార్వతీశం" వ్రాసిన మొక్కపాటి నరసింహశాస్త్రిగారు రామ్మూర్తిగారి సోదరులే అని వ్రాశారు. ఇది సరికాదని అనుకుంటున్నాను. అప్పటి విషయాలు క్షుణ్ణంగా తెలిసిన పతివాడ సూర్యనారాయణగారిలాటివారిని మీరు సంప్రదిస్తే సరియైన వివరణ తెలుస్తుంది.

మొక్కపాటి సుబ్బారాయుడుగారి, మొక్కపాటి రామ్మూర్తిగారల సోదరులు 'తారకం'గారు. వీరి గురించి తర్వాత స్మరించుకుంటాను. చలంగారి రచనలలో రత్నమ్మగారి, రామ్మూర్తిగారి ప్రస్తావనని చదివిన నాటినుంచీ 'వారిద్దరూ ఏమయ్యారు' అని నేను అనుకుంటూ ఉండేవాడిని. రామ్మూర్తిగారు ఆత్మహత్య చేసుకున్నారని మాత్రం తెలుసు. అంతే.

**మిసిమి** జూన్, 2016 సంచికలో మీరు ప్రచురించిన పిల్లుట్ల హనుమంతరావుగారి *త్యాగమే ఊపిరిగా – బాధలే బాటలుగా* అనుభవ పరంపరలోని వ్యాసం ద్వారా రత్నమ్మగారి, రామ్మూర్తిగారి విషయాలు తెలిసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. ఇక రామ్మూర్తిగారి గురించి తెలుగు సాహిత్యంలో విలసిల్లిన ముగ్గురు మహనీయులు – శ్రీయుతులు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, గుడిపాటి వెంకటచలంగారు, సామినేని ముద్దుకృష్ణగారు – వారి పుస్తకాలను రామ్మూర్తిగారికి అంకితం ఇచ్చారు. ఆ విధంగా ఆ ముగ్గురు రామ్మూర్తిగారి మీద వారి అభిమానం, గౌరవం లోకానికి తెలియజేశారు.

**'తారకం' గారి గురించి** : తారకం గారు విద్యాశాఖలో పదవీ విరమణ చేసి కాకినాడలో ఉండేవారు. ఆ సమయంలో ఉద్యోగపరంగా నేను కాకినాడలో ఉండడం – తారకంగారిని చూడడం, కలవడం, మాట్లాడడం, తెలుసుకోవడం – నా అదృష్టం. తారకం గారు గొప్ప సంస్కారి, సహృదయులు, సున్నిత మనస్కులు, బ్రహ్మసమాజీకులు. బ్రహ్మ సమాజ ఆలోచనకు చాలామంది అనుయాయులు దూరమైనా, చివరివరకు బ్రహ్మసమాజ సూత్రాలు తు.చ. తప్పకుండా ఆచరించిన మహోన్నతులు. బ్రహ్మసమాజం తరపున *ధర్మసాధని* పత్రిక కొన్ని దశాబ్దాలు ప్రచురించిన కార్యశీలి. కాకినాడలోని 'బ్రహ్మసమాజ మందిర' భవనాన్ని ఆప్యాయంగా, భక్తితత్పరతతో ప్రతి దినం చూసుకుంటూ ఆ తన్మయత్వంలో వికసించిన మానవోత్తముడు. ఆ భవనపు ప్రహరీలో ఓ చిన్నపాటి ఇటుక జారిపోయినా ఆయన మనసు చాలా గాయపడేది. చలంగారు *చలం మిత్రులు* పుస్తకంలో తారకం గారి గురించి చాలా ఇష్టంగా, గొప్ప గౌరవంతో వ్రాశారు. ఆ పుస్తకం సంపాదించి చదివి, తారకం గారి గురించి, కొంతమంది ఇతర ఉన్నతుల గురించి **మిసిమి**లో అచ్చువేయడానికి ప్రయత్నించగలరని ఆశిస్తున్నాను.

కొందరు విశిష్ట మూర్తులను ఈ విధంగా స్మరించుకోవడానికి దోహదపడిన చెరుకువాడ వెంకట్రామయ్య గారికి నా కృతజ్ఞతాపూర్వక వందనాలు.

భమిడిపాటి జగన్నాథరావు
నాగపూర్. ఫోన్ : 944 088 3812, 712 254 8766.

పైన జగన్నాథరావుగారు చెప్పినట్లు తారకం గారు సుబ్బారాయుడుగారు రామ్మూర్తిగార్లకు సోదరులు కారు.

మొక్కపాటి రామ్మూర్తిగారికి సోదరులు లేరు. మొక్కపాటి సుబ్బారాయుడుగారు, మొక్కపాటి నరసింహశాస్త్రిగారు (బారిష్టర్ పార్వతీశం) సోదరులు. వీరికి మేనల్లుడు తారకంగారు. వీరి అసలు పేరు కంభంపాటి రామశాస్త్రి. తారకంగారు సుబ్బారాయుడిగారి కుమార్తెను వివాహమాడవలసింది. కానీ, అంతకు పూర్వం పొన్నేరి స్టేషన్ నుండి ముగ్గురు అనాథ పిల్లలను రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు చేరదీసి, కాకినాడ బ్రహ్మసమాజం ఆశ్రమంలో విద్యాబుద్ధులు నేర్పించారు. వారిలో ఒకరిని – సుగుణ మహాలక్ష్మి – తారకం గారు వివాహమాడారు. తారకం గారు తరువాతి కాలంలో రాజమహేంద్రవరం వీరేశలింగం థీయస్టిక్ హైస్కూల్ ప్రధానోపధ్యాయులుగా పనిచేశారు.



**సుగుణ మహాలక్ష్మి - తారకం**

*(పతివాడ సూర్యనారాయణగారి సమాచారంతో)*

## వేదిక

సంసారమనే రథానికి రెండు చక్రాల్లాంటివారు భార్యాభర్తలు. ఇద్దరిదీ సమాన బాధ్యతే. హక్కులు హృదయ సంస్కారాలకు సంబంధించి ఉంటాయి. ఒకరినొకరు గౌరవించుకోవాలి. ఒకరి ఇష్టాలను వేరొకరు తెలుసుకోవాలి. అంతేకాదు, అందుకనుగుణంగా ప్రవర్తించాలి. అప్పుడే అది ఆదర్శ దాంపత్యమవుతుంది. ఆ భార్యాభర్తలే ఆదర్శ జంటవుతారు. ఇది నేపథ్యంగా సాగిన వోలేటి వారి 'శివరాజు సుబ్బలక్ష్మి'గారి ఇంటర్వ్యూ (**మిసిమి**, ఆగస్టు 2016) ఎంతో హృద్యంగా ఉంది. సరళమైన భాషలో, చక్కని సూటి ప్రశ్నలతో సాగి ఎంతో ఆత్మీయ స్పర్శనిచ్చింది. వోలేటివారి కొన్ని ప్రశ్నలు సుబ్బలక్ష్మిగారినుద్దేశించి వేసినవైనప్పటికీ కొన్ని కుటుంబాలలో ఆమెలా (వారిలా) ఉండి, ఆమెలా ప్రవర్తించి అన్నపూర్ణగా పేరొందినవారిని గుర్తుకు తెచ్చాయి. అయితే, కేవలం అన్నపూర్ణలానే మిగలక భార్యలు వారి వ్యక్తిత్వాలను నిలబెట్టుకొంటూ, తమ సృజనను ఎలా బతికించుకోవచ్చో చూపటానికి సుబ్బలక్ష్మిగారు ప్రత్యక్ష సాక్షి. ఒకరివల్ల ఒకరికి గౌరవం ఒనగూరుతుంది. ఇక్కడ గౌరవం పరాస్పరాశ్రయం. ఇది ఎరిగి ప్రవర్తించిన భార్యాభర్తలకే చరిత్రలో స్థానం దక్కేది. కొన్ని తరాల నాలుకల మీద 'ఆదర్శ జంట'గా మనగలుగుతారు వారి తర్వాత కూడా! భార్యాభర్తలు ఎలా ఉండవచ్చో శ్రీ బుచ్చిబాబు – సుబ్బలక్ష్మి తమ ఆదర్శ దాంపత్యం ద్వారా చూపారు. హక్కులు, స్వాతంత్ర్యాల గురించే ఆలోచించే నేటి దంపతులకు ఒక చక్కని అవగాహనే కాక హితవునూ ఇస్తుంది ఈ ఇంటర్వ్యూ. అసలు నేటి తరం కోరుకొనే హక్కులు, స్వాతంత్ర్యం ఒక అవగాహన, ప్రేమ, అనురాగం, పరస్పర గౌరవం తరువాతేనని గ్రహించాలి. అది బుచ్చిబాబు – సుబ్బలక్ష్మిగార్ల జీవితాల్లో సాధ్యమైంది. పార్వతీశంగారి ప్రశ్నలు దాన్ని ప్రస్ఫుటం చేశాయి. బుచ్చిబాబులాంటి సాహితీ వటవృక్షపు ఛాయలో ఎదిగినా తన ఉనికిని, సృజనను చాటుకున్న సుబ్బలక్ష్మి ప్రశంసార్హురాలు. భౌతికంగా దూరమైన భర్తను తన ఆలోచనలతో అనుక్షణం తలుస్తూ సజీవుణ్ణి చేసుకుంటున్నారామె. రెండైనా సగాలలో ఒక్క సగంగానే ఆవిడ కనిపిస్తున్నా, ఆమె ఊపిరి, ఆలోచనలు బుచ్చిబాబు గారి గురించే. ఆ రకంగా చూసినపుడు ఆ రెండు సగాల కలపోతే శ్రీమతి సుబ్బలక్ష్మి. వారికి నా అభినందనలు. అంత విశిష్ట వ్యక్తిని పరిచయం చేసిన వోలేటి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.



శివరాజు సుబ్బలక్ష్మి - బుచ్చిబాబు


– బొడ్డపాటి చంద్రశేఖర్

హవల్దార్ జగదీశ్‌చంద్ గురించి వల్లభరావు వ్రాయడం ద్వారా మనలో నిద్రాణమైయున్న దేశభక్తిని తట్టి లేపారు. ఇలాంటి ఉత్తేజకరమైన దేశభక్తి వ్యాసాలు యువతరం కళాశాల విద్యార్థులు చదవాలి. ఉపాధ్యాయులు చదివించే బాధ్యత తీసుకోవాలి. బుచ్చిబాబుగారు రచనలో ఎంత ఉన్నతుడో వ్యక్తిగా అంతటి మహోన్నతుడు. శ్రీమతి సుబ్బలక్ష్మిగారు శ్రీవారి శతజయంతిని కనులారా దర్శించుకున్న అదృష్టవంతురాలు. వారి దాంపత్యం ఆదర్శవంతమైనది. వారి ఆతిథ్యం అమృతమేకదా! పార్వతీశంగారి మాట, రచన కూడా బాగుంటాయి. శశాంకగారి అబ్బాయి కదా!



హవల్దార్ జగదీశ్ చంద్

ఆనాటి బ్రహ్మసమాజం శ్రీమతి విజయ బక్ష్ మంచి వ్యాసం అందించారు. బ్రహ్మసమాజ స్థాపకులు, దీక్షాతత్పరులు రఘుపతినాయుడుగారు, వీరేశలింగంగారున్నూ పిఠాపురం రాజావారి సహకారమూ లభించింది. వీటికితోడు కృష్ణశాస్త్రిగారి పాటలు, చెలంగారి పాటలు, తారకం గారి సేవలు అనేకమంది బ్రహ్మసమాజ మార్గాన్ని అనుసరించారు. ఆనాడొక ఉద్యమంలా సాగింది ఏకేశ్వరోపాసన! తారకంగారు *ధర్మసాధని* పత్రిక వారు జీవించినంతకాలం నడిపారు. కృష్ణాపుష్కరాల సందర్భంగా కాసుల పురుషోత్తం కవిగారి గోపాల శతకం సమర్పించి ధన్యత పొందారు దామోదరనాయుడుగారు. కాసుల పురుషోత్తం రెండు శతకాలు వ్రాశారు. గోపాల శకతం – ఆంధ్ర నాయక శతకం. శ్రీకాకుళం ఆంధ్ర మహావిష్ణువును దర్శించి ***చిత్ర చిత్ర ప్రభావ – దాక్షిణ్యభావ! జ హత్ విమతజీవ! శ్రీకాకుళాంధ్ర దేవ!*** పురుషోత్తం కవి మకుటం దీర్ఘంగా ఉన్నా భక్తితో ఆర్తితో వ్రాశారు. శ్రీకృష్ణ పరమాత్మ ఆవేశం చేసి వ్రాయించాడా! అనిపిస్తుంది. పురుషోత్తం కవి తపస్సంపన్నుడు ఉపాసనా తత్పరుడు. ఆయన మాట వేదవాక్కు! "పోతన భాగవతం వ్రాయకపోతే కాసుల పురుషోత్తం వ్రాసి ఉండేవాడని విశ్వనాథ సత్యనారాయణగారు అన్నారు. ఈ రెండు శతకాల్ని కథావశేషులు మండలి వెంకట కృష్ణారావుగారు ప్రచురించి ధన్యత పొందారు. ఈ శతక పద్యాలు నిందిస్తూ కీర్తించడం ద్వారా 'కీర్తి నింద – వ్యాజస్తుతి' ప్రక్రియగా ప్రస్తుతించారు. భక్తితత్వాన్ని, దేశభక్తిని, సాహిత్య స్ఫూర్తినీ కలిగిస్తున్న **మిసిమి** యాజమాన్యానికి ధన్యవాదములు.



బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు

చెరుకువాడ వెంకటరామయ్య (ఫోన్ : 954 211 8184)

## వేదిక

ఆంజనేయరెడ్డిగారికి నమస్కారములు. జులై 2016 **మిసిమి** సంచిక సంపాదకీయంలో షోపెన్‌హావర్ – ఆత్మహత్య పిరికిపంద లక్షణం, మావుళ్ళయ్య ఆత్మహత్యను ఒక రేడియో అక్క ఆపగలిగింది కదా! అని సంపాదకీయం ముగించారు. చాలా సంతోషం. షోపెన్‌హావర్‌కన్నా ముందుగా వాల్మీకి సుందరకాండలో, సీత పాత్రచేత హనుమ పాత్రలచేత ఈ విషయం చెప్పించిన సంగతి గుర్తుచేస్తున్నాను. మారుతి సీతను కనుగొనలేక నిరుత్సాహంతో ప్రాయోపవేశమునకు సిద్ధపడి, లీలగా అశోకవనంపై దృష్టిసారించి, వెతకని ప్రాంతమునకు వెళ్ళి లక్ష్యమును సాధించెను. అట్లే సీతాదేవి రాక్షసుల బెదిరింపులకు భయపడి, వారిచేత మరణంకన్నా ఆత్మహత్య శ్రేష్టమని నిర్ణయించుకొని ఉరిపోసుకొని ఆత్మహత్య చేసికొన ప్రయత్నంలోనుండగా, హనుమవలన రామకథ విన్నదై ఆ ప్రయత్నం విరమించును. ఆ పాత్రలచేత ఆత్మహత్య నివారణం వాల్మీకి జనాళికి చెప్పించి సందేశంను వెలువరించెను. వాల్మీకి పాత్రలచేత చెప్పించిన సత్యమునే షోపెన్‌హావర్ సిద్ధాంతీకరణ చేసెను. బలిపీఠం – అలజడులు – ఉద్యమాలు, ప్రయత్నించినచో నివారించవచ్చునని సూత్రీకరించారు. పోగాలము దాపురించినవారు హితవులను వినరు, అరుంధతిని దర్శింపలేరు, దీపనిర్వాణ గంధమాఘ్రాణించలేరు అన్న నీతి చంద్రిక సందేశాలను ఒకసారి గుర్తుచేసుకొనవలెను. గాంధారి మహాభారత యుద్ధం, ముగిసిన తరువాత ఇదే ప్రశ్న శ్రీకృష్ణుని అడిగినది. నీవు గట్టిగా ప్రయత్నించిన యుద్ధం జరగదుగదా అని. శ్రీకృష్ణుని సమాధానం వినండి : మదాంధుల బలముతో దుర్యోధనుడు యుద్ధమునకు ఉద్యుక్తుడైనాడు. కొంత క్షయం జరిగినకాని శాంతి రాదు అని తన నిశ్చితాభిప్రాయమును వ్యాసుడు కృష్ణునిచే చెప్పించెను (శ్రీకృష్ణుని మురాతః). రెండవ ప్రపంచ యుద్ధము తదుపరి UNO జనించినను యుద్ధములు, పోరాటములు, అలజడులు నివారణమైనవా! ఆ సంస్థ ఆపగలిగినదా! ఇది మీకు తెలియునుగదా! కాలం బ్రహ్మస్వరూపం. దాని గమనమును ఎవరూ ఆపలేరు.

ఆగస్టు 2016 **మిసిమి** సంచిక సంపాదకీయంలో తెనుగు భాషను వృద్ధిచేయుట గురించి, సరళ చేయుట గురించిన సూచనలు పరిశీలింపదగిన అంశములు. UNESCO వారు కొన్ని ప్రపంచ భాషలు త్వరలో అదృశ్యమగునని, వానిలో తెనుగు భాష కూడ కలదన్న రహస్యం వెలికితీసెను. దీని ఆధారంగా కొన్ని పత్రికలు UNESCO వారి భయం (తెనుగు పోవుట) నిజమని మరికొన్ని కాదని చదువరుల మెదడుకు మేతను పెట్టగా పత్రికలు అవకాశం తీసుకొని అనేకరకములైన అనుకూల ప్రతికూల వాదనలతో ఘోషించినవి. UNESCO వారి పరిశీలనయే సరికాదు. లిపిలేని భాషలు చాలా సజీవముగా ఉన్నవి. సవర భాషకు గిడుగువారు లిపిన తయారుచేసి వ్యాకరణం నెరచించెను. కేరళలలో కొంకణి / ఆంధ్రదేశంలో ఎరుకుల, ఏనాదులకు వేరు భాష, చెంచు, కోయ జాతులకు చెరి ఒక భాష (లిపి లేకనె) సజీవముగా లేదా! లిపిగల తెనుగు భాష ఎందుకు మరుగు కాగలదు, మారుట, మార్పులు సహజం కదా! కొన్ని మాసముల ముందు **మిసిమి** పత్రికలో కన్నడ శివుడు – తెనుగు పార్వతి (హోసూరు, కుప్పంవంటి) సరిహద్దు రాష్ట్ర ప్రాంతములందు నాటకీకరణ చూపించిరి. తెలంగాణా తెనుగు (జర్రా సర్దుకో – రాయలసీమ తెనుగు – బిడ్డను తోలకవచ్చినవా? కోనసీమ తెనుగు – గుంట, అయ్యబాబోయ్ వంటి పదములు వేరు ప్రాంతములవారికి అర్థమగునా?) సంస్కృతభాష తద్భవములు, తత్సమములు ఇతర భాషల నుండి గ్రహించి పరిపుష్టమైనట్లు తెనుగు కావలెనని ఆకాంక్షించినారు. సంస్కృత నాటకములలో స్త్రీపాత్రలు ప్రాకృతం ఎందుకు మాట్లాడించబడెను. ప్రాకృతమును కాపడుటకా? లేక స్త్రీలకు సంస్కృతము రాదని చెప్పుటకా? సరళత కావలెనన్నారు. సరళత అనగానేమి? అచ్చతెనుగు ఇప్పటివారికి అర్థమగునా? కూచిమంచి తిమ్మకవి తెనుగు కావ్యనామము శీలసుందరి పరిణయము. పరిణయము సంస్కృతమే! పెండ్లి అనలేదుకదా! అతి తక్కువ అక్షరమాల ఉన్న తమిళము అనాది భాషగా గుర్తించినారు. మరి వర్తమానము (theory) తమిళ పదము తెనుగువారు వాడుట లేదా?

**మైలవరపు రామానందం, చిలకలూరిపేట**

శ్రీ అశ్విన్ కుమార్ గారికి,
సి. వేదవతి

ఆగస్టు 'మిసిమి' లోని మీ చిన్న రచన 'ఎవరు ముందు?' చదివి చలించిపోయాను. నిజానికి అది రచన కాదు - అనుభవమే! ఎక్కడా భేషజం లేదు - పదాడంబరం లేదు - సూటిగా వచ్చి గుండెను తాకే ఒక అనుభవ ముద్ర అక్షరాల్లో కూర్చుంది. జీవన చరమాంకంలో ఎదురయ్యే ఒక విషాదమయ సన్నివేశాన్ని గురించి చెప్పకనే చెప్పిన ఉదంతమది.

అరవై ఏళ్ల సహజీవన అనుబంధాన్ని ఒక పేజీకి మించని కథనంలో ఎంత బలంగా, హార్దికంగా చిత్రించారు! మీ మిత్రుడూ, ఆయన భార్యామణీ - భారతీయ దాంపత్య జీవన వైభవానికి ధ్వజ స్తంభాల లాంటివాళ్లు. జీవితాన్ని పంచుకోవటంలోనే కాదు - ఆలోచనల్లోనూ తాదాత్మ్యతను సిద్ధించుకున్నవాళ్లు.

అతడి దృష్టిలో ఆమె అమాయకురాలయితే, ఆమె దృష్టిలో అతడు పిచ్చి మానవుడు! ఇప్పుడు ఇద్దరి మనసుల్లోనూ ఒకే ఒక తపన! వారు కోరుకునేదేమిటంటే -

తాను ఉండగానే అతడు వెళ్లిపోవాలని ఆమె కోరిక - తాను తోడు లేకుండా ఆ పిచ్చి మానవుడు బ్రతకలేడు కనుక - తాను ఉండగానే ఆమె వెళ్లిపోవాలని అతడి కోరిక - తన తోడు లేకుండా ఆ అమాయకురాలు బ్రతకలేదు కనుక!

తీవ్రమైన, గాఢమైన ఆర్తి అది! సులభంగానే పసిగట్టగలిగాను ఆ ఆర్తిని - నేనూ అనుభవించిందే కదా! కొన్నేళ్ల పాటు నేను కోరుకున్న కోరిక ఇటువంటిదే - కాకపోతే కాస్త భిన్నంగా -

"ఆయన లేకుండా నేను బ్రతకలేను - నేను లేకుండా ఆయన బ్రతుకును ఊహించలేను. అందుచేత ప్రభూ! ఇద్దరికీ ఒక్కసారే మరణం ప్రసాదించు!" - ఈ కోరిక నా నిత్యప్రార్థనలో భాగమై ఉండేది.

ఎంత ఆర్తిగా విన్నవించుకున్నా, ఎందుకో కానీ వినలేదు ప్రభువు!


ఇప్పుడు మీరు అక్షరీకరించిన ఉదంతం చదువుతుంటే, గుండెలోని పచ్చిగాయాన్ని కెలికినట్లయింది.

అదే అక్షరానికి ఉండే మహత్తు!

(84 ఏండ్ల బాలిక చేతి రాత ఇది. ఒక్క అక్షరం పొల్లు పోకుండా స్థిరంగా రాసిన ఆమె మానసిక ప్రశాంతత పాఠకులు గ్రహించగలరు.)

# చదవండి...

– ఎన్నార్కె




*మంచి పుస్తకం* ప్రచురణకర్తలు మరో నాలుగు మంచిపుస్తకాలను ఈ మధ్యనే విడుదల చేశారు.

✧ **(1) స్వర్ణపుష్పాలు :** ఈ బాలగేయ కథామాలను రచించినవారు బాలబంధు అలపర్తి సుబ్బారావు. ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ వారి బాలసాహిత్య పురస్కారం లభించింది. ఎం. శ్రీకాంత్ వేసిన బొమ్మలు పిల్లలను అలరిస్తాయి.

*పేజీలు : 64, వెల : ₹ 35/-*





**(2) పిచ్చిపుల్లయ్య :** లియో టాల్‌స్టాయ్ Ivan the Fool అనే మూలరచనకు కె. సురేష్ తెలుగు అనువాదం ఆహ్లాదంగా పిల్లలను ఆకట్టుకునేలా ఉంది.

*పేజీలు : 52, వెల : ₹ 30/-*




**(3) కణాలు, కోటానుకోట్ల కణాలు :** పి. కటిన్ వ్రాసిన దానికి డా. వి. శ్రీనివాస చక్రవర్తి అనువాదం చేశారు. ఈ పుస్తకం పిల్లల్లో వైజ్ఞానిక దృక్పథం ఏర్పడడానికి దోహదం చేస్తుంది. సావనీర్ సైజ్ పుస్తకం.

*పేజీలు : 32, వెల : ₹ 60/-*




**(4) అందరికన్నా ఎవరు బలవంతులు? :** వి. సూస్లొవ్ రష్యన్ భాషలో వ్రాసిన వైజ్ఞానిక రచనకు డా. వి. శ్రీనివాస చక్రవర్తి అనువాదం సరళంగా సాగింది. సావనీర్ సైజ్ పుస్తకం. మూలంలోనున్న వి. త్రుబ్కోవిచ్ బొమ్మలను యథాతథంగా ఉపయోగించుకున్నారు. అయితే విషయంకంటే బొమ్మలు పెద్దవిగా ఉన్నాయి.

*పేజీలు : 15, వెల : ₹ 35/-*



**(5) శ్రమ జీవన విద్యా విప్లవ కావ్యం - జిడ్డు కృష్ణమూర్తి అధ్యయనం :** రచయిత యం. శివరాం. మన విద్యా విధానంలో స్కూల్ టీచర్ బాధ్యతలేమిటి? శ్రామికతలోని ఔన్నత్యాన్ని గురించి పిల్లలకు అర్థమయ్యేలా చెబుతున్నవారు ఎంతమంది? దీనిపై సాగిన అధ్యయన వ్యాస సంపుటిది.

*పేజీలు : 280, వెల : ₹ 112/- పై అయిదు పుస్తకాలకు మంచి పుస్తకం, సికింద్రాబాద్. ఫోన్ : 949 074 6614.*




కథకునిగా, వ్యాస రచయితగా, గేయ కవిగా, తెలుగు సాహిత్యంలో అందరికీ తెలుసున్న పేరు కాలువ మల్లయ్య. తెలంగాణా గ్రామ జీవితం, పీడితుల ఆవేదనలను హృద్యంగా చెప్పే కమిట్‌మెంట్‌గలవాడు. వీరు వ్రాసిన నాలుగు పుస్తకాలను సామాజిక భారత ప్రచురణలు – హైదరాబాద్, తెలంగాణ వారు ప్రచురించారు. ఈ పుస్తకాలు నవోదయ, విశాలాంధ్ర, ప్రజాశక్తి, సహచర, దిశ పుస్తకాలయాల్లో లభిస్తాయి.



కాలువ మల్లయ్య

**(1) జీవన దృశ్యాలు (నానీలు) :** సంఘానికి విలువైన సందేశమివ్వని సాహిత్యం వృథా అని నమ్మి ప్రజాహితం కోసం రచించిన నానీలు. ఇందులోని నవ్యత, కమనీయ భావుకత ప్రశంసనీయం.

*పేజీలు : 100, వెల : ₹ 75/-*




**(2) విశ్వమానవ గీతాలు :** మనిషి ద్వేషం, కక్ష, ధనకాంక్ష, అధికార మదం వదలి కులమత రహితంగా విశ్వమానవునిగా ఆలోచించాలి, ప్రేమమయంగా జీవించాలి అని తన గీతాల ద్వారా చాటుతున్నారు రచయిత.

*పేజీలు : 124, వెల : ₹ 100/-*




**(3) తేలుకుంట నానీ కైతాలు :** తెలంగాణా గ్రామీణ జీవితాన్ని ఒక నవలలోగాని, కథలోగాని సమగ్రంగా చెప్పటం సాధ్యం కాదు. దానికిగాను దేనికదే స్వతంత్రంగా ఉండే నానీ ప్రక్రియను సాధికారంగా ఉపయోగించుకుంటూ, గ్రామంలో ఉండిన హాస్యగాడు, కవి, గాయకుడు, నటుడు, మిమిక్రీ మొదలు అన్ని రకాల కళల నైపుణ్యాన్ని తన రచనలో చిత్రిక పట్టినారు రచయిత.

*పేజీలు : 102, వెల : ₹ 100/-*



**(4) తెలంగాణ భాష, చదువుల తల్లి (వ్యాస సంపుటి) :** ఇందులోనున్న 15 వ్యాసాలలో మాతృభాష, అధికార భాషకు సంబంధించిన విశ్లేషణలు చేశారు రచయిత.

*పేజీలు : 106, వెల : ₹ 100/- ప్రతులకు : కాలువ విజయలక్ష్మి, C/o కాలువ మల్లయ్య, 44-214, హుడా కాంప్లెక్స్, క్రాంతిహారిక అపార్ట్‌మెంట్స్, కొత్తపేట, సరూర్‌నగర్, హైదరాబాద్-35. ఫోన్ : 984 937 7578. మరియు అన్ని ప్రముఖ పుస్తక షాపులు.*




✧ **గౌతమ బుద్ధుని జాతక కథలు :** తెలంగాణా శాసన, తాళపత్ర గ్రంథ (సేకర్త – పరిష్కర్త) పండితులు, కవి, వ్యాసకర్త, పరిశోధకులు అయిన డా. కాపూరి శ్రీనివాస్ సేకరించి, తయారు చేసిన రచనలివి. ఇందులో 40 కథలున్నాయి. ప్రతీ పేజీలోనూ ఒక కథ, దానికి సంబంధించిన ఒక శిల్ప ఛాయాచిత్రాన్ని ప్రచురించారు. తప్పక సేకరించతగ్గ పుస్తకం. తెలంగాణా స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టూరిజం హౌస్, హిమయత్‌నగర్, హైదరాబాద్ వారి ప్రచురణ.

*పేజీలు : 92, వెల : ₹ 100/-, ప్రతులకు : డా. కాపూరి శ్రీనివాస్, ఫోన్ : 984 977 6157, 964 007 1218.*



✧ **మిగ్గు :** పొన్నాల బాలయ్య, కవిత్వం ఇప్పుడు నవ్వుతున్న నల్ల కలువలా మనముందుకొచ్చింది. పల్లె నాల్కలపై చిందులాడుతున్న కమ్మటి తెలుగు పదాలతో కవితలు శోభిల్లాయి. తెలంగాణ రచయితల సంఘంవారి ప్రచురణ. *పేజీలు : 126, వెల : ₹ 100/- ప్రతులకు : ఫోన్ : 990 890 6248.*



✧ **ఈ మట్టి ఆక్రోశం :** మలిదశ తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్నప్పుడు అనేక ప్రజా కళారూపాలతో పోటీపడుతూ కవిత్వం పుట్టుకొచ్చింది. నేటి పరిస్థితుల్ని సమాజం యొక్క వింత పోకడల్ని గమనిస్తూ భౌతిక శాస్త్ర అధ్యాపకుడైన చంద్రశేఖర్‌గారు తన ప్రతిభతో ఈ కవిత్వాన్ని రచించారు. ఇందులో 59 కవితలున్నాయి.

*పేజీలు : 120, వెల : ₹ 80/- ప్రతులకు : ఆథర్, 7-2-904/1, మంకమ్మతోట, కరీంనగర్ మరియు అన్ని ప్రముఖ పుస్తక షాపులు.*



✧ **1901 నుండి సాహిత్యంలో నోబెల్ మహిళలు :** ఇందులో 15 వ్యాసాలున్నాయి.

*పేజీలు : 86, వెల : ₹ 70/- ప్రతులకు : అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ హైదరాబాద్ వారి ప్రచురణ. ఫోన్ : 990 834 7273.*



✧ **అదేగాలి :** ప్రపంచ దేశాల కవిత్వం, నేపథ్యం రచయిత ముకుంద రామారావు. సంపాదకులు కె.బి. గోపాలం, లంకా శివరామప్రసాద్. **మిసిమి** పత్రికలో మొదటిసారిగా ఇవి ప్రచురించబడినపుడు ఈ వ్యాసాలు విశేష పాఠకాదరణ పొందాయి.

*పేజీలు : 560, వెల : ₹ 300/- ప్రతులకు : ఎమ్మెస్కో బుక్స్, హైదరాబాద్. ఫోన్ : 040 – 23264028.*



✧ **ప్రసన్న కవి శంకరంబాడి సుందరాచారి :** రచన అవధాన కళానిధి ఆముదాల మురళి. తెలుగు మూలాల్లోనికి చొచ్చుకొనిపోయి, తెలుగు హృదయాల్లో పరవళ్ళు తొక్కిన పాట మా తెలుగు తల్లికి మల్లెపూదండ. ఆ రచయిత జీవన విధానాన్ని ప్రతి పాఠశాలకు, ప్రతి విద్యార్థికి ఈ పుస్తకం అందించాలనే సదుద్దేశంతో దీనిని ప్రచురించారు.

*పేజీలు : 20, వెల : ₹ 15/- ప్రతులకు : ఫోన్ : 944 043 2683, 834 105 4824.*

## మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹ 360/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింది గడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో**
**మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి),
3. బుద్ధుని సూత్రసముచ్చయం, 4. మానవీయ బుద్ధ,
5. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి),
6. అంతర్వీక్షణం, 7. దూరతీరాలలో, 8. అగాధం,
9. ఓ ఖైదీ వీరగాథ, 10. నాలో నేను (వి. అశ్వినీకుమార్),
11. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).


**పేరు :** ..................................................
**ఇం.నెం.**......................**వీధి**......................
**ఊరు**......................**పిన్** ......................
**సెల్** ..................................................
**సంతకం :** ..................................................

మీ చిరునామా ఇక్కడ రాసి, వాట్సాప్ (994 951 6567)గానీ, ఇ-మెయిల్ (misimi_monthly@yahoo.in) ద్వారాగానీ పంపండి.

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | **STATE BANK OF INDIA** |
| Account | : | **MISIMI** |
| A/c. No. | : | **10261569316** |
| Branch | : | **Saifabad, Hyderabad, INDIA** |
| IFS Code | : | **SBIN0007315** |

(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 50/- బ్యాంకు ఛార్జీలు కలపండి.)



**రెండు సంవత్సరాల చందాదారులకు (₹ 720+50/-)** ***ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి**



**నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ 1440+50/-)** ***నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి**





**మూడు సంవత్సరాల చందాదారులకు (₹ 1080+50/-)** ***బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి**



**అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ 1800+50/-)** **మిసిమి 2013 లేదా 2014 సంచికల బౌండ్ పుస్తకం బహుమతి**

**మిసిమి**
మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**



మరణశాస్త్రం (Thanatology)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.09.2016



కరదీపం